
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 124
శుక్రవారం 25-7-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి


ఫైనల్లో హంపి
మహిళల ప్రపంచకప్ టోర్నీ సెమీఫైనల్లో 5–3తో లె టింగ్జీపై గెలుపు -15లో


మళ్లీ ఐపీవో హవా
రేసులో ఎన్ఎస్‌డీఎల్, ఆదిత్య ఇన్ఫోటెక్, శ్రీ లోటస్ డెవలపర్స్ -15లో


ఆఖరి నిమిషంలో...
50 ఏళ్ల పాత రష్యా విమానం అనూహ్యంగా కొండ ప్రాంతంలో కూలిపోయింది. 48 మంది ప్రాణాలు కోల్పోయారు.
వివరాలు 6లో ▸


భారతీయులకు ఉద్యోగాలొద్దు
అమెరికన్లకే కొలువుల్లో పట్టం కట్టాలని, భారతీయులకు ఉద్యోగాలివ్వడం ఆపాలని టెక్ సంస్థలకు ట్రంప్ హితవు పలికారు.
వివరాలు 6లో ▸


ముంబై పేలుళ్ల కేసులో..
ముంబై రైలు పేలుళ్ల కేసులో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. నిందితులకు నోటీసు జారీ చేసింది.
వివరాలు 6లో ▸


పార్లమెంట్‌లో రచ్చరచ్చ
బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణతో పాటు కీలక అంశాలపై విపక్షాలు తమ డిమాండ్ల నుంచి వెనక్కి తగ్గలేదు.
వివరాలు 6లో ▸

కేంద్రానిదే బాధ్యత

బీసీ రిజర్వేషన్లపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా బిల్లు ఆమోదంలో జాప్యం చేయకూడదు: రాహుల్‌గాంధీ

- తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే దేశానికే మార్గదర్శకం
- దేశంలో సామాజిక న్యాయానికి ఇదొక మైలురాయిగా నిలుస్తుంది.. కులగణనకు దిక్సూచిగా మారుతుంది
- ప్రస్తుతం 50% రిజర్వేషన్ల పరిమితి అడ్డుగోడగా మారింది
- ఈ అడ్డుగోడను తొలగించేందుకే బీజేపీపై ఒత్తిడి తెస్తున్నాం
- దేశాభివృద్ధికి డబ్బు, భూములు కాదు.. ఇంగ్లిష్ విద్యే మార్గమన్న కాంగ్రెస్ అగ్రనేత
- ఓబీసీలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదని బీజేపీ ప్రభుత్వం గమనించింది: ఏఐసీసీ చీఫ్ ఖర్గే
- కులగణన తెలంగాణ సాధించిన పెద్ద విజయమని కితాబు


పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న ఖర్గే, రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన కుల గణన సర్వే దేశానికే మార్గదర్శకమని, ఇందుకు సంబంధించి రాష్ట్రం తీసుకొచ్చిన బిల్లును ఆమోదించే బాధ్యత కేంద్రంపైనే ఉందని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్రానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా బిల్లును ఆమోదించే విషయంలో జాప్యం చేయరాదని అన్నారు. దేశంలో సామాజిక న్యాయానికి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సర్వే మైలురాయిగా నిలుస్తుందని కొనియాడారు. గురువారం ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయంలో తెలంగాణలో చేపట్టిన కుల గణన సర్వేపై ప్రభుత్వం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో ఆయన పార్టీ ఎంపీలను ఉద్దేశించి మాట్లాడారు.

ఇదొక సామాజిక, ఆర్థిక, రాజకీయ పనిముట్టు
'కుల గణన అనేది రేవంత్‌రెడ్డికి అంత సులువు కాదని భావించాం. సీఎంగా ఇది ఆయనకు ఇబ్బందికరమని అనుకున్నాం. ఆయన సామాజిక వర్గం ఆయనను సమర్థించదని భావించాం. కానీ రేవంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు నేను ఆశించిన దానికంటే అద్భుతంగా పనిచేశారు. సరైన దృక్పథంతో సర్వేను పూర్తి చేశారు. బీజేపీ దీనిని ఇష్టపడినా, పడకున్నా.. దేశంలో కుల గణన
మిగతా 2వ పేజీలో ▶

పార్లమెంటులో పోరాడండి

- బీసీ రిజర్వేషన్ బిల్లులపై కాంగ్రెస్ ఎంపీలకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- తాను, మంత్రులు, ఎమ్మెల్యేలు జంతర్ మంతర్ వద్ద పోరాడతామని వెల్లడి
- కులగణన సర్వేకు సంబంధించి మా వద్ద 88 కోట్ల పేజీల డేటా ఉంది
- తెలంగాణ సర్వే దేశానికే రోల్ మోడల్.. ఇది 'రేర్' సర్వే

2లో

యూకే ప్రధాని కీర్ స్టార్మర్, ప్రధాని మోదీ ఆత్మీయ ఆలింగనం


యూకేతో స్వేచ్ఛా వాణిజ్యం

ఎఫ్‌టీఏపై సంతకాలు చేసిన భారత్, యునైటెడ్ కింగ్‌డమ్

- భారత ఉత్పత్తులపై సుంకాలు సున్నాకు తగ్గించనున్న యూకే
- భారతీయ రైతులు, ఎంఎస్ఎంఈలకు ప్రయోజనం
- ఇండియన్ మార్కెట్‌లోకి చౌకగా బ్రిటిష్ విస్కీ, కార్లు, చాక్లెట్లు, ఇతర ఉత్పత్తులు
- యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో నరేంద్ర మోదీ భేటీ
- వాణిజ్య బంధం మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయం.. ఇది విస్తరణవాద యుగం కాదు.. అభివృద్ధి వాద యుగమని మోదీ స్పష్టీకరణ

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో భారతీయ యువత, రైతులు, మత్స్యకారులతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు లబ్ధి చేకూరుతుంది. భారత వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార పరిశ్రమకు బ్రిటిష్ మార్కెట్‌లో నూతన అవకాశాలు లభిస్తాయి. 'విజన్-2030' రోడ్‌మ్యాప్‌పై ఇండియా, యూకే అంకితభావంతో ముందుకెళ్తున్నాయి.
– ప్రధాని నరేంద్ర మోదీ

ఒప్పందంతో లాభమేంటి? 6లో

న్యూస్‌రీల్

రెండ్రోజులు ఎల్లో అలర్ట్



రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. వచ్చే రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.
- వివరాలు 12లో▶

'3 ట్రిలియన్ల' సంకల్పంలో భాగస్వాములు కండి



18 నెలల్లో తెలంగాణ కొత్తగా రూ.3.2 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులను ఆకర్షించిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. యూఏఈ ప్రతినిధులతో కలిసి ఆయన 'ఇన్వెస్టోపియా గ్లోబల్' సదస్సును ప్రారంభించారు.
- వివరాలు 16లో▶

కలిసి తింటూ.. బరువెక్కుతున్నారు



భార్యాభర్తలు.. ఒకరి కోసం ఒకరు తమ ఆహారపు అలవాట్లు మార్చుకునే క్రమంలో ఒకే రకమైన ఆహారం తీసుకోవడం వల్ల ఇద్దరూ బరువు పెరిగే చాన్స్ ఉందని ఐసీఎంఆర్ అంటోంది.
- వివరాలు 2లో▶

ముక్తసరి సమాధానాలతో సరి!
ఏసీబీ ప్రశ్నలకు అంతగా స్పందించని మాజీ ఈఎన్సీ మురళీధర్‌రావు
- వివరాలు 5లో▶

కేంద్రం వద్దకు ఆర్డినెన్స్ ముసాయిదా!

కేంద్ర హోం శాఖ న్యాయ సలహా కోరిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు వీలుగా పీఆర్ చట్ట సవరణకు సర్కారు యత్నం
- రాష్ట్రం పంపించిన బిల్లుపై 32 అభ్యంతరాలు వ్యక్తం చేసిన కేంద్ర ప్రభుత్వం!



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు వీలుగా పంచాయతీరాజ్ చట్టం–2018ని సవరించడంలో భాగంగా ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా ఆర్డినెన్స్‌ను.. న్యాయ సలహా కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పంపించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంకోవైపు ఇప్పటికే అసెంబ్లీ ఆమోదించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు సైతం కేంద్రానికి వెళ్లగా..దీనిపై 30 నుంచి 32 అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ కేంద్రం తిరిగి రాష్ట్రానికి పంపించినట్లు కూడా తెలిసింది. కాగా ఆర్డినెన్స్ ముసాయిదాను కేంద్ర హోం శాఖకు పంపిన అంశంపై రాజ్‌భవన్ వర్గాలు స్పందించడం లేదు. ప్రస్తుత పరిమితి 50 శాతానికి మించి రిజర్వేషన్ల అమలు చేయడానికి ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్రానికి హక్కు ఉన్నట్లుగా ముసాయిదాలో పేర్కొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో
మిగతా 2వ పేజీలో ▶

పాడైన కాలేయానికి పునరుజ్జీవం..

హెచ్‌సీయూలోని తులసీ థెరప్యూటిక్స్ స్టార్టప్ ఘనత



- మార్పిడి అవసరం లేకుండా మళ్లీ పెరిగేలా ప్రయోగం.. జంతువుల్లో ప్రీక్లినికల్ ట్రయల్స్ విజయవంతం
- త్వరలో మానవ ప్రయోగాలు..
- భారతీయ బయోటెక్ రంగంలో ఇదో మైలురాయి
- దేశంలో 25 లక్షల మందిని పరీక్షించగా 65 శాతం మంది ఫ్యాటీ లివర్ బాధితులే..


సాక్షి, హైదరాబాద్: ఫ్యాటీ లివర్, లివర్ ఫెయిల్యూర్ వంటివాటి గురించి తరచూ వింటూంటాం. జీవనశైలి మార్పు వంటి కారణాలతో మన కాలేయంపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. రక్తశుద్ధి, ప్రొటీన్, హార్మోన్ల ఉత్పత్తి, జీవక్రియల నియంత్రణ, రోగనిరోధక వ్యవస్థకు ఊతమివ్వడంలో కాలేయం కీలకం. అయితే, కాలేయ సమస్యలకు పరిష్కారం కనుక్కోవడంలో ఓ స్టార్టప్ కంపెనీ ముందడుగు వేసింది. మూలకణాలు, ఎక్సోసోమ్‌లను ఉపయోగించి పాడైపోయిన జంతు కాలేయాన్ని మళ్లీ పెరిగేలా చేయడంలో 'తులసీ థెరప్యూటిక్స్' అనే సంస్థ విజయం సాధించింది. ప్రస్తుతం కాలేయం బాగా పాడైతే ట్రాన్స్‌ప్లాంటేషన్ తప్ప మరో మార్గం లేదు. ఈ సంస్థ చేస్తున్న ప్రయోగాలు పూర్తిస్థాయిలో విజయవంతమైతే అలాంటి సమస్య ఉత్పన్నం కాదు. పాడైన కాలేయాన్ని మార్చకుండా పునరుజ్జీవింపచేయొచ్చు.

ప్రీక్లినికల్ ట్రయల్స్ విజయవంతం: హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)లో స్టార్టప్‌ల ప్రోత్సాహానికి ఆస్పైర్-బయో నెస్ట్ అనే విభాగం ఉంది. కాలేయం పనిచేయని స్థితిలో ఉంటే
మిగతా 16వ పేజీలో ▶

చదువు 'కొనలేం'

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 4,200 కోట్లు
ఏపీ చరిత్రలో తొలిసారి ఏకంగా ఆరు క్వార్టర్లు పెండింగ్
ఫలితంగా అర్ధంతరంగా చదువు మానేస్తున్న విద్యార్థులు
దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు.. బిడ్డల భవిష్యత్‌పై తీవ్ర ఆందోళన

- గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని, చదువుల పట్ల కూటమి సర్కారు చిత్తశుద్ధి ఇదేనా అని నిలదీస్తున్న తల్లిదండ్రులు
- వసతిదీవెన రూ. 2,200 కోట్లూ పెండింగ్‌లోనే.. మొత్తంగా రూ.6,400 కోట్లు బకాయిలు..
- నిధుల విడుదల జాప్యంతో ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీల నిర్వహణ దారుణం
- తెలంగాణలో మాదిరిగా కోర్టుకెళ్లే యోచనలో ఇంజనీరింగ్ కళాశాల అసోసియేషన్?.. 80 శాతంపైగా కళాశాలలు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారం
- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి త్రైమాసికం ఠంచన్‌గా చెల్లింపులు



సాక్షి, అమరావతి: ఏడాదికి పైగా ఇదిగో ఇస్తాం.. అదిగో ఇస్తాం.. అంటూ ఊరించి ఉసూరుమనిపించడం తప్ప కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి పట్టించుకున్న పాపాన పోలేదు..! కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా పాత బకాయిల విడుదల ఊసే లేదు..! ప్రభుత్వం కనీస కనికరం చూపకుండా.. తమ జీవితాలతో చెలగాటం ఆడుతుండడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఉన్నత విద్యకు భరోసా
మిగతా 12వ పేజీలో ▶

ఇలంజేకర్



భారతీయులను నియమించకుండా కాపలాగా నాడ్యూటీ తనే చేస్తున్నారు!

సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్న థాయ్‌వాసులు


భగ్గుమన్న సరిహద్దు వివాదం

థాయ్‌లాండ్-కాంబోడియా మధ్య ఉద్రిక్తత

ఇరు దేశాల నడుమ ఘర్షణలు
పరస్పర దాడుల్లో 11 మంది మృతి
కనిష్ట స్థాయికి దౌత్య సంబంధాలు
- వివరాలు 6లో▶

బనకచర్లకు మా సమ్మతి తప్పనిసరి

పోలవరానికి మేం సమ్మతినిచ్చినట్లేనన్న విభజన చట్ట నిబంధన దీనికి వర్తించదు

పోలవరం ఆపరేషన్ షెడ్యూళ్లలో మార్పులు అంతర్రాష్ట్ర ఒప్పందాలకు విరుద్ధం

బనకచర్ల ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతుల ప్రక్రియ చేపట్టరాదు


కేంద్ర జలశక్తి శాఖకు తెలంగాణ లేఖ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టుకు తాము సమ్మతి ఇచ్చినట్లేనంటూ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 90 (3)లో ఉన్న నిబంధన గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు వర్తించదని తెలంగాణ స్పష్టం చేసింది. పోలవరం విస్తరణలో భాగంగా చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుకు తమ అనుమతి తీసుకోవాల్సిందేనని తేల్చిచెప్పింది. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)లోని 95వ టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ (టీఏసీ) పోలవరం ప్రాజెక్టును ఆమోదిస్తూ గోదావరి ట్రిబ్యునల్ తీర్పుకు అనుగుణంగా జారీ చేసిన ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్స్‌లో బనకచర్లతో తీవ్ర మార్పులు చోటుచేసుకుంటాయని ఆందోళన వ్యక్తం చేసింది. రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల గోదావరి వరద
మిగతా 12వ పేజీలో ▶

650 ▸ టీఎంసీల తరలింపు



పోలవరం ద్వారా 449.78 టీఎంసీల తరలింపునకు డీపీఆర్ రూపొందగా... తాజాగా మరో 200 టీఎంసీలను ఇదే ప్రాజెక్టు ద్వారా తరలించడానికి బనకచర్లను ఏపీ ప్రతిపాదించడం వల్ల పోలవరం ద్వారా తరలించనున్న మొత్తం జలాలు 650 టీఎంసీలకు పెరిగి ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూళ్లలో మార్పులు చోటుచేసుకుంటాయని లేఖలో తెలంగాణ వాదించింది. ఇది ఉమ్మడి ఏపీ, మధ్యప్రదేశ్, ఒడిశాల మధ్య కుదిరిన ఆపరేషన్ షెడ్యూల్ ఒప్పందానికి విరుద్ధమని గుర్తుచేసింది. 75 శాతం లభ్యతతో 449.78 టీఎంసీల తరలింపునకే పోలవరానికి సీడబ్ల్యూసీ అనుమతించగా.. బనకచర్ల పేరుతో అంతకుమించి మిగులు జలాలను ఏపీ తరలించాలనుకోవడం ఆ అనుమతులు, అంతర్రాష్ట్ర ఒప్పందాలు, ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధమని పేర్కొంది. మరోవైపు పోలవరం ప్రాజెక్టుకు జారీ చేసిన పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా అదనపు పనులు చేపట్టడంతో 2011లో పనుల నిలుపుదలకు కేంద్ర పర్యావరణ శాఖ ఆదేశాలు జారీ చేసిందని.. ఈ అంశం ప్రస్తుతం సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉందని గుర్తుచేసింది.



చుక్క లాంటి అమ్మాయి, చక్కనైన అబ్బాయి! ఒకరితో ఒకరికి పెళ్లయింది. పెళ్లికి ముందు 'ఎవరికి వారు'గా ఉన్నవారు, పెళ్లి తర్వాత 'ఒకరి కోసం ఒకరు' అన్నట్లుగా మారిపోయారు. మంచిదే కదా! మంచిదే కానీ.. వాళ్లలో మెల్లగా మార్పు మొదలైంది! గొడవలా? కాదు. మనస్పర్థలా? కాదు. ఉద్యోగాల్లో పడి ఒకరికొకరు టైమ్ ఇవ్వటం లేదా? కాదు.. కాదు! మరేంటి సమస్య? ఏంటంటే - ఇద్దరూ బాగా లావైపోయారు! అవునా!! అవును. దేశమంతటా ఇదే ధోరణి కనిపిస్తోందట! కలిసి తినటమే దంపతులను ఊబకాయులుగా మార్చేస్తోందట.

దాంపత్య భోజనంబు..

అధ్యయనంలోకి తీసుకున్న ప్రతి నాలుగు జంటల్లో ఒక జంట ఊబకాయులేనని ఐ.సి.ఎం.ఆర్. గుర్తించింది. భార్యాభర్తల్లో వివాహం ముందు వరకు ఆహారం, జీవన శైలుల విషయంలో ఎవరికి వారికి విభిన్న అభిరుచులు ఉంటాయి. వివాహం తర్వాత ఇదంతా మారిపోతుంది. ఆఫీస్‌లో పని ఒత్తిడి, ప్రయాణ అలసట వారి వారి ఆహారపు అలవాట్లను కలగాపులగం చేసేస్తాయి. ఇద్దరూ ఆర్డర్ పెట్టి ఫుడ్ తెప్పించుకోవటం ఎక్కువౌతుంది. ఒకరి కోసం ఒకరు మేల్కొని ఉండటం, లేట్ నైట్ ఆఫీస్ ప్రజెంటేషన్‌లు ఇవ్వటం, వారాంతపు విహారాలు.. ఇలాంటివన్నీ కలిసి దంపతుల జీవన శైలిని మార్చేస్తాయి. దాంతో సరైన నిద్రా, తగిన శారీరక శ్రమా లేకపోవటంతో 30ల వయసుకే దంపతులు లావైపోతున్నట్లు ఐ.సి.ఎం.ఆర్. గుర్తించింది.

అతి పెద్ద అధ్యయనం


'ఐ.సి.ఎం.ఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ రీసెర్చ్', 'టెరి స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్', ఇతర సంస్థల పరిశోధకులు కలిసి ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5 (2019-21) దగ్గరున్న దేశవ్యాప్త డేటా నుంచి 52,737 జంటల ఆహార తీరుతెన్నులను, వారి ఆరోగ్యాలను విశ్లేషించారు. వారిలో 27.4 శాతం జంటల్లో ఊబకాయ స్థితి ఉండటాన్ని గమనించారు. 'కరెంట్ డెవలప్‌మెంట్స్ ఇన్ న్యూట్రిషన్'లో ప్రచురణ అయిన ఈ అధ్యయన ఫలితాలు.. భారతదేశ దంపతులు కలిసి తింటూ, కలిసి బరువు పెరగటాన్ని గుర్తించింది. ఇది దేశంలోనే ఈ తరహా అతిపెద్ద అధ్యయనం.

ప్రథమ స్థానంలో కేరళ

అధ్యయనానికి ఎంచుకున్న అరలక్షకు పైగా జంటలలో ప్రధానంగా.. కేరళ, మణిపూర్, ఢిల్లీ, గోవా, జమ్మూ కశ్మీర్ వంటి రాష్ట్రాలలోని పట్టణ, సంపన్న కుటుంబాలకు చెందిన భార్యాభర్తలు లావు పెరగటం కనిపించింది. కేరళ దంపతులలో అత్యధికంగా 51.3 శాతం వరకు ఊబకాయులు ఉండగా ఆ శాతం జమ్మూ కశ్మీర్‌లో 48.5, మణిపూర్‌లో 47.9, ఢిల్లీలో 47.1, గోవాలో 45 శాతం, తమిళనాడులో 42.7, పంజాబ్‌లో 42.5గా ఉంది. అత్యంత ధనికులైన వారిలో దాదాపు సగం (47.6 శాతం) జంటల్లో అధిక బరువు లేదా ఊబకాయం కనిపించింది. పేదలలో అది కేవలం 10.2 శాతం మాత్రమే కావడం గమనార్హం.



అధ్యయనానికి తీసుకున్న దంపతుల సంఖ్య	ఊబకాయం ఉన్న జంటలు	దక్షిణాదిన ఊబకాయులు	ఉత్తరాదిన ఊబకాయులు
52,737	27.4%	37.2%	33.5%
	వార్తాపత్రికలు చదివేవారు 39.6%	టీవీ చూసేవారు 32.8%	గుడ్లు తినేవారు 30.7%
		చికెన్ తినేవారు 29.9%	



ఇద్దరూ లావవటం ఎలా సాధ్యం?

భార్యాభర్తలు సాధారణంగా జన్యుపరంగా సంబంధం కలిగి ఉండరు. అయినప్పటికీ ఒకే విధమైన ఆరోగ్య పరిస్థితులలోకి – అది ఊబకాయం, రక్తపోటు, ఇతరత్రా – ఏదైనా కావచ్చు, ఇద్దరూ ఒకేలా ఎలా మారి పోతారు? దీనికి సమాధానంగా – 'ఉమ్మడి జీవనశైలి (టీవీ చూడటం, వార్తా పత్రికలు చదవటం వంటి అలవాట్లను కూడా కలిపి), ఆహారం, సామాజిక-ఆర్థిక స్థితి, పర్యావరణం, భావోద్వేగ అంశాల కారణంగా ఇది జరుగుతుంది' అని ఐ.సి.ఎం.ఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ రీసెర్చ్ ప్రధాన అధ్యయన రచయిత డాక్టర్ ప్రశాంత్ కుమార్ సింగ్ చెబుతున్నారు.

కలసి తింటూ.. బరువెక్కుతున్నారు

- ప్రతి నాలుగు జంటల్లో ఒకరిలో స్థూలకాయం
- పెళ్లయ్యాక ఆహారపు అలవాట్లలో మార్పే కారణం
- ఒకరి ఇష్టాలు మరొకరు స్వీకరిస్తూ భోజనాలు
- ఐసీఎంఆర్ అధ్యయనంలో ఆసక్తికర విషయాలు

అయ్యో రామా, భార్యాభర్తలు కలిసి తినటం కూడా తప్పేనా? తప్పు కాదు కానీ, ఇద్దరూ ఒకరి కోసం ఒకరు తమ ఆహారపు అలవాట్లు మార్చుకునే క్రమంలో 'సయోధ్య'తో ఒకే రకమైన ఆహారం తీసుకోవటం వల్ల ఇద్దరూ కూడా క్రమేణా బరువు పెరిగే అవకాశం ఉందని భారత వైద్య పరిశోధన మండలి (ఐ.సి.ఎం.ఆర్.) అంటోంది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5 (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్.) దగ్గరున్న డేటాలో 50 వేలమందికి పైగా దంపతుల ఆహార అలవాట్ల వివరాలను విశ్లేషించిన ఐ.సి.ఎం.ఆర్., ఆ దంపతులలో 27.4 శాతం మంది అధిక బరువు లేదా ఊబకాయంతో ఉన్నట్లు కనుగొంది. ఈ ధోరణి ప్రధానంగా పట్టణ, సంపన్న వర్గాలలోని దంపతులలో కనిపించిందని తాజా అధ్యయనం వెల్లడించింది.

దంపతుల ఆహార స్వేచ్ఛ..: సాధారణంగా భారతీయ కుటుంబాలలో అందరికీ కలిపి ఒకే మెనూ ఉంటుంది. అన్నం, నూనెతో వండే కూరలు, వేపుళ్లు ఉంటాయి. అయితే పెళ్లయిన వారికి కొత్తగా 'ఆహార స్వేచ్ఛ' వస్తుంది. దంపతులలో ఎవరికి ఇష్టాలు వారికున్నా, ఒకరికి ఇష్టమైన దానికి మరొకరు ఇష్టపడటంతో ఇద్దరూ కలిపి ఒకే విధమైన ఆహారాన్ని తీసుకుంటారు. ఈ కారణంగా దంపతులు లావయ్యే అవకాశం ఉందని ఐ.సి.ఎం.ఆర్. అధ్యయనం విశ్లేషించింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

నేతల విభేదాలు మాకు వదిలేయండి

పార్టీ పటిష్టంపై దృష్టి పెట్టండి.. టీబీజేపీ అధ్యక్షునికి అమిత్‌షా దిశానిర్దేశం




సాక్షి, న్యూఢిల్లీ: నేతల మధ్య విభేదాలు మాకు వదిలేయండి. అది మేం చూసుకుంటాం. మీరు పార్టీ పటిష్టంపై దృష్టి సారించండి.. అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావుకు దిశానిర్దేశం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రామచందర్‌రావు.. తొలిసారి గురువారం పార్లమెంట్‌లోని అమిత్ షా కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా.. ఇటీవల నేతల మధ్య తలెత్తిన విభేదాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. అనంతరం పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై కూడా చర్చించినట్లు సమాచారం.

బీసీ బిల్లును ఆమోదించకపోతే ఉద్యమమే

కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఖర్గే, రాహుల్‌ను కోరాం: మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ బీసీ బిల్లును కేంద్రం ఆమోదించకపోతే ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఉద్యమం చేస్తామని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ యూటర్న్ తీసుకుందని విమర్శించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు వ్యాఖ్యలతో బీసీ బిల్లుకు ఆ పార్టీ వ్యతిరేకమన్న విషయం స్పష్టమైందన్నారు. బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో జరిగిన సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు గంటల పాటు సాగిన సమావేశంలో తెలంగాణలో చేపట్టిన కుల సర్వే విధివిధానాలు, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలపై చర్చించామని మహేశ్‌గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయంగా కులగణన సర్వే నిర్వహించిన తీరును పార్టీ పెద్దలకు వివరించామని చెప్పారు.రాష్ట్రం పంపిన బీసీ రిజర్వేషన్ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపామని, వాటి ఆమోదానికి ఒత్తిడి తీసుకురావాలని కోరామని వివరించారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చేలా బీజేపి సర్కార్‌పై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు.



పార్లమెంటులో పోరాడండి

బీసీ రిజర్వేషన్ బిల్లులపై కాంగ్రెస్ ఎంపీలకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

- తనతోపాటు, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు జంతర్ మంతర్ వద్ద పోరాడతామని వెల్లడి
- రాష్ట్రంలో కులగణన సర్వేకు సంబంధించి మా వద్ద 88 కోట్ల పేజీల డేటా ఉంది
- తెలంగాణ సర్వే దేశానికే రోల్ మోడల్..ఇది 'రేర్' సర్వే
- సర్వే ప్రకారం తెలంగాణలో బీసీలు 56.36 శాతం ఉన్నారు
- 3.9 శాతం మంది తమది ఏ కులం కాదని ప్రకటించుకున్నారు.. ఇదొక సరికొత్త పరిణామం



సమావేశంలో పాల్గొన్న రాహుల్ గాంధీ, ఖర్గే, రేవంత్, భట్టి, మీనాక్షి, మహేశ్‌గౌడ్, ఉత్తమ్, కొండా సురేఖ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: రాహుల్‌గాంధీ హామీ మేరకు తమ ప్రభుత్వం కుల గణన చేసి, ఆ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ బిల్లులను లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదింపజేసేందుకు రాహుల్‌గాంధీ, ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ ఎంపీలు పోరాడాలని విజ్ఞప్తి చేశారు. తాను, తన మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలందరం జంతర్‌మంతర్ వద్ద పోరాడతామని చెప్పారు. తెలంగాణలో తమ ప్రభుత్వం ఇంటింటికీ తిరిగి ప్రజల స్వీయ ధ్రువీకరణ పత్రంతో సేకరించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే దేశానికే రోల్ మోడల్ అని అన్నారు. ఈ సర్వేకు సంబంధించిన 88 కోట్ల పేజీల డేటా తమ వద్ద ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, విద్యా, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో ఆమోదించిన బిల్లులపై..ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో గురువారం సాయంత్రం పార్టీ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన సందర్భంగా సీఎం మాట్లాడారు.

రాహుల్ హామీ మేరకు రాష్ట్రంలో కులగణన

'భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ కుల గణనకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మేము అధికారంలోకి వచ్చిన తర్వాత 2024, ఫిబ్రవరి 4వ తేదీన ఈ మేరకు సర్వేను ప్రారంభించి 2025, ఫిబ్రవరి 5న అంటే ఏడాది కాలంలోనే పూర్తి చేశాం. అందుకే ఫిబ్రవరి 4ను తెలంగాణలో సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. కులగణన చేపట్టే సమయంలో అనేకమంది అగ్ర కులాల నాయకులు నా వద్దకు వచ్చి అభ్యంతరాలు, సందేహాలు వ్యక్తం చేశారు. కాలనుగుణంగా మార్పులకు అవకాశం ఇవ్వాలని నేను వారికి సూచించా. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 60 ఏళ్ల పాటు పోరాటాలు జరిగాయి. అనేక మంది అమరులయ్యారు. కానీ 2009, డిసెంబర్ 9న ప్రకటన చేయడంతో పాటు తెలంగాణ ఇచ్చి తెలంగాణ ప్రజల కలను సోనియాగాంధీ నెరవేర్చారు. అదే తెలంగాణలో కుల గణనపై రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని మా ప్రభుత్వం నెరవేర్చింది..' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

గాంధీ కుటుంబం ఇచ్చిన మాట నిలుపుకుంటుంది

'బీజేపీ నాయకులు చెప్పినవి ఏవీ చేయరు. గాంధీ కుటుంబం చెప్పిన ప్రతి మాటను నిలుపుకుంటుంది. కుల గణనకు సంబంధించి మా ప్రభుత్వం 56 ప్రశ్నలతో ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తి వద్దకు వెళ్లి సమాచారం సేకరించింది. సర్వే ప్రకారం తెలంగాణలో బీసీలు 56.36 శాతం ఉన్నారు. 3.9 శాతం మంది తమది ఏ కులం కాదని ప్రకటించుకున్నారు. ఇది తెలంగాణలో సరికొత్త పరిణామం. వీరంతా ఎవరని.. సర్వే, స్వతంత్ర నిపుణుల బృందాలు పరిశీలించాయి. వాళ్లంతా ఇంగ్లిష్ అభ్యసించిన ఉన్నత విద్యావంతులని తేలింది. ఈ సర్వే ప్రకారమే మేము బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు, విద్యా, ఉపాధి అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మరో బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించాం..' ముఖ్యమంత్రి తెలిపారు.

మోదీ లీగల్లీ కన్వెర్టెడ్ బీసీ..

'బీజేపీ తొలి నుంచి బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లీగల్లీ కన్వెర్టెడ్ బీసీ. మేము కుల గణన చేపట్టబోమని రాజ్‌నాథ్ సింగ్ పార్లమెంటులో చెప్పారు. రైతుల నల్ల చట్టాల విషయంలో రాహుల్ గాంధీ గళం విప్పిన తర్వాత మోదీ వాటిని రద్దు చేసి క్షమాపణ చెప్పారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ మాట మేరకు తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టిన తర్వాత కేంద్రం కుల గణనకు అంగీకరించింది. ఇదంతా రాహుల్ గాంధీ ఘనతే. మేము చేపట్టిన సర్వే దేశానికి రోల్ మోడల్. ఇది తెలంగాణ మోడల్. నేను దీనిని 'రేర్' (ఆర్ఏఆర్ఈ) మోడల్ అంటున్నా. ఆర్ఏఆర్ఈ..అంటే ఏమిటో నేను త్వరలో వివరిస్తా..' అని రేవంత్ అన్నారు.

సోనియాగాంధీ లేఖ నాకు నోబెల్, ఆస్కార్ లాంటిది

'కుల సర్వే, బీసీ బిల్లుల ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ సోనియాగాంధీ స్వహస్తాలతో నాకు లేఖ రాశారు. ఆ లేఖ నాకు నోబెల్, ఆస్కార్, జీవితకాల సాఫల్య పురస్కారాలతో సమానం. నేను ఈ స్థానంలో ఉన్నా లేకున్నా ఆ లేఖ నాకు ప్రత్యేకంగా మిగిలిపోతుంది..' అంటూ సీఎం భావోద్వేగానికి గురయ్యారు.

డిప్యూటీ సీఎం భట్టి పవర్‌పాయింట్ ప్రజంటేషన్

బీసీ రిజర్వేషన్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పార్టీ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి ప్రసంగించారు. మహేశ్‌గౌడ్ కార్యక్రమ సంధానకర్తగా వ్యవహరించారు. సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, సీనియర్ నేతలు దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్, కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు, స్వతంత్ర నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఖర్గే, రాహుల్‌తో సీఎం బృందం భేటీ

గురువారం ఉదయం ఖర్గే నివాసంలో ఆయనతో పాటు, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు భేటీ అయ్యారు. రాష్ట్రంలో కులగణన సర్వే ప్రక్రియ, శాసనసభలో బిల్లుల ఆమోదం, పార్లమెంట్‌లో వాటిని ఆమోదింప జేయడంపై చర్చించారు.

కేంద్రానిదే బాధ్యత


▶ మొదటి పేజీ తరువాయి

చేపట్టేందుకు ఇది ఒక దిక్సూచిగా మారుతుంది. ఇది నాలుగు గోడల మధ్య చేయలేదు. తెలంగాణలోని లక్షల మంది ప్రజలు, అన్ని వర్గాలను 56 ప్రశ్నలు అడిగి సర్వే చేశారు. వేరే ఏ ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి సర్వే జరగలేదు. 21వ శతాబ్దపు సామాజిక, రాజకీయ, ఆర్థిక డేటా తెలంగాణ ప్రభుత్వం చేతుల్లో ఉంది. ఈ సర్వే వివరాల ఆధారంగానే కులం, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకోవచ్చు. ఇదొక సామాజిక, ఆర్థిక పనిముట్టు. బీజేపీకి ఇష్టం లేకపోయినా ఇదొక రాజకీయ పనిముట్టు..' అని రాహుల్ అభివర్ణించారు.

కుల గణనను కేంద్రం సరిగా చేయదు

'ప్రస్తుతం 50 శాతం రిజర్వేషన్ల అడ్డుగోడను తొలగించే అవసరం వచ్చింది. కానీ దీనిని కేంద్రం విస్మరిస్తోంది. కుల గణన సర్వే వివరాల ఆధారంగా తెలంగాణలో జరిగే అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోంది. హిందుత్వ పేరుతో స్థానిక రాజకీయాల్లో, ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ల అడ్డుగోడ సామాజిక అభివృద్ధికి విఘాతంగా మారింది. ఈ అడ్డుగోడను తొలగించే విషయంపై నేను, రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలంతా బీజేపీపై ఒత్తిడి తెస్తున్నాం. మాకు తెలిసినంత వరకు కుల గణనను కేంద్రం సరైన రీతిలో నిర్వహిస్తుందని అనుకోవడం లేదు. వాళ్లు అలా చేయరు. ఓబీసీలు, దళితులు, ఆదివాసీల వాస్తవ పరిస్థితులు ఏంటో దేశ ప్రజలకు చెప్పాలన్న ఆలోచన కూడా వారికి లేదు. కులగణన వాస్తవాలు వారు ఎప్పుడు బయటకు వెల్లడిస్తారో అప్పుడు బీజేపీ భావజాలం పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుంది..' అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి బృందాన్ని అభినందిస్తున్నా..



'రాష్ట్ర ప్రభుత్వం కులగణన తీర్మానాన్ని రాష్ట్రపతికి పంపించింది. విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం అడ్డుగోడను తొలగించాలనుకుంటున్నట్లు అందులో పేర్కొంది. అయితే అందుకు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోవడం లేదు. దీనిని పార్లమెంటులో లేవనెత్తడమే మన కర్తవ్యం. రేవంత్‌రెడ్డి చేసిన దాన్ని మనం ప్రోత్సహించాలి. సర్వే నిర్వహించిన రేవంత్‌రెడ్డి, నిపుణుల కమిటీ, కాంగ్రెస్ నేతలను నేను అభినందిస్తున్నా. జరిగిన దానిని ఖర్గే పెద్దగా సమర్థించలేదు. అయినప్పటికీ ఆయనకు కూడా నా ధన్యవాదాలు..' అని రాహుల్ అన్నారు.

ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇంగ్లిష్ వద్దా?

'దేశాభివృద్ధికి డబ్బు, భూములు కాదు.. ఇంగ్లిష్ విద్యే మార్గం. తెలంగాణ కుల గణనలో ఈ విషయం స్పష్టంగా వెల్లడైంది. ఈ సర్వేకు ముందు భూములే విలువైనవని నేను కూడా అనుకునేవాడిని. కానీ ఇంగ్లిష్ ప్రాధాన్యమైన అంశం అని కుల గణన నిపుణుల కమిటీ చెప్పినప్పుడు ఆశ్చర్యం కలిగింది. ఇంగ్లిష్ అవసరం..అలాగని హిందీ, ఇతర ప్రాంతీయ భాషలు అక్కర్లేదని నేను చెప్పడం లేదు. ఏ బీజేపీ నేతను ప్రశ్నించినా ఇంగ్లిష్ వద్దంటారు. వారి పిల్లలు ఏ స్కూల్, కాలేజీలో చదువుతున్నారని ప్రశ్నిస్తే మాత్రం.. ఇంగ్లిష్ మీడియం అనే సమాధానమే వస్తుంది. మరి ఆ అవకాశాన్ని దేశంలోని వెనుకబడిన వర్గాలైన ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు బీజేపీ నేతలు ఎందుకు ఇవ్వరు?..' అని రాహుల్ నిలదీశారు.

భవిష్యత్ లేదనే కేంద్రం కులగణన నిర్ణయం: ఖర్గే



ఓబీసీలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదని గమనించే దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో కుల గణనను భాగం చేయాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసు కుందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. 'భారత్ జోడో యాత్ర, సంవిధాన్ బచావ్ ర్యాలీల్లో రాహుల్‌గాంధీకి ఓబీసీలంతా మద్దతు ఇచ్చారు. 'జై బాపూ.. జై భీమ్.. జై సంవిధాన్' అనే రాహుల్ నినాదంతో పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లాభం జరిగింది. ఇది గమనించిన ఇతర పార్టీలు తమకు భవిష్యత్తు లేదని భావించి మన బాటలో నడుస్తున్నాయి. కేంద్రం తీసుకున్న జనగణనలో కులగణన నిర్ణయం అందుకు నిదర్శనం. కులగణన సర్వే తెలంగాణ సాధించిన పెద్ద విజయం. కుల గణన చేపట్టడం సీఎం రేవంత్ తీసుకున్న సాహసోపేతమైన చర్య. రాజకీయంగా శక్తి లభించింది కాబట్టే ఆయన ఇది చేయగలిగారు. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాల్లోని ప్రతి బ్లాక్‌కు తీసుకెళ్లాలి. బీసీలు సామాజికంగా వెనుకబడ్డారు. కానీ దళితులు అంటరానివారిగా ఉన్నారు. అలా ఉన్నామని భావిస్తున్నారు. ఈ అంతరాన్ని చెరిపేయాలి. ఈ సర్వేలో భాగస్వామ్యం వహించిన వారికి అభినందనలు. జోడో యాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణలో కులగణనను ప్రోత్సహించిన రాహుల్‌ను అభినందిస్తున్నా. ఆయన ఒత్తిడితోనే ప్రధాని మోదీ జన గణనలో కుల గణనను భాగం చేస్తూ దిగిరాక తప్పలేదు..' అని ఖర్గే అన్నారు.

పార్లమెంట్ సమావేశాలు

సైబర్ నేరాలపై 17.82 లక్షల ఫిర్యాదులు

లోక్‌సభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణకు కేంద్రం కృషి చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్పారు. నేరాల నియంత్రణతో పాటు.. ప్రజలకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరాల్లో కొట్టేసిన డబ్బును ఫ్రీజ్ చేసేందుకు ఐ4సీ కింద 'సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం'ను 2021లో ప్రారంభించినట్లు.. లోక్‌సభలో పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు బండి సంజయ్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఇప్పటి వరకు 17.82 లక్షల ఫిర్యాదులు ఐ4సీకి అందగా.. వీటిలో రూ.5,489 కోట్లు నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లకుండా ఫ్రీజ్ చేసినట్లు వివరించారు. నేరగాళ్లు సైబర్ నేరాల కోసం వినియోగిస్తున్న 9.42 లక్షల సిమ్ కార్డులు, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు దేశంలో నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. ఈ కో-ఆర్డినేషన్ సెంటర్‌లో కేంద్ర అధికారులతో పాటు, రాష్ట్ర, జిల్లా పరిధిలోని అధికారులు సైతం ఉన్నట్లు తెలిపారు.

తెలంగాణ విద్యుత్ సంస్థల ప్రాజెక్టులకు కేంద్రం ఎర్రజెండా

- రూ.487.99 కోట్ల విలువైన 9 ప్రతిపాదనలు తిరస్కరణ
- లోక్‌సభలో కేంద్ర మంత్రి శ్రీపాద్‌నాయక్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన రూ.487.99 కోట్ల విలువైన తొమ్మిది విద్యుత్ ప్రసరణ ప్రాజెక్టులకు కేంద్రం ఎర్రజెండా ఊపింది. గురువారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022-23లో టీజీ ట్రాన్స్‌కో, టీజీ డిస్కం, టీజీ ఎస్ఎల్‌డీసీలు ఈ ప్రాజెక్టులను పవర్ సిస్టం డెవలప్‌మెంట్ ఫండ్ (పీఎస్‌డీఎఫ్) కింద కేంద్ర నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు సమర్పించాయి. ఈ ప్రతిపాదనలను టెక్నో-ఎకనామిక్ సబ్‌గ్రూప్ పరిశీలించినా, ఈ ఏడాది జూన్ 13న సమావేశమైన పీఎస్‌డీఎఫ్ మానిటరింగ్ కమిటీ వాటిని ఆమోదించలేదు. ప్రస్తుతం బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్), లోడ్ డిస్పాచ్ కేంద్రాల బలోపేతం వంటి ప్రాజెక్టులకే ప్రాధాన్యం ఇవ్వాలని కమిటీ స్పష్టం చేసింది.

60 వేల సీఎన్జీ వాహనాలకు 83 బంకులే

లోక్‌సభలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి



హైదరాబాద్ నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో వేగంగా పెరుగుతున్న సీఎన్జీ వాహనాల సంఖ్యకు అనుగుణంగా గ్యాస్ స్టేషన్ల విస్తరణ జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం నగర పరిధిలో కేవలం 83 సీఎన్జీ స్టేషన్లే ఉన్నాయి. ఇవి రోజూ 55 వేల నుంచి 60 వేల వాహనాలకు గ్యాస్ సేవలు అందిస్తున్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెల్లడించారు. గురువారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పలు కీలక వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లో ప్రజారవాణా వాహనాలు, ఆటోలు, ప్రైవేట్ వాహనాలు అధికంగా సీఎన్జీపైనే ఆధారపడుతున్నాయి. కానీ స్టేషన్ల తక్కువ సంఖ్య వల్ల వాహనదారులు గంటలకొద్దీ క్యూ లైన్లలో నిలబడాల్సి వస్తోందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి లోక్‌సభ వేదికగా తెలిపారు.

కేంద్రం వద్దకు ఆర్డినెన్స్ ముసాయిదా!

▶ మొదటి పేజీ తరువాయి

పీఆర్ చట్టానికి సవరణల వరకే ప్రతిపాదించారా? 50 శాతానికి మించి రిజర్వేషన్ల అమలు జరుగుతుందా? ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎంతవరకు అవకాశం ఉందన్నది చర్చనీయాంశమౌతోంది.

ఢిల్లీ స్థాయిలో చర్చ..: ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు సాగుతున్న నేపథ్యంలో.. రాష్ట్రంలో కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపుదల వంటి వాటిపైఢిల్లీ స్థాయిలో చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ పరంగా తాము చేపట్టిన చర్యలు, తీసుకున్న నిర్ణయాలను గురించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు.. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ముఖ్య నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక, కాంగ్రెస్ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం పంపిన ముసాయిదా ఆర్డినెన్స్, పంచాయతీరాజ్ చట్టంలో 50 శాతానికి లోబడి రిజర్వేషన్లు ఉండాలనే క్లాజ్ సవరణ విషయంలో ఎలాంటి వైఖరిని అనుసరించాలనే దానిపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సలహాను గవర్నర్ కోరినట్టుగా నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ విషయంలో చట్ట, న్యాయపరంగా ఎదురయ్యే సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఎలా ముందుకు వెళ్లాలి తదితర అంశాలపై ఆయన స్పష్టత కోరినట్టు తెలుస్తోంది.

"ఈ ప్రాపంచిక జీవితం కేవలం వినోద కాలక్షేపం మరియు క్రీడ మాత్రమే.
మరియు అసలు పరలోకగృహ జీవితమే వాస్తవమైన జీవితం.
ఇది వారు తెలుసుకుంటే ఎంత బాగుండేది!
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 25 జూలై 2025

స్వేచ్ఛావాణిజ్యం కల సాకారం

దాదాపు నాలుగేళ్ల కాలం... పదహారు దఫాల చర్చలు... నలుగురు ప్రధానులు– ఎట్టకేలకు బ్రిటన్ అభీష్టం నెరవేరింది. గురువారం ప్రధాని నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌ల సమక్షంలో రెండు దేశాల వాణిజ్య మంత్రులు పీయూష్ గోయెల్, జొనాథన్ రేనాల్డ్స్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై లండన్‌లో సంతకాలు చేశారు. ఈ ద్వైపాక్షిక ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంటు ధ్రువీకరించాల్సి వుంది. ఆ ప్రక్రియకు ఏడాది సమయం పడుతుందంటున్నారు. 2030 నాటికి ఇరు దేశాల వాణిజ్య పరిమాణం 12,000 కోట్ల డాలర్లకు చేరుకోవాలన్నది ఎఫ్‌టీఏ లక్ష్యం. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతున్న భారత్‌తో ఎఫ్‌టీఏ సాకారం కావాలని ఆ దేశం ఎంతగానో ఎదురుచూసింది. అందుకు కారణముంది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బయటికొచ్చాక సాగిస్తున్న ఒంటరి ప్రయాణం దాని ఆర్థిక వ్యవస్థను ఒడిదుడుకుల్లో పడేసింది. ఒకప్పుడు ప్రపంచంలో రవి అస్తమించని సామ్రాజ్యాన్నేలిన దేశం నేల చూపులు చూడటం మొదలైంది. అందుకే కన్సర్వేటివ్ పార్టీకి చెందిన బోరిస్ జాన్సన్ ప్రధానిగా వున్నప్పుడు 2022లో తొలిసారి ఎఫ్‌టీఏ కుదుర్చుకోవాలన్న ప్రతిపాదన వచ్చింది. ఆయన స్థానంలో అదే పార్టీకి చెందిన లిజ్ ట్రస్ వచ్చారు. ఆమె 49 రోజుల్లోనే పదవి పోగొట్టుకున్నారు. తదనంతరం భారత్ మూలాలున్న రిషి సునాక్ ప్రధాని అయ్యారు. ఆయన కూడా నిష్క్రమించి ఎన్నికల్లో లేబర్ పార్టీ విజయం సాధించి ప్రస్తుత ప్రధాని స్టార్మర్ బాధ్యతలు స్వీకరించారు. వీరిలో అందరూ భారత్‌తో ఎఫ్‌టీఏ కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినవారే. మొన్నటి ఎన్నికల్లో లేబర్ పార్టీ ప్రధాన వాగ్దానాల్లో భారత్‌తో ఎఫ్‌టీఏ కుదుర్చుకుంటామన్నది ఒకటి. మొత్తానికి అనేక రకాల అడ్డంకులూ, అపోహలూ అధిగమించి ఒప్పందం సాకారమైంది. ఎఫ్‌టీఏ వల్ల బ్రిటన్‌లో ఏటా కొత్తగా 2,200 ఉద్యోగాలొస్తాయని, దేశ జీడీపీ 480 కోట్ల పౌండ్ల (రూ. 56,150 కోట్లు) మేర పెరుగుతుందని అంచనా. అయితే రెండు దేశాల్లోనూ ఎఫ్‌టీఏపై అసంతృప్తి తక్కువేమీ లేదు.

ఈ ఒప్పందం వల్ల ప్రధానంగా లాభపడేది స్కాచ్ విస్కీ, జిన్ ఉత్పత్తిదార్లు, బ్రిటన్ కార్ల పరిశ్రమలు. జిన్, స్కాచ్ విస్కీలపై ప్రస్తుతం 150 శాతం దిగుమతి సుంకాలుండగా, అవి 75 శాతానికి పడిపోతాయి. వచ్చే పదేళ్ల కాలంలో 40 శాతానికొస్తాయి. అలాగే బ్రిటన్ కార్లపై ప్రస్తుతం 100 శాతం సుంకాలున్నాయి. అవి పది శాతానికి పడిపోతాయి. ఎగువ మధ్య తరగతి, సంపన్న వర్గాలకు ఇది ఊరటనిచ్చే కబురు. మన ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కార్లకు కూడా గిరాకీ ఏర్పడుతుంది. ఈ రంగంలో టాటాలకు డబుల్ ధమాకా అని చెప్పాలి. బ్రిటన్‌లో ఆ సంస్థ ఉత్పత్తి చేసే జాగ్వార్ ల్యాండ్ రోవర్‌లకు మన దేశంలో... ఇక్కడ ఉత్పత్తయ్యే టాటా ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కార్లకు బ్రిటన్‌లో మార్కెట్ లభ్యత పెరుగుతుంది. మన దేశం నుంచి వెళ్లే 99 శాతం ఎగుమతులకు కూడా ఎఫ్‌టీఏ అమల్లోకొస్తే సుంకాల బెడద వుండదు. బ్రిటన్ నుంచి మనకొచ్చే దిగుమతులపై సుంకాలు 15 శాతం నుంచి ఒక్కసారిగా 3 శాతానికి పడిపోతాయి. చాలా సరుకులపై కస్టమ్స్ సుంకాలు తగ్గిపోతాయి. మన సాగు రంగానికి ఎఫ్‌టీఏ ఎంతగానో దోహదపడుతుందని వాణిజ్య నిపుణులంటున్నారు. ప్రస్తుతం బ్రిటన్‌కు మన వార్షిక సాగు ఎగుమతుల విలువ కేవలం 81 కోట్ల డాలర్లు. ఈ ఒప్పందం వల్ల మన నుంచి తేయాకు, మామిడిపళ్లు, ద్రాక్ష, సుగంధ ద్రవ్యాలు, చేపలు, రొయ్యలు, ఎండ్రకాయలు వగైరాల ఎగుమతులు అపారంగా పెరుగుతాయని అంచనా వుంది. సేవల రంగానికి సంబంధించినంతవరకూ యోగా బోధకులు, సంగీతవేత్తలు, పాకశాస్త్ర ప్రవీణులకు డిమాండ్ పెరుగుతుంది. ఈ రంగాల్లో పనిచేసే వారికోసం ఏటా 1,800 వీసాలు జారీచేస్తారు. వాహన విడిభాగాలు, వస్త్రాలు, పాదరక్షలు, క్రీడోపకరణాలు, ఆటబొమ్మలు, బంగారం, వజ్రాభరణాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, సేంద్రీయ రసాయనాలు, ఇంజిన్లు వగైరాలపై దాదాపు 4 నుంచి 16 శాతం వరకూ సుంకాలు విధిస్తున్నారు. ఒప్పందం అమల్లోకొస్తే ఆ సుంకాలు కనుమరుగవుతాయి. కనుక ఎగుమతులు ఊపందుకుంటాయి. పర్యవసానంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

ఎఫ్‌టీఏపై రెండు దేశాల్లోనూ విమర్శలూ, ఆందోళనలూ వున్నాయి. ఇది అమల్లోకొస్తే స్వల్పకాలిక వీసాపై వచ్చే భారతీయ కార్మికులకూ, వారి యాజమాన్యాలకూ జాతీయ బీమా సంస్థ ఎన్ఐసీకి చేసే చెల్లింపుల నుంచి మూడేళ్ల మినహాయింపు ఇవ్వదల్చుకున్నారని, ఇందువల్ల దేశ ఖజానాకు ఏటా పది లక్షల పౌండ్ల నష్టంతోపాటు దేశీయ కార్మికుల ఉపాధికి గండిపడుతుందని కన్సర్వేటివ్ పార్టీ ఆరోపిస్తోంది. ప్రస్తుతం ఆ మినహాయింపు ఏడాది కాలానికి మాత్రమే వుంది. వలస విధానం మారదని, ఇప్పటికన్నా భారతీయ కార్మికుల సంఖ్య పెరిగే అవకాశం లేదని ప్రభుత్వం చెబుతోంది. తమ రంగాన్ని ఎఫ్‌టీఏ విస్మరించిందని, మేధోహక్కుల పరిరక్షణ సంగతి పట్టించుకోలేదని బ్రిటన్ ఫార్మా రంగం ఆరోపణ. ఒకవేళ పట్టించుకుని ఉంటే మన దేశంలో జెనెరిక్ ఔషధ పరిశ్రమ దెబ్బతింటుంది. ఆటోమొబైల్ విడిభాగాల రంగంలో బ్రిటన్ ప్రవేశిస్తే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) రంగం నష్టపోతుంది. అందుకు ప్రతిగా మన ఎంఎస్ఎంఈలకు కూడా బ్రిటన్ చోటిస్తే వేరుగా వుండేది. ఇక 2027 నుంచి బ్రిటన్ అమలుచేయబోతున్న 'కార్బన్ టాక్స్' అంశాన్ని ఏం చేశారో వెంటనే తెలియలేదు. కార్బన్ టాక్స్ వల్ల మన ఇనుము, ఉక్కు, అల్యూమినియం, ఎరువులు, సిమెంట్ రంగాలు దెబ్బతినే అవకాశం వుంది. మొత్తానికి ఎఫ్‌టీఏ అమల్లోకొచ్చాకే దాని అసలు కథ ఏమిటన్నది తెలుస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం; **తిథి:** శు.పాడ్యమి రా.11.55 వరకు, తదుపరి విదియ; **నక్షత్రం:** పుష్యమి సా.5.24 వరకు, తదుపరి ఆశ్లేష; **వర్జ్యం:** లేదు; **దుర్ముహూర్తం:** ఉ.8.12 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.23 వరకు; **అమృత ఘడియలు:** ప.11.20 నుండి 12.38 వరకు.

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

అమానుషంపై స్పందించి తీరుదాం!

సందర్భం



గోపాలకృష్ణ గాంధీ

నాకెందుకో నిమిష ప్రియకు మరణ దండనను అమలుపరచకపోవచ్చు అనిపిస్తోంది. ఇరాన్ అండదండలున్న హూతి దళాల పాలనలో ఉన్న యెమెన్‌లోని భాగంలో షరియా చట్టం అమలులో ఉంది. కేరళకు చెందిన 38 ఏళ్ళ నర్సు నిమిష ప్రియ ఆమె వ్యాపార భాగస్వామిని హత్య చేసిందంటూ అక్కడి చట్టం ఆమెకు మరణ దండనను విధించింది. హూతీల రాజకీయ, న్యాయ పాలనా సౌధంలో ప్రతి ఒక్కరు ఆ శిక్షను ధ్రువపరచేశారు. పాలక్కాడ్‌లో జన్మించిన ఆ క్రైస్తవ మతస్థురాలు అరెస్టు అయి, శిక్షపడినప్పటి నుంచి ఇప్పటికి అనేక నెలలుగా ఫైరింగ్ స్క్వాడ్ ను ఎదుర్కోవలసిన స్థితిలో ఉంది. మరణ దండనను అమలుపరచేందుకు యెమెన్‌లో కాల్పులు జరిపి చంపే విధానం అమలులో ఉంది.

నాలుగు ఆశలు

వర్తమాన భౌగోళిక, రాజకీయ పరిస్థితుల్లో భారతదేశానికున్న ప్రాధాన్యం వల్లనైతేనేమి లేదా నిమిష కేసు దాదాపుగా మొత్తం ప్రపంచ దృష్టిని ఆకర్షించడం వల్లనైతేనేమి లేదా మరణ దండనకు వ్యతిరేకంగా ఇరాన్, సౌదీ అరేబియాలు యెమెన్‌కు నచ్చజెప్పడం వల్లనైతేనేమి ఆ దేశం బుల్లెట్లకు ఇంకా పనిచెప్పలేదు. నిమిషను కాపాడేందుకు 'సేవ్ నిమిష ప్రియ ఇంటర్నేషనల్ కౌన్సిల్' పేరుతో కొందరు ఒక సంఘంగా ఏర్పడ్డారు. నిమిష లీగల్ డిఫెన్స్‌ను సమన్వయపరచుకుంటూ ఆ కౌన్సిల్ పనిచేస్తోంది. కేరళలోని ఇస్లామిక్ మత పెద్దలు, ప్రసిద్ధ స్కాలర్లు బహిరంగంగా, తెర వెనుక మార్గాల ద్వారా శిక్షను ఆపు చేసేందుకు తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఈ ప్రయత్నాలు వృథా పోవని అనిపిస్తోంది. మరణ దండనకు గురిచేయకుండా ఆమెను విడిచిపెట్టవచ్చుననడానికి నాకు మరో నాలుగు కారణాలు తోస్తున్నాయి. ఒకటి– షరియా అమలులో ఉండటం నిజం. హతుని కుటుంబ ఆగ్రహం కూడా అర్థం చేసుకోదగిందే. నమ్మశక్యం కాకపోయినా, కంటికి కన్ను పంటికి పన్ను సిద్ధాంతాన్ని ప్రపంచం అసహ్యించుకుంటుందని సానా(యెమెన్ రాజధాని) లోని అధికార వర్గాలకు తెలియదనుకోలేం. రెండు– యెమెన్‌లోని ఆ భాగంలో ఉన్న అధికారులు మానవ హక్కులకు సంబంధించిన అంతర్జాతీయ నిబంధనలకు జవాబుదారులు ఏమీ కారు. గతంలో మరణ దండనలను గణనీయంగానే అమలు జరిపి ఉండవచ్చు. అంతమాత్రాన, ప్రపంచ మనోభిప్రాయాన్ని లెక్క చేయనివారుగా బాహాటంగా కనిపించకూడదని వారు అనుకుంటూ ఉండవచ్చు. మూడు– జాతీయ భద్రతా సలహాదారు అజీత్ దోభాల్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వంటి సమర్థులు నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఉన్నారు. పరాయి దేశంలో బందీగా ఉన్న ఒక భారతీయ మహిళను కాపాడలేకపోయినదిగా కనిపించడం భారత ప్రభుత్వానికి ఇష్టం ఉండదు. నిమిష ప్రాణాలను కాపాడేందుకు హంగు ఆర్భాటాలు లేకుండా ఎంత ప్రయత్నించాలో అంతా న్యూఢిల్లీ చేస్తుంది. నాలుగు– హతుని కుటుంబం దోషిని క్షమించినందుకు పరిహారంగా ఇచ్చే నగదు(బ్లడ్ మనీ) మొత్తంపైనే ఇపుడు సంప్రదింపులు సాగుతున్నట్లు చెబుతున్నారు. వాటిలో



◆ ఒకవేళ నిమిష ప్రియను కాపాడే ప్రయత్నాలు విఫలమైతే, సానా (యెమెన్)లోని పాలనా వ్యవస్థపై భారత్ ఆంక్షలు విధించాలి. యెమెన్‌లోని భారతీయులందరినీ వెనక్కి తీసుకొచ్చి, వారి భద్రతకు సంబంధించి సానాపై నమ్మకం పెట్టుకోలేమని న్యూఢిల్లీ సంకేతాలు పంపి తీరాలి. నిమిష కేసును ఆసరాగా చేసుకుని, కులభూషణ్ జాధవ్‌కు కూడా అటువంటి గతి పట్టించే సాహసం పాకిస్తాన్ అధికారులకు కలుగకుండా మనం ప్రతిఘటించి తీరాలి.



యెమెన్‌లో మరణ శిక్ష పడిన భారతీయ నర్సు నిమిష ప్రియ

ప్రభుత్వం పాల్గొన్నా పాల్గొనకపోయినా ప్రపంచంలోనే నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ నగదు కొరతతో బాధపడుతున్నదిగా ముద్రపడలేదు.

ఒకవేళ ఆశలు అడియాసలైతే...

పైన పేర్కొన్న కారణాలన్నింటివల్ల నిమిష ప్రియను కాపాడారు అనుకుందాం. అదృష్టం బాగుండి ఆమె భారతదేశానికి తిరిగి వచ్చింది అనుకుందాం. ఆమెకు ఘన స్వాగతం లభిస్తుంది. ఆమె ప్రాణాలను కాపాడిన ఘనత తమదేనని చెప్పుకునేవారూ చాలా మంది ఉంటారు. కానీ, నా ఈ అంచనాలన్నీ ఘోరంగా తలకిందులు కావచ్చు. సానాలోని పాలకులు నిమిష ప్రియకు మరణ దండనను అమలుపరిస్తే, నేను పైన చెప్పిన విషయాలన్నీ బుద్ధి హీనమైనవిగా తేలతాయి. నిజంగానే, ఘోరం జరిగితే, భారత్ ఏం చేయవలసి ఉంటుంది?

భారత్ తన అసంతృప్తిని సానాకు తెలిపి తీరాలి. ''ఇది టెర్రరిజం కేసు కాదు కదా. ఆ పని భారత్‌ను ఉద్దేశించి చేసింది కాదు. ఆ చర్య భారత రాజ్య వ్యవస్థకు లేదా ప్రజానీకానికి వ్యతిరేకంగా తీసుకున్నది కాదు'' అని ఎవరూ అనుకోకూడదు. ఎందుకంటే, సానాలోని రాజకీయ వ్యవస్థ చట్టబద్ధమైనదని ప్రపంచం గుర్తించలేదు. అటువంటి వ్యవస్థ తమ దేశంలో ఉంటున్న ఒక భారతీయురాలి జీవితాన్ని అంతమొందిస్తే మనం మౌనంగా చూస్తూ ఊరుకోవాలా? అందులోనూ ఆమె సేవా భావంతో నిండి ఉండే నర్సింగ్ వృత్తిలో ఉన్న వ్యక్తి. ఆమెకు అలాంటి గతి పట్టవచ్చా? అనేక దేశాలలో వివిధ వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలలో ఉన్న భారతీయులు సంఖ్య నానాటికీ పెరుగుతోంది. వారిలో నర్సులు గణనీయమైన వర్గం కిందకు వస్తారు. ఆ యా దేశాలు అన్నింటి దృష్టిలో మనం చులకన అయిపోమా?

నిమిష చేసిన నేరం తక్కువదేమీ కాదు. దాన్ని గర్హించకుండా ఉండటమో లేదా ఉపేక్షించడమో చేయలేం. దాన్నలా ఉంచినా, హతుని దేహాన్ని ఆమె ముక్కలు చేసిన తీరు ఇంకా ఘోరం. కానీ, ఆమె హంతకురాలిగా మారడానికి పురికొల్పిన అంశాలను కూడా విస్మరించలేం. అటువంటి నేరమే భారతదేశంలో జరిగి ఉంటే, దిగువ కోర్టు ఉరి శిక్ష విధించినా సంబంధిత హైకోర్టు లేదా సుప్రీం కోర్టు దాన్ని జీవిత ఖైదు శిక్షగా తగ్గించే అవకాశాలు ఎక్కువ. కోర్టులన్నీ మరణ దండనను సమర్థించినా, క్యాబినెట్ సలహా మేరకు రాష్ట్రపతి క్షమాభిక్ష ప్రసాదించి శిక్షను తగ్గించే అవకాశమూ ఉంది.

అసంతృప్తిని చాటి తీరాలి!

సరే. అది ఇపుడు అప్రస్తుతం. దేశపు చట్టబద్ధమైన ప్రభుత్వంగా గుర్తింపు పొందని కొన్ని శక్తుల నియంత్రణలో ఉన్న యెమెన్‌లోని ఒక భూభాగంలో ఫైరింగ్ స్క్వాడ్ నిమిషను కాల్చి చంపితే, ఇండియా ఎలా స్పందించాలి? ఆపరేషన్ రాహత్ కింద, ఆ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో భారతీయులను భారత ప్రభుత్వం వెనక్కి తీసుకొచ్చింది. యెమెన్‌లోని ఆ ప్రాంతంలో ఇప్పటికీ కొద్ది వేల మంది భారతీయులు ఉన్నారని చెబుతున్నారు. వారినందరినీ ఏకమొత్తంగా వెనక్కి తీసుకొచ్చే అంశాన్ని భారత్ పరిశీలించవలసి ఉంటుందా? వారిలో కొంత మందికి స్వదేశానికి రావడం ఇష్టం లేకపోయినా ప్రభుత్వం ఆ పని చేయాలా? దానివల్ల యెమెన్‌కు వాటిల్లే నష్టం ఏమైనా ఉంటుందా? అక్కడున్న భారతీయుల భద్రత పట్ల భారత్‌కు నమ్మకం కలగడం లేదనే అంశాన్ని మనం వెల్లడించి తీరాలి. యెమెన్‌లోని ఆ ప్రాంతంతో వాణిజ్యాన్ని (అది లెక్కలోకి వచ్చేది కాకపోయినా) మనం తీవ్రంగా పరిమితం చేయాలి. సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న విధానాన్ని మనం ఈ విషయంలో అనుసరించినా తప్పు లేదు.

కానీ, నేను మొదట ధైర్యంగా అనుకుంటున్నదే నిజమవ్వాలని ఆశిద్దాం. ఇలాంటి స్పందనలకు వెళ్ళాల్సిన అవసరం రాకూడదనే ప్రార్థిద్దాం. ఈ సందర్భంగా భారత్ చేసి తీరవలసిన పని మరొకటుంది. పాకిస్తాన్‌లో మరణ దండనను ఎదుర్కొంటున్న కులభూషణ్ జాధవ్‌ను స్వదేశానికి తిరిగి రప్పించాలన్న మన డిమాండ్‌ను ఇది మరింత బలోపేతం చేయాలి. నిమిష కేసును (ఒకవేళ ఆమె శిక్షను మనం నిలువరించలేకపోతే) ఆసరాగా చేసుకుని, జాధవ్‌కు కూడా అటువంటి గతి పట్టించే సాహసం పాకిస్తాన్ అధికారులకు కలుగకుండా మనం ప్రతిఘటించి తీరాలి. ఇది చాలా ముఖ్యం. అన్నింటికన్నా మించి, అరుదైన కేసుల్లోనే విధిస్తున్నప్పటికీ, మన దేశంలోనూ ఉరి శిక్షకు అవకాశం కల్పిస్తున్నాం. శిక్షా స్మృతికి సంబంధించి నీతి నియమాలు పరిణామం చెందుతున్న పరిస్థితులలో, ఆ రకమైన (ఉరి) శిక్ష తగినది కాదని మనం గ్రహించవలసి ఉంది.

వ్యాసకర్త పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్, ఆధునిక భారతదేశ చరిత్ర విద్యార్థి ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

పెరుగుతున్న చైనా



యూరోపియన్ యూనియన్‌కు మరింత ప్రాధాన్యత గల వాణిజ్య భాగస్వామిగా చైనా మారుతోంది. 2024లో చైనాతో ఈయూ వాణిజ్య వాటా 14.6 శాతం. ఒక్క అమెరికా మాత్రమే 17.3 శాతంతో చైనా కంటే ముందుంది. అదే 1988లో చైనా వాటా 1.7 శాతమే. అప్పుడు టాప్ 10 వాణిజ్య భాగస్వాముల్లో కూడా లేదు.
– వెలీనా త్చకరోవా, స్ట్రాటజిస్ట్

కంటి డాక్టర్



డాక్టర్ పి.నమ్‌పెరుమాళ్‌సామీ నిజమైన విజనరీ. ఆయన, ఆయన ప్రారంభించిన అరవింద్ ఐ హాస్పిటల్స్ కంటి చికిత్సను విప్లవాత్మకంగా మార్చాయి. హృదయం, సమర్థత ఉన్న ఆయన లాంటి డాక్టర్లు అరుదు. (జూలై 24న మరణించారు)
– కె.బాలాకుమార్, మాజీ సంపాదకుడు

కొన్ని అడుగులైనా...



రోజుకు 10,000 అడుగులు వేయాలనేది ఆచరణీయ లక్ష్యమే. కానీ లాన్సెట్ పబ్లిక్ హెల్త్ అధ్యయనం ప్రకారం, అన్ని కూడా అవసరం లేదు. 7,000 అడుగులు వేసినా డిమెన్షియాను 38 శాతం, హృదయ సంబంధిత వ్యాధులు రావడాన్ని 25 శాతం, హృదయ సంబంధ మరణాలు సంభవించడాన్ని 47 శాతం, క్యాన్సర్ మరణాన్ని 37 శాతం తగ్గించగలవు. కనీసం 4,000 అడుగులు వేసినా మంచి లాభాలే ఉంటాయి.
– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

శాంతి స్థాపనావకాశం



కంబోడియా, థాయిలాండ్ దేశాల మధ్య మొదలైన యుద్ధం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమానం నామినేషన్‌కు మరో అవకాశం ఇస్తోంది.
– శేష్ పాల్ వైద్, జమ్ము కశ్మీర్ మాజీ డీజీపీ

ఒక కన్ను అటే...



అమెరికన్లను అత్యుత్తమంగా గమనించే వాళ్లు జపాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ. రష్యాను అత్యుత్తమంగా గమనించేది ఫిన్స్ (ఫిన్‌లాండ్ ప్రజలు). చైనాను బాగా గమనించేది భారతీయులు. ఇరాన్‌ను బాగా గమనించేది ఇజ్రాయెలీలు.
– జేమ్స్ జే కరఫానో, పీస్ యాక్టివిస్ట్

వండితే చాలదా?



సూర్యకాంతి తగ్గిపోయిన తర్వాతో, మరెప్పుడో దానికదే టైమును సరిచేసుకునేట్టుగా నా రైస్ కుకర్ నా వైఫైకి కనెక్ట్ కావాల్సిన అవసరం లేదు. నా రైస్ కుకర్ నాకు టైమ్ చెప్పాల్సిన పని లేదు. నా రైస్ కుకర్ వండితే చాలు. ఈ విషయం మీద మీ శ్రద్ధకు ధన్యవాదాలు.
– మైక్ సోలానా, వ్యాపారవేత్త

పుష్కలం



జనాలు ఎప్పుడు మేల్కొని ఎప్పటికి తెలుసుకుంటారు! మొత్తం భూగోళానికి అందుతున్న మంచి నీళ్లు అన్నీ మహాసముద్రాలను సూర్యరశ్మి లవణ హరణం చేయడం వల్ల అందుతున్నవే! మనుషులకు అవసరమైన నీరు లేదా ఎనర్జీని ఎంత ఉత్పత్తి చేయగలం(ఎంత చేయాలి) అనేదానిమీద ఏ పరిమితీ లేదు.
– ఆరోన్ మాండెల్, ఆంట్రప్రెన్యూర్

ఇన్ బాక్స్

గిరాయిపల్లి అమరుల స్ఫూర్తి

గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ జరిగి ఏభై ఏళ్లు. ఈ సంఘటనతో వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ (ఆర్ఈసీ) విద్యార్థుల విప్లవ పోరాటం ముగిసిపోలేదు. కామ్రేడ్స్ సూరపనేని జనార్దనరావు, లంకా మురళీమోహన్ రెడ్డి, కొలిశెట్టి ఆనందరావు, వనపర్తి సుధాకర్... ఈ నలుగురి అమరత్వం సజీవమైనది.



1974లో ప్రారంభమైన రాడికల్ విద్యార్థి యూనియన్ ప్రభావానికి గురయ్యారు గిరాయిపల్లి అమరులు. నక్సల్బరీ సైద్ధాంతిక అవగాహనతో పనిచేశారు. జనార్దనరావు కృష్ణా జిల్లాలోని ఉయ్యూరు దగ్గర గరికపర్రు గ్రామంలో జన్మించాడు. వ్యవసాయ కుటుంబం. ఇంజినీరింగ్ విద్య కోసం వచ్చిన విద్యార్థి వరంగల్ పట్టణంలోనే కాదు, ఆంధ్రప్రదేశ్‌లో విస్తరిస్తున్న విప్లవోద్యమంలోనూ ప్రధాన శక్తి అయ్యాడు. ఇంజనీరింగ్ విద్యను ఆఖరి సంవత్సరం వదిలి ప్రజా పోరాటాలలో భాగమయ్యాడు. విప్లవోద్యమ కర్తవ్యాన్ని దాని ప్రాసంగికతను విడవకుండా ఆనాటి యువతరంలో విప్లవ మార్గం పట్ల, అనురక్తి కలిగించగలిగాడు. 1975 జూన్ 25న తన సహచరులతో పాటు ఎన్‌కౌంటర్ అయిన సమయానికి అతడి వయసు ఇరవై అయిదేళ్లు. ఎమర్జన్సీ తొలి నాళ్ళ కాలం అది.

గిరాయిపల్లి అమరులు తమ అమరత్వంతో పోరు విత్తనాలు చల్లారు. వీరి జ్ఞాపకార్థం గిరాయిపల్లిలో స్ఫూర్తి స్థూపం వెలిసింది. ప్రభుత్వం 1985లో ఈ స్థూపాన్ని కూల్చివేసింది. 1990లో తిరిగి నిర్మాణం జరిగింది. గిరాయిపల్లి అమరత్వాన్ని తలుచుకున్నప్పుడు మధ్య భారతంలో జరుగుతున్న ఆదివాసీ హననం గురించి మాట్లాడుకోవడం సముచితం. అరవై ఏళ్ళ విప్లవోద్యమ చరిత్రలో అణచివేత, రక్తపాతం సాధారణమైన అంశమైంది. విప్లవకారులకు, ఆదివాసులకు భారత రాజ్యాంగ పరిధిలోని ఏ హక్కులూ వర్తించడం లేదు. జీవించే హక్కు అనుమతించడం లేదు. గిరాయిపల్లి అమరుల అమరత్వాన్ని వర్తమానం వెలుగులో చూసినప్పుడే దాని విలువ మరింత అర్థమవుతుంది.

– అరసవిల్లి కృష్ణ | విరసం అధ్యక్షుడు
(గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ జరిగి నేటికి 50 ఏళ్లు)

అయిననూ అనుమానించాల్సిందే!

పహెల్‌గామ్‌లో 26 మంది సాధారణ పౌరుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదుల దాడి వెనుక ఉన్నది 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) అని అమెరికా ప్రకటించింది. టీఆర్ఎఫ్‌ను విదేశీ ఉగ్రసంస్థగా, గ్లోబల్ టెర్రరిస్ట్‌గా తాము పరిగణిస్తున్నట్టు అమెరికా ప్రకటిస్తూ... అది లష్కరే తోయిబా సోదర సంస్థ అనీ, దాని మరో రూపమే టీఆర్ఎఫ్ అనీ, లష్కరే తోయిబా కనుసన్నల్లో విదేశాలలో పరోక్ష యుద్ధం చేసే సంస్థ అనీ యూఎస్ విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 'ఈ చర్య... పహెల్‌గామ్ దాడికి తగిన న్యాయం చెయ్యడంలో అధ్యక్షుడు ట్రంప్ నిబద్ధతను వెల్లడిస్తోంది' అని ఆ శాఖ వ్యాఖ్యానించడం గమనార్హం.

ఇవాళ అమెరికా టీఆర్ఎఫ్‌ను గ్లోబల్ టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్‌గా ప్రకటించడం అంటే... ఉగ్రవాదంపై ఉమ్మడి పోరుకు భారత్ చేస్తున్న విజ్ఞప్తులకు అంతర్జాతీయ ఆమోదం, సహకారం లభించడానికి మార్గం సుగమం అయ్యిందని అర్థం. మన దేశం ఐక్యరాజ్యసమితి భద్రతాసమితి 1267 తీర్మానాన్ని అనుసరించి టీఆర్ఎఫ్‌ను అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా గుర్తించేలా చేయడానికీ, తద్వారా దానిపై ఆంక్షలు అమలు జరిపేలా చూడటానికీ అమెరికా ప్రకటనను ఉపయోగించుకోవచ్చు. దీంతో టీఆర్ఎఫ్ ఆగడాలకు కొంతవరకు అడ్డుకట్టపడే అవకాశం ఉంది. దానికి అందే నిధులు తగ్గిపోతాయి. ఇటీవలి కాలంలో భారత్‌కు లభించిన అతి పెద్ద దౌత్య విజయంగా నిపుణులు ఈ నిషేధాన్ని అభివర్ణిస్తున్నారు.

అయితే తమ మనుగడకు ఇబ్బందులు వచ్చినప్పుడు ఉగ్రవాద సంస్థలు పేర్లు మార్చుకుని తమ కార్యకలాపాలను యథాతథంగా నిర్వహించడం కొత్తకాదు. భావ సారూప్యం కలిగిన వివిధ రకాల వ్యక్తుల సహకారం రహస్యంగా అందుతున్నంత కాలం ఉగ్రసంస్థలను అంతమొందించడం సాధ్యం కాదు. ఈ మధ్యనే రాయచోటిలో తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే కారణంతో కొందరు వ్యక్తులను ఎన్ఐఏ అధికారులు అరెస్టు చెయ్యడం మనం చూశాం. వాళ్లు దశాబ్దాలుగా అదే ఊర్లో నివసిస్తున్నారు. వ్యాపారాలు చేస్తున్నారు. పైకి మామూలుగానే కనిపిస్తున్నారు. కానీ వాళ్ళ ఇంట్లో సోదాలు నిర్వహించిన పోలీసులు నిర్ఘాంతపోయే రీతిలో



◆ ఐక్యరాజ్యసమితి భద్రతాసమితి 1267 తీర్మానాన్ని అనుసరించి టీఆర్ఎఫ్‌ను అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా గుర్తించేలా చేయడానికీ, తద్వారా దానిపై ఆంక్షలు అమలు జరిపేలా చూడటానికీ అమెరికా ప్రకటనను మన దేశం ఉపయోగించుకోవచ్చు.

అక్కడ పేలుడు పదార్థాలు, తీవ్రవాద సాహిత్యం, తుపాకులు దొరికాయి. ఇటువంటివాళ్లను గుర్తించటం అంత తేలికేమీ కాదు. కాబట్టి ప్రపంచవ్యాప్తంగా నిషేధం ఉన్నంత మాత్రాన, అమెరికా ఇవాళ కొత్తగా ఆ సంస్థను గ్లోబల్ టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్‌గా ప్రకటించినంతమాత్రాన అలాంటి కార్యకలాపాలు రాత్రికి రాత్రే ఆగిపోతాయి అనుకోవటం ఒట్టి భ్రమ.

మరొక గమనార్హమైన సంగతేమిటంటే అమెరికాను నమ్మదగిన దేశంగా భావించలేకపోవడం. ముఖ్యంగా ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటుందో, ఎప్పుడు మాట మారుస్తుందో చెప్పలేం. యూఎస్ ఎయిడ్ (యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్) సంస్థ భారతదేశంలో ప్రభుత్వాలను అస్థిరపరచడానికీ, తప్పుడు కథనాలను వ్యాపింపజేసేందుకు మీడియా సంస్థలను ప్రోత్సహించడానికీ నిధులను వెచ్చించిందనే సమాచారం ఉండనే ఉంది. అంతేకాదు, యూఎస్ ఎయిడ్ సంస్థ, నిషిద్ధ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన ఆర్థిక విభాగం ఫలా–ఎ–ఇన్సానియత్ (ఎఫ్ఈఐ)కు నిధులు సమకూర్చిందన్న సంగతి కూడా ఆ మధ్య వెలుగు చూసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో టీచర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ కోసం యూఎస్ ఎయిడ్ సంస్థ 7.5 కోట్ల డాలర్లను ఖర్చుచేస్తోంది. ఈ నిధుల్లో ఎక్కువ భాగం వివిధ మార్గాల్లో లష్కరే తోయిబాకి చేరుతున్నాయనేదీ ఒక విమర్శ. పహెల్‌గామ్ దాడి తర్వాత అమెరికా స్పందించాల్సినంత తీవ్రంగా స్పందించకపోవడం, ఆ తర్వాత కొన్ని రోజులకే పాక్ అత్యున్నత సైనికాధికారిని అధ్యక్ష భవనానికి విందుకు ఆహ్వానించి పొగడ్తలతో ముంచెత్తడం వంటి పరిణామాలను గమనించినప్పుడు అమెరికాను నమ్మవచ్చా అనే ప్రశ్న తలెత్తక మానదు.

– శ్యాంప్రసాద్ రెడ్డి కోర్నిపాటి
యూట్యూబర్

సమరోత్సాహం

రామాయణ, మహాభారత కాలాల నుంచి నేటి దాకా చూస్తున్నాం, తలపెట్టిన పని విజయవంతం కావాలంటే, అర్థ బలం, అంగ బలం, బుద్ధి బలం, సామర్థ్యం మాత్రమే సరిపోవు. వాటికి తోడుగా ఉత్సాహం కావాలి. ఆత్మవిశ్వాసం, సకారాత్మకత, పట్టుదల, బలమైన విజయకాంక్ష– వీటిని కలబోస్తే అది ఉత్సాహం రూపంలో ప్రకటితమౌతుంది.

జ్యోతిర్మయం

రామరావణ యుద్ధానికి రామరావణ యుద్ధమే సాటి అన్నట్టు సమరం సాగింది. ప్రత్యర్థులిద్దరూ అన్ని విధాలా సమరంలో సమవుజ్జీలే. ఇద్దరివీ లోకోత్తరమైన బల పరాక్రమాలు. అందుకే యుద్ధం సుదీర్ఘంగా సాగినా, ఎంతకీ ఎటూ తెగలేదు. ప్రత్యర్థులిద్దరూ అలసిపోయారు. చింతాక్రాంతులు కూడా అయ్యారు.

ఆ దశలో, యుద్ధం చూసేందుకు దేవతలతో కలిసి వచ్చిన అగస్త్య మహర్షి, యుద్ధ పరిశ్రాంతుడై కూర్చొన్న దాశరథి దగ్గరకు వచ్చాడు. సకల కార్య సిద్ధిప్రదమూ, సర్వశత్రు వినాశకమూ అయిన ఆదిత్య హృదయ స్తోత్రాన్ని ఉపదేశించాడు. అవని జనులకు ప్రత్యక్ష దైవమయిన ఆదిత్యుడిని ఈ స్తోత్రంతో ముమ్మారు స్తుతించి, అందరు దేవతల అనుగ్రహాన్ని పొంది, దైవబలం సమకూర్చుకొమ్మన్నాడు. జయావహమైన ఈ మంత్రం జపించి, స్థైర్య సాహసాలను సంతరించుకొమ్మన్నాడు. 'ఇప్పుడిక నువ్వు రావణుడిని వధించటం తథ్యం!' అని తన ఆశీర్వాద బలం కూడా జోడించి, శ్రీరాముడిని ఉత్సాహపరిచి వెళ్ళాడు.

ఈ ఘటన యుద్ధాన్ని కీలకమైన మలుపు తిప్పింది. ఇనుమడించిన ఉత్సాహంతో ఈసారి రణరంగంలో ప్రవేశించిన దాశరథి ధాటిని దశకంఠుడు తట్టుకోలేకపోయాడు. వీగిపోయి, విగతజీవుడయ్యాడు. వైదేహీ వల్లభుడినే విజయలక్ష్మి కూడా వరించింది.

నిరుత్సాహం సమర్థతను నీరు గారుస్తుంది. ఉత్సాహ శక్తి సామర్థ్యాన్ని సాన బట్టి, పదును పెంచుతుంది. అగ్నికి వాయువులా తోడై, ప్రజ్వలింపజేస్తుంది. దైవబలమూ, మహా పురుషుల ఆశీర్వాద బలమూ, శంకలను శమింపజేయటం వల్ల కలిగే మనోబలమూ, ధర్మ పక్షానికి సర్వదా కవచంగా నిలిచే ధర్మబలమూ, ఉత్సాహాన్ని వృద్ధి చేసే ఉత్ప్రేరకాలు.

– ఎం. మారుతిశాస్త్రి

బండి సంజయ్‌కి వారెంట్

- ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసుల్లో జారీ

సిటీ కోర్టులు: గత ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళి ఉల్లంఘించారంటూ రెండు కేసుల్లో బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. కేసు విచారణకు నేరుగా హాజరుకావాలని కోర్టు ఆదేశించినప్పటికీ ఆయన హాజరుకాకపోవడంతో నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు ఈ వారెంట్ జారీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ మిర్యాలగూడలో రోడ్డుపై ఎన్నికల ప్రచార సభను ఏర్పాటుచేసినందుకు బండి సంజయ్‌తో పాటు ఆరుగురిపై మిర్యాలగూడ పోలీసులు ఐపీసీ సెక్షన్ 341, 143, 147, 188 రెడ్‌విత్ 149 కింద కేసు నమోదు చేశారు. అలాగే, రోడ్‌షో నిర్వహించి స్థానికులు, ప్రజలకు ఇబ్బందికలిగేలా వ్యవహరించారని పోలీసులు పేర్కొన్నారు. అలాగే హుజురాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కూ డా ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని బండి సంజయ్‌పై మరో కేసు నమోదైంది. వీటిపై నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు గురువారం విచారించింది. హుజురాబాద్ కేసు తదుపరి విచారణ ఈనెల 30కి, మిర్యాలగూడ కేసు ఆగస్టు 13కు వాయిదా వేసింది.

మావోయిస్టు శ్రీవిద్య అపహరణ

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు నార్ల శ్రీవిద్య (52)ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు మానవ హక్కుల వేదిక ఒక ప్రకటనలో తెలిపింది. నార్ల సుధాకర్ శర్మ కుమార్తె శ్రీవిద్యను గురువారం హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట ప్రాంతం నుంచి కిడ్నాప్ చేశారని, ఆమె ప్రాణాలకు ప్రమాదం ఉందని సంఘం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీవిద్యను అపహరించిన వారు స్థానిక పోలీసులా? లేక మరే ఇతర ఏజెన్సీలకు చెందినవారా? అనేది స్పష్టత లేదని పేర్కొన్నారు. ఆమెను తీసుకెళ్లిన వారు పోలీసులైతే చట్టప్రకారం కోర్టులో ప్రవేశపెట్టాలని కోరారు. పోలీసులు కాకుంటే ఆమెను వెతికి, కేసులుంటే చట్టప్రకారంగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని శ్రీవిద్యను కోర్టులో హాజరుపరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మావోయిస్టు శ్రీవిద్యపై ఇప్పటికే చాలా కేసులు నమోదయ్యాయని, ఇందులో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైం నంబర్ 1275/2019 కేసులో నిందితురాలిగా చూపించారని వివరించారు. శ్రీవిద్య సోదరుడు రవి శర్మ గతంలో మావోయిస్టుగా కొంతకాలం పనిచేసి, పోలీసుల ఎదుట లొంగిపోయారు.

హోటల్ ఉద్యోగికి రూ. 4.60 కోట్ల జీఎస్టీ

- గతంలో పొగాకు వ్యాపారం చేసి, మానేసిన యువకుడు
- ఉచితంగా జీఎస్టీ రిటర్న్స్ దాఖలు చేస్తానంటే అపరిచిత వ్యక్తికి వివరాలు
- ఆ జీఎస్టీ నంబర్‌తో రూ.140 కోట్ల మేర బంగారం వ్యాపారం
- లాభాలు దోచేసి పరారైన నిందితుడు.. లబోదిబోమంటున్న బాధితుడు



నవీన్‌కుమార్ రెడ్డికి బ్యాంకు ద్వారా వచ్చిన స్టేట్‌మెంట్

కర్నూలు (హాస్పిటల్): అతను ఓ గ్రామీణ యువకుడు. జీవితంలో స్థిర పడాలని పొగాకు వ్యాపారం ప్రారంభించాడు. జీఎస్టీ నెంబర్ తీసుకుని ప్రభుత్వానికి పన్ను చెల్లించాడు. వ్యాపారం కలిసి రాక మధ్యలో ఆపేసి ఓ హోటల్‌లో పనికి కుదిరాడు. మూడేళ్ల తర్వాత రూ.4.60 కోట్లకు పైగా జీఎస్టీ చెల్లించాలని మెసేజ్ రావడంతో కంగుతిన్నాడు. దీనిపై విచారణ చేసిన జీఎస్టీ అధికారులు సైతం అతను మోసపోయిన విధానాన్ని చూసి నివ్వెరపోయారు. ఏపీలోని నంద్యాల జిల్లా మిడుతూరు మండలం పైపాలెం గ్రామానికి చెందిన మల్లెం నవీన్‌కుమార్‌రెడ్డి 2017–18లో ఆర్యన్ ట్రేడర్స్ పేరిట పొగాకు వ్యాపారాన్ని ప్రారంభించాడు. మూడేళ్ల పాటు చేసిన రూ.30 లక్షల వ్యాపారానికి రూ.9 లక్షల జీఎస్టీని 2018–19 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాడు. ఆ తర్వాత 2019–20లో మరో రూ.7.5 లక్షలు, 2020–21లో రూ.1.25 లక్షలు జీఎస్టీ కట్టాడు. అనంతరం వ్యాపారం బాగోలేక మధ్యలో ఆపేసి హైదరాబాద్ వెళ్లి ఓ రెస్టారెంట్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కూడా అతను ప్రతి నెలా జీఎస్టీ రిటర్న్స్‌ను రెగ్యులర్‌గా దాఖలు చేస్తూ వచ్చాడు. ఇందుకోసం ఓ వ్యక్తికి రూ.300 నుంచి రూ.500 దాకా ఫీజు చెల్లించేవాడు. ఈ నేపథ్యంలో జీఎస్టీ రిటర్న్స్‌ను ఉచితంగా దాఖలు చేస్తామని ఓ గోడపై ఉన్న ప్రకటనకు ఆకర్షితుడై అందులో ఉన్న నితిన్ గుప్తా అనే వ్యక్తి నెంబర్‌కు ఫోన్ చేశాడు. అతడు నవీన్ రెగ్యులర్‌గా జీఎస్టీ రిటర్న్స్ దాఖలు చేసే యూజర్ ఐడీ, పాస్‌వర్డ్, మెయిల్, జీఎస్టీ నంబర్ తీసుకున్నాడు. కొద్ది కాలం పాటు నెలనెలా జీరో రిటర్న్స్ దాఖలు చేస్తున్నట్లు ఫోన్ చేసి చెప్పాడు. ఆ తర్వాత అతని నుంచి నవీన్ కుమార్ రెడ్డికి ఫోన్ రాలేదు.

నువ్వైనా కట్టు.. లేదా అతనితో కట్టించు

2023 జూలైలో వైజాగ్ నుంచి సెంట్రల్ జీఎస్టీ అధికారులు నవీన్ వద్దకు వచ్చారు. అతను చేస్తున్న ఉద్యోగాన్ని చూసి విస్తుపోయారు. మీ జీఎస్టీ నెంబర్‌తో రూ.140 కోట్లకు పైగా బంగారం వ్యాపారం చేశారని, అందుకు ఇప్పటి దాకా జీఎస్టీ చెల్లించలేదని చెప్పారు. తాను అలాంటి వ్యాపారమేదీ చేయలేదని నవీన్‌కుమార్ రెడ్డి వారికి వివరించాడు. తన వివరాలు ఎవరికిచ్చాడో చెబుతూ బ్యాంక్ స్టేట్‌మెంట్ చూపించి, జరిగిన విషయాన్ని తెలిపాడు. దీంతో నవీన్‌కుమార్ రెడ్డి మోసపోయాడని గ్రహించి, వారు అతనితో వాంగ్మూలం తీసుకుని వెళ్లిపోయారు. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ సెంట్రల్ జీఎస్టీ అధికారుల నుంచి పిలుపు వస్తే వెళ్లి కలిశాడు. 'రూ.4.60 కోట్లకు పైగా జీఎస్టీని నీవైనా కట్టు.. లేదా నీ వివరాలు ఇచ్చిన వారితోనైనా కట్టించు' అని అధికారులు చెప్పి పంపించారు. జరిగిన మోసంపై ఫిర్యాదు చేయడానికి మిడుతూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ప్రస్తుతం పని చేసేది హైదరాబాద్‌లో కాబట్టి, అక్కడికి వెళ్లమని చెప్పారు. హైదరాబాదులో ఫిర్యాదు చేయడానికి వెళ్తే మీ చిరునామా మిడుతూరు కాబట్టి, అక్కడే ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో ఏమి చేయాలో పాలుపోక న్యాయ నిపుణుల సలహాతో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితుడు సిద్ధమయ్యాడు.

ప్రజారవాణాకు ఇబ్బంది లేకుండా రోడ్లు పునరుద్ధరిస్తాం: కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: వరదలకు రోడ్లు పాడైతే ప్రజారవాణాకు ఇబ్బంది లేకుండా వెంటనే పునరుద్ధరిస్తామని.. ప్రజలు కూడా ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో తమ శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. సూపరింటెండెంట్ ఇంజనీర్లు జిల్లా కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ క్షేత్ర స్థాయిలోని అధికారులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి నాలుగైదు గంటలకు ఒకసారి ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గురువారం మంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రతి అధికారి ఫీల్డ్‌లో కచ్చితంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప సెలవుపై వెళ్లొద్దని మంత్రి స్పష్టం చేశారు. కల్వర్టులు, బ్రిడ్జిలు, నిర్మాణంలో ఉన్న రోడ్ల వద్ద రెగ్యులర్ చెకప్ చేయాలని, పొంగిపొర్లే వాగులపై ఉన్న బ్రిడ్జిలను తరచూ పరిశీలించాలన్నారు. వరద కోతకు గురైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇరిగేషన్ అధికారులతో టచ్‌లో ఉంటూ వరద ప్రవాహాన్ని అంచనా వేస్తూ.. రోడ్లపై రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రయాణించే వారిని అప్రమత్తం చేయాలని చెప్పారు.

కోర్టుల మీద నమ్మకం ఉంది: సీతక్క

- రూ.10 వేలతో రెండు పూచీకత్తులను కోర్టులో దాఖలు చేసిన మంత్రి
- తదుపరి విచారణ ఆగస్టు13కు వాయిదా



సిటీ కోర్టులు: కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలని హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద 2021 ఏప్రిల్‌లో ధర్నా చేస్తే.. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పోలీసుల అనుమతి లేదని తమపై తప్పుడు కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేసిందని మంత్రి సీతక్క అన్నారు. ఇందిరాపార్క్ దగ్గర నిర్వహించిన ధర్నాలో అప్పటి ములుగు ఎమ్మెల్యే సీతక్క, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్, రంజిత్, విధుర్ చావ్లా, అభిజిత్ యాదవ్‌పై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసు విచారణ గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. గత విచారణలో మంత్రి సీతక్కతోపాటు ఇతరులు పూచీకత్తులు పెట్టుకోవాలని కోర్టు సూచించడంతో సీతక్క నేరుగా హాజరై కోర్టు ఆదేశాల మేరకు రూ.10 వేలతో రెండు పూచీకత్తులను తన న్యాయవాది ద్వారా కోర్టులో అందజేశారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు తదుపరి విచారణ ఆగస్టు 13కు వాయిదా వేసింది. ఆలోపు మిగతా వారు రూ.10 వేలతో రెండు పూచీకత్తులు పెట్టుకోవాలని న్యాయవాదులకు సూచించింది. కోర్టు విచారణ అనంతరం మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. కోర్టుల మీద తమకు నమ్మకం ఉందని చెప్పారు.

సాంకేతికతతో పెన్షన్ల పంపిణీ: సీతక్క

సాక్షి, హైదరాబాద్: పెన్షన్ల పంపిణీలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. అసలైన లబ్ధిదారులకు పెన్షన్ చేరేలా అధికారులు కఠిన నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. సాంకేతిక కారణాలతో పెన్షన్ చెల్లింపు ఆలస్యమైతే.. ముందే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గురువారం ప్రజాభవన్‌లో చేయూత పెన్షన్ల పంపిణీపై సమీక్ష సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనలో భాగంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామన్నారు. సమావేశంలో సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, డైరెక్టర్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ క్రీడల్లో తెలంగాణ పోలీసు సత్తా

- అభినందించిన డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని అలబామా రాష్ట్రం బర్మింగ్‌హామ్‌లో జరిగిన వరల్డ్ పోలీస్, ఫైర్ గేమ్స్ 2025లో పతక విజేతలను డీజీపీ జితేందర్ గురువారం తన కార్యాలయంలో అభినందించారు. గత నెల 27 నుంచి ఈనెల 6 వరకు నిర్వహించిన పోటీల్లో తెలంగాణ పోలీస్ క్రీడాకారులు పది పతకాలు సాధించారు. ఇందులో తెలంగాణ పోలీస్ టీం వాటర్ స్పోర్ట్స్ కోచ్ పి.కృష్ణారావు 50 ప్లస్ వయసు విభాగంలో 2000 మీటర్లు, ఇండోర్ రోయింగ్ ఈవెంట్‌లో 500 మీటర్ల పరుగులో 2 బంగారు పతకాలు గెలుచుకున్నారు. తెలంగాణ పోలీస్ టీం అథ్లెటిక్స్ కోచ్ ఎండీ బాబా 35 ప్లస్ వయసు విభాగంలో 110 మీటర్ల షాట్‌పుట్, హర్డిల్స్‌లో 2 కాంస్య పతకాలు సాధించారు. టైక్వాండో క్రీడాకారుడు డి.గోపాల కృష్ణయ్య 40 ప్లస్ వయసు విభాగంలో (మూడు పతకాలు), 80 కిలోల లోపు క్యోరుగి ఈవెంట్‌లో రజతం, గుర్తింపు పొందిన పూమ్సే, ఫ్రీస్టైల్ పూమ్సే ఈవెంట్‌లో రెండు కాంస్య పతకాలు గెలుచుకున్నారు. డి.సంజీవ్ కుమార్ 30 ప్లస్ వయసు విభాగంలో ఒక బంగారు పతకం గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐజీ క్రీడలు రమేశ్, క్రీడా అధికారి, డీఎస్పీ రామారావు పాల్గొన్నారు.

మేడారం జాతరకు రైల్వే లైన్

కేంద్ర రైల్వే మంత్రికి ఎంపీ ఈటల విజ్ఞప్తి



అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఈటల

సాక్షి, న్యూఢిల్లీ: ఆసియా ఖండంలో అతిపెద్ద ఆదివాసీ పండుగగా పేరొందిన మేడారం జాతరకు వచ్చిపోయే భక్తుల కోసం నూతన రైల్వే లైన్ నిర్మాణంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను మర్యాదపూర్వకంగా 'ఈటల'కలిశారు. మేడారం నూతన రైల్వే లైన్ నిర్మాణంతో పాటు.. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. రైల్వే శాఖలో పనిచేస్తూ వైద్యం లేదా ఇతర కారణాలతో మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. మల్కాజిగిరిలోని అయోధ్య ఎక్స్ రోడ్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టి.. ప్రజలకు రవాణా సమస్యల నుంచి ఉపశమనం కలిగించాలని కోరారు.

ముక్తసరి సమాధానాలతో సరి!

- ఏసీబీ ప్రశ్నలకు అంతగా స్పందించని మాజీ ఈఎన్సీ మురళీధర్‌రావు
- రెండో రోజు కస్టడీకి తీసుకుని విచారణ

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు అయిన ఇరిగేషన్ మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) మురళీధర్‌రావు ఏసీబీ రెండో రోజు విచారణలో కూడా ముక్తసరి సమాధానాలకే పరిమితమైనట్టు తెలిసింది. అక్రమార్జనకు సంబంధించి ఏసీబీ అధికారులు అడిగిన చాలా ప్రశ్నలకు ఆయన మౌనం వహించినట్లు సమాచారం. ఐదు రోజుల కస్టడీలో భాగంగా గురువారం రెండో రోజు మురళీధర్‌రావును కస్టడీకి తీసుకున్న ఏసీబీ అధికారులు నాంపల్లిలోని సిటీ రేంజ్ ఏసీబీ కార్యాలయంలో ఆయనను సుదీర్ఘంగా ప్రశ్నించారు. ప్రధానంగా బినామీల పేరిట దాచిన ఆస్తులపైనే అధికారులు ఆరా తీశారు. ఈ నెల 15న ఏకకాలంలో 12 చోట్ల సోదాల్లో స్వాధీనం చేసుకున్న పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలను ముందుంచి మురళీధర్‌రావును ప్రశ్నించినట్టు తెలిసింది. డాక్యుమెంట్లలో ఉన్న వారికి, మురళీధర్‌రావుకు గల సంబంధాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఇందులో కుటుంబ సభ్యులు, బంధువులు సహా మరికొందరి పేర్లతో ఉన్న అనుమానిత డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. వీటితో పాటు బినామీల పేర్లతో మరికొన్ని ఆస్తులను గుర్తించినట్లు తెలిసింది. మురళీధర్‌రావు, ఆయన కుటుంబ సభ్యుల నివాసాల్లో స్వాధీనం చేసుకున్న జహీరాబాద్‌లోని సోలార్ పవర్ ప్రాజెక్ట్ సహా ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, లగ్జరీ ఫ్లాట్లు, కరీంనగర్, హైదరాబాద్‌లోని కమర్షియల్ కాంప్లెక్సులు సహా మొత్తం 22 ఆస్తులు, మూడు కార్లకు సంబంధించిన వివరాలను రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

'ఆ నియామకంపై వివరణ ఇవ్వండి'

సాక్షి, హైదరాబాద్: కనీస వేతనాల బోర్డు చైర్మన్‌గా జనక్‌ప్రసాద్ నియామకంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సీఎస్‌తో సహా జనక్‌ప్రసాద్, బోర్డు సభ్యుడు ఎస్.నరసింహారెడ్డికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. కనీస వేతనాల బోర్డు చైర్మన్‌గా జనక్‌ప్రసాద్‌ను గత ఏడాది మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆ తర్వాత గత డిసెంబర్‌లో 12 మంది సభ్యులను నియమించగా.. ఐఎన్‌టీయూసీ నుంచి ఎస్.నరసింహారెడ్డి సభ్యుడిగా ఎంపికయ్యారు. జనక్‌ప్రసాద్, నరసింహారెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ ట్రేడ్ యూనియన్ కార్యకర్త గంజి శ్రీనివాస్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ శామ్‌కోషి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది.

పుట్టిన రోజు వేడుకల్లో హత్య

- భార్యను కత్తితో పొడిచి చంపిన భర్త
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఘటన

అబ్దుల్లాపూర్‌మెట్: బంధువుల ఇంట్లో జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో ఓ వ్యక్తి తన భార్యను హత్య చేశాడు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట పట్టణం బాషానాయక్ తండాకు చెందిన సాతుపాటి శ్రీనివాస్, కళావతి భార్యాభర్తలు. కళావతికి ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో ఆమె చెల్లెలు సమ్మక్కను (40) శ్రీనివాస్ 13 ఏళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. ఉమ్మడి కుటుంబంతో కలసి శ్రీనివాస్ సూర్యాపేటలోని జనగాం రోడ్డులో ఉంటూ పాత ఇనుప సామాన్ల వ్యాపారం చేస్తున్నాడు. ఇదిలా ఉండగా పదిహేను రోజుల క్రితం శ్రీనివాస్, సమ్మక్కల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బీసీ కాలనీలో నివాసముంటున్న నిందితుడి మేనకోడలు రాజేశ్వరి ఇంటికి వచ్చింది. ఇక్కడ గురువారం రాజేశ్వరి కూతురు పుట్టిన రోజు వేడుక ఏర్పాటు చేశారు. శ్రీనివాస్ కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నాడు. ఈ క్రమంలో రాజేశ్వరి కూతురును తన సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తున్న సమ్మక్కపై వెంట తెచ్చుకున్న కత్తితో శ్రీనివాస్ దాడి చేశాడు. మొదట వీపులో, ఆ తర్వాత గొంతుపై పొడవడంతో సమ్మక్క అక్కడికక్కడే మృతిచెందింది. అందరూ తేరుకునేలోపే శ్రీనివాస్ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎల్బీనగర్ అదనపు డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- కేటీఆర్‌కు ఎర్రవల్లిలో కేసీఆర్ దంపతుల ఆశీస్సులు



కుమారుడు కేటీఆర్‌ను ఆలింగనం చేసుకుని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్/పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు గురువారం తెలంగాణ భవన్‌లో ఘనంగా జరిగాయి. ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌కు పోటెత్తారు. సమావేశ మందిరంలో జరిగిన వేడుకల్లో కేటీఆర్ భారీ కేక్‌ను కట్ చేశారు. మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, లక్ష్మారెడ్డి, మహమూద్ అలీ, మల్లారెడ్డి, మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు దేవీ ప్రసాద్, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు కేటీఆర్‌కు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భవన్‌లో పార్టీ కేడర్ మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న కేటీఆర్.. అనంతరం సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షుతో కలసి ఎర్రవల్లి నివాసానికి వెళ్లి తల్లిదండ్రులు కేసీఆర్, శోభ పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. కేటీఆర్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకుని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమారుడికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కాగా కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా 'గిఫ్ట్ ఎ స్మైల్' పేరిట రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలు, కేటీఆర్ అభిమానులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ సహకారంతో ఓ ప్రైవేటు పాఠశాలకు బెంచీలు, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల చికిత్స కోసం 'తలసేమియా సికిల్‌సెల్ ఎనీమియా సొసైటీ'కి కేటీఆర్ చేతుల మీదుగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి రూ.3 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. అలాగే కేటీఆర్ పటాన్‌చెరుకు వెళ్లి ఇటీవల అరెస్టయిన పార్టీ సోషల్ మీడియా విభాగం కార్యకర్త నల్లబాలు అలియాస్ శశిధర్‌గౌడ్‌ను పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఆయన పోస్టు పెట్టడంతో అరెస్టయిన విషయం తెలిసిందే. నల్లబాలు నివాసంలో ఆయన కుటుంబ సభ్యుల మధ్య కేటీఆర్ కేక్‌కట్ చేసి పుట్టినరోజు వేడుక చేసుకున్నారు. అనంతరం వారి ఇంట్లో భోజనం చేశారు.

రాష్ట్ర విద్యుత్ సంస్థలకు హైకోర్టులో ఊరట

- రూ.179 కోట్ల బకాయిల చెల్లింపు నిలిపివేత

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులకు సంబంధించి.. అదనపు చార్జీల బకాయిల చెల్లింపులపై సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎస్పీడీసీఎల్), నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్)కు హైకోర్టులో ఊరట లభించింది. విద్యుత్ సరఫరాలో లోటుపై రూ.179 కోట్లు చెల్లించాలన్న సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (సీఈఆర్సీ) ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులను సమన్వయం చేస్తూ గ్రిడ్‌కు అదనపు విద్యుత్ అందించినందుకు రూ.179 కోట్లు చెల్లించాలన్న సీఈఆర్సీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ శామ్‌కోషి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున స్టాండింగ్ కౌన్సెల్ ఎస్.శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కేరళ, మద్రాస్ హైకోర్టులు ఇలాంటి పిటిషన్లపై మధ్యంతర ఉపశమన ఆదేశాలు జారీ చేశాయని చెప్పారు. విద్యుత్ లోటుపై చార్జీలు వసూలు చేసే అధికారం సీఈఆర్సీకి లేదని స్పష్టం చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. బకాయిలపై ఊరటనిస్తూ, సరఫరా తేడాతో విధించే తాజా చార్జీలను మాత్రం చెల్లించాలని రాష్ట్ర విద్యుత్ సంస్థలను ఆదేశించింది.

ఇక స్వేచ్ఛా వాణిజ్యం

ఎఫ్‌టీఏపై సంతకాలు చేసిన భారత్, యునైటెడ్ కింగ్‌డమ్

- భారత ఉత్పత్తులపై సుంకాలు సున్నాకు తగ్గించనున్న యూకే
- భారతీయ రైతులు, ఎంఎస్‌ఎంఈలకు ప్రయోజనం
- ఇండియన్ మార్కెట్‌లోకి చౌకగా బ్రిటిష్ విస్కీ, కార్లు, చాక్లెట్లు, ఇతర ఉత్పత్తులు
- యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో నరేంద్ర మోదీ భేటీ

లండన్: భారత్, బ్రిటన్ సంబంధాల్లో కీలక ఘట్టం చోటుచేసుకుంది. చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)పై ఇరుదేశాలు సంతకాలు చేశాయి. పరస్పర ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెండు రెట్లు పెంచుకోవాలని వ్యూహాత్మక భాగస్వామ్యపక్షాలైన భారత్, యూకే నిర్ణయించుకున్నాయి. అమెరికా వాణిజ్య విధానాల పట్ల ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని తీర్మానించాయి. భారత ప్రధాని మోదీ గురువారం లండన్‌లో యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో సమావేశమయ్యారు. ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. 'యూకే–ఇండియా విజన్ 2035' రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. అధికారికంగా సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం(సీఈటీఏ)గా పిలుస్తున్న డీల్‌పై మోదీ, కీర్ స్టార్మర్ సమక్షంలో భారత వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, బ్రిటిష్ వాణిజ్య మంత్రి జోనాథన్ రేనాల్డ్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం వల్ల భారత్, యూకే మధ్య వాణిజ్యం ఏటా 34 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఎఫ్‌టీఏపై సంతకాలు జరగడం పట్ల మోదీ హర్షం వ్యక్తంచేశారు. భారత్, యూకే సంబంధాల్లో ఇదొక చరిత్రాత్మక దినమని అభివర్ణించారు. ఎన్నో ఏళ్ల కఠోర శ్రమ తర్వాత ఈ ఒప్పందంపై సంతకాలు పూర్తయినట్లు తెలిపారు. కీర్ స్టార్మర్ స్పందిస్తూ.. యూరోపియన్ యూనియన్(ఈయూ) తాము బయటకు వచ్చిన అనంతరం కుదుర్చుకున్న అతిపెద్ద ఒప్పందం ఇదేనని స్పష్టంచేశారు.

ఉగ్రవాదంపై పోరులో ఐక్యంగానే..

కీర్ స్టార్మర్‌తో చర్చల అనంతరం ప్రధాని మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. పహల్గాం ఉగ్రవాద దాడిని ఖండించినందుకు యూకే ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉగ్రవాదంపై పోరులో భారత్, యూకే ఐక్యంగా పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదన్నారు.

భారత్‌కు ఎనలేని మేలు

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో భారత్‌కు ఎనలేని మేలు జరుగుతుందని ప్రధానమంత్రి వెల్లడించారు. భారత వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార పరిశ్రమకు బ్రిటిష్ మార్కెట్‌లో నూతన అవకాశాలు లభిస్తాయన్నారు. భారతీయ యువత, రైతులు, మత్స్యకారులతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు(ఎంఎస్‌ఎంఈ) లబ్ధి చేకూరుతుందని స్పష్టంచేశారు. భారతీయ వస్త్రాలు, పాదరక్షలు, వజ్రాలు, బంగారు ఆభరణాలు, సముద్ర ఆహారం, ఇంజనీరింగ్ వస్తువులకు యూకే మార్కెట్‌లోకి ప్రవేశం లభిస్తుందన్నారు. 'విజన్–2030' రోడ్‌మ్యాప్‌పై ఇండియా, యూకే అంకితభావంతో ముందుకెళ్తున్నాయని ఉద్ఘాటించారు.



ఒప్పందం కుదుర్చుకున్నాక బ్రిటిష్ వాణిజ్య మంత్రి జోనాథన్, భారత వాణిజ్య మంత్రి గోయల్ సమక్షంలో ప్రధాని మోదీ, స్టార్మర్ కరచాలనం

మోదీకి స్టార్మర్ విందు

యూకే పర్యటన కోసం బుధవారం రాత్రి లండన్ చేరుకున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రవాస భారతీయులు ఆయనకు స్వాగతం పలికారు. లండన్‌కు 50 కిలోమీటర్ల దూరంలోని తన నివాసంలో గురువారం మోదీకి బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు మీడియాతో మాట్లాడారు. భారత్, యూకే కలిసికట్టుగా పనిచేస్తాయని స్టార్మర్ అన్నారు. రెండు దేశాలు సహజ భాగస్వామ్య పక్షాలు అని మోదీ చెప్పారు. చరిత్రలో నూతన అధ్యాయాన్ని లిఖించుకుంటున్నాయని తెలిపారు. డబుల్ కంట్రిబ్యూషన్స్ కన్వెన్షన్(డీసీసీ)పై ఏకాభిప్రాయానికి వచ్చామని వెల్లడించారు. రెండు దేశాల్లో టెక్నాలజీ, ఫైనాన్స్‌తోపాటు సేవల రంగానికి మేలు జరుగుతుందన్నారు. సులభతర వాణిజ్యానికి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. భారత్–యూకే సంబంధాలపై మోదీ క్రికెట్ పరిభాషలో వివరణ ఇచ్చారు. కొన్నిసార్లు స్వింగ్ అండ్ మిస్ ఉండొచ్చని, అయినప్పటికీ ఎప్పటికీ స్ట్రెయిట్ బ్యాట్‌తో ఆడుతూనే ఉంటామన్నారు. హైస్కోరింగ్‌తోపాటు బలమైన భాగస్వామ్యానికి కట్టుబడి ఉన్నాయని స్పష్టంచేశారు. మోదీ, స్టార్మర్ 'బకింగ్‌హమ్ స్ట్రీట్ క్రికెట్ క్లబ్' క్రీడాకారులతో సంభాషించారు.

ఒప్పందంతో లాభమేంటి?

వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకోవడంతోపాటు పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా భారత్, యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. మూడేళ్ల చర్చల తర్వాత ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇది అమల్లోకి వస్తే జరిగేది ఏమిటంటే..

- బ్రిటిష్ ఉత్పత్తులపై ఇండియాలో సగటు సుంకాలు 15 శాతం నుంచి 3 శాతానికి తగ్గిపోతాయి.
- బ్రిటన్ నుంచి విస్కీ, చాక్లెట్లు, సాఫ్ట్ డ్రింకులు, కాస్మెటిక్స్, కార్లు, వైద్య పరికరాలు భారత మార్కెట్‌లోకి విస్తృతంగా ప్రవేశిస్తాయి.
- బ్రిటిష్ విస్కీపై ప్రస్తుతం విధిస్తున్న 150 శాతం సుంకాన్ని భారత ప్రభుత్వం 75 శాతానికి తగ్గిస్తుంది. రాబోయే పదేళ్లలో 40 శాతానికి తగిస్తుంది. అంటే బ్రిటిష్ విస్కీ ఇండియాలో చౌకగా లభిస్తుంది.
- భారత్ నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులు, వస్తువులపై సుంకాలను యూకే సర్కార్ సగానికి తగ్గిస్తుంది. వస్త్రాలు, పాదరక్షలు, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గిపోతాయి.
- ప్రధానంగా భారతీయ రైతులకు భారీ లబ్ధి చేకూరుతుంది. వ్యవసాయ ఉత్పత్తులపై యూకేలో టారిఫ్‌లు దాదాపు 95 శాతం తగ్గుతాయి. జర్మనీ, నెదర్లాండ్స్‌తోపాటు ఈయూ రైతులతో సమానంగా, కొన్నిసార్లు అంతకంటే ఎక్కువే భారతీయ రైతులు లాభపడతారు. ఇండియా నుంచి దిగుమతి అయ్యే తేయాకు, పండ్లు, కూరగాయలు, మసాలా పొడులు, తృణధాన్యాలు, పచ్చళ్లు, రెడీ–టు–ఈట్ ఆహారం, పండ్ల గుజ్జుతోపాటు శుద్ధి చేసిన ఆహారంపై టారిఫ్‌లు సున్నాకు పడిపోతాయి.
- మత్స్య, సముద్ర ఉత్పత్తులపై సుంకాలను 99 శాతం తగ్గించబోతున్నారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, తమిళనాడులో చేపలు, రొయ్యల పెంపకం చేస్తున్న రైతులకు లాభమే.
- ఇండియా నుంచి యూకేకు దిగుమతి అయ్యే స్మార్ట్‌ఫోన్లు, ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్, ఇన్వర్టర్లపై ఎలాంటి టారిఫ్ ఉండదు.
- దేశీయ మద్యం ఉత్పత్తులు, పానీయాలు యూకే మార్కెట్‌లోకి ప్రవేశించబోతున్నాయి. సంప్రదాయ గోవా ఫెనీ, నాసిక్ వైన్స్, కేరళ కల్లు ఇందులో ఉన్నాయి.
- ఎఫ్‌టీఏతో రానున్న మూడేళ్లలో ఇండియా నుంచి యూకేకు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 20 శాతానికి పైగా పెరుగుతాయని అంచనా. 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయాలని ఇండియా లక్ష్యంగా పెట్టుకుంది.
- దేశీయ రైతులు, పరిశ్రమలను దృష్టిలో పెట్టుకొని పాడి ఉత్పత్తులు, వంట నూనెలు, యాపిల్స్‌ను ఎఫ్‌టీఏ నుంచి భారత ప్రభుత్వం మినహాయించింది. బ్రిటన్ నుంచి వచ్చే ఈ ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు ఉండబోదు.

మీరు ఆంగ్ల పదాలు వాడొచ్చు

ఎఫ్‌టీఏపై సంతకాల తర్వాత మోదీ, స్టార్మర్ ఉమ్మడిగా మీడియాతో మాట్లాడుతున్న సమయంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. స్టార్మర్ స్పీచ్‌ను హిందీలోకి అనువాదం చేస్తున్న దుబాసీ కొంత ఇబ్బందిపడ్డారు. ఆయనకు అప్పటికప్పుడు సరైన హిందీ పదాలు తగల్లేదు. అది గమనించిన మోదీ ''ఇబ్బంది పడాల్సిన పని లేదు. మీరు మధ్యలో ఆంగ్ల పదాలు వాడొచ్చు. దాని గురించి చింతించకండి'' అని సూచించారు. దుబాసీ క్షమాపణ కోరగా, ఫర్వాలేదని మోదీ అన్నారు. ఇదంతా చూసిన స్టార్మర్ చిరునవ్వు చిందించారు.

పత్రాలన్నీ వెంట ఉండాల్సిందే

- గ్రీన్‌కార్డ్ హోల్డర్లు సహా నాన్–సిటిజెన్స్ అందరికీ ఇదే నియమం
- పాటించకుంటే జరిమానా తప్పదు
- అమెరికా ప్రభుత్వం తాజా హెచ్చరిక

వాషింగ్టన్: అసలు కంటే కొసరు పనే ముఖ్యమన్న తరహాలో అమెరికా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఎలాగూ వీసా నిబంధనలు, ఎయిర్‌పోర్ట్‌లో క్షుణ్ణంగా తనిఖీలు దాటుకొని అమెరికాలోకి అడుగుపెట్టినా దాదాపు ప్రతి ఒక్క అమెరికాయేతర వ్యక్తులంతా ఎక్కడ పడితే అక్కడ అధికారులు అడిగే అన్ని రకాల డాక్యుమెంట్లను చూపించాల్సిందేనని ట్రంప్ సర్కార్ హెచ్చరించింది. ఈ మేరకు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్స్(సీబీపీ) విభాగం హెచ్చరికలు జారీచేసింది. గ్రీన్‌కార్డ్ సాధించిన వ్యక్తులు సహా అమెరికా పౌరసత్వం పొందని వారంతా నిరంతరం తమ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను తమ వెంటేసుకుని తిరగాల్సిందేనని సీబీపీ పేర్కొంది. అధికారులు అడిగినప్పుడు చూపించకపోతే జరిమానా ముప్పు తప్పదని, కొన్ని సార్లు అత్యల్పస్థాయి నేరాభియోగాలను సైతం ఎదుర్కోవాల్సిఉంటుందని సీబీపీ హెచ్చరించింది. 18 ఏళ్లు, ఆపైబడిన వారందరికీ ఇదే నియమం వర్తించనుంది. దీంతో విద్య, ఉద్యోగాల కోసం వచ్చే భారతీయులు, వారి వెంట వచ్చే కుటుంబసభ్యులు, చిన్నారులకు కొత్త సమస్య వచ్చిపడింది. సినిమా, షాపింగ్, పార్క్, హోటల్, ఆస్పత్రి, రైల్వేస్టేషన్.. ఇలా ఎక్కడికి వెళ్లినా ముఖ్యమైన రిజిస్ట్రేషన్ పత్రాలు పట్టుకెళ్లడమంటే ఎంతో ఇబ్బందితో కూడిన వ్యవహారం. అక్రమంగా వలసవచ్చారని ఏ క్షణాన ఎవరిపై అనుమానం వచ్చినా వెంటనే అధికారులు సోదాలు, తనిఖీలుచేసేందుకు వీలుగా విదేశీయులకు ఈ అడ్వైజరీని జారీచేసినట్లు సీబీపీ తెలిపింది.



భారతీయులకు ఉద్యోగాలు ఆపండి

వాళ్ల స్థానంలో అమెరికన్లకు ఉపాధి కల్పించండి • అమెరికా టెక్ దిగ్గజ సంస్థలకు ట్రంప్ ఆదేశాలు

న్యూయార్క్/వాషింగ్టన్: విపరీతమైన వీసా ఆంక్షలు అమలుచేస్తూ, సోషల్‌మీడియా ఖాతాలను జల్లెడపడుతూ వీలైనంతవరకు భారతీయులను అమెరికా గడ్డపై కాలుమోపకుండా అడ్డు తగులుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు నేరుగా అక్కడి కంపెనీలకే ఆదేశాలు ఇచ్చేందుకు తెగించారు. చట్టబద్ధంగా, అత్యంత నైపుణ్యముండి వీసాలతో అమెరికాకొస్తున్న భారతీయులను కాదని, అమెరికన్లకే కొలువుల్లో పట్టంకట్టాలని ట్రంప్ అక్కడి టెక్ దిగ్గజ సంస్థలకు హితవు పలికారు. బుధవారం వాషింగ్టన్‌లో జరిగిన ఏఐ సదస్సులో ట్రంప్ పాల్గొని ప్రసంగించారు. మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలనుద్దేశిస్తూ సూటిగా సూచనలు ఇచ్చారు. '' వేర్పాటు వాదంలాంటి ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) భావాజలంలో మన అతిపెద్ద టెక్నాలజీ కంపెనీలు కొట్టుకుపోతున్నాయి. గ్లోబలైజేషన్ కోసం పరితపిస్తున్నాయి. ఈ క్రమంలో కంపెనీలన్నీ కోట్లాది మంది అమెరికన్ల విశ్వాసాన్ని కోల్పోయి కృతఘ్నులుగా తయారవుతున్నాయి. మీరు తోటి అమెరికన్ల పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణిని కనబరుస్తున్నారు. అమెరికాలో లభించిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ ఇక్కడి కంపెనీలు చైనాలో భారీ ఫ్యాక్టరీలు నిర్మిస్తున్నాయి. భారత్ నుంచి తక్కువ జీతభత్యాలకు ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. ఐర్లాండ్‌లో నష్టాలు వస్తున్నాయన్న సాకుతో ఇక్కడ లాభాలను తక్కువచేసి చూపిస్తూ పన్నుల భారాన్ని తగ్గించుకుంటున్నాయి. ఇవన్నీ చేస్తూ మీ తోటి అమెరికన్‌పౌరుల ఉద్యోగ హక్కులను కాలరాస్తున్నారు. ఇక నా హయాంలో మీ ఆటలు సాగవు. అమెరికా టెక్నాలజీ సంస్థలన్నీ మన దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేయాలి. ఫ్యాక్టరీల కల్పనలో, ఉద్యోగాల్లో అమెరికన్లకే తొలి ప్రాధాన్యం దక్కాలి. ఇకనైనా భారతీయులకు ఉద్యోగాలు ఇవ్వడం ఆపండి. అమెరికన్లకు ఉపాధి కల్పించండి. మిమ్మల్ని నేను అడిగేది ఇదొక్కటే. ఈ పని మీరు ఖచ్చితంగా చేస్తారనే భావిస్తున్నా'' అని అధ్యక్షుడు ట్రంప్ అన్నారు.

ముంబై పేలుళ్ల కేసులో..

హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే

న్యూఢిల్లీ: ముంబై రైళ్లలో పేలుళ్ల కేసులో ఇటీవలే బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ కేసులో 12 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును గురువారం అత్యున్నత న్యాయస్థానం నిలిపేసింది. ప్రభుత్వ పిటిషన్‌పై వాదనలు విన్న చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. నిర్దోషులుగా విడుదలైన 12 మందిని తిరిగి అరెస్ట్ చేయాలని చెప్పలేమంది. 'ఈ కేసులో ప్రతివాదులందరినీ విడుదల చేశారు. మళ్లీ వారిని జైలుకు తీసుకొచ్చే ప్రశ్నే లేదు. అయితే, ఈ అభ్యంతరకరమైన తీర్పును మరే ఇతర కేసులలోనూ ఉదాహరణగా పరిగణించరాదు. హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తున్నాం' అని సుప్రీంకోర్టు పేర్కొంది. మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల నియంత్రణ చట్టం కింద ఉన్న ఇతర కేసులను హైకోర్టు తీర్పు ప్రభావితం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొనడంతో సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 189 మంది ప్రాణాలు తీసిన 2006 ముంబై రైలు పేలుళ్ల కేసులో 12 మంది దోషులను నిర్దోషులుగా ప్రకటిస్తూ సోమవారం బాంబే హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాలు చేస్తూ మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును అత్యున్నత న్యాయస్థానం గురువారం విచారించింది.

భగ్గుమన్న సరిహద్దు వివాదం

- థాయ్‌లాండ్–కాంబోడియా మధ్య ఉద్రిక్తతలు
- థాయ్‌లాండ్‌లో 12 మంది మృతి
- దిగజారిన దౌత్య సంబంధాలు


బ్యాంకాక్: థాయ్‌లాండ్–కాంబోడియాల మధ్య దశాబ్దాలుగా నలుగుతున్న సరిహద్దు వివాదం తీవ్రరూపం దాల్చింది. సరిహద్దు ప్రాంతాల్లో ఇరు దేశాల సైనికులు గురువారం ఉదయం తుపాకులు, ఫిరంగులు, రాకెట్లతో కాల్పులకు దిగారు. థాయ్‌లాండ్ వైమానిక దాడులను సైతం ప్రారంభించింది. ఈ ఘటనల్లో 12 మంది చనిపోయారు. వీరిలో 11 మంది పౌరులు కాగా, ఒక సైనికుడు ఉన్నారని థాయ్ తాత్కాలిక ప్రధాని ఫుంథమ్ వెచాయచై తెలిపారు. మరో నలుగురు సైనికులు 25 మంది వరకు పౌరులు గాయపడ్డారన్నారు. మృతులు, క్షతగాత్రుల సంఖ్యను కాంబోడియా విడుదల చేయలేదు. ఘర్షణల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లోని పౌరులు భయంతో ఇళ్లను వదిలి పారిపోతున్నట్లు తెలిపే వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. సరిహద్దుల్లోని కనీసం ఆరు ప్రాంతాల్లో కాల్పులు కొనసాగుతున్నట్లు థాయ్ రక్షణ శాఖ తెలిపింది.

ఏం జరిగిందంటే..

ప్రాచీన 'ట మ్యుయెన్ థోమ్'ఆలయం సమీపంలోనే గురువారం ఉదయం ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ మొదటగా మొదలైంది. ఘర్షణకు కారణం మీరంటే మీరేనని ఎవరికి వారు ఆరోపణలు సంధించుకుంటున్నారు. సరిహద్దుల్లోని తమ సైనిక స్థావరాలకు సమీపంలో డ్రోన్ కనిపించగా కొద్దిసేపటికే ఆరుగురు కాంబోడియా సైనికులు దూసుకొచ్చారని, ఘర్షణను నివారించేందుకు ప్రయత్నిస్తుండగానే వారు కాల్పులకు దిగారని థాయ్ ఆర్మీ తెలిపింది. ఆస్పత్రిపైనా కాంబోడియా దాడులు చేసిందని ఆరోపించింది. అందుకే, తాము సైనిక లక్ష్యాలపై వైమానిక దాడులు చేపట్టినట్లు అనంతరం ప్రకటించింది. తమ దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగిస్తే ఆత్మ రక్షణ చర్యలను తీవ్రతరం చేస్తామని థాయ్ ప్రభుత్వం హెచ్చరించింది. అయితే, థాయ్ సైన్యం తమ ప్రాంతంలోకి ముందుగా డ్రోన్‌ను పంపించిందని, ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపామని కాంబోడియా ఆర్మీ పేర్కొంది. పురాతన ప్రియా విహియార్ ఆలయంలోని రహదారిపై థాయ్ జెట్ విమానాలు బాంబులు విసిరాయని ఆరోపించింది. థాయ్ దురాక్రమణను వెంటనే నిలిపివేసేందుకు భద్రతా మండలిని సమావేశపర్చాలని కాంబోడియా ప్రధాని హున్ మనెత్ ఐరాసకు తాజాగా లేఖ రాశారు.

పేలిన మందుపాతర

బుధవారం వివాదాస్పద సరిహద్దు ప్రాంతంలో మందుపాతర పేలి థాయ్‌లాండ్ సైనికుడొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో థాయ్ ప్రభుత్వం కాంబోడియా రాయబారిని బహిష్కరించడంతోపాటు ఆ దేశంలోని తమ రాయబారిని వెనక్కి పిలిపించుకుంది. కాంబోడియాతో గల ఈశాన్య సరిహద్దు క్రాసింగ్‌లన్నిటినీ మూసివేస్తున్నట్లు ప్రకటించింది. తమ పౌరులను కాంబోడియా వీడాలని కోరింది. ప్రతిగా కాంబోడియా సైతం థాయ్‌తో దౌత్య సంబంధాలను కనీస స్థాయికి తగ్గించుకుంటున్నట్లు తెలిపింది. బ్యాంకాక్‌లోని తమ దౌత్య సిబ్బంది మొత్తాన్ని వెనక్కి పిలిపించుకుంది. థాయ్‌లాండ్ దౌత్య సిబ్బంది మొత్తం తమ దేశం విడిచివెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. తమ ఉబోన్ రట్చంథని ప్రావిన్స్‌లో బుధవారం మందుపాతర పేలి ఐదుగురు గాయపడినట్లు థాయ్‌లాండ్ ప్రభుత్వం తెలపగా తమ ప్రియా విహియార్ ప్రాంతంలో ఈ పేలుడు చోటుచేసుకుందని కాంబోడియా అంటోంది.



వెయ్యేళ్ల ఆలయమే కేంద్రంగా

భారతదేశాన్ని పాలించిన గుప్తులు, పల్లవ చక్రవర్తుల ప్రాబల్యం అప్పట్లో థాయ్‌లాండ్, కాంబోడియాల దాకా విస్తరించింది. పల్లవుల కాలంలో 11వ శతాబ్దంలో ఖ్మెర్ రాజులు నిర్మించిన మూడు హిందూ ఆలయాలున్నాయి. ఈ ఆలయా ల్లో శివలింగం, సంస్కృత లిపిలో శాసనాలు, హిందూ దేవతల చిత్రాలు ఉన్నాయి. ఇక్కడి ప్రసత్‌తా మ్యుయెన్ థోమ్ అనే శివాలయాన్ని 11వ శతాబ్దంలో ఉదయాదిత్యవర్మన్–2 అనే రాజు నిర్మించాడు. దాంగ్‌రెక్ పర్వతాల్లో పురాతన ఖ్మెర్ హైవేను కాంబోడియాలోని అంగ్‌కోర్‌ను థాయ్‌లాండ్‌లోని ఫిమయితో కలిపే మార్గంలో ఈ ఆలయం ఉంది. దీని ప్రకారం ఖ్మెర్ సామ్రాజ్య సరిహద్దులపై తమకే హక్కుందని కాంబోడియా అంటుండగా, థాయ్‌లాండ్ అంగీకరించట్లేదు. శిథిలావస్థకు చేరిన ఈ ఆలయాలు రెండు దేశాల మధ్య వివాదంతో మరోసారి తెరపైకి వచ్చాయి.

ఫ్రాన్స్ ఇచ్చిన మ్యాప్‌తో వివాదం

థాయ్‌లాండ్‌లోని సురిన్ ప్రావిన్స్, కాంబోడియాలోని ఒద్దార్ మియాంచే ప్రావిన్స్‌ల పొడవునా ఉన్న వెయ్యేళ్లనాటి ప్రాచీన శివాలయం 'టమ్యుయెన్ థోమ్' వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. థాయ్‌లాండ్, కాంబోడియాలు గతంలో ఫ్రాన్స్ వలస పాలనలో ఉన్నాయి. ఆ సమయంలో 1907లో రెండు దేశాల సరిహద్దులను విభజిస్తూ ఫ్రాన్స్ ఒక మ్యాప్‌ను రూపొందించింది. ఈ మ్యాప్‌లో పేర్కొన్న భూభాగం తమదేనని కాంబోడియా అంటుండగా, థాయ్‌లాండ్ అది అస్పష్టంగా ఉందని వాదిస్తోంది. దీనిపై కాంబోడియా అంతర్జాతీయ న్యాయస్థానానికి వెళ్లగా 1962లో అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో అప్పటి నుంచీ తరచూ చోటుచేసుకుంటున్న సైనిక ఘర్షణల్లో కనీసం 20 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో కాంబోడియా 2011లో మరోసారి అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారించిన న్యాయస్థానం 2013లో మరోసారి కాంబోడియాకే ఆ దేవాలయ ప్రాంతంపై హక్కుందంటూ మరోసారి ప్రకటించింది. థాయ్‌లాండ్ మాత్రం ఈ తీర్పును అంగీకరించడంలేదు.

'ఇండియా' కూటమి ఉమ్మడి అభ్యర్థి!

న్యూఢిల్లీ: జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవికి త్వరలో ఎన్నికలు నిర్వహించబోతున్నారు. ఎన్నికల సంఘం ఈ మేరకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఎన్నికలో అధికార ఎన్డీయే అభ్యర్థిపై తమ ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలని విపక్ష 'ఇండియా'కూటమి నిర్ణయించినట్లు తెలిసింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ పోటీ పడడమే సరైన వ్యూహమని భావిస్తున్నట్లు సమాచారం. ఫలితంతో సంబంధం లేకుండా అధికార కూటమికి బలమైన సందేశం ఇవ్వదలిచామని ఇండియా కూటమి నేతలు గురువారం వెల్లడించారు. పార్లమెంట్‌లో మొత్తం ఓట్లు 782 కాగా, ఉప రాష్ట్రపతి ఎన్నికలో నెగ్గాలంటే 392 ఓట్లు అవసరం. ప్రస్తుతం ఎన్డీయేకు 423 ఓట్ల బలం ఉంది. ఇండియా కూటమికి సానుకూలంగా 313 ఓట్లు ఉన్నాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికలో పార్లమెంట్ ఉభయ సభల సభ్యులు పాల్గొంటారు.

ఆఖరి నిమిషంలో

కూలిన విమానం

48 మంది సజీవదహనం

మాస్కో: ల్యాండింగ్ విఫలంకావడంతో మళ్లీ గాల్లోకి లేచి మరోసారి ల్యాండింగ్ కోసం గాల్లో చక్కర్లు కొడుతున్న 50 ఏళ్ల పాత రష్యా విమానం ఒకటి అనూహ్యంగా కొండప్రాంతంలో కూలిపోయింది. రష్యాలోని చైనా సరిహద్దుల్లోని మారుమూల అమూర్ రీజియన్‌లోని టిండా పట్టణ సమీపంలో ఈ ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. కుప్పకూలిన విమానం నుంచి చెలరేగిన మంటల్లో విమానంలోని వారంతా అగ్నికి ఆహుతయ్యారు. మొత్తం 48 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో చిన్నారులు సైతం ఉన్నారు. టిండా విమానాశ్రయానికి 15 కిలోమీటర్ల దూరంలో గురువారం ఉదయం ఈ ఘోర ప్రమాదం జరిగింది. రష్యా శివారు అమూర్ రీజియన్ గవర్నర్ వాసిలీ ఓర్లోవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోవియట్ కాలంనాటి అంగారా ఎయిర్‌లైన్స్ ఆంటోనోవ్ ఏఎన్24 విమానం ఖబరోవ్స్క్ నుంచి బ్లాగోవెష్‌చెన్స్క్ సిటీకి బయల్దేరింది. షెడ్యూల్ ప్రకారం మార్గమధ్యంలో టిండా పట్టణంలో ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే ల్యాండింగ్‌కు ప్రయత్నించగా అది సాధ్యంకాలేదు. దీంతో మళ్లీ గాల్లోకి లేచి మరోసారి ల్యాండింగ్ కోసం ఆకాశంలో అలా చుట్టూ తిరిగి వస్తోంది. ఈ క్రమంలో ఎయిర్‌పోర్ట్‌కు 15 కిలోమీటర్ల దూరంలో అటవీప్రాంతంపై ఎగురుతుండగా హఠాత్తుగా రాడార్ల నుంచి అదృశ్యమైంది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ కేంద్రం నుంచి ఈ విమానానికి సంబంధాలు తెగిపోయాయి. వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగి ఎంఐ–8 హెలికాప్టర్‌తో గాలింపు చేపట్టగా సమీప కొండప్రాంతంలో విమానం శకలాలు కనిపించాయి. ప్రమాదానికి అసలు కారణాలు ఇంకా తెలియరాలేదు. అసాధారణ వాతావరణ పరిస్థితుల కారణంగా విమానం అదుపుతప్పి నేలరాలి ఉంటుందని స్థానిక ఇంటర్‌ఫ్యాక్స్ న్యూస్‌ఏజెన్సీలో కథనాలు వెలువడ్డాయి.



చెల్లాచెదురుగా పడిన విమాన శకలాలు

పార్లమెంట్‌లో రచ్చ రచ్చ

- బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై విపక్షాల ఆగ్రహం
- వెంటనే చర్చ చేపట్టాలని, ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్
- యథావిధిగా కొనసాగిన నిరసనలు, నినాదాలు
- ఉభయ సభలు పలుమార్లు వాయిదా

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో వరుసగా నాలుగో రోజు గురువారం ఎలాంటి కార్యకలాపాలు చోటుచేసుకోలేదు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణతోపాటు కీలక అంశాలపై విపక్షాలు తమ డిమాండ్ల నుంచి వెనక్కి తగ్గలేదు. ఆయా అంశాలపై వెంటనే చర్చ ప్రారంభించాలని, ప్రభుత్వం స్పందించాలని తేల్చిచెప్పాయి. నిరసనలు, నినాదాలు యథావిధిగా కొనసాగించాయి. ఉభయ సభలకు అంతరాయం కలిగించాయి. దీంతో సభలను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. గురువారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు ప్రారంభించారు. వెల్‌లోకి దూసుకొచ్చి ప్లకార్డులు ప్రదర్శించారు. సభకు సహకరించాలని, వెనక్కి వెళ్లి సీట్లలో కూర్చోవాలని స్పీకర్ బిర్లా కోరినా వారు వినిపించుకోలేదు. సభకు అంతరాయం సరైన పద్ధతి కాదని స్పీకర్ హితవు పలికారు. సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత పరిస్థితిలో మార్పు రాలేదు. గోవా అసెంబ్లీలో ఎస్టీలకు సీట్ల కేటాయింపునకు సంబంధించిన బిల్లుపై చర్చలో పాల్గొనాలని స్పీకర్ స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేయగా, విపక్ష ఎంపీలు పట్టించుకోలేదు. ఎస్టీలకు సంబంధించిన బిల్లుపై చర్చకు అడ్డుపడడం పట్ల విపక్షాలపై న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినప్పటికీ నినాదాలు ఆగకపోవడంతో సభాపతి లోక్‌సభను శుక్రవారానికి వాయిదావేశారు.

రాజ్యసభలోనూ గందరగోళం

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యసభలో విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. ఉదయం రాజ్యసభ సమావేశాలు ప్రారంభమైన కొద్దిసేపటికే వారు అలజడి సృష్టించడంతో సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత క్యారేజీ ఆఫ్ గూడ్స్ బై సీ బిల్లుపై చర్చ మొదలైంది. దీనిపై ఏఐఏడీఎంకే నేత తంబిదురై మాట్లాడారు. ఇంతలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు ప్రారంభించారు. వెల్‌లోకి చేరుకొని నినాదాలతో హోరెత్తించారు. తంబిదురై తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడారు. విపక్ష ఎంపీలు తమ నినాదాలు ఆపలేదు. సభలో వారి ప్రవర్తన పట్ల బీజేపీ ఎంపీ లక్ష్మీకాంత్ బాజ్‌పాయ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని సభాపతి స్థానంలో ఉన్న భువనేశ్వర్ కలితాను కోరారు. ప్రతిపక్ష నేత ఖర్గేకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ విన్నవించారు. అందుకు సభాపతి అంగీకరింకపోవడంతో విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. దాంతో సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు సభాపతి పేర్కొన్నారు.

పార్లమెంట్‌లో ప్రాంగణంలో నిరసన

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణను వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. ఓటు బందీని ఆపాలని ప్లకార్డులు ప్రదర్శించారు. సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విపక్షాలు ప్రదర్శించిన ప్లకార్డుల్లో లోక్‌తంత్ర బదులు లోక్‌తంతర్ అని రాసి ఉండడంతో బీజేపీ నేత మాలవీయా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఏది ఎలా రాయాలో తెలియనివారు ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు.



విశాఖ టు జోగిపేట..
ఉమ్మడి ఏపీలోని విశాఖపట్నం జైలులో డిటెన్షన్ సెంటర్ ఉండేది. ఆపై వికారాబాద్, హైదరాబాద్‌లలో ఏర్పాటు చేయాలని భావించినా.. ఇప్పుడది జోగిపేట సబ్ జైలుకు మారింది. -8లో



'ఇక్సీ'తో.. ఇన్‌ఫెర్టిలిటీ ఫిక్స్..
వైద్యరంగంలో సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది. యుక్త వయసులోనే పురుషులు శుక్ర కణాలను, మహిళలు అండాలను భద్రపరుచుకునే వెసులుబాటు వచ్చేసింది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
28.0/21.0
నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 28, కనిష్ఠంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



'జల'దరింపు

నగరాన్ని ముసురు వర్షం చుట్టేసింది. బుధవారం అర్ధరాత్రి కుండపోతగా కురిసిన వాన.. గురువారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు చిరుజల్లులతో తడిపేసింది. సాయంత్రం పలు ప్రాంతాల్లో భారీగా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. మాదాపూర్, మియాపూర్, నాలెడ్జి సిటీ తదితర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్‌జాం నెలకొంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. - సాక్షి, సిటీబ్యూరో

సచివాలయ పరిసర ప్రాంతాల్లో ముసురు వర్షం

భవనంపై నుంచి దూకి పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

ఐదు రోజుల వ్యవధిలో ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరి బలవన్మరణం

- రెండు కుటుంబాల్లో చర్చనీయాంశంగా మారిన విషాదకర ఘటనలు

మియాపూర్: పదో తరగతి విద్యార్థిని భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం నింపింది. సీఐ శివప్రసాద్, మృతురాలి తండ్రి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మియాపూర్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లోని డీ- బ్లాక్‌లో నాలుగో అంతస్తులో నివాసముంటున్న బిజయ్ నాయక్, చిన్మయి నాయక్ దంపతులకు కుమార్తె హన్సిక నాయక్ (15), ఓ కుమారుడు ఉన్నారు. హన్సిక మియాపూర్ మాధవ నగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. గురువారం ఉదయం హన్సిక పరీక్ష రాసేందుకు వెళ్లగా.. పాఠశాల యాజమాన్యం ఇంటికి తిరిగి పంపించింది. దీంతో హన్సిక ఇంటికి వెళ్లి మధ్యాహ్నం తాము నివసిస్తున్న భవనం ఐదో అంతస్తు పైనుంచి కిందికి దూకడంతో తీవ్ర గాయాలపాలైంది. ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా.. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.



హన్సిక (ఫైల్)

ఐదు రోజుల క్రితం..
మాధవనగర్‌లోని హన్సిక చదువుతున్న పాఠశాలలోనే పదో తరగతి చదువుతున్న షేక్ రిజ్వాన్ (15) ఈ నెల 19న పాఠశాల భవనం ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. రిజ్వాన్, హన్సిక ఒకే తరగతి కావడంతో సన్నిహితంగా మెలిగేవారు. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్‌లు చేసుకునేవారు. వీటిని పాఠశాల టీచర్ చూసి ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించింది. దీంతో ప్రిన్సిపాల్ రిజ్వాన్ తల్లిని పాఠశాలకు శనివారం పిలిపించి మాట్లాడుతుండగా ఈ చాటింగ్ విషయం తల్లికి, పాఠశాల యాజమాన్యానికి తెలిసిందనే మనస్తాపంతో పాఠశాల భవనం ఐదో అంతస్తు నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో గురువారం విద్యార్థిని హన్సిక, తండ్రి బిజయ్ నాయక్‌తో కలిసి మృతి చెందిన తోటి విద్యార్థి రిజ్వాన్ ఇంటికి వెళ్లారు. అక్కడ రిజ్వాన్ తల్లిదండ్రులు బిజయ్ నాయక్, హన్సికపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల భవనంపై నుంచి దూకి రిజ్వాన్ ఆత్మహత్య చేసుకున్న విధంగానే తన కుమార్తె హన్సికను పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవాలని బెదిరించారని హన్సిక తండ్రి బిజయ్ నాయక్ పోలీసులకు చెప్పారు. పరీక్ష రాసేందుకు అనుమతించకపోవడం, తోటి విద్యార్థి రిజ్వాన్ కుటుంబ సభ్యులు దూషించడంతో మనస్తాపం చెందిన తన కుమార్తె హన్సిక ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని మియాపూర్ పోలీసులు తెలిపారు.

జంట జలాశయాలకు భారీ వరద



హిమాయత్ సాగర్

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారులోని హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్‌లకు వరద భారీ స్థాయిలో వచ్చి చేరుతోంది. హిమాయత్ సాగర్ జలాశయానికి వరద ఉధృతి పెరిగింది. గురువారం సాయంత్రానికి జలాశయం పూర్తి నీటి మట్టానికి 1.45 అడుగుల దూరంలో ఉంది. మొత్తం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు కాగా.. ప్రస్తుతం 1761.05 అడుగులకు చేరింది. ఎగువ భాగం నుంచి జలాశయంలోకి 300 క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరుతోంది. ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉందని, మరో అడుగు మేర నీరు వచ్చి చేరితే గేట్లు ఎత్తే అవకాశముందని జలమండలి అధికారులు తెలిపారు. మరోవైపు ఉస్మాన్‌సాగర్ పూర్తి నీటమట్టం 1790 అడుగులు కాగా.. ప్రస్తుతం 1782.80 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి 100 క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోంది. హిమాయత్ సాగర్ జలాశయం ప్రాజెక్టు ఆరు గేట్ల నుంచి వాటర్ లీకేజీ అవుతుండటం గమనార్హం.

అధికారులూ.. అప్రమత్తంగా ఉండండి: మేయర్

లక్డీకాపూల్: గ్రేటర్ నగరంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. ఎడతెరిపిలేకుండా వానలు కురుస్తున్న దృష్ట్యా గురువారం మేయర్ జోనల్ కమిషనర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం నగరంలో మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జోనల్ కమిషనర్లు, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని సూచించారు. హైడ్రాతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, వరద నీరు నిలిచే ప్రాంతాల (వాటర్ లాగింగ్ పాయింట్స్)పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అత్యవసర నిమిత్తం ప్రజలు 040-29555500, 040-21111111 లేదా 9000113667 నంబర్లలో సంప్రదించాలని, లేదా హైడ్రాకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వర్షాల వల్ల ప్రజలకు అసౌకర్యం కలగకుండా జీహెచ్‌ఎంసీ అవసరమైన చర్యలు తీసుకుంటుందని మేయర్ స్పష్టం చేశారు.

బస్తీబాటన డిస్కం సీఎండీ



సాక్షి, సిటీబ్యూరో: ఏకధాటిగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ బస్తీబాట పట్టారు. గురువారం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్ పరిధిలోని బస్తీల్లో ఆయన పర్యటించారు. విద్యుత్ సరఫరా, అంతరాయాలపై ఆరా తీశారు. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాల కోసం కేటాయించిన స్థలాలను పరిశీలించారు. సీఎండీ వెంట నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ నరసింహులు, చీఫ్ ఇంజినీర్ సాయిబాబా, ఎస్‌ఈ వెంకన్న, డీఈ సుధీర్ కుమార్ తదితర అధికారులు ఉన్నారు.

రెక్క లొచ్చేనా..



ఆ లోహ విహంగం ఎగిరేదెన్నడో!!

- పునరుద్ధరణకు నోచుకోని హైదరాబాద్ టు చికాగో ఫ్లైట్
- నగరం నుంచి అమెరికాకు ఏటా 10 లక్షల మంది ప్రయాణం
- డైరెక్ట్ ఫ్లైట్స్ లేకపోవడంతో ఇబ్బందులు
- కనెక్టింగ్ ఫ్లైట్ల కోసం గంటల తరబడి పడిగాపులు

సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ టు చికాగో ఎయిర్ ఇండియా విమానం. కేవలం పదహారున్నర గంటల్లో చేరుకొనే సదుపాయం. యూఎస్‌లోని అత్యధిక రద్దీ ఉన్న విమానాశ్రయాల్లో ఒకటైన చికాగోకు హైదరాబాద్ నుంచి నేరుగా బయలుదేరే సదుపాయం ఉండడంతో ప్రయాణికులకు గొప్ప ఊరటనిచ్చింది. కనెక్టింగ్ ఫ్లైట్‌ల కోసం పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండానే గమ్యస్థానానికి చేరుకొనే అవకాశం కల్పించింది. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచి యూఎస్‌కు వెళ్లే విద్యార్థులు, వ్యాపారులు, బంధుమిత్రులు చికాగో ఫ్లైట్‌పైనే ఆధారపడి రాకపోకలు సాగించారు. రెండు ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాల మధ్య 2021లో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విమాన సర్వీసు అనతి కాలంలోనే ఆగిపోయింది. కోవిడ్ కారణంగా పలు విమాన సర్వీసులను నిలిపివేశారు. అందులో భాగంగా హైదరాబాద్- చికాగో సర్వీసుకు సైతం బ్రేకులు పడ్డాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ సర్వీసును పునరుద్ధరించలేదు. హైదరాబాద్- చికాగో విమానాన్ని పునరుద్ధరించడంతో పాటు కొత్తగా మరిన్ని నగరాలకు అంతర్జాతీయ సర్వీసులను ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మాత్రం 24 గంటలకు పైగా ప్రయాణం చేసి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తోంది.

30 శాతానికి పైగా పెరిగిన రద్దీ..

- హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతి రోజు సుమారు 15 వేల మంది వివిధ దేశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో యూఎస్‌కు రాకపోకలు సాగించేవారి సంఖ్యే అధికం. మిగతా ప్రయాణికులు ఎక్కువగా దుబాయ్, యూరప్, సింగపూర్, బ్యాంకాక్, మలేసియా, శ్రీలంక, మాల్దీవులు తదితర దేశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి యూఎస్‌కు రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికుల సంఖ్య ఏటా పెరుగుతోంది. లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగార్థులు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పర్యాటకులు భారీ సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు.
- 2020లో హైదరాబాద్ నుంచి అమెరికాకు సుమారు 8.5 లక్షల మంది ప్రయాణం చేశారు. ఇప్పుడు ఆ సంఖ్య 10 లక్షలు దాటింది. ఈ ఐదారేళ్లలో ప్రయాణికుల రద్దీ సుమారు 30 శాతం పెరిగినట్లు అంచనా. కానీ ప్రయాణికుల డిమాండ్, రద్దీ మేరకు నేరుగా బయలుదేరేందుకు విమాన సర్వీసులు లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం పలు ఎయిర్‌లైన్స్‌కు చెందిన 25 విమానాలు కనెక్టింగ్ సదుపాయాన్ని అందజేస్తున్నాయి. లుఫ్తాన్సా, పసిఫిక్ క్యాథీ, ఎమిరేట్స్, ఎతైహాద్, ఖతార్, తదితర ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానాలు ఢిల్లీ, ముంబయి, దుబాయ్, దోహా, ఫ్రాంక్‌ఫర్ట్, లండన్ తదితర ఎయిర్‌పోర్టుల నుంచి సర్వీసులను అందజేస్తున్నాయి.

రోజుకు 5 విమానాల డిమాండ్..

రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారుల అంచనాల మేరకు ప్రతి రోజు 1462 మంది యూఎస్‌కు ప్రయాణం చేస్తున్నారు. అంటే కనీసం 5 విమానాల ఆక్యుపెన్సీకి తగినట్లుగా ప్రయాణికుల డిమాండ్ ఉంది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నుంచి ఆగస్టు వరకు ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవర్గాలకు చెందిన వాళ్లు ఎక్కువగా ఉంటారు. వారానికి కనీసం 3 డైరెక్ట్ ఫ్లైట్‌లు అందుబాటులో ఉన్నా ప్రయాణికులకు ఎంతో సదుపాయంగా ఉంటుంది.

24 గంటలకు పైగా పడిగాపులే....
హైదరాబాద్ నుంచి దుబాయ్, దోహాల మీదుగా బయలుదేరే ప్రయాణికులు కనెక్టింగ్ ఫ్లైట్‌ల కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. 'హైదరాబాద్ నుంచి డల్లాస్‌కు చేరుకోవడానికి 24 గంటల కంటే ఎక్కువ సమయం ప్రయాణంలోనే గడిచిపోతోంది. ట్రాన్సిట్ ఎయిర్‌పోర్టుల్లోనే ఎదురుచూడాల్సి వస్తోంది' అని హిమాయత్‌నగర్‌కు చెందిన ట్రావెల్స్ ఏజెన్సీ ప్రతినిధి ఒకరు తెలిపారు. డైరెక్ట్ ఫ్లైట్ సదుపాయం ఉంటే 12 నుంచి 17 గంటల వ్యవధిలోనే చేరుకోవచ్చని చెప్పారు. హైదరాబాద్ నుంచి 75 శాతం మంది ప్రయాణికులు డల్లాస్, న్యూయార్క్, చికాగో, అట్లాంటా, బోస్టన్, లాస్‌ఏంజిల్స్, శాన్‌ఫ్రాన్సిస్కో తదితర నగరాలకు ప్రయాణం చేస్తున్నట్లు అమీర్‌పేట్‌కు చెందిన ఓ ట్రావెల్స్ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు.



బల్దియాకు జలమండలి బాకీ రూ.53 కోట్లు

అక్రమంగా రోడ్లు తవ్విన జలమండలి

- చార్జీలు సర్దుబాటు చేయాలన్న జీహెచ్‌ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేటు వ్యక్తులు, కాంట్రాక్టర్లు అనుమతులు తీసుకోకుండా, అర్ధరాత్రుళ్లు వివిధ అవసరాల కోసం రోడ్లు తవ్వడం పరిపాటి. కానీ.. ప్రభుత్వ విభాగమైన హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సివరేజీ బోర్డు (జలమండలి) సైతం తాగునీటి పైపులైన్లు, సివరేజీ లైన్ల ఏర్పాటు కోసం జీహెచ్‌ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, రోడ్ కటింగ్ చార్జీలు చెల్లించకుండా రోడ్లు తవ్వేసింది. వివిధ ప్రాంతాల్లో వాటిని గుర్తించిన జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు, సదరు రోడ్ కట్టింగ్‌లకు చెల్లించాల్సిన చార్జీలను లెక్కగట్టారు. 2024 ఏప్రిల్ నుంచి గత జూన్ నెలాఖరు వరకు అవి రూ.53.43 కోట్లుగా తేలింది. వాటిని సర్దుబాటు చేయాలని జలమండలిని కోరినట్లు తెలిసింది.

ప్రజలకు పాట్లు..
జీహెచ్‌ఎంసీ.. జలమండలి మధ్య సంబంధాలు, వివాదాల సంగతి ఎలా ఉన్నప్పటికీ, అడ్డగోలు రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ అడ్డగోలుగా రోడ్లు తవ్వారు. ఇలాంటి పనులన్నీ వేసవిలోనే పూర్తి చేయాల్సి ఉండగా, జోరున వర్షాలు పడుతున్న తరుణంలోనూ నగరంలోని ఎన్నో ప్రాంతాల్లో తవ్విన రోడ్లు దర్శనమిస్తున్నాయి. జలమండలి వాటిని అత్యవసరమంటూ తవ్వడం.. జీహెచ్‌ఎంసీ వెంటనే పూడ్చివేయకపోవడంతో ప్రజలు తిప్పలు పడుతున్నారు. అంతేకాదు.. ఏదైనా రోడ్డు కొత్తగా వేయాలన్నా, రీకార్పెటింగ్ వంటి పనులు చేయాలన్నా సంబంధిత విభాగాలతో సంప్రదించి, భవిష్యత్‌లో ఏవైనా పనులు చేయాల్సి ఉంటుందేమో తెలుసుకోవాలి. ఒకవేళ పనులు చేయాల్సి ఉంటే, వాటిని పూర్తిచేశాకే కొత్తవి వేయాలి. కానీ నగరంలో అలా జరగడం లేదు. ఎమ్మెల్యే తొందరపెడుతున్నారనో, ఎంపీ చెప్పారనో జీహెచ్‌ఎంసీ రోడ్లు వేయడం.. వేసిన మూణ్నాళ్లకే జలమండలి, టెలికాం, విద్యుత్ సంస్థల వంటివి రోడ్డు తవ్వడం పరిపాటిగా మారింది. ఇలాంటి చర్యల వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. మరోవైపు రోడ్ల సమస్యలు మొదటికి వస్తున్నాయి.

పరస్పర సహకారంతోనే సమస్యల పరిష్కారం

హైడ్రా-జీహెచ్‌ఎంసీ సమన్వయ సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా-జీహెచ్‌ఎంసీ విభాగాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఉంటేనే వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడగలమని కమిషనర్లు ఏవీ రంగనాథ్, ఆర్‌వీ కర్ణన్ అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల వేళ క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారంలో ఇబ్బందులపై గురువారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నగరంలోని నాలా నెట్‌వర్క్‌పై పూర్తి అవగాహన ఉన్న జీహెచ్‌ఎంసీ ఏఈ, డీఈలు క్షేత్రస్థాయిలో పని చేస్తున్న హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ (ఎంఈటీ), డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు (డీఆర్‌ఎఫ్) బృందాలకు సహకారం అందించాలని ఇరువురు కమిషనర్లు సూచించారు. ఈ రెండు విభాగాలూ వేర్వేరు కాదని, వీటి లక్ష్యం ప్రజలకు ఇబ్బంది లేని మెరుగైన సేవలు అందించడమే అన్నది గ్రహించాలని దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట జలమండలి సహకారం కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్‌యూబీల వద్ద డీ వాటరింగ్ పంపుల నిర్వహణ, క్యాచ్‌పిట్స్ క్లీనింగ్, క్యాచ్‌పిట్స్ మధ్యన ఉన్న పైపులలో సిల్ట్ తొలగించడం, నాలా భద్రత, నాలాల క్లీనింగ్, సిల్ట్‌ను తరలించడం, మాన్సూన్ సమయంలో డీసిల్టింగ్ చేయడం, వర్షంలో కొట్టుకొచ్చిన చెత్తను తరలించడం, నాలాల్లో తీసిన సిల్ట్‌ను ఎక్కడికి తరలించాలి? వార్డు కార్యాలయంలో ఎంఈటీలు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. జీహెచ్‌ఎంసీ జేసీ, డీసీ స్థాయి నుంచి డీఈలు, ఏఈలు ఇలా అన్ని స్థాయిల్లోనూ పూర్తి సహకారం హైడ్రాకు అందజేయాలని ఇరువురు కమిషనర్లు నిర్ణయించారు. ఐటీ రంగం కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోందని, ఇలాంటి తరుణంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ పెంచడానికి అందరూ కృషి చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తగూడ ఫ్లైఓవర్‌పై, అండర్ పాస్‌లో నీరు నిలవడాన్ని ఉదహరిస్తూ ఈ సమస్య భవిష్యత్తులో ఉత్పన్నం కాకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏవీ రంగనాథ్, ఆర్‌వీ కర్ణన్ తదితరులు

మీరాలం చెరువుపై వంతెన

- రూ.430 కోట్లతో ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం
- పరిపాలనా అనుమతులు మంజూరు



సాక్షి, సిటీబ్యూరో: దుర్గం చెరువు తరహాలో హైదరాబాద్‌లో రెండో కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి లైన్ క్లియరైంది. 2.65 కిలోమీటర్ల పొడవునా నాలుగు లైన్ల ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రతిపాదిత ఈ వంతెన శాస్త్రిపురం వద్ద బెంగళూరు జాతీయ రహదారి నుంచి చింతల్‌మెట్ రోడ్‌ను అనుసంధానిస్తుంది. ఈ ఐకానిక్ వంతెన నిర్మాణానికి రూ.430 కోట్ల మొత్తానికి పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఈమేరకు మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏఅండ్‌యూడీ) సెక్రటరీ ఇలంబర్తి గురువారం జీవో జారీ చేశారు. మీరాలం చెరువు అభివృద్ధితో పాటు బ్రిడ్జి నిర్మాణానికి మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో ఈ వంతెనను నిర్మించనున్నారు.

- సరస్సు సుందరీకరణతో పాటు పార్కింగ్, రోడ్ల అనుసంధానం, లైటింగ్, రిటైల్ ఔట్‌లెట్లు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల కోసం అవసరమైన భూములను సమీకరించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ డీపీఆర్ పనులను సింగపూర్ కన్సార్టియం మెయిన్‌హార్ట్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీఎంసీ) ఏజెన్సీగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఫైనాన్సింగ్, నిర్మాణం, సౌకర్యాల నిర్వహణ బాధ్యతలు ఈ సంస్థవే. వంతెన నిర్మాణ పనుల పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, పరీక్షలు, ఆడిట్ల బాధ్యత ఏజెన్సీదే. ఏజెన్సీ సమర్పించిన వంతెన డిజైన్లను ఐఐటీ హైదరాబాద్, ఎన్‌ఐటీ వరంగల్, జేఎన్‌టీయూ వంటి సాంకేతిక సంస్థ ఏజెన్సీ సమర్పించిన డ్రాయింగ్, డిజైన్లను పరిశీలిస్తాయి.

ఐలాండ్స్‌లో టవర్లు..
మీరాలం ట్యాంకులో సహజసిద్ధమైన రెండు దీవులు (ఐలాండ్స్) ఉన్నాయి. ఒకటి 5 ఎకరాలు, మరొకటి 2.5 ఎకరాల విస్తీర్ణంలో ఇవీ ఉన్నాయి. గతంలో ఇక్కడికి వెళ్లేందుకు పర్యాటక శాఖ బోటింగ్‌లను నిర్వహించేది. తాజాగా ఈ రెండింటితో పాటు మరొకటి కలిపి మొత్తం మూడు ఐలాండ్స్‌ను నిర్మించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. సింగపూర్‌లోని గార్డెన్స్ బై ది బేను తలపించేలా బర్డ్స్ ప్యారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయనున్నారు. వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వెంచర్ పార్క్, థీమ్ పార్క్, యాంపీ థియేటర్లను ఏర్పాటు చేయనున్నారు.

ప్రహసనంగా ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలు

- సీట్ల జాబితా విడుదలలో జాప్యం
- విద్యార్థుల్లో పెరుగుతున్న ఉత్కంఠ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ కేటగిరీ-2 ప్రవేశాలు ప్రహసనంగా మారాయి. సీట్లు సాధించిన అభ్యర్థుల జాబితా విడుదలలో అంతులేని జాప్యం ఏర్పడుతోంది. దీంతో విద్యార్థుల్లో జాబితాపై ఉత్కంఠ నెలకొంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూల అనంతరం ఈ నెల 19న పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామని అధికారులు గతంలోనే ప్రకటించారు. కానీ ఇంతవరకూ జాబితా విడుదలపై అధికారుల నుంచి ఎటువంటి సమాచారం లేకుండాపోయింది. ఓయూలోని 12 విభాగాల ఫ్యాకల్టీలకు సంబంధించిన డీన్‌ల సమావేశం అనంతరం జాబితాను ప్రకటించాల్సి ఉంది. ఇంటర్వ్యూలు ముగిసి 15 రోజులు గడుస్తున్నా ఇంతవరకూ డీన్‌లు సమావేశం కాలేదు. మూడేళ్ల తర్వాత 650 సీట్లకు జరుగుతున్న పీహెచ్‌డీ కోర్సుల ప్రవేశాలు ప్రహసనంగా మారాయి. వీసీ కుమార్ వెంటనే స్పందించి డీన్‌ల సమావేశాన్ని ఏర్పాటు చేసి పీహెచ్‌డీ సీట్లు సాధించిన విద్యార్థుల జాబితా విడుదల చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్ట్

12.5 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి రవాణా వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్

సికింద్రాబాద్: గంజాయి రవాణా చేస్తున్న ఇరువురిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 12.5 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు బి.సాయీశ్వర్‌గౌడ్, బీఎస్.సారస్వత్ వివరాల మేరకు...కొమురంభీమ్ అసిఫాబాద్ జిల్లా బూసిమట్టకు చెందిన షేక్‌ఖాతూన్ బీ (58) , ఒడిశా నుంచి వచ్చి చర్లపల్లిలో ఉంటున్న గణేశ్ జేన (42)లు గంజాయి ప్యాకెట్లను ఒడిశా రాష్ట్రం బరంపూర్ నుంచి వెంట తీసుకుని కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఇక్కడికి తీసుకు వచ్చిన గంజాయి ప్యాకెట్లను వ్యాపారులకు అప్పగించేందుకు రైల్వేస్టేషన్‌లోని సాధారణ ప్రయాణికుల వెయిటింగ్ హాలులో ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసు బృందాలు రైల్వేస్టేషన్‌లో జరిపిన తనిఖీల్లో ఈ ఇద్దరూ పట్టుబడడంతో గంజాయి రవాణా వ్యవహారం వెలుగుచూసింది. వీరిని రవాణాకు ప్రోత్సహించిన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు చెందిన ఏ.ప్రేం (42), సుల్తాన్‌గూడకు చెందిన వసంత్‌నాయక్ (35) అనే ఇరువురు వ్యాపారులపై కేసులు నమోదు చేసిన పోలీసులు వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వారంతా పలుమార్లు గంజాయి రవాణా కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన వారు కావడం గమనార్హం. గంజాయి అక్రమ రవాణాలో ప్రమేయం ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివం ఫార్మా కంపెనీపైన కూడా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విశాఖ టు జోగిపేట వయా వికారాబాద్!

తెలంగాణ రాష్ట్రానికి డిటెన్షన్ సెంటర్ కరువు

- డిపోర్టేషన్ చేసే వారిని ఉంచాల్సింది అక్కడే
- ఉమ్మడి రాష్ట్రంలో ఇది విశాఖపట్నం జైలులో
- ఆపై సీసీఎస్ ఆధీనంలో తాత్కాలికంగా ఏర్పాటు
- వికారాబాద్‌లో నిర్మించడానికి గతంలో యత్నం
- తాజాగా జోగిపేటలోని సబ్ జైల్‌లో ఏర్పాటు



జోగిపేట సబ్ జైలు..

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాలు... డ్రగ్స్ దందా... అక్రమ నివాసం... అసాంఘిక కార్యకలాపాలు... అనుమానాస్పద ప్రవర్తన... ఇలాంటి అనేక కారణాలతో చిక్కిన విదేశీయుల్లో కొందరిపై కేసులు నమోదు చేస్తుంటారు. మరికొందరిని తక్షణం వారి వారి దేశాలకు బలవంతంగా తిప్పిపంపుతారు. డిపోర్టేషన్‌గా పిలిచే ఈ ప్రక్రియకు కనిష్టంగా మూడు నెలలు పడుతుంది. అప్పటి వరకు వారిని డిటెన్షన్ సెంటర్‌లో ఉంచాల్సిందే. ఉమ్మడి రాష్ట్రంలో విశాఖపట్నం సెంట్రల్ జైలులో డిటెన్షన్ సెంటర్ ఉండేది. విభజన తర్వాత తెలంగాణకు ప్రత్యేక సెంటర్ లేకపోవడంతో తాత్కాలికంగా హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఆధీనంలో ఉంచారు. ఆపై వికారాబాద్, హైదరాబాద్‌లలో ఏర్పాటు చేయాలని భావించినా ఇప్పుడది జోగిపేట సబ్ జైలుకు మారింది.

ఆ దేశాలకు చెందిన వారే అధికం...

ఇక్కడ ఉన్న అవకాశాల నేపథ్యంలో నైజీరియా, సోమాలియా, టాంజానియా, ఐవరీ కోస్ట్ వంటి ఆఫ్రికా దేశాల నుంచి అనేక మంది వివిధ రకాలైన వీసాలపై హైదరాబాద్ వస్తున్నారు. వీరిలో కొందరు తమ వీసా, పాస్‌పోర్టుల గడువు ముగిసినా అక్రమంగా నివసిస్తున్నారు. నకిలీ గుర్తింపుకార్డుల సహకారంతో తమ పనులు పూర్తి చేసుకుంటున్నారు. ఒకప్పుడు ఇలా ఉంటూ చిక్కిన వారిపై ఫారెనర్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసేవారు. అనుమానాస్పద కదలికలు ఉన్నా, కొన్ని రకాలైన నేరాలకు పాల్పడినా ఇదే జరిగేది. దీంతో కోర్టులో ఆ కేసుల విచారణ పూర్తయ్యే వరకు డిపోర్టేషన్‌కు అవకాశం ఉండేది కాదు. దీంతో పాటు కొందరు నల్లజాతీయులు సైబర్ నేరాలు, డ్రగ్స్ విక్రయం చేస్తున్నారు. వీరు పట్టుబడినా, శిక్ష పూర్తి చేసుకున్నా, కోర్టు ఆదేశించినా డిపోర్టేషన్ చేయాల్సిందే. కొందరిపై నేరుగా డిపోర్టేషన్ ప్రక్రియ చేపడతారు.

తాత్కాలికం అంటూ ఇప్పటి వరకు...

ఇలా అత్యంత సమస్యాత్మక వ్యక్తులుగా మారుతున్న ఈ విదేశీయుల ప్రభావం సమాజంపై తీవ్రంగా ఉంటోంది. దీనిని గుర్తించిన నగర పోలీసులు అక్రమంగా నివసిస్తున్న వారికి, అనుమానాస్పద కదలికలు కలిగిన వారిని అరెస్టు చేయడానికి బదులు డిపోర్ట్ చేయాలని నిర్ణయించారు. తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారి పైనే కేసు నమోదు చేసి, అరెస్టు తదితర వ్యవహారాలు చేస్తున్నారు. ఈ డిపోర్టేషన్ ప్రక్రియలో అనేక దశలు ఉంటాయి. ఆయా ఎంబసీలకు సమాచారం ఇచ్చి వీరికి గుర్తింపు పత్రాలు, ఢిల్లీలోని కార్యాలయాల నుంచి టెంపరరీ ట్రావెల్ డాక్యుమెంట్లు పొందాలి. ఆపై విమాన టిక్కెట్లు ఖరీదు చేసి సదరు ఎయిర్‌వేస్ నుంచి సెక్యూరిటీ క్లియరెన్స్, ఫారెనర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) నుంచి ఎగ్జిట్ పర్మిట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు వారిని అదుపులో ఉంచుకోవాలి. దీనికోసం వారిపై మూవ్‌మెంట్ రిస్ట్రిక్షన్ ఆర్డర్ తీసుకుని డిటెన్షన్ సెంటర్‌లో ఉంచుతారు. రాష్ట్ర విభజనకు ముందు ఇది విశాఖపట్నంలో ఉండేది. తెలంగాణ ఏర్పడిన తర్వాత తాత్కాలిక ప్రాతిపదికన హైదరాబాద్ సీసీఎస్‌ను డిపోర్టేషన్ సెంటర్‌గా మార్చినా ఇప్పటికీ ఇక్కడే కొనసాగుతోంది.

సీసీఎస్ మారినా సౌకర్యాల లేమి...

ఒకప్పుడు సీసీఎస్ పబ్లిక్‌గార్డెన్స్ ఎదురుగా ఉన్న ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌ను ఆనుకుని ఉండేది. అక్కడ ఐదుగురిని ఉంచడానికి సరిపోయే జైలు గదినే ఈ సెంటర్‌గా వాడారు. ఆపై సీసీఎస్ బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్‌కు వెళ్లింది. దీంతో అక్కడే ఓ గదిని లాకప్ కమ్ డిపోర్టేషన్ సెంటర్‌గా వాడుతున్నారు. ఒక్కోసారి పాత సీసీఎస్ లాకప్‌లోనే వీరిని ఉంచుతున్నారు. ఆయా విదేశీయులకు అనువైన ఆహారం అందించలేకపోవడం కొత్త సమస్యలకు కారణం అవుతోంది. దీంతో నగర పోలీసు విభాగం ప్రత్యేకంగా డిటెన్షన్ సెంటర్ కోరుతూ ఐదేళ్ల క్రితం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. దీంతో వికారాబాద్‌లో ఈ సెంటర్ ఏర్పాటుకు సర్కారు నిర్ణయించింది. దీనికి నిధుల కేటాయింపు జరగకపోవడంతో నిర్మాణం ముందుకు సాగలేదు. 2023లో ఈ అంశంపై దృష్టి పెట్టిన ప్రభుత్వం నగరానికి దూరంగా కాకుండా సిటీలోనే డిటెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ఎట్టకేలకు జోగిపేట సబ్ జైలులో...

కొత్తగా డిటెన్షన్ సెంటర్ ఏర్పాటుకు భారీగా ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న భవనాల్లో అనువైనది ఎంపిక చేసి అందులోనే దీని ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జోగిపేట సబ్ జైల్ అధికారుల దృష్టికి వచ్చింది. ఇక్కడ నివసిస్తున్న విదేశీయుల వ్యవహారం సున్నితమైంది, అంతర్జాతీయ సంబంధాలతో ముడిపడి ఉన్నదని ప్రభుత్వ అభిప్రాయం. దీనిని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం ఆయా దేశీయుల భాష తర్జుమా చేయడానికి ట్రాన్స్‌లేటర్లు, వారికి అనువైన ఆహారం అందించే వంట వారితో పాటు ఇతర సౌకర్యాలు ఉండేలా ఆదేశించింది. ఈ సెంటర్ నిర్వహణతో పాటు డిపోర్టేషన్ ప్రక్రియ చేపట్టడానికి అవసరమైన నిధులను అందించడానికి సుముఖత వ్యక్తం చేసింది. దీంతో జోగిపేట సబ్ జైలులో అవసరమైన మార్పులు చేర్పులు చేస్తున్న అధికారులు వీలైనంత త్వరలో ఈ సెంటర్ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏడు తులాల నగలు, రూ.30వేల నగదు చోరీ

బన్సీలాల్‌పేట: అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఓ దొంగ ఇంట్లో చొరబడి ఏడు తులాల బంగారు నగలు, రూ.30వేల నగదు, సెల్ ఫోన్లు అపరించుకుపోయిన సంఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. మహ్మద్ షబ్బీర్ అహ్మద్ బైక్ మెకానిక్‌గా జీవనం సాగిస్తూ బోయగూడలో నివాసం ఉంటున్నారు. ఎప్పటిలాగే తన కుటుంబ సభ్యులతో కలిసి హాల్లో నిద్రపోయాడు. గురువారం తెల్లవారుజామున నిద్ర నుంచి మెలకువ వచ్చిన మహమ్మద్ షబ్బీర్ అహ్మద్ తన ఫోన్ కోసం వెతికాడు. అతని భార్య ఫోన్ కూడా ఇంట్లో కనిపించలేదు. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా పక్క గదిలో ఉన్న మూడు అల్మారా లాకర్లు తెరిచి ఉన్నాయి. వాటిలో భద్రపరిచిన ఏడు తులాల బంగారు నగలు, రూ.30 వేల నగదు, రెండు సెల్ ఫోన్లు, ఒక ట్యాబు దొంగ అపరించుకుని వెళ్ళిపోయాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైలు కింద పడి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



రాజేందర్ మృతదేహం

పోచారం: రైలు కిందపడి బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. యాదాద్రి జిల్లా, మానయిగూడెం గ్రామానికి చెందిన ఉప్పుల రాజేందర్ హాస్టల్‌లో ఉంటూ యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. గురువారం అతను స్థానిక రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కల్తీ కల్లు తాగి వ్యక్తి మృతి



విజయ్‌కుమార్ (ఫైల్)

మూసాపేట: కల్తీ కల్లు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లి, ఇందిరా హిల్స్‌కు చెందిన ఆడెబు విజయ్‌కుమార్ (35) రాపిడో బైక్ రైడర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న రాత్రి అతను సాయిచరణ్ కాలనీలో కల్లు తాగి ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత వాంతులు చేసుకోవడంతో మర్నాడు కేపీహెచ్‌బీలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు 8న గాంధీ ఆసుపత్రికి, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాల కేసులో 9 మంది అరెస్ట్



రాయదుర్గం: సైబర్ నేరస్తులకు సహరించిన తొమ్మిది మందిని గురువారం సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.కమిషనరేట్ పరిధిలో నమోదైన సైబర్ నేరాలపై దర్యాప్తు చేపట్టిన ఎస్‌ఓటీ మేడ్చల్, సైబరాబాద్ సీసీఎస్ పోలీసులు ఆయా కేసుల్లో నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలు అందించి సహకరించిన తొమ్మిది మందిని గుర్తించారు. గురువారం వారిని అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో సుమిత్‌రాథోర్, మానవేంద్రసింగ్ రాథోర్, మహ్మద్ నదీమ్ ఉర్ రహమాన్, ఎండీ నయీమ్ ఉర్ రహమాన్, ఎండీ షఫి, ఎస్.భరత్, తెలుగు మహేష్, అబ్దుల్ ఖాలీద్, జె.మహేష్ ఉన్నారు.వీరిలో సుమిత్ రాథోర్, మానవేంద్రసింగ్ రాథోర్ రాజస్థాన్‌కు చెందిన వారు కాగా, మిగతా ఏడురుగు హైదరాబాద్‌కు చెందిన వారు కావడం గమనార్హం. వీరి నుంచి 16 మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, రెండు కార్లు, రూ.82,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

సేల్స్‌మెన్ దృష్టి మళ్లించి బంగారు గొలుసు చోరీ

పంజగుట్ట: బంగారం దుకాణానికి కస్టమర్‌గా వచ్చిన మహిళ సేల్స్‌మెన్ దృష్టి మళ్లించి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమాజిగూడ లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో గత నెల 28న రాత్రి బురఖా ధరించిన ఓ మహిళ కస్టమర్‌గా వచ్చింది. బంగారు గొలుసు డిజైన్‌లు చూపించాలని సేల్స్‌మెన్‌ను కోరింది. సేల్స్‌మెన్ దృష్టి మళ్లించి బంగారు గొలుసును కొట్టేసి దాని స్థానంలో నకిలీ చైన్ ఉంచి బయటికి వెళ్లిపోయింది. ఇటీవల వెరిఫికేషన్‌లో నకిలీ బంగారు గొలుసును గుర్తించిన సిబ్బంది సీసీ ఫుటేజీలను పరిశీలించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి షాపు డిప్యూటీ స్టోర్ హెడ్ జిజీష్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

అమీర్‌పేట : కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై రాజు రాథోడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన దేవి (23) జయంత్‌లాల్ దంపతులు అమీర్‌పేట అన్నపూర్ణ బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఓ కుమారుడు (1.5) ఉన్నాడు.జయంతి లాల్ అదే బ్లాక్‌లోని రెండో అంతస్తులో ల్యాప్‌టాప్, కంప్యూటర్స్ స్పేర్ పార్ట్స్ వ్యాపారం చేస్తున్నాడు. గత కొన్ని నెలలుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి లోనైన ఆమె బుధవారం చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మధ్యాహ్నం భోజనం చేసేందుకు వచ్చిన జయంత్‌లాల్ కుమారుడు ఏడుస్తూ ఉండటాన్ని గుర్తించి లోపలికి వెళ్లి చూడగా దేవి ఉరికి వేలాడుతూ కనిపించింది. ఆమెను కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. రాజస్థాన్‌లో ఉంటున్న ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జయంత్‌లాల్ వేధింపుల కారణంగానే తన సోదరి ఆత్మహత్య చేసుకుందని ఆమె సోదరుడు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు జయంతి లాల్‌ను అరెస్టు చేశారు.

బీజేపీ మహిళా మోర్చా నాయకురాలి బలవన్మరణం



రాధిక (ఫైల్)

నాగోలు: బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లగూడ ఇంద్రప్రస్థకాలనీలో లలిత్‌కుమార్, దామరాజు రాధిక(42) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు రాధిక. నాగోలు డివిజన్ బీజేపీ మహిళా మోర్చా నాయకురాలిగా పనిచేస్తుంది. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు షాపింగ్‌కు వెళ్లి వచ్చిన తర్వాత రాధిక తన గదికి వెళ్లి నిద్రించింది. గురువారం ఉదయం ఆమె గదిలోనుంచి బయటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు కొట్టినా స్పందించలేదు. కిటికీలో నుంచి చూడగా ఆమె ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. ఆను కిందకు దించి సూడగా అప్పటికే మృతి చెందింది. దీనిపై సమాచారం అందుకున్న నాగోలు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. రాధిక మృతికి కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రేమ జంటకు ఆశ్రయమిచ్చిన యువతీ యువకుల అరెస్టు

ఫిలింనగర్: ప్రేమ జంటకు ఆశ్రయం ఇచ్చినందుకు యువతీ, యువకులను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే ప్రేమజంట మధ్య విబేధాలు రావడంతో సదరు బాలిక ఫిలింనగర్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు ఆమె మైనర్ కావడంతో ఆమె ప్రియుడిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో భాగంగా బాధితురాలు తమకు ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్‌లో నివసించే కోనె అఖిల్ అనే యువకుడు తన గదిలో ఆశ్రయం ఇచ్చినట్లు చెప్పింది. దీంతో బాలికతో పాటు ఆమె ప్రియుడికి చట్టవిరుద్ధంగా గదిని ఇచ్చినందుకుగాను పోలీసులు కోనె అఖిల్, అతడికి సహాయపడిన నిఖిత అనే యువతిని గురువారం అరెస్టు చేశారు. బీజేఆర్‌నగర్ బస్తీకి చెందిన యువకుడు, మైనర్ బాలిక ప్రేమించుకున్నారు. వీరిద్దరూ తరచూ కలుసుకునేందుకు అఖిల్ పలుమార్లు తన గదిని ఇచ్చాడు. అంతేగాక ఇదే బస్తీలో నివసించే నిఖిత అనే యువతి కూడా వీరికి పలుమార్లు ఆశ్రయం కల్పించింది. ఇలా గదులు ఇవ్వడం చట్టవిరుద్ధం కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు గదులు ఇచ్చిన వారిని కూడా నిందితులుగా చేర్చి అరెస్టు చేశారు. బస్తీల్లో, కాలనీల్లో, అపార్ట్‌మెంట్లలో ఎవరైనా స్నేహితులకు తమ గదులను ఇస్తే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం హెచ్చరించారు. ముఖ్యంగా ఫిలింనగర్ 18 బస్తీల్లో కొందరు ప్రేమ జంటలకు తమ గదులను వాడుకునేందుకు ఇస్తున్నట్లుగా ఫిర్యాదులు అందుతున్నాయని, వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఇళ్ల యజమానులు తమ ఇళ్లల్లో అద్దెకు ఉంటున్న వారి ఇంటికి ఎవరు వస్తున్నారో.. ఎవరు వెళ్తున్నారో తెలుసుకుని అనుమానాస్పదంగా ఉంటే బయటకు పంపించాలని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బైక్ దొంగల ముఠా ఆటకట్టు

- ముగ్గురు అంతర్రాష్ట్ర నేరస్తుల అరెస్టు
- 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- నిందితుల్లో ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి



పోలీసుల అదుపులో నిందితులు

నాగోలు: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర నేరస్తులను ఎల్‌బీనగర్ పోలీసులు గురువారం అరెస్టు చేసిన వారి నుంచి రూ. 18 లక్షల విలువైన 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా, గుడివాడకు చెందిన షేక్ అక్రమ్ బోడుప్పల్, ఆర్ఎన్ఎస్ కాలనీలో ఉంటూ ర్యాపిడో డ్రైవర్ పనిచేస్తున్నాడు. ఏపీలో కోనసీమ అంబేడ్కర్ జిల్లాకు చెందిన ఈడిగ దుర్గా గంగాధర్, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నీరుకొండ చరణ్ నగరానికి వలస వచ్చి అడ్డగుట్టలోని హాస్టల్‌లో ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. షేక్ అక్రమ్ బీటెక్ పూర్తి చేసి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. ప్రేమ వివాహం చేసుకున్న అతడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో తన స్నేహితులు గంగాధర్, చరణ్‌లతో కలిసి తక్కువ సమయంలో డబ్బులు సంపాదించాలని పథకం రూపొందించారు. పథకం ప్రకారం షేక్ అక్రమ్, గంగాధర్ పార్కింగ్ చేసిన వాహనాలను చోరీ చేసి చరణ్‌కు అప్పగించేవారు. ముగ్గురూ కలిసి ఎల్‌బీనగర్, మేడిపల్లి, ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడ్డారు. ఈనెల 23న ఎల్‌బీనగర్ మాల్ మైసమ్మ ఫ్లైఓవర్ కింద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించారు. కాగా నిందితుల్లో ఒకరైన షేక్ అక్రమ్‌ను గతంలో ఖమ్మం రైల్వే పోలీసులు ఎన్‌డీపీఎస్ డ్రగ్ కేసులో అరెస్టు చేసినట్లు గుర్తించారు. వారిని నుంచి 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ ఆసుపత్రులపై దాడులు

సాక్షి, సిటీబ్యూరో: అడ్డగుట్ట, సికింద్రాబాద్, జవహర్ నగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ప్రాంతాల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. అనధికారికంగా నిర్వహిస్తున్న ఆసుపత్రులు, నకిలీ వైద్యులను గుర్తించారు. ఫస్ట్ ఎయిడ్ సెంటర్, శ్వేత క్లినిక్, చక్రవర్తి క్లినిక్, సాయి వెంకట మెడికల్ స్టోర్, క్లినిక్ పైకేసులు నమోదు చేశారు. కార్యక్రమం లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, డా. విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ ట్రాఫిక్ డీసీపీపై వేటు

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో అత్యంత కీలకమైన ట్రాఫిక్-1 డీసీపీ ఎస్ మల్లారెడ్డిపై వేటు పడింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకుగాను ఆయనను డీజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయి, ఆల్ఫ్రాజోలం పట్టివేత



పోలీసుల అదుపులో నిందితులు

కుత్బుల్లాపూర్: గంజాయి, అల్ప్రాజోలం విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దీన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్ర పర్లీ–వైద్యనాథ్‌కు చెందిన మజ్లూమ్ ఖురేషీ, అబ్దుల్ రహమాన్ బైక్‌పై 10 కేజీల గంజాయిని కూకట్‌పల్లికి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు గంజాయిని సరఫరా చేసిన వసీమ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఫిరోజ్‌గూడకు చెందిన రాగుల సాయికుమార్‌కారులో 2.5 కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన సంగారెడ్డి జిల్లా ముస్లాపూర్‌కు చెందిన బాల్‌రాజ్‌ను అదుపులోకి తీసుకుని అతడి నుంచి 140 గ్రాముల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలు, వాహనాలు, మొబైల్ ఫోన్ల విలువ రూ. 7.20 లక్షలు ఉంటుందని షేక్ ఫయాజుద్దీన్ తెలిపారు. దాడుల్లో సీఐ సర్సిరెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది సత్తార్, సంజయ్, మున్నాఫ్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, చెన్నయ్యలు పాల్గొన్నారు.

హీరో నాగార్జున పరువునష్టం కేసు వాయిదా

- విచారణకు మంత్రి కొండా సురేఖ, నాగార్జున గైర్హాజరు
- తదుపరి విచారణ ఈనెల 28కి వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు: తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో విచారణ జరిగింది. అగ్రనటుడు నాగార్జున కుమారుడైన హీరో నాగ చైతన్య–సమంత విడాకుల విషయమై మంత్రి కొండా సురేఖ అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని, ఆమె వ్యాఖ్యలతో తన కుటుంబ పరువుపోయిందని నాగార్జున నాంపల్లి కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణకు ప్రతివాది అయిన మంత్రి కొండా సురేఖ ఎగ్జామినేషన్‌కు హాజరు కావాల్సి ఉండగా గైర్హాజరయ్యారు. పిటిషనర్ నాగార్జున కూడా గైర్హాజరు కావడంతో వారి తరఫున న్యాయవాదులు పిటిషన్లు దాఖలు చేశారు. మంత్రి కొండా సురేఖ ఢిల్లీ వెళ్లారని వచ్చే విచారణకు హాజరు అవుతారని ఆమె తరఫు న్యాయవాది గుర్మిత్‌సింగ్ కోర్టుకు సూచించారు. దీంతో విచారణను ఈనెల 28కు వాయిదా వేసిన కోర్టు తప్పకుండా ఆ విచారణకు హాజరు కావాలని సూచించింది.

సేవకు దక్కిన అవార్డు



అవార్డు అందుకుంటున్న రమేష్‌

బంజారాహిల్స్‌: ప్రముఖ సినీ దర్శకుడు, నాటక రచయిత, లలిత కళాంజలి నాటక పరిషత్‌ వ్యవస్థాపకులు దివంగత కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా ఆయన పేరుపై ఏర్పాటు చేసిన కోడి రామకృష్ణ ఫిలిం అవార్డుల ప్రదానోత్సవం బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–2లోని ప్రసాద్‌ ల్యాబ్స్‌లో వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో సేవా దృక్పథంతో పనిచేసిన వారికి సినిమా పరిశ్రమలో ప్రతిభావంతులను గుర్తించి ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ అవార్డు ప్రదానోత్సవం జరిగింది. సినీనటులు సుమన్‌, మురళీ మోహన్‌, అల్లరి నరేష్‌, రేలంగి నర్సింహారావు తదితరులు అవార్డులను అందజేశారు. బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–2లోని ఇందిరానగర్‌కు చెందిన సామాజిక సేవకుడు రమేష్‌ కోడిచెర్లకు కోడిరామకృష్ణ ఫిలిం అవార్డును నటుడు సుమన్‌ ప్రదానం చేశారు.

దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలి



దోమల లార్వాను పరిశీలిస్తున్న డీఎంసీ సమ్మయ్య

వెంకటేశ్వరకాలనీ: వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా దోమల స్వైరవిహారం పెరిగే అవకాశం ఉందని ఎంటమాలజీ సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అప్రమత్తంగా ఉంటూ దోమల వ్యాప్తి పెరగకుండా చర్యలు చేపట్టాలని జూబ్లీహిల్స్‌ సర్కిల్‌ 18 డీఎంసీ సమ్మయ్య సూచించారు. జూబ్లీహిల్స్‌ సర్కిల్‌ పరిధిలోని జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, బంజారాహిల్స్‌, ఫిలింనగర్‌ ప్రాంతాల్లో ఎంటమాలజీ అధికారులు, సిబ్బందితో కలిసి గురువారం ఆయన పర్యటించారు. దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు ఎంటమాలజీ సిబ్బంది తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు నివాసితులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంటమాలజీ ఏఈ రజిత పాల్గొన్నారు.

రేషన్‌ దరఖాస్తుల సర్వే..
41 బృందాలు సిద్ధం

నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం

- ఖైరతాబాద్‌ సర్కిల్‌లో 13 వేల దరఖాస్తులు
- వచ్చే నెల 10లోపు పూర్తి చేయాలని ఆదేశాలు
- జీహెచ్‌ఎంసీ సిబ్బంది సహకారంతో ఇంటింటి సర్వే



రేషన్‌ దరఖాస్తుల ఇంటింటి సర్వే చేస్తున్న రేషనింగ్‌ అధికారులు(ఫైల్‌)

బంజారాహిల్స్‌: రేషన్‌ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి పూర్తి వివరాలను విచారించి నమోదు చేసుకునేందుకు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు రేషన్‌ దరఖాస్తుల ఇంటింటి సర్వే చేపట్టేందుకు రేషనింగ్‌ అధికారులు సిద్ధమయ్యారు. రేషనింగ్‌ ఖైరతాబాద్‌ సర్కిల్‌–7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్‌, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్‌, వెంగళరావునగర్‌, ఎర్రగడ్డ, బోరబండ, అమీర్‌పేట, సనత్‌నగర్‌ డివిజన్ల పరిధిలో ఉన్న 81 రేషన్‌ దుకాణాల పరిధిలో రేషన్‌ దరఖాస్తుల ఇంటింటి సర్వే కోసం 41 బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ప్రతిరోజూ తమకు కేటాయించిన దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి 360 డిగ్రీల కోణంలో ఆ దరఖాస్తులను పరిశీలిస్తారు. పూర్తి వివరాలను నమోదు చేసుకుని ఏ రోజుకారోజు ఆయా దరఖాస్తులను సంబంధిత రేషనింగ్‌ ఇన్‌స్పెక్టర్‌కు రిపోర్ట్‌ చేస్తారు.

- తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలన కేంద్రాల ద్వారా, మీ–సేవ కేంద్రాల్లో, వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించింది. అర్హులైన వారికి ఇప్పటికే లబ్ధి చేకూరగా వారందరికీ గత నెల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు.
- అయితే రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుండటంతో ప్రతిరోజూ మీ సేవ కేంద్రాల ద్వారా కొత్త రేషన్‌ కార్డుల కోసం దరఖాస్తులు అందజేస్తున్నారు.
- గతంలో సర్వే చేసిన అనంతరం లబ్ధిదారులను గుర్తించి అర్హులైన వారికి రేషన్‌కార్డులు పంపిణీ చేశారు.
- 3 నెలల నుంచి మీ–సేవ కేంద్రాల ద్వారా ఖైరతాబాద్‌ సర్కిల్‌లో 13 వేల దరఖాస్తులు అందాయి.
- తాజాగా అందిన 13 వేల దరఖాస్తులను త్వరితగతిన సర్వే చేసి అర్హులైన వారిని గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించింది.
- ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయనున్నారు.
- జీహెచ్‌ఎంసీ ఇప్పటికే 41 మంది ఉద్యోగులను ఈ సర్వే కోసం కేటాయించగా వీరంతా రేషనింగ్‌ ఖైరతాబాద్‌ సర్కిల్‌–7 సహాయ పౌర సరఫరాల శాఖ అధికారిణి జ్యోతికి రిపోర్ట్‌ చేశారు.
- ఈ టీమ్‌లకు ఆయా ప్రాంతాల దరఖాస్తులు అందజేసి రేషన్‌ దుకాణాల పరిధిని కూడా కేటాయించారు.
- ప్రస్తుతం ఖైరతాబాద్‌ సర్కిల్‌–7 పరిధిలో 81 రేషన్‌ దుకాణాలు ఉండగా వీటి పరిధిలో ఆహార భద్రతా కార్డులు, అంత్యోదయ అన్న యోజన కార్డులు, అన్నపూర్ణ కార్డులు, కలిపి 83,013 ఉన్నాయి.
- ఈ కార్డుల్లో మొత్తం 2,92,882 మంది లబ్ధిదారులు ఉన్నారు.
- తాజాగా చేపట్టిన ఇంటింటి సర్వేలో దరఖాస్తుదారులను 360 డిగ్రీల కోణంలో పరిశీలించి అర్హత ఉంటే వీరికి కూడా కొత్త కార్డులు మంజూరు చేయనున్నారు.

ప్రహరీ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన హైడ్రా అధికారులు



ఎమ్మెల్యే కాలనీలో ప్రహరీ స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–12లోని శ్రీవెంకటేశ్వర కో–ఆపరేటివ్‌ హౌస్‌ బిల్డింగ్‌ సొసైటీ ఎమ్మెల్యే కాలనీలో ప్లాట్‌ నంబర్‌ 224/ఏ యజమాని రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నాడని, దీని వల్ల రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తడమే కాకుండా సొసైటీ బైలాస్‌కు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయని, చర్యలు తీసుకోవాల్సిందిగా సొసైటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా ఇన్‌స్పెక్టర్‌ నర్సింహారావుతో పాటు సంబంధిత అధికారులు గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సంబంధిత ప్లాట్‌ యజమానిని పిలిపించి పత్రాలు పరిశీలిస్తామని, అక్రమమైతే చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీనిచ్చారు.

'ఇద్దరు పిల్లలు' నిబంధన రద్దుచేయాలి

పంజగుట్ట: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేసే అంశంపై ఆలోచిస్తున్నట్లు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ప్రకటించడం సంతోషకరమని జీవో 21(3) 1995 చట్టం రద్దు ఉద్యమ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అభిమాన్‌ గాంధీ నాయక్‌ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీఆర్‌ఎస్‌ నాయకురాలు కీర్తిలతగౌడ్‌తో కలిసి గురువారం ఆయన మాట్లాడారు. 1995లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీవో తీసుకువచ్చి ఇద్దరు పిల్లలకంటే ఎక్కువ ఉన్నవారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం తొలగించారని అన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ నిబంధన తొలగించారని, రాష్ట్రంలో కూడా తొలగించాలని ఆయన అన్నారు.

రెనోవా సెంచరీ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స



సర్జరీ వివరాలను వెల్లడిస్తున్న వైద్యులు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–12లోని రెనోవా సెంచరీ హాస్పిటల్స్‌ వైద్యులు 62 సంవత్సరాల వయస్సున్న వ్యక్తికి సంక్లిష్టమైన బైలేటరల్‌ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్సల్టెంట్‌ ఆర్థోపెడిక్‌ సర్జన్‌ అండ్‌ చీఫ్‌ ట్రామా సర్జన్‌ డాక్టర్‌ విజయ్‌కుమార్‌రెడ్డి, కన్సల్టెంట్‌ షోల్డర్‌ అండ్‌ స్పోర్ట్స్‌ సర్జన్‌ డాక్టర్‌ అనూప్‌రెడ్డి సామ వెల్లడించారు. ఖమ్మం జిల్లా ఖానాపురం హవేలి రోటరీనగర్‌కు చెందిన 62 ఏళ్ల వ్యక్తి జారిపడిపోవడంతో నెల రోజులుగా రెండు భుజాల్లో తీవ్ర నొప్పి, వాపు, గాయాలు, రెండు చేతులను కదపలేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. వైద్యులను సంప్రదించగా బైలేటరల్‌ ప్రాక్సిమల్‌ హ్యూమరస్‌ ఫ్రాక్చర్‌తో బాధపడుతున్నట్లు గుర్తించి సర్జరీ చేయాల్సిందిగా సూచించారు. ప్రముఖ ఆర్థోపెడిక్‌ సర్జన్‌ డాక్టర్‌ హిమకాంత్‌ లింగాల, సహచర వైద్య బృందం కుడి భుజానికి రైట్‌ రివర్స్‌ షోల్డర్‌ ఆర్థోప్లాస్టీ, ఆ తర్వాత ఫిలోస్‌ ప్లేట్‌ ఫిక్సేషన్‌ ఉపయోగించి ఎడమ భుజానికి ఓపెన్‌ రిడక్షన్‌ అండ్‌ ఇంటర్నల్‌ ఫిక్సేషన్‌ సర్జరీ పూర్తి చేశారు. శస్త్రచికిత్స అనంతరం పూర్తి ఆరోగ్యంతో వారం రోజుల్లోనే డిశ్చార్జ్‌ అయ్యారు. తక్కువ ఖర్చుతో రాజీపడకుండా చికిత్స అందించినట్లు చెప్పారు. హిమాకాంత్‌ లింగాల, సుహాస్‌ మసిలామణి, డాక్టర్‌ విష్ణు, రవీంద్రనాథ్‌ పాల్గొన్నారు.

స్కూల్‌ బస్సు డ్రైవర్లపై యాజమాన్యాల నిఘా తప్పనిసరి

ఏసీపీ మోహన్‌ కుమార్‌



ఖైరతాబాద్‌లో డ్రైవర్లకు డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షలను పరిశీలిస్తున్న అడిషనల్‌ డీసీపీ రాములు

బంజారాహిల్స్‌: స్కూల్‌ బస్సులు నడిపే డ్రైవర్లపై పాఠశాలల యాజమాన్యాలు నిఘా పెట్టాలని, అవసరమైతే వారికి స్కూల్‌ వద్ద యాజమాన్యాలు శ్వాస పరీక్షలు నిర్వహించాలని, ట్రాఫిక్‌ ఏసీపీ మోహన్‌ కుమార్‌ సూచించారు. ఖైరతాబాద్‌ చౌరస్తాలో స్కూల్‌ డ్రైవర్ల కోసం గురువారం స్పెషల్‌ డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ డ్రైవ్‌ను అడిషనల్‌ డీసీపీ రాములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం జాయింట్‌ సీపీ జోయల్‌ డేవిస్‌ సూచనల మేరకు కొన్నిచోట్ల స్పెషల్‌ డ్రైవ్‌లు నిర్వహించగా కొంత మంది బస్సు డ్రైవర్లు తాగి వాహనాలు నడిపినట్లు తాము గుర్తించామని, స్కూల్‌ విద్యార్థులను తీసుకెళ్లే డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలు తప్పవన్నారు. కార్యక్రమంలో సైఫాబాద్‌ ట్రాఫిక్‌ సీఐ సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంజయ్‌నగర్‌లో పోలీసుల కార్డన్‌ అండ్‌ సెర్చ్‌

రహమత్‌నగర్‌: బోరబండ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని శ్రీరాంనగర్‌, సంజయ్‌నగర్‌ బస్తీల్లో పోలీసులు బుధవారం రాత్రి కార్డన్‌ అండ్‌ సెర్చ్‌ నిర్వహించారు. అడిషనల్‌ డీసీపీ గోవర్ధన్‌, ఎస్‌ఆర్‌నగర్‌ డివిజన్‌ ఏసీపీ రాఘవేంద్రరావు పాల్గొన్నారు. సరైన పత్రాలు లేని 29 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మంది రౌడీ షీటర్లు, ఏడుగురు అనుమానస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. శ్రీరాంనగర్‌ కూరగాయాల మార్కెట్‌ వద్ద అడిషనల్‌ డీసీపీ గోవర్ధన్‌, ఏసీపీ రాఘవేంద్రరావు స్థానికులతో మాట్లాడారు. సేఫ్‌ అండ్‌ సెక్యూర్‌ గురించి వారికి వివరించారు. అనంతరం హెచ్‌ఎఫ్‌నగర్‌ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్‌ డీసీపీ మాట్లాడుతూ నేరాలు అరికట్టడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. బోరబండ ఎస్‌హెచ్‌ఓ సురేందర్‌, సెక్టార్‌ ఎస్సైలు నాగూల్‌ మీరా, స్వప్నరెడ్డి, భూమేశ్వర్‌, కాశయ్యతో పాటు దాదాపు 200 మంది పోలీసులు పాల్గొన్నారు.

రోజంతా ముసురే..

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు వాన కురుస్తూ, మధ్యలో కొద్దిసేపు తెరపినిస్తూ రోజంతా ఇలా సాగింది. బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, ఫిలింనగర్‌, పంజగుట్ట, ఖైరతాబాద్‌లలోని పలు ప్రాంతాల్లోని రోడ్లు జలమయం అయ్యాయి. – బంజారాహిల్స్‌



తల్లిపాలు అమూల్యం



సాక్షి, సిటీబ్యూరో: పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమూల్యమైనవని నిలోఫర్‌ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డా.విజయ్‌కుమార్‌ అన్నారు. అంకుర ఆసుపత్రిలో అంకుర ధాత్రి మిల్క్‌ బ్యాంక్‌ ప్రారంభోత్సవంలో గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవజాత శిశువుల పోషణ అవసరాలను మరింత మెరుగుపరిచే దిశగా అంకుర ధాత్రి మిల్క్‌ బ్యాంక్‌ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఆరోగ్యవంతమైన తల్లుల నుంచి సేకరించి, పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించి, క్రిమిరహితంగా మార్చే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. వీటిని నెలలు నిండకుండా జన్మించిన, తక్కువ బరువుతో బాధపడే పిల్లలకు అందిస్తారన్నారు. తల్లిపాలతో శిశువుల రోగ నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీజీఐఎంఈఆర్‌(చండీగఢ్‌) ప్రొఫెసర్‌ ప్రవీణ్‌కుమార్‌, తెలంగాణ న్యానోనాటాలజీ ఫోరం అధ్యక్షుడు శ్రీశైలం, అంకుర ఆసుపత్రి నిర్వాహక సంచాలకుడు శ్రీనిధి తిరునగరి, సుషేణ ఆరోగ్య సంస్థ ప్రధాన కార్యదర్శి కుమార్‌ పాల్గొన్నారు.

కత్తితో దాడిచేసి పర్సుతో పరారైన ఇద్దరు యువకుల అరెస్టు

ఫిలింనగర్‌: వాహనదారుడిని కత్తితో బెదిరించి పర్సుతో పాటు సెల్‌ఫోన్‌ లాక్కొని పరారైన దొంగలను ఫిలింనగర్‌ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. 16వ తేదీన అర్ధరాత్రి తర్వాత షేక్‌పేట డీమార్ట్‌ సమీపంలో రెడీమిక్స్‌ కాంక్రీట్‌ వాహనం పార్కు చేసి ఉంది. అదే సమయంలో మహ్మద్‌ జకీవుద్దీన్‌(19), మహ్మద్‌ ఇమ్రాన్‌(21)తో పాటు మరో వ్యక్తి ముగ్గురూ కలిసి రెడీమిక్స్‌ వాహన డ్రైవర్‌ వద్దకు వెళ్లి నగదు డిమాండ్‌ చేయడంతో అతడు తిరస్కరించాడు. కత్తితో దాడి చేసి అతడి వద్ద ఉన్న పర్సు లాక్కొని పరారయ్యారు. గాయాలపాలైన అతడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి జకీవుద్దీన్‌, ఇమ్రాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి యాక్టివా వాహనం, రెండు మొబైల్‌ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి



బంజారాహిల్స్‌: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బంజారాహిల్స్‌ పోలీసులు స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–10లోని బసవతారకం కేన్సర్‌ ఆస్పత్రి ఫుట్‌పాత్‌పై 45–50 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి చలికి వణుకుతూ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ వ్యక్తిని వెంటనే చికిత్స నిమిత్తం బంజారాహిల్స్‌ పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడు మృతి చెందాడు. ఆ వ్యక్తి గురించి ఆరా తీయగా వివరాలు లభ్యం కాలేదు. దీంతో పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిస్తే.. ఫోన్‌: 93909 36338.

ఫలహార బండి ఊరేగింపు



ఊరేగింపులో బాబాఫసియుద్దీన్‌

రహమత్‌నగర్‌: బోరబండ, రహమత్‌నగర్‌ డివిజన్లలో ఫలహారం బండి ఊరేగింపు బుధవారం రాత్రి వైభవంగా కొనసాగింది. డప్పు వాయిద్యాలు, నృత్యాలతో ఫలహారం బండి శోభాయాత్ర నిర్వహించారు. బోరబండ బస్టాప్‌ వద్ద ఉన్న నల్ల పోచమ్మ అమ్మవారికి స్థానిక నాయకులు ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్‌ బాబా ఫసియుద్దీన్‌, కాంగ్రెస్‌ నాయకులు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

మనసు ప్రశాంతతకు బ్యాడ్మింటన్‌



మాట్లాడుతున్న దోమన్‌ యాదవ్‌

వెంగళరావునగర్‌: వ్యూహంతో ప్రత్యర్థి ఎత్తుగడలను చిత్తు చేస్తూ మనసును ప్రశాంతంగా ఉంచేందుకు బ్యాడ్మింటన్‌ ఎంతగానో ఉపయోగపడుతుందని పవర్‌గ్రిడ్‌ సదరన్‌ రీజియన్‌–1 ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ దోమన్‌ యాదవ్‌ తెలిపారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్‌ స్టేడియంలో గురువారం నుంచి పవర్‌గ్రిడ్‌ సదరన్‌ రీజియన్‌–1 ఆధ్వర్యంలో అంతర్‌ప్రాంత బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌–2025 ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన దోమన్‌ యాదవ్‌ మాట్లాడుతూ క్రీడాకారులు స్కోర్లు, ట్రోఫీల కంటే క్రీడాస్ఫూర్తి, శ్రమ, వ్యక్తిత్వాన్ని ప్రాధాన్యంగా చూడాలని ఆయన సూచించారు. పోటీలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని అన్నారు. ప్రతి జట్టులో ఆరుగురు మహిళలు, ఆరుగురు పురుషులు చొప్పున మొత్తం 132 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పవర్‌గ్రిడ్‌ హెచ్‌ఆర్‌ చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ అరుణ్‌కుమార్‌, తెలంగాణ బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ కోశాధికారి వంశీధర్‌, అసిస్టెంట్‌ సెక్రటరీ పీఎల్‌వీ కుమార్‌ మాట్లాడారు.

హైదరాబాద్‌ యూత్‌ డిక్లరేషన్‌ హామీని అమలుచేయాలి



మాట్లాడుతున్న అనంతుల మధుబాబు

హిమాయత్‌నగర్‌: గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌ పార్టీ నిరుద్యోగ యువతకు హైదరాబాద్‌ యూత్‌ డిక్లరేషన్‌ పేరుతో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధుబాబు డిమాండ్‌ చేశారు. బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలో వచ్చి సుమారు 18 నెలలు కావొస్తున్నా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. జాబ్‌ క్యాలెండర్‌ పేరుతో కాలయాపన ప్రకటనలు వద్దని, ఖాళీగా ఉన్న సుమారు రెండు లక్షల ఉద్యోగాల జాబ్‌ నోటిఫికేషన్లను విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు మారేపల్లి కుమార్‌, నాయకులు సునీల్‌, రహమత్‌ భాష, సంతోష్‌ రెడ్డి, విప్లవ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉదయ్‌నగర్‌లో విద్యుత్‌ అధికారుల బస్తీబాట



ఉదయ్‌నగర్‌లో పర్యటిస్తున్న విద్యుత్‌ శాఖ అధికారులు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–11లోని ఉదయ్‌నగర్‌ బస్తీలో టీజీఎస్‌పీడీసీఎల్‌ బంజారాహిల్స్‌ సబ్‌స్టేషన్‌ అధికారులు బస్తీ బాటలో భాగంగా పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న విద్యుత్‌ సంబంధిత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న కరెంటు స్తంభం వల్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానిక నేత నజీర్‌ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే 200 మీటర్ల ఏబీ కేబుల్‌ ఏర్పాటు చేయాలని కూడా స్థానికులు కోరారు. ఈ సందర్భంగా టీజీఎస్‌పీడీసీఎల్‌ బంజారాహిల్స్‌ ఏఈ రమేష్‌ మాట్లాడుతూ స్థానికుల ఫిర్యాదులను త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. బస్తీబాటలో భాగంగా స్థానికుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. అధికారులు, సిబ్బంది తమ వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకోవడంతో బస్తీవాసులు కూడా హర్షం వ్యక్తం చేశారన్నారు.

వైన్స్‌, బార్లలో కల్లుగీత సొసైటీలకు రిజర్వేషన్‌ కల్పించాలి



మాట్లాడుతున్న బాలరాజుగౌడ్‌

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే వైన్స్‌ టెండర్లు పిలిచేందుకు యత్నిస్తున్న నేపథ్యంలో ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 25 శాతం కల్లుగీత సొసైటీలకు రిజర్వేషన్‌ కల్పించాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్‌ బాలగోని బాలరాజు గౌడ్‌ కోరారు. గౌడ కులస్తులను బినామీలుగా ఉంచి అగ్రవర్ణాల వారు టెండర్లు పొందే అవకాశం ఉన్నందున కల్లుగీత సొసైటీలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే గౌడ కులస్తులకు న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కన్వీనర్‌ అయిలి వెంకన్న గౌడ్‌, వర్కింగ్‌ చైర్మన్‌ యెలికట్టె విజయ్‌ కుమార్‌ గౌడ్‌, వైస్‌ చైర్మన్‌ గడ్డమీది విజయ్‌ కుమార్‌ గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేవలం టెండర్లలో రిజర్వేషన్లు ఇస్తే గౌడ కులస్తులు బాగుపడరని, పక్క రాష్ట్రంలో మాదిరి కల్లుగీత సొసైటీలకు టెండర్లు మొదలుకొని రెంటల్‌ కూడా 50 శాతం సబ్సిడీ ఇస్తోందని, అలా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇస్తే గౌడ కులస్తులను ఆదుకున్న వారవుతారని పేర్కొన్నారు. వైన్స్‌, బార్లలో గౌడ కులస్తులకు 25 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని, ట్యాంక్‌ బండ్‌పై సర్దార్‌ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న జిల్లా పేరు పెట్టాలని, 50 ఏళ్లు దాటిన గీత కార్మికుడికి రూ.5 వేల పింఛన్‌ ఇవ్వాలని, చెట్టుపై నుంచి కిందపడ్డ కార్మికుడికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్‌, వివిధ గౌడ, బీసీ సంఘాల నాయకులు దుర్గయ్య గౌడ్‌, వేములయ్య, నగేష్‌ గౌడ్‌, లతగౌడ్‌, వెంకటేష్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

హిమాయత్‌నగర్‌: ఉచిత మెడికల్‌ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హిమాయత్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మహాలక్ష్మి రామన్‌ గౌడ్‌ అన్నారు. దత్తనగర్‌లో గురువారం నిర్వహించిన మెడికల్‌ క్యాంపులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దోమలగూడ యూపీహెచ్‌సీ డాక్టర్‌ భువనేశ్వరి, సిస్టర్‌ కిరణ్మయి, ఇతర సిబ్బంది పలువురికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కాంగ్రెస్‌ నాయకులు రమేష్‌, జైస్వాల్‌, బస్తీవాసులు తుల్జారాం, రఘు, చింటు తదితరులు పాల్గొన్నారు.

2న ఏజీ వర్సిటీ 55వ స్నాతకోత్సవం



ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం ఆగస్టు 2న నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ సి.హెచ్.విద్యాసాగర్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో చదువుకున్న 519 మంది యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు పట్టాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వర్సిటీ ఆడిటోరియంలో విశ్వవిద్యాలయం కులపతి, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్)కి చెందిన ఎంఎల్ జాట్ హాజరుకానున్నారు. చదవుతోపాటు ఇతర రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పీజీ, పీహెచ్‌డీ, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవానికి వచ్చే విద్యార్థులు పాటించాల్సిన సూచనలు, అడ్మిట్ కార్డు, డ్రెస్‌కోడ్ వివరాల కోసం విశ్వవిద్యాలయం వైబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

సెప్టెంబర్ 5, 6 తేదీల్లో వరల్డ్ రోబోటిక్ చాంపియన్‌షిప్ పోటీలు

ప్లాటినం స్పాన్సర్‌గా జీఎంఆర్ ఏరోసిటీ

శంషాబాద్: వరల్డ్ రోబోటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు శంషాబాద్ విమానాశ్రయంలోని జీఎంఆర్ అరెనా వేదికగా మారనుందని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 5, 6 తేదీల్లో జరిగే 19 వరల్డ్ రోబోటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు జీఎంఆర్ ఏరోసిటీ ప్లాటినం స్పాన్సర్‌గా వ్యవహరించనుందని పేర్కొన్నారు. 'ద ఫ్యూచర్ ఆఫ్ రోబోటిక్ థీమ్'తో వ్యవహరిస్తున్న ఈ పోటీల్లో యువత సృజనాత్మక, నైపుణ్యాలకు వెలికి తీసే వేదికగా మారుతుందని తెలిపారు. 8 నుంచి 19 విద్యార్థుల కోసం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అటానమస్ రోబోటిక్ పరిష్కారాలను డిజైన్, ప్రోగ్రామ్ చేయడం ద్వారా సమస్యల పరిష్కారానికి ఆలోచనలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా యువత సృజనాత్మకు వేదికగా మారనున్న కార్యక్రమాన్ని మద్దతుగా జీఎంఆర్ ఏరోసిటీ నిలుస్తోందని పేర్కొన్నారు.

మాజీమంత్రి మల్లారెడ్డి ఇళ్లలో ఐటీ సోదాలు అవాస్తవం



మాట్లాడుతున్న ప్రీతిరెడ్డి

కుత్బుల్లాపూర్: మాజీ మంత్రి మల్లారెడ్డి, అతని కుమారుడు భద్రారెడ్డి ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారని వచ్చిన వార్తలు అవాస్తవమని మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వైస్ చైర్‌పర్సన్, మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి అన్నారు. కొంపల్లిలోని భద్రారెడ్డి నివాసానికి గురువారం తెల్లవారుజామున పోలీసులు రావడంతో ఐటీ అ,ధికారులు వచ్చినట్లు పుకార్లు షికార్లు చేశాయి. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రీతిరెడ్డి మాట్లాడుతూ 2022లో కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం పీజీ సీట్ల విషయమై తమ కళాశాలపై వేసిన కేసుకు సంబంధించి వరంగల్ పోలీసులు వచ్చి నోటీసులు ఇచ్చారని తెలిపారు. అయితే ఐటీ అధికారులు వచ్చినట్లుగా కొందరు తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. తమ యూనివర్సిటీలో అడ్మిషన్లు సక్రమంగా జరిగాయని, అవకతవకలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.

నేడు మహిళా దక్షిత సమితి ఆధ్వర్యంలో స్నాతకోత్సవం

చందానగర్: చందానగర్ గంగారంలోని మహిళా దక్షిత సమితి, బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్నాతకోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరుకానున్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, వసుధ ఫౌండేషన్, ఫార్మా కెమికల్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మంతెన వెంకట రామరాజు పాల్గొననున్న ట్లు మహిళా దక్షిత సమితి అధ్యక్షురాలు సరోజ్‌బజాజ్ తెలిపారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది
- సైఫాబాద్‌లోని విద్యారణ్య హైస్కూల్‌లో నిర్వహించే కార్యక్రమంలో అఫ్సర్ రచించిన 'సాహిల్ విల్ కమ్ అండ్ ఆదర్స్ స్టోరీస్'పుస్తకాన్ని సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాద్ వర్సిటీ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్ డీన్ కె.సునీతా రాణి ఆవిష్కరిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఎదురుచూపులు

ఇంకెన్నాళ్లు?

- వాయిదా పడిన కొత్త రేషన్‌కార్డుల పంపిణీ
- ఇప్పటికే దాఖలైన 2.19 లక్షల దరఖాస్తులు
- ఇప్పటివరకు 44,415 కార్డులు మంజూరు
- జీహెచ్ఎంసీకి పెండింగ్ దరఖాస్తుల విచారణ బాధ్యత



సాక్షి,సిటీ బ్యూరో: హైదరాబాద్‌లో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు ఎదురుచూపులు తప్పడంలేదు. కార్డుల పంపిణీ ప్రక్రియ ఆలస్యం కానుంది. వాస్తవానికి శుక్రవారం కొత్త రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించాలి. ఈ మేరకు కసరత్తు పూర్తయినప్పటికీ హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అందుబాటులో లేకపోవడంతో ఆ కార్యక్రమం వాయిదా పడింది. ఈ నెల 15 సీఎం రేవంత్‌రెడ్డి సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది.

ఇదీ పరిస్థితి..

హైదరాబాద్ జిల్లాలో సుమారు 2,19, 321 కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నాయి. అయితే కేవలం 47,374 దరఖాస్తులపై పౌర సరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయి విచారణ నిర్వహించినట్లు తెలుస్తోంది. వాటిల్లో 44,415 దరఖాస్తులు మాత్రమే అర్హత సాధించగా, 2,959 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఆరు నెలల నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం మీ సేవ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయి విచారణ మాత్రం నత్తకు నడక నేర్పిస్తోంది. సిబ్బంది కొరత వల్ల విచారణ ప్రక్రియ వేగంగా ముందుకు సాగడం లేదని అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా దరఖాస్తులను 360 డిగ్రీల్లో పరిశీలించి ఆస్తి, ఆదాయ వివరాల సేకరణ, వాహనాల పన్ను చెల్లింపు వంటి అంశాల్లో విచారణ జరిపి అర్హులను తేల్చాల్సి ఉంటుంది. అయితే సిబ్బంది మాత్రం వీలును బట్టి ఒక దగ్గర కూర్చొని దరఖాస్తుదారులను పిలిచి వివరాలు సేకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 20 శాతం దరఖాస్తులు కూడా క్షేత్రస్థాయి విచారణకు నోచుకోకపోవడం గమనార్హం.

1,100 మంది ఆర్పీల సేవలు

తాజాగా కొత్తరేషన్ కార్డుల పెండింగ్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ బాధ్యతను జీహెచ్ఎంసీకి అప్పగించినట్లు తెలుస్తోంది. పెండింగ్ దరఖాస్తుల పరిశీలన సర్కిళ్లవారీగా నోడల్ అధికారుల పర్యవేక్షణలో వేగంగా సాగాలని ఇటీవల మంత్రి పొన్నం అధికారులను ఆదేశించారు. ఇందు కోసం జీహెచ్ఎంసీ నుంచి 1,100 మంది ఆర్పీలను వినియోగించుకోవాలని సూచించారు. దీంతో పౌరసరఫరాల శాఖ పెండింగ్ దరఖాస్తుల విచారణను జీహెచ్ఎంసీకి అప్పగించినట్లు తెలుస్తోంది.

కొత్త రేషన్ కార్డుల మంజూరు ఇలా...

సర్కిల్	దరఖాస్తుల ఆమోదం	తిరస్కరణ
మలక్‌పేట	4,317	34
యాకుత్‌పురా	7,558	28
చార్మినార్	8,721	637
నాంపల్లి	1,233	3,32
మెహిదీపట్నం	9,135	760
అంబర్‌పేట	3,811	51
ఖైరతాబాద్	5,345	1,147
బేగంపేట	2,330	1,22
సికింద్రాబాద్	1,935	106

జేఎన్‌టీయూలో బోర్డు ఆఫ్ స్టడీస్ భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయూహెచ్ వీసీ కిషన్‌కుమార్ రెడ్డి

బాలానగర్: విద్యార్థులు ఎక్కడ చదువుతున్నారన్న దాని కంటే వారికి వచ్చే అకడమిక్ అనుభవమే కీలకంగా ఉండాలని జేఎన్‌టీయూహెచ్ ఉప కులపతి టి.కిషన్‌కుమార్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో రెండురోజులపాటు జరిగిన బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. విద్యాబోధనకు సాధ్యమైన, నాణ్యమైన విషయాలనే పాఠ్యాంశాల్లో చేర్చాలని సూచించారు. గణితం, ఫిజిక్స్ వంటి సబ్జెక్టులు బలంగా ఉండాలని, వాటిపై ఆధారపడి ఏఐ, డేటాసైన్స్‌ను ఏర్పర్చాలని, ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంజనీరింగ్ గురించి అవగాహన కలిగించే వీడియోలు రూపొందించాలని సూచించారు. నూతన సిలబస్ రూపకల్పనలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పారిశ్రామిక వర్గాల నుంచి ఒకరు చొప్పున, డిపార్టుమెంట్స్ నుంచి ఇద్దరు, ఎన్ఐటీ నుంచి ఒకరు ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ కె.విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు, వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ జి.వెంకటనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి సమాయత్తం

వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్



కొండాపూర్ ఆస్పత్రిలో డాక్టర్లతో మాట్లాడుతున్న డాక్టర్ రవీందర్ నాయక్

గచ్చిబౌలి: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు సమాయత్తం కావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.రవీందర్ నాయక్ అన్నారు. గురువారం ఆయన కొండాపూర్ జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. వర్షాకాలంలో కలుషిత నీరు వల్ల మలేరియా, డెంగీ, మెదడు వాపు, ఫైలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉంచాలని, నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు డాక్టర్లు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలిన వెంటనే ఆయా కాలనీలు, బస్తీలలో వైద్య బృందాలు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, కొండాపూర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో మధుసూదన్‌రెడ్డి పాత్ర కీలకం

హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



మధుసూదన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దత్తాత్రేయ

హిమాయత్‌నగర్: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో ప్రొఫెసర్ కుంభం మధుసూదన్‌రెడ్డి కీలకపాత్ర పోషించారని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఇటీవల మరణించిన మధుసూదన్ రెడ్డి కుటుంబసభ్యులను గురువారం దత్తాత్రేయ పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దత్తాత్రేయ మాట్లాడుతూ ఆయన సూచనలు, సలహాలు రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించాయని కొనియాడారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా, విద్యావేత్తగా నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. ఆయన మరణం తెలంగాణ సమాజానికి తీరనిలోటని తెలిపారు. ఆయన వెంట ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, బీజేపీ నాయకులు జి.మాధవి, కేశబోయిన శ్రీధర్, కె.నర్సింగ్ ముదిరాజ్ ఉన్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో సర్వైకల్ కేన్సర్‌కు చెక్

- 'కాంకర్ హెచ్‌పీవీ అండ్ కేన్సర్ కాన్‌క్లేవ్ 2025'లో పేర్కొన్న వక్తలు
- సీరం ఆధ్వర్యంలో మహిళలు, పురుషుల కోసం 'సెర్వావాక్' వ్యాక్సిన్



కాంకర్ హెచ్‌పీవీ అండ్ కేన్సర్ కాన్‌క్లేవ్ లో ప్రముఖులు

సాక్షి, సిటీబ్యూరో: ముందస్తుగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకుంటే పోలియో మాదిరిగా దేశంలో సర్వైకల్ కేన్సర్లను సమూలంగా నిర్మూలించవచ్చని 'కాంకర్ హెచ్‌పీవీ అండ్ కేన్సర్ కాన్‌క్లేవ్–2025'లో వక్తలు స్పష్టం చేశారు. వయస్సు, ఆరోగ్యం పరంగా అర్హులైన 90 శాతం మందికి హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందిస్తే ఆ దేశాన్ని సర్వైకల్ క్యాన్సర్ ఫ్రీ దేశంగా గర్తిస్తారు. కానీ, దేశంలో కేవలం 1.6 శాతం మహిళలు ఈ వ్యాక్సిన్ తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ తయారీదారు సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని ఐటీసీ కాకతీయ వేదికగా కాంకర్ హెచ్‌పీవీ అండ్ కేన్సర్ కాన్‌క్లేవ్ 2025ను నిర్వహించింది. ఈ కాన్‌క్లేవ్‌లో నగరంలోని కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఓబీజీవైఎన్ విభాగం అధిపతి ప్రొ.ఎం. త్రిపుర సుందరి, ప్రముఖ గైనకాలజిస్ట్, ఆంకాలజిస్ట్ డా.డి.లీల, గైనకాలజీ–లాప్రోస్కోపిక్ సర్జన్ డా.ఎస్.సుధ, కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డా.నివాలికా రాజమోని, మాజీ పీడియాట్రిక్ అకాడమీ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు డా.ఎం. సురేంద్ర నాథ్, మాజీ ఐఏపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ మెంబర్ డా.కె.పవన్ కుమార్ ప్యానలిస్టులుగా పాల్గొన్నారు.

పురుషులు–మహిళలిద్దరికీ హెచ్‌పీవీ వ్యాక్సిన్..

హెచ్‌పీవీ కేన్సర్లు–వ్యాక్సిన్ అంశంపై ప్యానలిస్టులు చర్చిస్తూ ఈ సర్వైకల్ కేన్సర్ మహిళల్లో దేశంలోనే 2వ సాధారణ కేన్సర్‌గా మారిందని, దేశంలో ఏటా 1.23 లక్షలకుపైగా కేసులు నమోదవుతున్నాయని, ఇందులో 77 వేల కన్నా ఎక్కువ మంది మరణిస్తున్నారని తెలిపారు. హెచ్‌పీవీ వైరస్ ఇన్‌ఫెక్షన్ల వల్ల 90 శాతం అనల్ కేన్సర్లు (మహిళలకు), 63 శాతం పెనైల్ కేన్సర్లు (పురుషులకు) నమోదవుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదకరమైన ఈ కేన్సర్లను నిర్మూలించే అవకాశం ఉందని, 9 నుంచి 14 ఏళ్ల వయస్సులోనే అమ్మాయిలకు ఈ హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందిస్తే వీరికి దాదాపుగా సర్వైకల్ కేన్సర్లు రాకుండా నివారిస్తుందని తెలిపారు. సీరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరాగ్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ పురుషులు, మహిళలకు ఇవ్వగలిగిన క్వాడ్రివాలెంట్ హెచ్‌పీవీ వ్యాక్సిన్ 'సెర్వావాక్'ను అందుబాటులోకి తీసుకువచ్చామని, ఇది మొట్టమొదటి స్వదేశీ వ్యాక్సిన్ అని పేర్కొన్నారు. ఇది సుమారు రూ. 2 వేలకే లభిస్తుండటం శుభపరిణామమని అన్నారు.

'దాశరథి, సినారెలు చిరస్థాయిగా నిలిచి ఉంటారు'



పురస్కార గ్రహీతలతో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: శృతిలయ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్తాధ్వర్యంలో సినారె, దాశరథి జయంతి వేడుకలను గురువారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ దాశరథి, సినారెలు సాహిత్య లోకంలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని కొనియాడారు. సినీనటి రాజశ్రీకి సినారె సాహిత్య నటనా పురస్కారాన్ని, నలంద గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్‌కు సినారె స్ఫూర్తి పురస్కారాన్ని అందజేశారు. అంతకు ముందు.. నన్ను దోచుకుందువటే.. శీర్షికన గాయనీ గాయకుల గీతాలాపన ఆహుతులను అలరించింది. కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్ గుప్త, వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, కళాపత్రిక సంపాదకుడు మహ్మద్ రఫీ, శృతిలయ కార్యదర్శి ఆమని పాల్గొన్నారు.

'గాంధీ'లో 25 మంది వైద్యులకు పదోన్నతి

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్న 25 మంది ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. బ్రాడ్ స్పెషాలిటీ విభాగంలో 21 మంది, సూపర్ స్పెషాలిటీ విభాగంలో 4 అసోషియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి లభించింది. రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో ఇటీవల జరిగిన బదిలీలు, అడిషనల్ డీఎంఈ పదోన్నతుల నేపథ్యంలో గాంధీలో భారీగా ప్రొఫెసర్ పోస్టు ఖాళీలు ఏర్పడ్డాయి. పదోన్నతి కల్పించి ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల పదోన్నతి త్వరలోనే చేపట్టనున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి.

మరోమారు కనిపించిన చిరుత



మంచిరేవుల గ్రే హౌండ్స్ వెనక ఓ కొండపై కనిపించిన చిరుత

మణికొండ: మంచిరేవుల పోలీస్ గ్రేహౌండ్స్ గ్రౌండ్ పరిసరాల్లో చిరుతపులి గురువారం మరోసారి కనిపించింది. పక్కనే ఉన్న ఓ కొండపైన కూర్చుని ఉండగా స్థానికులు గమనించారు. మూడు రోజుల క్రితం గ్రే హౌండ్స్ పోలీసుల కంటపడటంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో చిరుతను బంధించేందుకు వారు ఏడు సీసీ కెమరాలు, నాలుగు బోన్‌లు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న చిరుతపులి తాజాగా ఓ సీసీ కెమెరాలో కనిపించింది. సాయంత్రం పక్కనే ఉన్న ఓ కొండపై కూర్చుని ఉండగా ఈఐపీఎల్ రివరేజ్ విల్లాస్ నివాసితులు ఫొటో తీశారు. చిరుత మంచిరేవుల గ్రే హౌండ్స్‌తోపాటు చిలుకూరు జింకల పార్కు చుట్టుపక్కలనే తిరుగుతున్న ఆనవాళ్లు కనిపించాయని, దాన్ని బోనులో బంధించేందుకు అటవీ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారని నార్సింగి పోలీస్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. అది తిరుగుతున్న ప్రాంతంలో నాలుగు బోన్‌లు ఏర్పాటు చేశారని, వాటి సంఖ్యను పెంచి దాన్ని త్వరగా పట్టుకోవాలని అటవీ అధికారులను కోరినట్టు చెప్పారు. బోన్‌లలో ఉంచిన మేక పిల్లలకు ఆహారం ఇవ్వకపోవటంతో అవి గట్టిగా అరుస్తున్నాయని, అరుపులకు చిరుత వచ్చి బోనులో చిక్కుకునే అవకాశం ఎక్కువగా ఉందని అటవీ అధికారులు తెలిపారు.

సింగరేణిని కాపాడుకుందాం

సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ పిలుపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు

పంజగుట్ట: గత 135 ఏళ్లుగా బొగ్గు ఉత్పత్తి చేస్తూ దేశానికి సేవ చేస్తున్న సింగరేణి కంపెనీని అందరం కలిసి రక్షించుకోవాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్ అనుబంధం) పిలుపునిచ్చింది. సింగరేణిని కాపాడుకునేందుకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి, కార్యదర్శి మాధవ నాయక్, టి.పవన్ కుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం సింగరేణిలో లక్షమంది, కోల్ ఇండియాలో ఆరున్నర లక్షల మంది శాశ్వత ఉద్యోగులు ఉండేవారని, ఇప్పుడు సింగరేణిలో 39 వేలు, కోల్ ఇండియాలో రెండు లక్షల మంది మాత్రమే శాశ్వత ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. వెంటనే బొగ్గు పరిశ్రమలోని అన్ని కంపెనీల్లో శాశ్వత ఉద్యోగుల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బొగ్గు కంపెనీల్లో వంద శాతం భద్రతా నియమాలు పాటించాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం నాలుగు దశలుగా ఉద్యమించనున్నట్లు తెలిపారు. నాల్గవ దశలో భాగంగా సెప్టెంబర్ 15న అన్ని బొగ్గు ఉత్పత్తి కార్యాలయాల వద్ద ఒకరోజు ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

'యునానీ' వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ జహీర్ అహ్మద్

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ యునానీ మెడిసిన్ (యునానీ కేంద్రీయ వైద్యశాల) ఆడిటోరియంలో గురువారం నేషనల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్ ఫర్ స్కిన్ డిజాస్టర్ ఆధ్వర్యంలో 'ప్రజ్ఞా–2025'పేరుతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఆర్‌యూఎం మాజీ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ ఆసిమ్ ఆలీఖాన్ మాట్లాడుతూ మూడురోజులపాటు జరగనున్న ఓరియెంటేషన్ వర్క్‌షాపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీసీఆర్‌యూఎం డైరెక్టర్ డాక్టర్ ఎన్.జహీర్ అహ్మద్ మాట్లాడుతూ జ్ఞాన సాధికారతలో ఈ శిక్షణ ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐయూఎంఎస్‌డీ డైరెక్టర్ ఇన్‌చార్జి ఇష్తికార్ మున్నీ, సీసీఆర్‌యూఎం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గజాల జావెద్, డిప్యూటీ డైరెక్టర్ దీపక్ కొచ్చర్, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ సంస్థల నుంచి 60 మంది శిక్షణార్థులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ విధానాలు భేష్

టీడీఆర్, బిల్డ్ నౌ విధానాలు పరిశీలించిన రాజస్థాన్ బృందం



జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన జైపూర్ అధికార బృందంతో కమిషనర్ కర్ణన్

లక్డీకాపూల్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అమలు చేస్తున్న టీడీఆర్, బిల్డ్ నౌ విధానాలను జైపూర్ నగరాభివృద్ధి సంస్థ అధికారులు ప్రశంసించారు. గురువారం జైపూర్ అభివృద్ధి సంస్థ (జేడీఏ) కమిషనర్ ఆనంది నేతృత్వంలో ప్రణాళిక శాఖ డైరెక్టర్ ప్రీతి గుప్తా, ఐటీ సలహాదారు ఆర్.కె.శర్మ, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ రుషికేశ్ కొల్టే, ఐటీ డిప్యూటీ డైరెక్టర్ పంకజ్ శర్మలతో కూడిన ప్రతినిధి బృందం ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) పాలసీ, బిల్డ్ నౌ అనే ఏకీకృత భవన, లేఅవుట్ అనుమతి వ్యవస్థల అధ్యయనం నిమిత్తం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ 2017లో జీహెచ్ఎంసీ టీడీఆర్ పాలసీ, దాని ప్రయోజనాలు, 'బిల్డ్ నౌ' అనే సింగిల్–విండో ప్లాట్‌ఫామ్‌ల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ విధానాల ద్వారా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు భూసేకరణను సులభతరం చేయడంతోపాటు పౌర సేవల్లో పారదర్శకత, సమర్థత, బాధ్యతను పెంచామని చెప్పారు. జీహెచ్ఎంసీ విధానాలు బాగున్నాయని ఆ బృందం సభ్యులు ప్రశంసించారు. జైపూర్ నగర పరిపాలన బలోపేతానికి ఇలాంటి వ్యవస్థలను అక్కడ అమలుపరిచేందుకు చేస్తామన్నారు. సమావేశంలో జీహెచ్ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌రావు, అదనపు సీసీపీలు గంగాధర్, ప్రదీప్ కుమార్, ప్రతినిధుల అధ్యయన టూర్ సమన్వయకర్తలు రాజ్ కుమార్, విల్సన్, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి చైతన్యవంతమైన భారతదేశం

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గచ్చిబౌలి: భారతదేశాన్ని 2047 నాటికి చైతన్యవంతమైన దేశంగా రూపొందించడం అవసరమని, ఆ దిశగా చర్యలు సాగుతున్నాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. గచ్చిబౌలిలోని లీమెరీడియన్‌లో క్యూఎస్ 1–గేజ్ ఇండియా అకడమిక్ ఫోరం రూపొందించిన 'విజన్ టు రియాలిటీ: భారతీయ ఉన్నత విద్యలో ఎన్ఈపీ–2020 అమలును ట్రాక్ చేయడం'అనే నివేదికను జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గురువారం విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యోగా, ఆయుర్వేదం కోసం భారతదేశానికి విదేశీయులు వస్తున్నారని అన్నారు. వికసిత్ భారత్ అంటే కేవలం ఆర్థికంగా సంపన్నదేశంగా కావడం కాదని, దేశంలో జరిగే అభివృద్ధి, ప్రయోజనాలన్నీ చివరి మనిషి వరకు చేరితే ఆశించిన లక్ష్యం నెరవేరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆరోగ్య సంరక్షణను కూడా చివరి వ్యక్తికి చేరే వరకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. క్యూఎస్ 1–గేజ్ మేనేజింగ్ డైరెక్టర్ రవి నాయర్ మాట్లాడుతూ భారతీయ విద్య నిజమైన పరివర్తన, సంస్కరణతో ప్రారంభమవుతుందన్నారు. భారతదేశంలో విద్య భవిష్యత్తు ఆశాజనకంగా ఉందని, ఇది ఇప్పటికే పురోగతిలో ఉందన్నారు. ఈ సందర్భంగా 51 సంస్థలు క్యూఎస్–గేజ్ రేటింగ్ సర్టిఫికెట్లను పొందాయి. వాటిలో 19 విశ్వవిద్యాలయాలు, 19 కళాశాలలు, 13 పాఠశాలలు ఉన్నాయి. కార్యక్రమంలో డాక్టర్ అశ్విన్ ఫెర్నాండెజ్, ఇక్ఫాయ్ చైర్‌పర్సన్ ఎస్ఎస్ శోభారాణి, ఇక్ఫాయ్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎల్ఎస్ గణేష్, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



'విజన్ టు రియాలిటీ: భారతీయ ఉన్నత విద్యలో ఎన్ఈపీ-2020 అమలును ట్రాక్ చేయడం' అనే నివేదికను విడుదల చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శుక్రవారం, 25, జూలై, 2025

నెక్లెస్ రోడ్డులో ఇన్‌కమ్‌ట్యాక్స్ వాకథాన్




ఖైరతాబాద్: ఇన్‌కమ్‌ట్యాక్స్ శాఖ 166 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నెక్లెస్ రోడ్డులో గురువారం వాకథాన్ నిర్వహించారు. ఇన్‌కమ్‌ట్యాక్స్ శాఖ డైరెక్టర్ ఆనంద్ రాజేశ్వర్, చీఫ్ కమిషనర్ సురేష్ బత్తినితో కలిసి ఈ వాక్ ప్రారంభించారు. ఇన్‌కమ్‌ట్యాక్స్ శాఖ విజయవంతంగా 166 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, వ్యాయామం చేస్తూ మంచి ఆహారం తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. పీపుల్స్ ప్లాజా నుంచి జలవిహార్ మీదుగా తిరిగి పీపుల్స్ ప్లాజా వరకూ వాకథాన్ నిర్వహించారు. వాకథాన్‌లో ఐటి ఉద్యోగులు, శాఖ సభ్యులు పాల్గొన్నారు.

ప్యారడైజ్‌లో 'సూఫీ శాటర్‌డే'..

26న సూఫీ, బాలీవుడ్ స్వరాలతో అలరించనున్న ఇమ్రాన్ ఖాన్..



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఈ నెల 26వ తేదీన సూఫీ ఫేం, రూహానియత్ బ్యాండ్ ఇమ్రాన్ ఖాన్ తన స్వరమాధుర్యంతో అలరించనున్నారు. నగరంలోని ప్రసాద్స్ ఐమ్యాక్స్ సమీపంలోని ప్యారడైజ్ బిర్యానీ వేదికగా ఈ శనివారం సాయంత్రం 'సూఫీ శాటర్‌డే' పేరుతో సూఫీ, బాలీవుడ్ సంగీత ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సంగీత వేడుకలో భాగంగా ఇమ్రాన్ ఖాన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గ్యాస్ట్రోనమీ ట్రిప్ ఆస్వాదించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఫుడ్ విత్ మ్యూజిక్ అనే కాన్సెప్ట్‌తో సరికొత్తగా నిర్వహిస్తున్న ఈ సూఫీ శాటర్‌డే ఉత్సాహంగా కొనసాగనుందని వివరించారు.





'ఇక్సీ'తో.. ఇన్‌ఫెర్టిలిటీ ఫిక్స్..

ఫెర్టిలిటీ సమస్యలకు ప్రత్యామ్నాయం

టెక్నాలజీ రోజు రోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది.. ఇది మానవ జీవితాన్ని గట్టిగానే ప్రభావితం చేస్తోంది. మానవ మనుగడకు తోడ్పాటునందిస్తోంది.. కాలుష్యం, రసాయనాల ప్రభావంతో పాటు తీవ్ర ఒత్తిడి అనేక రుగ్మతలకు దారితీస్తోంది. మరీ ముఖ్యంగా చెప్పాలంటే సంతానోత్పత్తిపై విపరీతమైన ప్రభావాన్ని చూపిస్తోంది.. దీనికి పరిష్కారంగా అనేక పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయి. వాటిల్లో చెప్పుకోదగినది ఐవీఎఫ్ పద్ధతి. చదువులు, ఉద్యోగాలు, భారీ జీతాల కోసం భారీ లక్ష్యాలతో వివాహ వయసు దాటిపోతోంది. దీంతో గతంలో మహిళలనే ఇబ్బంది పెట్టిన ఇన్‌ఫెర్టిలిటీ సమస్య మగవారిలోనూ కనిపిస్తోంది. నగరాలు, పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా సగటున 50 శాతం మందిలో ఈ సమస్య తలెత్తుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా యుక్త వయసులోనే పురుషులు శుక్ర కణాలను, మహిళలు అండాలను భద్రపరుచుకునే వెసులుబాటు వచ్చేసింది.

- సాక్షి, సిటీబ్యూరో



మారుతున్న కాలంలో పాటే అధునాతన చికిత్సలు అందుబాటులోకి వచ్చేశాయి. ఆలస్యంగా వివాహాలు చేసుకునే వారి వేధించే ఇన్‌ఫెర్టిలిటీ సమస్యకు పరిష్కారంగా ఎంబ్రియో ఫ్రీజింగ్ కేంద్రాలు వెలుస్తున్నాయి. మెట్రోనగరాల్లో ఒకటైన మన నగరంలోనూ ఈ వెసులుబాటు వచ్చేసింది. శుక్ర కణాలు, ఎగ్ (జీవ కణం) క్వాలిటీలో ఎలాంటి ఇబ్బందులూ లేనివారు యుక్త వయసులో ఆరోగ్యంగా ఉన్నప్పుడే వీటిని ఫ్రీజ్ చేసుకుంటున్నారు. ఇలా ఫ్రీజ్ చేసిన వాటిని ఐదు నుంచి పదేళ్లలో ఎప్పుడైనా గర్భాశయంలోకి ట్రాన్స్‌ఫర్ చేసుకుని ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనివ్వవచ్చు. దీంతో విద్య, ఉద్యోగం వంటి కారణాలతో అనేక మంది వివాహాన్ని ఆలస్యం చేస్తున్నారు. ఇది సంతానోత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో నగర ప్రజలు ఐవీఎఫ్ కేంద్రాలకు క్యూ కట్టేవారు.. దీనికి పరిష్కారంగా అధునాతన చికిత్సలు అందుబాటులోకి రావడంతో ఫ్రీజింగ్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.



40 శాతం దంపతుల్లో సంతాన సమస్యలు..

ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో ఉద్యోగం, వ్యాపారం, ఒత్తిడి, సంపాదన, లైఫ్‌స్టైల్, కుటుంబ పరిస్థితులు, కాలుష్యం, ఆహారం, మైక్రో ప్లాస్టిక్, హార్మోన్ల సమతుల్యత, ఆలస్యంగా వివాహం చేసుకోవడం, మద్యం సేవించడం, పొగ తాగడం, రక్త సంబంధీకులను పెళ్లి చేసుకోవడం, జన్యుపరమైన, ఇతర సమస్యలతో సుమారు 40 శాతం కొత్తగా పెళ్లైన జంటల్లో సంతానోత్పత్తి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇందులో పురుషుల్లో 50 శాతం మందిలో, 45 శాతం మంది స్త్రీలల్లో పునరుత్పత్తి సమస్యలు గుర్తిస్తున్నారు. ఇద్దరిలోనూ సమస్యలు ఉన్న జంటలు సుమారు 15 శాతం నుంచి 20 శాతం ఉంటున్నాయి. ఈ సమయంలో కొంత మంది మానసికంగా కుంగిపోవడం కనిపిస్తోంది. ఐవీఎఫ్ పద్ధతులను ఆశ్రయిస్తున్నారు. 30 ఏళ్ల వయసుగల వారిలో ఐవీఎఫ్ పద్ధతులు సుమారు 60 శాతం నుంచి 70 శాతం సక్సస్ రేటు ఉండగా, ఆపై వయసున్న వారిలో సుమారు 40 శాతం నుంచి 50 శాతం ఉంటోందని నిపుణులు చెబుతున్నారు.

ఆరోగ్య రంగంలో ప్రపంచానికే మార్గదర్శిగా వెలుగొందుతున్న హైదరాబాద్ సంతాన సమస్యలకు చెక్ పెట్టే అధునాతన పద్ధతులను ఆవిష్కరిస్తోంది. ఈ క్రమంలోనే ఐవీఎఫ్ కంటే అధునాతన చికిత్సా విధానాలను అందుబాటులోకి తెచ్చింది. దంపతుల నుంచి సేకరించిన ఎగ్స్, శుక్రకణాలను ఎంబ్రియాలజీ ల్యాబ్‌లో మైక్రోస్కోప్ కింద పిండాన్ని (జీవ కణం) తయారు చేస్తారు. ఐదు నుంచి ఆరు రోజుల్లో పిండం సిద్ధమై

జీవ కణం పదేళ్లు..

పోతుంది. ఇలా తయారు చేసిన పిండాన్ని పదేళ్లలోపు ఎప్పుడైనా మహిళ గర్భాశయంలోకి ట్రాన్స్‌ఫర్ చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.



- యుక్త వయసులోనే అండాలు, శుక్రకణాల సేకరణ
- భవిష్యత్తు అవసరాలకు ఫ్రీజ్ చేసుకునే సౌలభ్యం
- నగరంలో అందుబాటులో ఎంబ్రియో సెంటర్లు
- పదేళ్లలో ఎప్పుడైనా వినియోగించుకునే అవకాశం
- ఐవీఎఫ్ సెంటర్లను సంప్రదిస్తున్న జంటలు
- 50 శాతం మగవారిలోనూ ఇన్‌ఫెర్టిలిటీ సమస్యలు



ఇది డే కేర్ ప్రొసీజర్..



పట్టణ ప్రాంతాల్లో జీవన శైలి, ఇతర అలవాట్లతో సంతాన సమ్యలు సర్వసాధారణం అయిపోయాయి. దీంతో కొందరు ఐవీఎఫ్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అందులోనూ అధునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. శుక్రకణాలు, అండం, పిండాన్ని ఫ్రీజ్ చేయడం, ఎంబ్రియోస్ ట్రాన్స్‌ఫర్ చేసే ప్రొసీజర్లు కొనసాగుతున్నాయి. శుక్ర కణాలు, ఎగ్స్ ఎంబ్రియాలజీ ల్యాబ్‌లో మైక్రో స్కోప్ కింద కలిపి పిండం (జీవ కణం) తయారు చేస్తాం. దీన్ని ఇక్సీ పద్ధతి అంటారు. మహిళకు నొప్పి లేకుండా డే కేర్ ప్రొసీజర్‌లో పూర్తయిపోతుంది. మరుసటి రోజు నుంచి అన్ని పనులు చేసుకోవచ్చు.

- పీ.స్వాతి, రీప్రొడక్టివ్ మెడిసిన్, కన్సల్టెంట్ రైన్‌బో హాస్పటల్స్

వైరల్ మార్కర్ టెస్టులు..

పెళ్లికి ముందు, లేదా వివాహం నిశ్చయించుకున్న జంటలు ముందుగా వైరల్ మార్కర్, ఏఎంహెచ్ వంటి టెస్టులు చేయించుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఒక వేళ ఇద్దరిలో ఎవరికైనా సమస్యలు ఉంటే ముందుగానే వాటికి చికిత్సలు తీసుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. అధిక ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతల్లో పని చేసే వారిలో శుక్రకణాల సంఖ్య తగ్గిపోతుందట. మహిళల్లో 25 ఏళ్ల లోపు ఎగ్ రిలీజ్ బాగుంటుందని, తరువాత తగ్గిపోతుందని చెబుతున్నారు. ప్రీ కన్సెప్షనల్ కౌన్సిలింగ్ వివాహానికి ముందే చేసుకుంటే మంచిది. ఏడాది వరకూ సహజంగానే ట్రై చేసుకోవచ్చు.

పర్యాటకుల కోసం.. టూర్స్ అట్రాక్షన్స్..

సాక్షి, సిటీబ్యూరో: తాము పర్యటించే ప్రాంతాల్లో ఉండే ఆకర్షణీయ విశేషాలను ఆస్వాదించేలా ముందస్తుగా బుక్ చేసుకునేందుకు ప్రముఖ ట్రావెల్ బ్రాండ్ మేక్ మై ట్రిప్ టూర్స్ – అట్రాక్షన్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ విషయాన్ని సంస్థ సీఈఓ రాజేష్ మాగోవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేదిక నగరవాసులకు 130 దేశాల్లోని 1100 నగరాల్లో రెండు లక్షలకు పైగా యాక్టివిటీస్‌కు సులభమైన యాక్సెస్ అందిస్తోందని, నగర ప్రయాణం నుంచి సాంస్కృతిక టూర్లు, థీమ్ పార్కులు, అడ్వెంచర్ కార్యకలాపాల వరకూ విస్తృత శ్రేణి కార్యకలాపాలను ఇది అందుబాటులోకి తెచ్చిందన్నారు.

అనారోగ్యాన్ని 'తొక్కేద్దాం'!

సైకిల్‌పై నగరవాసుల్లో పెరుగుతున్న ఆసక్తి	పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యానికీ దోహదం	మార్కెట్‌లో వివిధ రకాల మోడళ్లు	పెరుగుతున్న కొనుగోళ్లు, వినియోగం

సైకిల్ పట్ల నగరవాసుల్లో ఇటీవల కాలంలో ఆసక్తి పెరుగుతోంది. నగరంలో ట్రాఫిక్ దృష్ట్యా చాలా మంది సైకిల్ వినియోగం పట్ల సుముఖత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది పర్యావరణ ప్రేమికులు, ఐటీ నిపుణులు పలు కారణాలతో సైకిల్ వినియోగిస్తున్నారు. దీనికితోడు సైకిల్ వినియోగం ఆరోగ్యానికీ మంచిదని, అనారోగ్య సమస్యలు దూరమవ్వాలంటే సైకిల్ తొక్కడం ఓ మార్గం అని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో మధ్యవయస్కులు, పెద్దలు విరివిగా సైకిల్ వినియోగిస్తున్నారు. దీంతో వీటికి మార్కెట్‌లో గిరాకీ పెరిగిందని పలువురు చెబుతున్నారు.

- జవహర్‌నగర్



ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునిక పోకడలు, ప్రాశ్చాత్య సంస్కృతి పెరిగిపోయింది. యువతతో పాటు మధ్య వయస్కులు సైతం ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకునే సాధనలో పడిపోతున్నారు. దీంతో మార్కెట్‌లో యంత్రాల వినియోగం భారీగా పెరిగిపోయింది. ఫలితంగా శారీరక శ్రమ తగ్గిపోయి అనారోగ్యాల బారినపడుతున్నారు. మరోవైపు ఒత్తిడితో కూడిన ఉద్యోగాల వల్ల గుండె సంబంధిత వ్యాధులు, ఉబకాయంతో బాధపడుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీంతో అనేక వ్యాధులు చుట్టుముడుతున్నాయి. శారీరక శ్రమ తగినంత లేకపోవడమే దీనికి కారణమని పలువురు వైద్యులు సూచిస్తున్నారు. రోజులో కనీసం గంట సేపైనా వ్యాయామం చేయాలని, లేందటే కనీసం సైకిల్ వినియోగించాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో సైకిల్ వినియోగించే వారి సంఖ్య నగరంలో గణనీయంగా పెరుగుతోంది. నగర ప్రజల్లో ఆరోగ్య పరిరక్షణపై కరోనా తర్వాత వచ్చి మార్పుతో ఈ సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీనికితోడు రోజు రోజుకూ మెట్రో నగరాల్లో దెబ్బతింటోన్న పర్యావరణ సమతుల్యత, కాలుష్యం గాడిన పడాలంటే సైకిళ్ల వినియోగమూ ఓ పరిష్కారమని పర్యావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

పెరుగుతున్న వాడకం..

పట్టణాల్లో పెరుగుతున్న ఆర్థిక అవసరాలు, వ్యయాలు, ఆరోగ్య పరిరక్షణ కూడా సైకిల్ వైపు మళ్లడానికి ఓ కారణమని ఇటీవల ఓ సంస్థ జరిపిన సర్వే చెబుతోంది. నగరంలో ట్రాఫిక్ కారణంగా ఇంధన ఖర్చులు పెరుగుతున్నాయని, అవసరానికి మించి ఇంధనం ఖర్చవుతోందని, దీని ఫలితంగా కాలుష్యం కూడా పెరుగుతోందని ఫలితాలు చెబుతున్నాయి. ఈ కారణంగా కూడా కొందరు ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా సైకిళ్లవైపు దృష్టిసారిస్తున్నారని ఈ అధ్యయనం చెబుతోంది.

యువతలోనూ పెరిగిన ఆసక్తి..

నగరాలతో పోలిస్తే నగర శివారు ప్రాంతాల్లో నివాసముండే యువత సైకిల్ వినియోగం పట్ల ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. విద్యార్థులు దగ్గర్లోని పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లడానికి, లోకల్‌లో పనులు చక్కబెట్టుకోడానికి సైకిల్ ఎక్కువగా వినియోగిస్తున్నారు. నగరంలో అయితే ఫిట్‌నెస్‌పై దృష్టిసారించేవారు, ఆరోగ్య సమస్యలను దూరంచేసుకోవాలనుకునే వారు వీటిని వాడుతున్నారు.

సైకిళ్ల గిరాకీ పెరిగింది..

గతంలో కంటే ఇప్పుడు సైకిల్ కొనే వారి సంఖ్య పెరిగింది. ప్రస్తుతం అమ్మకాలు బాగున్నాయి. అన్ని వయసుల వారికీ మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. పెట్రోల్ ధరలను తగ్గించుకునేందుకు కొందరు, డాక్టర్ల సలహా మేరకు కొందరు వాడుతున్నారు.

– జ్ఞాన్‌రాం, సైకిల్‌షాపు యజమాని, జవహర్‌నగర్

ఆరోగ్యానికి మేలు..

సైకిల్ వినియోగం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగ్గా ఉంటుంది. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. శరీరంలో పేరుకుపోయిన కొవ్వు తగ్గుతుంది. వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చు. రోజూ కనీసం పది కిలోమీటర్లు సైకిల్ వినియోగిస్తా.

– బొంకూరి రమేష్, కరాటే మాస్టర్



వ్యాధులకు దూరంగా..

సైకిల్ వినియోగం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అనారోగ్య సమస్యలు దరిచేరవు. రక్తపోటు, మధుమేహం, కొవ్వు వంటి సమస్యలకు చక్కని పరిష్కారం. రోజుకు గంటపాటు సైకిల్ తొక్కితే మంచిది. దీనిద్వారా జీర్ణశక్తి మెరుగుపడుతుంది.

– డాక్టర్ అశోక్, జవహర్‌నగర్



భారతీయ 'పట్టు'కు ప్రపంచ గుర్తింపు

నిగమాగమం 'సిల్క్ ఎక్స్‌పో'లో మాజీ మిసెస్ ఇండియా ఆసియా పసిఫిక్



శ్రీనగర్‌కాలనీ: భారతీయ పట్టు వస్త్రాలకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని, మన చేనేతకారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని మాజీ మిసెస్ ఇండియా ఆసియా పసిఫిక్ డాక్టర్ సుధాజైన్ అన్నారు. సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలతో శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనను గురువారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలోని సిల్క్, కాటన్ వస్త్రాలు మగువల మనసు దోచుకుంటున్నాయి. చేనేత ప్రదర్శనలో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు సుమారు 70 స్టాల్స్‌లో పలు ఫ్యాన్సీ వస్తువులను ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని నిర్వాహకులు జయేష్ గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 28 వరకూ కొనసాగుతుంది.

క్లుప్తంగా...

మేడిగడ్డను పరిశీలించిన సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం


బరాజ్ వద్ద సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం

కాళేశ్వరం: మేడిగడ్డ బరాజ్‌ను పుణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తలు పరిశీలించారు. శరబ్‌జీత్‌సింగ్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యులతో కూడిన బృందం గురువారం బరాజ్ గుండా తరలి వెళుతున్న వరద ప్రవాహాన్ని పరిశీలించింది. 2023 అక్టోబర్ 21న బరాజ్ 7వ బ్లాక్‌లోని 20వ పియర్ కుంగిన విషయం తెలిసిందే. దీంతో వరద ప్రవాహంలో పియర్ వద్ద పలు పరీక్షలను ఎన్‌డీఎస్‌ఏ తుది రిపోర్టులో పేర్కొన్న సూచనల మేరకు చేపట్టినట్లు తెలిసింది. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బరాజ్‌లలో మళ్లీ మరికొన్ని పరీక్షలు చేపట్టనున్నారు. బృందం వెంట డీఈ సురేశ్ ఉన్నారు.

విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి కన్నుమూత



పలాస: ప్రముఖ విప్లవ కవి, శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధుల్లో ఒకరైన సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖా పాణిగ్రాహి(87) అనారోగ్యంతో శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడులో గురువారం సాయంత్రం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న విప్లవ, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు బొడ్డపాడుకు చేరుకుని ఆమె భౌతికకాయంపై ఎర్రజెండాను కప్పి జోహార్లు అర్పించారు. శుక్రవారం ఉదయం 8గంటలకు అంత్యక్రియలు నిర్వహించడానికి గ్రామస్తులతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు నిర్ణయించారు.

రేపు ఉద్యోగ జేఏసీ ప్రత్యేక సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఈనెల 26న భేటీ కానుంది. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు టీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న టీఎన్జీవో భవన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే సమావేశం అనంతరం.. భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.



మీకు ఫ్రీ సీటు లేదు!

- తెలంగాణలో ఇంటర్మీడియట్ చదివిన ఏపీ విద్యార్థులకు కూటమి సర్కార్ దగా
- రాజ్యాంగ సవరణ లేని స్థానికత మార్పులతో స్థానికేతరులుగా మార్చేసిన ప్రభుత్వం
- ఇంజినీరింగ్ ప్రవేశాల్లో సీటు వచ్చినా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నోచుకోని వైనం
- తెలంగాణ ఈఏపీసెట్‌లో ఏపీ విద్యార్థులను కన్వీనర్ కోటా నుంచి తొలగింపు
- ఏపీలో సీటు వచ్చినా రూ.వేలల్లో ఫీజులు చెల్లించుకోవాల్సిన దుస్థితి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

చదువు 'కొనలేం'

▶ మొదటి పేజీ తరువాయి

దక్కక దిగులు చెందుతున్నారు. దీంతో అర్ధంతరంగా చదువులు మానేస్తున్నారు. ఇదంతాచూసి విద్యార్థుల తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఇదేనా? ఉన్నత విద్య పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి..?? అని నిలదీస్తున్నారు.

- 2024 జనవరి, ఫిబ్రవరి, మార్చి త్రైమాసికం నిధులు ఆ ఏడాది మే నెలలో ఇవ్వాల్సి ఉంది. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అప్పటినుంచి ఇప్పటివరకు చంద్రబాబు ప్రభుత్వం ఒక్క త్రైమాసికం (క్వార్టర్) కూడా ఇవ్వలేదు. ఈ ఏడాది జూన్ వరకు ప్రభుత్వం నుంచి ఆరు క్వార్టర్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.4,200 కోట్లు, విద్యార్థులకు హాస్టల్ మెయింటెనెన్స్ (వసతి దీవెన) కింద మరో రూ.2,200 కోట్లు వెరసి రూ.6,400 కోట్లు బకాయిలు పేరుకుపోవడం గమనార్హం.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో చదువులతో పాటు హాస్టల్ వసతి దీవెన (మెయింటెనెన్స్) కింద ఆర్థిక సాయం చేసింది. ఏడాదికి రూ.1100 కోట్లు అందించింది. కూటమి ప్రభుత్వం వసతి దీవెన ఎత్తేసింది. విద్యార్థులకు రూ.2,200 కోట్లు బకాయి పెట్టింది.

నెలకు రూ.50 లక్షల నుంచి రూ.3 కోట్లు ఖర్చు

రాష్ట్రంలో 230 వరకు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వం కన్వీనర్ కోటా కింద మొత్తం సీట్లలో 70 శాతం భర్తీ చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేస్తోంది. అంటే, కళాశాలల నిర్వహణ దాదాపు ప్రభుత్వం విడుదల చేసే నిధులపైనే ఆధారపడి ఉంది. కానీ, ఏడాదికి పైగా ప్రైవేటు కళాశాలలకు రావాల్సిన బకాయిలను మంజూరు చేయకుండా కూటమి సర్కారు తాత్సారం చేస్తోంది. ఫలితంగా ఒక్కో కళాశాలకు బకాయిలు కొండలా పేరుకుపోయాయి. చిన్న కళాశాలలకు రూ.6 నుంచి రూ.10 కోట్లు, పెద్ద కళాశాలలకు రూ.40 నుంచి రూ. 60 కోట్ల వరకు పెండింగ్ కనిపిస్తున్నాయి. ఫలితంగా కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయి.

- ప్రైవేటు యాజమాన్యాల్లోని 20–30 శాతం కళాశాలలు మినహా.. మిగిలినవి ఏ పూటకు ఆ పూటే అన్న చందాన నిధుల కొరత ఎదుర్కొంటూ కాలం వెళ్లదీస్తున్నాయి. ఉద్యోగుల నెలవారీ జీతభత్యాలు, ఇతర నిర్వహణ కోసం చిన్న కళాశాలలు రూ.50 లక్షలు నుంచి పెద్ద కళాశాలలు రూ.3 కోట్లు వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. వడ్డీలకు అప్పులు తెచ్చి నడిపించాల్సి వస్తుండడం ఆర్థికంగా భారం అవుతోంది. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను బకాయి పెట్టడంతో ప్రైవేటు కళాశాలలు అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి. ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేని దుస్థితిలో నడుస్తున్నాయి.

ఇదీ మా గోడు...

"ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ప్రభుత్వం నుంచి బకాయిలువిడుదల కావట్లేదు. కళాశాలల నిర్వహణ ముందుకు సాగట్లేదు. ఆర్థికంగా బలంగా ఉంటేనే కదా? నాణ్యమైన బోధనా సామర్థ్యాలను సమకూర్చుకుని విద్యార్థులకు మెరుగైన చదువు అందించగలం. డబ్బులు లేకుండా ఇవన్నీ ఎక్కడినుంచి తెస్తాం...? ఇంజనీరింగ్ కాలేజీ అంటే బ్యాంకులు కూడా అప్పులు ఇవ్వట్లేదు. ఆస్తులు అమ్ముదామంటే మార్కెట్‌లో రేట్లు లేవు. తాకట్టు పెట్టి తెద్దామంటే రూ.2-5 వరకు వడ్డీలు అవుతున్నాయి. ఇంకేం చేయాలి...?" అని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల యజమాని వాపోయారు. ఇక్కడ ఒక్క ఇంజినీరింగ్ కళాశాలలే కాదు, అదే యాజమాన్యాల్లో డిగ్రీ కళాశాలలు కూడా ఉన్నాయి. తమ పరిస్థితి ఇలా ఉండగా... ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదల ఊసే ఎత్తకపోతుండడంతో ప్రైవేటు యాజమాన్యాలు భవిష్యత్తు కార్యాచరణ దిశగా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. పొరుగు రాష్ట్రం తెలంగాణలోనూ ఇదే అనుభవం ఎదురవగా అక్కడి ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. వాటికి అనుకూలంగా తీర్పులొచ్చాయి. ఈ స్ఫూర్తితో ఏపీలోని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు చెల్లింపులు

- 2019 మేలో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం విద్యార్థులకు రాజకీయాలకు అతీతంగా అండగా నిలిచింది. 2017–19 వరకు నాటి టీడీపీ సర్కారు 16.73 లక్షల మంది విద్యార్థులకు రూ.1,778 కోట్లు బకాయిపెడితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించింది. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్ల కాలంలో జగనన్న విద్యా దీవెన కింద రూ.12,609.68 కోట్లు ప్రతి త్రైమాసికానికి క్రమంతప్పకుండా చెల్లించి... ఏ లోటు లేకుండా కళాశాలలు సక్రమంగా నడిచేలా, విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేలా ప్రోత్సహించింది.
- ఇక జగనన్న వసతి దీవెన కింద రూ.4275.76 కోట్లను విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో వేశారు. ఇలా మొత్తం ఐదేళ్లలో ప్రభుత్వం ఉచిత ఉన్నత విద్యపై రూ.18,663.44 కోట్లు ఖర్చు చేసింది.

మంత్రి మాటంటే.. జరగదంట?

పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలపై విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పూటకో మాట చెప్పుకొచ్చారు. పైసా ఖర్చు లేకపోవడంతో తన ఎక్స్ ఖాతాలో ట్వీట్లు చేస్తూ ప్రజలు, కళాశాలల యాజమాన్యాలను మభ్యపెడుతూ వచ్చారు. ఈ తంతు నిరుడు జూన్ నుంచి మొదలైంది. ఈ ఏడాది జూన్ వెళ్లిపోయినా బకాయిలు మాత్రం విడుదల కాలేదు. గత నెలలో మంత్రిని కలిసిన కళాశాలల యాజమాన్యాలకు జూలైలో కచ్చితంగా ఫీజు బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. తొలుత జూలై 10న ఇస్తామన్నారు. ఇప్పుడు 20వ తేదీ దాటినా ఎక్కడా రూపాయి విడుదల కాలేదు. ఇదేంటని అడిగితే మరో నాలుగు రోజుల్లో నిధులు విడుదల చేస్తామని మళ్లీ చెబుతున్నారని ఇంజినీరింగ్ కళాశాలల అసోసియేషన్ వాపోతోంది. ఇక్కడ మంత్రి మాట ఇచ్చిన తర్వాత కూడా ఎటువంటి చర్యాలేకపోవడం గమనార్హం.

బనకచర్లకు మా సమ్మతి తప్పనిసరి

▶ మొదటి పేజీ తరువాయి

జలాలను తరలించడానికి చేపట్టిన ప్రాజెక్టులో రోజుకు 3 టీఎంసీల జలాల తరలింపునకు వీలుగా ఏపీ సర్కారు సదుపాయాలను సృష్టిస్తోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో పునర్విభజన చట్టం, గోదావరి ట్రిబ్యునల్ తీర్పు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిబంధనలతోపాటు ఆ ప్రాజెక్టుకు జారీ చేసిన పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతుల ప్రక్రియను చేపట్టరాదంటూ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా తాజాగా లేఖ రాశారు. 'అన్ని మిగులు జలాలు ఉమ్మడి ఏపీకి చెందుతాయని గోదావరి ట్రిబ్యునల్ తీర్పులో ఉన్న నేపథ్యంలో ఆ జలాల ఆధారంగా ప్రతిపాదించిన బనకచర్లకు ఉమ్మడి ఏపీ నుంచి వేరుపడిన తెలంగాణ సమ్మతి తప్పనిసరి. ఈ ప్రాజెక్టు తెలంగాణ హక్కులకు తీవ్ర విఘాతం కలిగించనుంది. బేసిన్‌లో చివరి రాష్ట్రం కావడంతో బనకచర్ల ప్రాజెక్టును చేపట్టే హక్కు ఉందని ఏపీ పేర్కొనడం పూర్తిగా గోదావరి ట్రిబ్యునల్ తీర్పును వక్రీకరించడమే. వరద జలాల పంపిణీ గురించి ట్రిబ్యునల్ తీర్పులో ఎలాంటి ప్రస్తావన లేదు'అని లేఖలో ఆయన పేర్కొన్నారు.

లేఖలోని ముఖ్యాంశాలు...

వరద జలాల పంపిణీకి ప్రాతిపదిక లేదు..

'బనకచర్ల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి అక్కడి నుంచి పెన్నా బేసిన్‌లోని రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు తరలించాలని ఏపీ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన 9.14 లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ, 3 లక్షల హెక్టార్ల కొత్త ఆయకట్టు గోదావరి బేసిన్ పరిధిలోకి రాదు. పూర్తిగా కృష్ణా, పెన్నా బేసిన్ల పరిధిలోకి ఆయకట్టు రానుండటం వల్ల ఈ అంశంపై పునఃపరిశీలన జరపాలి. రాష్ట్రాల మధ్య వరద జలాల పంపిణీపై గోదావరి ట్రిబ్యునల్ తీర్పులో ఎలాంటి నిబంధన లేదు. భారీ మొత్తంలో జలాలను బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ తరలించడంతో ఇప్పటికే కృష్ణా బేసిన్ తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటోంది. గోదావరి జలాలను కృష్ణా బేసిన్ మీదుగా పెన్నా బేసిన్‌కు తరలించడం పూర్తిగా కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పునకు విరుద్ధం'అని లేఖలో తెలంగాణ పేర్కొంది. విభజన చట్టంలోని సెక్షన్లు 84 (3) (2), 85 (8సీ/8డీ) ప్రకారం కొత్త ప్రాజెక్టులన్నింటికీ తొలుత సంబంధిత నదీ యాజమాన్య బోర్డు, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉండగా బనకచర్ల విషయంలో ఏపీ ఈ నిబంధనలన్నింటినీ ఉల్లంఘించి ప్రతిపాదనలను కేంద్రానికి పంపిందని వివరించింది. బనకచర్లతో పోలవరం గేట్ల నిర్వహణలో మార్పులు జరిగి బ్యాక్‌వాటర్‌తో తెలంగాణ భూభాగంలో ముంపు సమస్య మరింత తీవ్రమై దుమ్ము గూడెం బరాజ్ మునుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. బ్యాక్‌వాటర్ మరింత పెరిగితే భద్రాచలం పట్టణం, ఆలయంతోపాటు పరిసర గ్రామాలు, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ ముంపునకు గురవుతాయని పేర్కొంది.

పోలవరంపై పీపీఏకే ఆ అధికారం..

బనకచర్లలో భాగంగా పోలవరం ప్రాజెక్టు ఫోర్‌షోర్ నుంచి నీటిని తరలించనుండటంతో ఆ పనులు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) పరిధిలోకి వస్తాయని తెలంగాణ తెలిపింది. విభజన చట్టం ప్రకారం ఏర్పాటైన పీపీఏ.. పోలవరం పనులను టీఏసీ, సీడబ్ల్యూసీ అనుమతులకు కట్టుబడి నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొంది. టీఏసీ, సీడబ్ల్యూసీ అనుమతుల్లేకుండా బనకచర్ల పేరుతో పోలవరం ప్రాజెక్టు విస్తరణ పనులను పీపీఏ అనుమతించరాదని కేంద్రాన్ని తెలంగాణ కోరింది. బనకచర్లకు పర్యావరణ, ఇతర అనుమతులను కోరే అధికారం పీపీఏకే ఉందని స్పష్టం చేసింది.

ఎల్ఎల్‌సీకి 17.41 టీఎంసీలు చాలు

కృష్ణా ట్రిబ్యునల్–2 ఎదుట రెండోరోజు తెలంగాణ వాదనలు

సాక్షి, హైదరాబాద్: గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం ద్వారా తుంగభద్ర నది నుంచి నీళ్ల తరలించుకునేందుకు ఏపీని అనుమతించరాదని తెలంగాణ కోరింది. తుంగభద్ర ఎల్ఎల్‌సీ ఆయకట్టుకు తుంగభద్ర డ్యామ్‌తోపాటు ఆర్డీఎస్ కుడి కాల్వ, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని తరలిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేసింది. గురు రాఘవేంద్ర ఎత్తిపోతల ద్వారా ఏపీ అదనపు తుంగభద్ర జలాలను వాడుకుంటుండడంతో దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు వచ్చే ప్రవాహం తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 ఎదుట తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ గురువారం రెండోరోజు వాదనలు వినిపించారు.శ్రీశైలం జలాశయానికి సరిపడా వరద ప్రవాహం ఉండేలా చూడడంలో భాగంగా తుంగభద్ర డ్యామ్/తుంగభద్ర బేసిన్ నుంచి కర్ణాటక, ఏపీ రాష్ట్రాలు జరిపే నీటివాడకంపై కృష్ణా ట్రిబ్యునల్–1 పరిమితులు విధించిందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే తుంగభద్ర కుడిగట్టు దిగువ కాల్వ ద్వారా నీటి వాడకాన్ని 29.5 టీఎంసీలకు పరిమితం చేసిందని, అందులో 5.5 టీఎంసీలు ఆవిరి నష్టాలు పోగా 24 టీఎంసీలు మిగులుతాయన్నారు. ఆయకట్టు పంటలకు సాగునీటి అవసరాలను విశ్లేషిస్తే 17.41 టీఎంసీలే అవసరం అవుతాయని, మిగిలే 6.59 టీఎంసీలను తెలంగాణలోని కృష్ణా బేసిన్ పరిధిలోని ప్రాజెక్టులకు కేటాయించాలని ట్రిబ్యునల్‌కు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రానికి రెండ్రోజులు ఎల్లో అలర్ట్

- మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవొచ్చని అంచనా
- కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సగటున 2.53 సెం. మీ. వర్షపాతం నమోదైంది. మరోవైపు ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతంలో గురువారం ఉదయం ఉపరితల ఆవర్తనం విలీనమైంది. దీంతో వచ్చే రెండు రోజులపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవొచ్చని అంచనా వేసింది. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు నమోదవుతాయని తెలిపింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, జనగామ, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో గంటకు 30–40 కి.మీ. వేగంతో కూడిన ఈదురుగాలులతో భారీ వర్షాలు నమోదు కావొచ్చని వివరించింది. ఈ మేరకు రెండు రోజులపాటు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. సాధారణ ఉష్ణోగ్రతల కంటే 3–6 డిగ్రీల సెల్సియస్ మేర తక్కువగా నమోదవుతున్నాయి. గురువారం నల్లగొండలో 28.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలి: సీఎం

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం... గురువారం సీఎంఓ అధికారులతో మాట్లాడారు. భారీ వర్షాలు నమోదైన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వరద ఉధృతి ఉన్న ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం ఆదేశించారు. భారీ వర్షసూచన ఉన్న జిల్లాల్లో కలెక్టర్లు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని.. ప్రతి విభాగం అధికారితో కలెక్టర్లు నేరుగా మాట్లాడాలని చెప్పారు. భారీ వర్షాలు, వరదల వల్ల ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు అవసరమైన సహాయక చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలని.. జిల్లా అధికారులు జిల్లా కేంద్రంలోనే అందుబాటులో ఉండాలన్నారు

మున్నేటి వరదలో చిక్కుకున్న పశువుల కాపరులు

సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది


బయటకు వచ్చిన వారితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఏసీపీ రెహమాన్

చింతకాని: ఖమ్మం జిల్లా చింతకాని మండలం చిన్న మండవ వద్ద మున్నేటి వరదలో ఐదుగురు పశువుల కాపరులు చిక్కుకున్నారు. ఈ విషయం తెలియగానే డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దింపారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సహాయక చర్యలు చేపట్టగా, ఐదుగురినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గ్రామానికి చెందిన గుండ్ల సాలయ్య, మొండితోక పుల్లయ్య, గుండ్ల వెంకటేశ్వర్లు, దారెల్లి శ్రీను, కుక్కల గోపి గురువారం ఉదయం గేదెలను మేతకు తీసుకెళ్లారు. మున్నేటి మధ్యలో ఉన్న లంకలోకి వెళ్లగా సాయంత్రం 4గంటల సమయాన మున్నేటి వరద పెరిగి లంకను చుట్టుముట్టింది. దీంతో వారు కుటుంబసభ్యులకు ఫోన్‌లో చెప్పగా.. సమాచారం తెలియగానే తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎస్సై నాగుల్‌మీరా చేరుకున్నారు. అయితే, స్థానికుల సాయంతో కాపరులను బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా నీటి ఉధృతి కారణంగా సాధ్యం కాలేదు. ఇంతలోనే ఢిల్లీలో ఉన్న మల్లు భట్టివిక్రమార్క, ఖమ్మంలో ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ఇచ్చిన ఆదేశాలతో కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, వైరా ఏసీపీ రెహమాన్ ఖమ్మం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అక్కడకు పంపించారు. ఈ మేరకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రత్యేక పడవలో వెళ్లి రాత్రి 7–15 గంటలకు పశువుల కాపరులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

వర్షాకాలం వ్యాధులతో జాగ్రత్త

- అప్రమత్తంగా ఉండండి.. జిల్లాల్లో పర్యటించండి
- అధికారుల మంత్రి దామోదర ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులను హెచ్చరించారు. తక్షణమే జిల్లాలకు వెళ్లి..ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించాలని ఆదేశించారు. కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న చోట్ల మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడంతోపాటు ప్రజలకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గురువారం మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, ఇతర ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఔట్ పేషెంట్లు, ఇన్‌పేషెంట్లు పెరిగే అవకాశం ఉన్నందున, కౌంటర్లు పెంచాలని, అవసరమైతే ఓపీ టైమింగ్స్‌ను పొడిగించుకోవాలని మంత్రి ఆదేశించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఆస్పత్రులను తనిఖీ చేయాలని, వార్డులు, వాష్‌రూమ్‌లు పరిశుభ్రంగా లేకపోయినా, పేషెంట్లకు అందించే ఆహారంలో నాణ్యత లోపించినా ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంవోలు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా పెంచాలని, డెంగీ, ప్లేట్‌లెట్స్ పేరిట ప్రజలను దోచుకునే ప్రయత్నం చేస్తే, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ పనులు ఊపందుకున్న పరిస్థితుల్లో రైతులు ఎక్కువ సమయం పొలాల్లో గడుపుతారని, ఈ క్రమంలో పాము, తేలు కాటుకు గురయ్యే ప్రమాదం ఉంటుందని మంత్రి హెచ్చరించారు. అన్ని హాస్పిటళ్లలో పాము, తేలు కాటుకు అవసరమైన మెడిసిన్, ఇంజెక్షన్లు అందుబాటులోకి ఉంచుకోవాలన్నారు.

ఉస్మానియాలో డాక్టర్ అజయ్‌కుమార్ తనిఖీలు

గురువారం రాత్రి వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ ఉస్మానియా హాస్పిటల్‌లో పర్యటించారు. సూపరింటెండెంట్‌తో కలిసి వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వార్డులు, వాష్‌రూమ్‌ల పరిశుభ్రతపై మరింత శ్రద్ధ పెట్టాలని సూపరింటెండెంట్, ఆర్ఎంవోలకు సూచించారు.



జోరుగా సాగర్.. నిలకడగా శ్రీశైలం

- 576 అడుగులకు సాగర్ నీటిమట్టం
- శ్రీశైలం ప్రాజెక్టులో రెండు గేట్ల ఎత్తివేత

నాగార్జునసాగర్/దోమలపెంట: సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం సాయంత్రానికి 576 అడుగులకు (271.6270 టీఎంసీలు) చేరింది. ఈ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు), ఎగువనున్న శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా కూడా నీటిని సాగర్ జలాశయంలోకి వదులుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయానికి 1,21,400 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం నీటిమట్టం గంటగంటకూ పెరుగుతోంది. సాగర్ జలాశయం నుంచి గడిచిన 24 గంటల్లో విద్యుదుత్పాదనతో 3,030 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీకి 1,800 క్యూసెక్కులు, కుడి కాల్వకు 234 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 3,205 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రివర్స్ పంపింగ్ ద్వారా 1,377 క్యూసెక్కుల నీటిని సాగర్ జలాశయంలోకి ఎత్తిపోశారు. సాగర్ జలాశయంలోకి మరో 41 టీఎంసీల నీరు వచ్చి చేరితే.. 590 అడుగులకు చేరి నిండుకుండలా మారనుంది. కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో వర్షాలకు ఎగువ నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతోందని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. కాగా, శ్రీశైలం ఆనకట్ట వద్ద గురువారం రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆనకట్ట స్పిల్‌వే నుంచి 54,406 క్యూసెక్కులు, భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,328 క్యూసెక్కులు.. మొత్తం 66,648 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. ఎగువనున్న జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 20,530 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 37,465, సుంకేసుల నుంచి 43,790 క్యూసెక్కులు.. మొత్తం 1,01,785 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వస్తోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.1 అడుగుల వద్ద 205.2258 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్ (సీఎంఎస్టీఈఐ) లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా, ఓపెన్ మెరిట్ ద్వారా జరిగిందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'పెద్ద సార్లే పారిశ్రామికవేత్తలు'శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు ఆయన వివరణ ఇచ్చారు. అర్హుల ఎంపిక ప్రక్రియ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్ నిర్వహించిన ఓపెన్ మెరిట్ ఆధారిత స్క్రీనింగ్ టెస్ట్, బిజినెస్ అప్టిట్యూడ్ టెస్ట్, అలాగే వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా జరిగిందని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక, యూనిట్ల మంజూరుకు కఠినమైన విధానం అమలులో ఉందని వివరించారు. పథకం మార్గదర్శకాల ప్రకారం.. లబ్ధిదారుల ఎంపికకు ఎటువంటి ఆదాయ పరిమితి లేదని స్పష్టం చేశారు.

మురిసిన బొగత

ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి గ్రామ సమీపంలోని బొగత జలపాతం ఎగసిపడుతూ కనువిందు చేస్తోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలపాతం గురువారం నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా, భద్రతా కారణాల రీత్యా అటవీశాఖ అధికారులు పర్యాటకులను జలపాతం వద్దకు అనుమతించడం లేదు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ



అందాల 'గుండాల'!

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు తిర్యాణి మండలం గుండాల గ్రామ పంచాయతీ పరిధిలోని గుండాల జలపాతం కనువిందు చేస్తోంది. దాదాపు 100 అడుగుల పైనుంచి నీరు జాలువారుతూ ఆకట్టుకుంటోంది. ఈ జలపాతాన్ని బాహుబలి జలపాతంగా కూడా పిలుస్తుంటారు.

– తిర్యాణి



ఇంటికి ఐశ్వర్యాన్ని, పండగ కళనూ తీసుకువచ్చే మాసంగా శ్రావణానికి పేరు. పూజలు, వివాహ వేడుకలతో ఎప్పుడూ సందడిగా ఉండే ఈ రోజుల్లో వాతావరణం మబ్బు, తుంపరలతో డల్‌గా కనిపిస్తుంది. ఇలాంటి సమయాలలో బ్రైట్‌గా వెలిగిపోవాలంటే పట్టు ఎంపిక ఎప్పుడూ పర్‌ఫెక్ట్ ఛాయిస్ అవుతుంది. పట్టు చీరలు అన్నివేళలా ఒకే తరహా కట్టు అంటే బోర్‌గా ఫీలయ్యే నవతరానికి మోడర్న్ స్టైల్‌లో కట్టు, కుట్టు డిజైన్స్ చాలానే వచ్చాయి. ఈ మాసంలో మెరుపును, ఉత్సాహాన్ని ఇచ్చే పట్టు ఇండోవెస్ట్రన్స్ స్టైల్స్ ఇవి...

● ఇంద్రధనస్సు

ఫ్యాషన్

పట్టు.. మెరిసేటట్టు...







డ్యుయెల్ టోన్...
పండగలు అనగానే మనలో చాలామంది ఎరుపు, పసుపు, పచ్చ రంగుల గురించి ఆలోచన చేస్తారు. ఈ యేడాది ట్రెండ్‌లో ఉన్న రంగులు.. పీకాక్ బ్లూ, గోల్డ్ పట్టు చీరలు లేదా డ్రెస్సులు ఈవెనింగ్ పార్టీలకు ఎంచుకోవాలి. బాటిల్ గ్రీన్- మెరూన్ కలిసిన సంప్రదాయ రంగులు పండగల సమయాల్లో, లావెండర్ - సిల్వర్, మెహందీ రంగులు పూజలకు, మస్టర్డ్- నేవీ బ్లూ రంగులు ఇండోర్ ఈవెంట్‌లకు బ్రైట్ లుక్‌నిస్తాయి. దీంతోపాటు రెండు రంగుల కాంబినేషన్‌లో వచ్చే డ్యుయెల్ టోన్ పట్టుచీరలు వేడుకలకు మంచి లుక్‌ను తీసుకు వస్తాయి. ఉదాహరణకు బ్లూ- పింక్, గోల్డ్- మెరూన్ .. కలయికలతో ఉన్నవి. పట్టు చీరలు లైట్‌వెయిట్‌లోనూ లభిస్తున్నాయి. పెద్ద జరీ అంచు చీరలు ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. మన చేనేతలైన గద్వాల, పోచంపల్లి, నారాయణపేట, పీతాంబరం, బనారసి.. పట్టు చీరలు ఈ మాసానికి నిండుతనాన్ని తీసుకువస్తాయి.

పట్టు లాంగ్ జాకెట్స్/ కేప్స్...
ప్లెయిన్ మ్యాక్సీ డ్రెస్ వేసుకుంటే బనారసీ లాంగ్ జాకెట్ బ్రైట్‌గా, ట్రెడిషనల్‌గా కనిపిస్తుంది. లాంగ్ గౌన్‌పైకి జాకెట్ లేదా కేప్ లేయర్డ్‌గా ఉండి స్టైలిష్ ఎంపిక అవుతుంది.

మోడర్న్ పట్టు బ్లౌజ్‌లు...
పట్టు చీరలు/ స్కర్ట్స్‌కి ఆఫ్-షోల్డర్ బ్లౌజ్ ధరిస్తే స్టైలిష్‌గా కనిపిస్తారు. పట్టుచీర పూర్తి సంప్రదాయ విధానం అని ఆలోచించే యువతరానికి పెప్లమ్ స్టైల్ బ్లౌజ్ లేదా బెల్ట్‌తో కూడిన చీర కట్టు మంచి లుక్‌తో నప్పుతుంది. బ్యాక్-ఓపెన్ లెహంగా స్టైల్ చీర కట్టుకు హాల్టర్ నెక్ బ్లౌజ్, ప్లెయిన్ సిల్క్ స్కర్ట్‌కి కాలర్ నెక్ ఉన్న షర్ట్ స్టైల్ బ్లౌజ్‌తో ఆధునికతను జోడించవచ్చు.

- ఎన్నార్



ఇండో -వెస్ట్రన్ పట్టు
పట్టు క్రాప్ టాప్‌కి లెహంగా లేదా స్కర్ట్ ధరించవచ్చు. వీటిలో బనారసి లేదా ఉప్పాడ క్రాప్ టాప్ (స్లీవ్‌లెస్/బోట్ నెక్/హై నెక్)తో ఉన్నవి ఎంచుకోవచ్చు. వీటికి లేయర్డ్ కాంట్రాస్ట్ జరీ లెహంగా మంచి కాంబినేషన్ అవుతుంది. జరీ బోర్డర్‌ని నెట్ లేదా జార్జెట్ ఫ్యాబ్రిక్‌కి జత చేసి దుపట్టాను డిజైన్ చేసుకోవచ్చు. సంప్రదాయ పూజలు, రాఖీ వంటి పండగలు, ఎంగేజ్‌మెంట్ వంటి వేడుకలకు ఇది మంచి ఎంపిక అవుతుంది.

పట్టు లాంగ్ గౌనులు
కాంచిపట్టు లేదా మైసూర్ సిల్క్ చీరలతో డిజైన్ చేసిన లాంగ్ గౌనులు ఈ మాసంలో ప్రత్యేకంగా ధరించవచ్చు. అమ్మాయిలకు ఇవి సరైన ఛాయిస్ అవుతాయి. శరీరాకృతికి తగినట్టు, ఫ్లేయర్డ్ స్కర్ట్‌ని అలాగే ధరించవచ్చు. కొన్నిసార్లు దుపట్టాతో కూడా మ్యాచ్ చేయవచ్చు. ఎంగేజ్‌మెంట్, రిసెప్షన్, వివాహ ఊరేగింపు.. సమయాలలో వీటి ఎంపిక ఈ సీజన్‌లో ప్రత్యేకంగా ఉంటుంది.

విభిన్న మోడల్స్ కట్టు
డిజైనర్ బ్లౌజ్ ధరించే సాధారణ పట్టు చీరను ఎంచుకుంటే దానికి నడుము వద్ద ఎంబ్రాయిడరీ చేసిన ఫ్యాబ్రిక్ బెల్ట్ ధరించవచ్చు. వడ్డాణానికి మరొక శైలి. ఈ స్టైల్ యంగ్ లుక్‌ని తీసుకువస్తుంది. దీనికి టెంపుల్ జ్యువెలరీ, చోకర్లు ఉపయోగించవచ్చు.

పట్టు ధోతీ ప్యాంటు- షార్ట్ కుర్తీ
అమ్మాయిలు ట్రెండీ లుక్ కోసం ఇటీవల ధోతీ ప్యాంట్ , షార్ట్ కుర్తీని ఎంచుకుంటున్నారు. వీటిని పట్టుతో డిజైన్ చేస్తే ఈ కాలం స్టైలిష్‌గానూ, సంప్రదాయ లుక్‌తో బ్రైట్‌గా మెరిసిపోతారు. ధోతీ ప్యాంట్ కోసం నారాయణపేట, గద్వాల్ సిల్క్‌లను ఎంచుకోవచ్చు. ఎంబ్రాయిడరీ/మిర్రర్ వర్క్ చేసిన షార్ట్ కుర్తీలు ధోతీ ప్యాంటుకు మంచి కాంబినేషన్ అవుతుంది. వీటికి కొల్హాపురి లేదా జుట్టీలు పాదరక్షలుగా ఎంచుకోవాలి.



● ఇంట్రెస్టింగ్

నాన్నే... ఎలాగోలా ఇల్లు చేరుకుంటాడు



పనయ్యాక నాన్న ఇల్లు చేరుకుంటాడు.
ఆ రోజంతటినీ ముగించి, ఆ రోజును అంతటితో చాలించి.
ఉదయం వెళ్లేప్పుడు బయటకు చెప్పని హామీ ఇచ్చి వెళతాడు- సాయంత్రానికి ఇల్లు చేరుకుంటానని.
మరి ఏం జరిగినా సరే... తుఫాను గొంతు చించుకున్నా సరే... భూమి నిట్ట నిలువునా చీలినా సరే... నాన్న... ఇల్లు చేరుకుంటాడు.
చీకటి పడిపోతుంది... రాత్రి ఎనిమిదైపోతుంది... తొమ్మిదీ పదీ కూడా కావచ్చు... గ్రీజు మరకలు, ఆయిల్ వాసనా, గడ్డినూగు నస, చాక్‌పీస్‌పొడి రాలిన తల, గుండెన గుచ్చుకు వేళ్లాడుతున్న చీవాట్లు, ఆవేళ్టికి సరిపడా అవమానాలు, ఓవర్ డ్యూటీ ముఖము, కూచుని కూచుని పడిపోయిన నడుము... సరి చేసుకుని, సవరించుకుని... నాన్న... ఇల్లు చేరుకుంటాడు.
కొన్ని ద్రాక్షపళ్లు తెద్దామనుకుంటాడు. కాసింత మిఠాయి తీసుకెళ్లకుంటే ఎలా అనుకుంటాడు. అరటిపండ్లకూ ఇంటి సభ్యులకైతే జత సరిగ్గా కుదురుతుంది. మరునాడు పిల్లలు పెన్సిల్ కొనేందుకు చేయిపెడితే చిల్లర వరకైనా తగిలేలా జేబును భద్రం చేసుకుంటేగాని కదలడు. ఖాళీ జేబును భార్య అర్థం చేసుకుంటుంది. పిల్లలకు నాన్న జేబు ఎప్పుడూ హుండీయే.
నాన్న ఇల్లు చేరుకుంటాడు. దారిలో స్కూటర్ కుర్రాడు టక్కర్ ఇస్తే పడి, లేచి, ఎవరో ఇచ్చిన నీరు తాగి, మరేం పర్లేదని- నేరుగా ఇల్లు చేరుకుంటాడు. ఆ సంగతి ఎప్పటికీ ఇంట్లో చెప్పడు. పాత బాకీవాడు కూసిన నానా కూతలూ చెప్పడు. దగ్గరి బంధువొకరు గతిలేక గోజాడితే ఆ కాసింత సర్దుబాటు చేయలేనందుకు మనసున మూగెండ పట్టిందని ఎవరితోనైనా చెప్పగలడా ఏమి?
పని ఉంటేనే నాన్న సెలవు పెడతాడు. పని లేకున్నా పెట్టొచ్చని అంటే భయపడిపోతాడు.
నాన్న ఇంటికి యజమానో... పాలేరో. నాన్నను ఆ రోజంతా నాన్న మనుషులు ఏమేమి అన్నారో ఎన్నెన్ని అనుకున్నారో... నాన్నకు చుట్టూ ఉన్న జనం ఏమేమి పేర్లు పెట్టారో... ఎన్నెన్ని బిరుదులిచ్చారో... మంచివారి మంచి వల్ల బతుకుతున్నాడో... చెడ్డవారి చెడ్డను ఎదుర్కొనేందుకు ఊపిరి తిరగేస్తున్నాడో...
ఇంటికొచ్చి నాలుగు మెతుకులు తిని నడుం వాల్చిన నాన్నను చూస్తే ఉదయం లేవడానికి పడుకున్నట్టు సాయంత్రం ఇల్లు చేరడానికి పడుకోనివ్వండన్నట్టు ఉంటాడు.
నాన్న యుగాలుగా ఇల్లు చేరుకుంటున్నాడు. యుగాల పాటు ఇలాగే ఇల్లు చేరుకుంటాడు.
ఆ రోజుకి కాసింత నవ్వాడో లేదో- ఇంటికొచ్చాక నవ్వేలా ఉంచగలమో లేదో- మొత్తానికి నాన్న ఇల్లైతే చేరుకున్నాడు.

- ఖదీర్

(ఫొటో: జూలై 23న ఢిల్లీలో కుంభవృష్టికి రోడ్డు దాటుతున్న ఒక నాన్న)

● మహిళాశక్తి

షీ టీమ్ బుల్లెట్స్

పనిప్రదేశాల్లో అంటే ఆఫీసులు మొదలు అసంఘటిత రంగాల వరకు ఎక్కడైనా ఎంత ఎక్కువ మంది మహిళలుంటే జెండర్ సెన్సిటివిటీకి అంత ఎక్కువ అవకాశం ఉంటుందని చెబుతుంటారు సామాజిక కార్యకర్తలు. ఆ ప్రయత్నం పట్టాలెక్కిందని పిస్తోంది వడోదర ఎల్ అండ్ టీ ఫ్యాక్టరీలోని ఆల్ విమెన్ ఇంజినీర్స్ టీమ్‌ను చూస్తుంటే! ఆ మహిళా జట్టు మన తొలి బులెట్‌ట్రైన్ (MAHSR... ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్) ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యమవుతూ కొత్త చరిత్రకు ట్రాక్ వేస్తోంది. నిర్మాణం నుంచి నిర్వహణ దాకా సరికొత్త బెంచ్ మార్క్‌ను సృష్టిస్తున్నారు. ఆ టీమ్‌లో తెలుగు అమ్మాయి ఉండటం తెలుగురాష్ట్రాలకు గర్వకారణం.



హైదరాబాద్‌కు చెందిన రంగు స్రవంతి, తమిళనాడు, కోయంబత్తూర్‌కు చెందిన ఆదిత్య ఆర్, కేరళ, కొత్తమంగళానికి చెందిన సుమయ్యా, అదే రాష్ట్రం పాలక్కాడ్‌కు చెందిన ఫిదా రషీద్‌లతో కూడిన ఓ పదిమంది అమ్మాయిల టీమ్ ఎమ్మేహెచ్చెస్సార్ ప్రాజెక్ట్‌లో ప్లానింగ్ నుంచి క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్, డిస్పాచ్ వరకు అన్ని శాఖల్లో కీలకమైన విధుల్లో ఉన్నారు. ఈ సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్ అందరూ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సెలెక్ట్ అయినవారే! ట్రైనీలుగా చేరి ఇప్పుడు సీనియర్ ఇంజినీర్స్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి నిర్మాణరంగంలో 20 శాతం కూడా మహిళలులేని చోట వీరు నెలకు తొమ్మిదివేల ప్రీకాస్ట్ నాయిస్ బారియర్స్ (శబ్ద కాలుష్యాన్ని తగ్గించే పానల్స్)ను తయారుచేస్తూ పురుషులకు దీటుగా తమ శక్తిని చాటుకుంటున్నారు.

2023లో...
ఈ యువ ఇంజినీర్ల హైస్పీడ్ రైల్ జర్నీ 2023లో మొదలైంది. వాళ్లలో ఏ ఒక్కరూ అనుకోలేదట తామీ ప్రాజెక్ట్‌లో భాగమవుతామని. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నప్పుడు ఇలా రికార్డ్ క్రియేట్ చేసే కొలువుల్లో చేరుతామన్న ఊహ కూడా లేదు ఎవరికీ! ఎల్ అండ్ టీకి సంబంధించిన ఈ ప్రాజెక్ట్‌లో తమకు ప్లేస్‌మెంట్ ఖాయమయిందని తెలియగానే అందరూ చాలా ఉత్సాహపడ్డారు. అదే ఉత్సాహంతో శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగాల్లో చేరారు. తొలిరోజు సైట్‌లోకి అడుగుపెట్టగానే ఆ వాతావరణం చాలా ఇబ్బందిగా అనిపించింది. పనీ అంతే కష్టంగా తోచింది. పురుష ఉద్యోగుల నుంచి ఏమాత్రం సహకారం అందకపోగా 'ఏంటీ.. ఈ ఫీల్డ్‌లో కూడా ప్రతాపం చూపించుకోవాలనే..!' అన్నట్టుగా ఉండేవట వాళ్ల చూపులు, మాటలు. అయినా నిరుత్సాహపడలేదు.. నేర్చుకోవాలనే తపనను వీడలేదు. పట్టుదలతో పని నేర్చుకున్నారు. హేళన చేసిన పురుష ఉద్యోగులు ఆశ్చర్యపోయారు. గౌరవించడం మొదలుపెట్టారు. పని నేర్చుకోవడంలో సాయపడ్డారు. 'అప్పటిదాకా ఆడవాళ్లు ఇలా సైట్‌లోకొచ్చి పనిచేయడం వాళ్లు చూడలేదు. అందుకే మేము రావడాన్ని జీర్ణించుకోలేకపోయారు. కానీ పని పట్ల మాకున్న కమిట్‌మెంట్ చూసి మమ్మల్ని గౌరవించడం మొదలుపెట్టారు. దాంతో ఆఫీసులో పని చేసే వాతావరణమే మారిపోయింది' అని చెబుతుంది డిస్పాచ్ ఇన్‌చార్జ్ ఫిదా రషీదా. 'మొదటి అవకాశమే ఇందులో రావడం.. ఆల్ విమెన్ టీమ్‌లో భాగమవడం.. నిజంగా ప్రౌడ్ మూమెంట్స్' అంటుంది క్వాలిటీ ఇన్‌చార్జ్ సుమయ్యా. 'అత్యాధునిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణంలో నేను పాలు పంచుకుంటున్నందుకు చాలా గర్వంగా ఉంది' అని చెబుతుంది ప్రొడక్షన్ ఇన్‌చార్జ్ రంగు స్రవంతి. 'నిర్మాణ రంగంలోకి మరింతమంది అమ్మాయిలు రావాలి. అప్పుడే ఇందులోనూ మహిళా భాగస్వామ్యం పెరిగి కీలక బాధ్యతల్లోకి వెళ్లే అవకాశం దొరుకుతుంది' అంటుంది ప్లానింగ్ ఇన్‌చార్జ్ అదితి. వీళ్లంతా కష్టపడుతున్న ఈ హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్‌లో ముంబై నుంచి అహ్మదాబాద్‌కు కేవలం మూడుగంటల్లో చేరుకోవచ్చు.

● బ్యూటిప్

నేచురల్ హెయిర్ జెల్



జుట్టు పెరగడానికి రకరకాల ప్రయత్నాలు చేసి విఫలమైన వారు ఎందరో ఉన్నారు. అయితే ఇప్పుడు చెప్పే చిట్కా మాత్రం పని చేసే అవకాశాలు అధికం. ఎందుకంటే... ఈ చిట్కా కోసం వాడే పదార్థాలు పోషకాలతో నిండినవి. అవేంటంటే చియా గింజలు, గంజి. ఈ చిట్కా పాటించాలంటే ముందుగా అర కప్పు బియ్యం నానబెట్టిన నీళ్లు లేదా లేదా గంజిలో ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్స్ చియా సీడ్స్, రెండు కప్పుల నీళ్లు తీసుకుని బాగా మరగబెట్టాలి. దాదాపుగా ఇవి జెల్‌లా మారిపోతాయి. అప్పుడు దించి, చల్లారిన తర్వాత రోజ్ మేరీ లేదా లావెండర్ ఆయిల్ కలిపి, వడపోయాలి. ఈ లిక్విడ్‌ని ఓ గ్లాస్ జార్ లేదా బాటిల్ లోకి పోసుకుని కనీసం వారం రోజుల పాటు ఫ్రిజ్ లో నిల్వ చేయాలి. ఆ తరవాత దీనిని తీసుకుని ఎక్కుడైతే జుట్టు పలచబడిందో అక్కడ కాస్త ఎక్కువగా అప్లై చేసి మాడంతా మృదువుగా మసాజ్ చేయాలి. దీనివల్ల రక్త సరఫరా మెరుగవుతుంది. కనీసం అరగంట పాటు అలాగే ఉంచాలి. ఆ తరవాత గోరు వెచ్చని నీటితో జుట్టుని శుభ్రం చేసుకోవాలి. వారానికి కనీసం రెండు మూడుసార్లు ఇలా చేస్తే జుట్టు రాలే సమస్య తగ్గడంతో పాటు బట్టతలపై కూడా వెంట్రుకలు వచ్చే అవకాశాలుంటాయి.

● పర్యావరణ హిత

సముద్ర గర్భంలో...

పర్యావరణానికి హాని కలిగించే విధంగా అంతకంతకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను దృష్టిలో పెట్టుకొని అండమాన్ నికోబార్‌లోని నార్త్ బే దీవిలో 24 మంది స్కూబాడైవర్‌లు 'మెరైన్ క్లీనప్ డ్రైవ్' నిర్వహించారు. వీరిలో పదిమంది మహిళలు ఉన్నారు. 'ఉమెన్స్ డైవ్ డే 2025' బ్యానర్‌పై పర్యాటక శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.



'మహిళల కోసం ప్రత్యేకమైన డైవింగ్ కార్యక్రమాలు చేపట్టాం. నార్త్ బే, స్వరాజ్ ద్వీప్, షాహీద్ ద్వీప్‌లలో డైవర్ టీమ్‌లు అండర్‌వాటర్ క్లీనప్ మిషన్‌లో భాగమై పర్యావరణ సంరక్షణపై తమ నిబద్ధతను చాటుకున్నాయి' అని వివరించారు టూరిజం సెక్రెటరీ జ్యోతి కుమారి. ఈ డైవ్‌లో పాల్గొన్నవారిలో ఇండియన్ రిజర్వ్ బెటాలియన్ కమాండెంట్ నిహారిక భట్ ఒకరు.
'గత సంవత్సరం ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆఫ్ డైవింగ్ ఇన్‌స్ట్రక్టర్స్‌కు సంబంధించి బేసిక్, అడ్వాన్స్ డైవింగ్ కోర్సులు పూర్తి చేశాను. అండమాన్ నికోబార్ దీవులలో ప్రపంచంలోనే అత్యున్నతమైన డైవింగ్ డెస్టినేషన్‌లు ఉన్నాయి. డైవింగ్ అనేది ఉల్లాస పరిచే నీటి ఆట మాత్రమే కాదు సముద్ర పరిరక్షణపై అవగాహన కలిగిస్తుంది' అంటుంది నిహారిక భట్.

● సోషల్ మీడియా

నిశ్శబ్ద యోధుడి మౌన సందేశం





'ఈ వయసులో రిస్క్ ఎందుకు' అనుకునే రకం కాదు ఇంద్రజిత్ సింగ్. చండీగఢ్‌కు చెందిన 88 సంవత్సరాల మాజీ ఐపీఎస్ అధికారి ఇంద్రజిత్ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తాడు.
ఎక్కడ చెత్త కనిపించినా తానే స్వయంగా రంగంలోకి దిగి శుభ్రం చేస్తాడు.
సింగ్ తాతయ్య వీధిలో చెత్తను శుభ్రపరుస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.
ప్రతిరోజు ఉదయం ఆరుగంటలకు వీధుల్లోకి వచ్చే సింగ్ ఎక్కడ చెత్త కనిపించినా శుభ్రం చేస్తాడు.
ఈ వీడియో క్లిప్‌ను చూసిన పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్ర ఇంద్రజిత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు.
'స్వచ్ఛ్ సర్వేక్షన్' జాబితాలో చండీగఢ్ అథమ స్థాయిలో ఉండడం ఇంద్రజిత్‌కు అసంతృప్తి కలిగించింది. ఎవరినో నిందించడం అని కాకుండా, ఎవరి మీదో ఆధారపడకుండా తానే పరిసరాల శుభ్రత పనుల్లో భాగం అవుతున్నాడు.
'ఆయన చేస్తున్న పని కేవలం పని మాత్రమే కాదు. సమాజానికి ఇచ్చే సందేశం. ఆయన నిశ్శబ్ద యోధుడు' అని ఇంద్రజిత్ సింగ్‌ను కొనియాడారు ఆనంద్ మహీంద్ర.

● సమ్‌థింగ్ స్పెషల్

ఆహా... లిక్విడ్ లడ్డు!





ఎవరి టేస్ట్ వారికి ఆనందం. అలాంటి ఆనందమే ప్రయోగాలకు వేదికై కొత్త ఆవిష్కరణకు దారి తీస్తుంది. ఒక యువకుడు తయారు చేసిన 'లిక్విడ్ లడ్డు' వీడియో నెట్‌లోకంలో చక్కర్లు కొడుతూ నోరూరిస్తోంది.
'లొట్టలు వేయనక్కర్లేదు. మీరు కూడా ఎంచక్కా ఇలా తయారు చేసుకోవచ్చు' అని వీడియోలో కళ్లకు కట్టినట్లు చూపించాడు లిక్విడ్ లడ్డు సృష్టికర్త. ఈ లిక్విడ్ లడ్డు వీడియోకు లక్షలాది వ్యూస్ వచ్చాయి,
'ఎవరూ పుట్టించకపోతే మాటలెలా పుడతాయి!' అనే డైలాగు మనకు తెలిసిందే కదా. ఎవరూ చేయనిది కొత్త వంటలెలా పుడతాయి! అందుకే....ఈ లిక్విడ్ లడ్డు సృష్టికర్తకు 'వెరీ గుడ్' అని ప్రశంసలు వచ్చాయి.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
జూలై 24న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,00,500	1,02,380	1,00,970	1,02,380	98,900	1,00,960
బంగారం (22 క్యారెట్లు)	93,460	92,500	92,550	95,330	90,990	92,550
వెండి	1,26,000	1,18,000	1,28,000	1,18,000	1,17,000	1,28,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

యువర్స్



● స్ఫూర్తి



గురి తప్పని లక్ష్యం

చిన్న వయసులోనే ఆర్చరీలో జాతీయ స్థాయిలో రాణించింది ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేటకు చెందిన హారతి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విలువిద్యలో శిక్షణ ఇచ్చి వారిని జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చెన్నైలో చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి గ్రామీణ బాట పట్టింది....

సూళ్లూరుపేటలో పుట్టి పెరిగిన హారతికి చిన్నప్పటి నుంచి ఆర్చరీ అంటే ఇష్టం. జాతీయ స్థాయి విలువిద్య క్రీడాకారుడు అయిన సమీప బంధువు కమలాకర్ తనకు స్ఫూర్తి. పదో తరగతి చదివేలోపే రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీల్లో మూడు స్వర్ణ పతకాలు, రెండు రజత, నాలుగు కాంస్య పతకాలను గెలుచుకుంది. 2007 నుంచి 2017 మధ్య జరిగిన జాతీయస్థాయిలో పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచింది.

కుప్పంలో బీటెక్ పూర్తి చేసిన హారతి చెన్నైలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసేది. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీ కార్యదర్శి ఉద్యోగానికి ఎంపికైంది. ప్రస్తుతం సూళ్లూరుపేట మండలం ఆబాక సచివాలయంలో పని చేస్తోంది. చెన్నై లాంటి పెద్ద పట్టణాన్ని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి గ్రామీణ ప్రాంతంలో పని చేయాలనుకోవడానికి కారణం...ఆర్చరీ మీద ఉన్న అభిమానం. గ్రామీణ ప్రాంతంలో ఎంతోమంది పిల్లలను విలువిద్యలో తీర్చిదిద్దాలనేది హారతి ఆశయం. సూళ్లూరుపేట పట్టణంతో పాటు, పరిసర ప్రాంతాలకు చెందిన పిల్లలకు ఉదయం, సాయంత్రం వేళల్లో విలువిద్యలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. హారతి శ్రమ వృథా పోలేదు. ఆమె దగ్గర శిక్షణ పొందిన వారిలో పదకొండు మంది జాతీయ స్థాయి, పన్నెండు మంది రాష్ట్రస్థాయిలో పోటీలకు ఎంపికై విజయం సాధించారు.

హారతి కృషిని గుర్తించిన జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాధికారులు ఆమెను కోచ్‌గా ఎంపిక చేశారు. ఆతరువాత జాతీయస్థాయి కోచ్‌గా నియమితురాలై ఎంతోమంది విద్యార్థులకు విలువిద్యలో శిక్షణ ఇస్తోంది.

– ఎం.రమణయ్య, సాక్షి, సూళ్లూరుపేట



అదే నా కల

తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే ఎన్ని విజయాలైన సాధించవచ్చు. ఆర్చరీపై నా ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు నన్ను ప్రోత్సహించారు. దీంతో నేను మరింత ఉత్సాహంతో సాధన చేసేదాన్ని. ఎన్నో పతకాలు గెలుచుకోవడానికి ఆ సాధన ఉపయోగపడింది. ఆర్చరీపై ఆసక్తి ఉన్న విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే వారు ఎన్నో విజయాలు సాధిస్తారు. నా దగ్గర విలువిద్యలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు గెలుచుకోవాలనేది నా కల.

– హారతి

● ఇన్నోవేషన్



పా రా స్పీ క్



‘ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా ఒకరోజు పారాలిసిస్ కేర్ సెంటర్‌కు వెళ్లాను. అక్కడ రోగులు తమ సంరక్షకులు, చుట్టు ఉన్నవారితో మాట్లాడడానికి ఇబ్బంది పడడం, వారు చెబుతున్నది వినే వారికి అర్థం కాకపోవడం చూశాను. ఆ సమయంలోనే నాకు ఒక ఆలోచన వచ్చింది. వారు ఏమి చెప్పాలనుకుంటున్నారో అర్థం చేసుకోగల పరికరం ఉంటే ఎలా ఉంటుంది అని ఆలోచించాను’ అని గతాన్ని గుర్తు తెచ్చుకున్నాడు రఘునందన్ ప్రణీత్ ఖేతాన్.

అనుకోగానే సరిపోదు కదా! తన ఆలోచనలకు పదును పెట్టాడు. చివరికి ఒక పరిష్కారం దొరికింది. తన కల నెరవేరింది.

రోగులు చెప్పే మాటలు ఇతరులు సులభంగా అర్థం చేసుకోగల ‘పారాస్పీక్’ అనే పరికరాన్ని తయారుచేశాడు. మాట్లాడే లోపం ఉన్న డిసార్థ్రియ బాధితులకు ఈ పరికరం బాగా ఉపయోగపడుతుంది.

‘డిసార్థ్రియ అనేది స్పీచ్ డిజార్డర్. ఇంగ్లీష్ మాట్లాడే డిసార్థ్రియ రోగులకు సంబంధించి అధ్యయనం జరిగింది. అయితే హిందీ మాట్లాడే డిసార్థ్రియ రోగులకు సంబంధించి అధ్యయనం జరగలేదు. నేను హిందీని ఎంచుకోవడానికి కారణం మన దేశంలో నలభై శాతానికి పైగా ఈ భాషను మాట్లాడడం’ అంటున్న ప్రణీత్ తన పరిశోధనలో భాగంగా ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, కేర్ సెంటర్‌లకు వెళ్లాడు. ఆ తరువాత 28 రోగుల నుండి 42 నిమిషాలు ఉన్న హిందీ డిసార్థ్రియ స్పీచ్‌కు సంబంధించి మొదటి డేటాసెట్ రూపొందించాడు. ఆగ్‌మెంటేషన్ టెక్నిక్స్‌తో 20 గంటలకు విస్తరించాడు.

● టెక్ టాక్

శాంసంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 7



డిస్‌ప్లే : 8.00 అంగుళాలు
రిఫ్రెష్ రేట్ : 120 హెచ్‌జడ్
రిజల్యూషన్ : 1968x2184 పిక్సెల్స్
మెమోరీ : 256 జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా : 10
బ్యాటరీ:4400 ఎంఏహెచ్

మెటా వారి ఇమాజిన్ మీ



‘ఇమాజిన్ మీ’ అనే సరికొత్త ఏఐ–పవర్డ్ ఫీచర్‌ని తీసుకువచ్చింది మెటా ఏఐ. ఈ ఫీచర్‌తో టెక్స్ట్ ప్రాంప్ట్ ఉపయోగించి యూజర్‌లు తమ ఏఐ ఇమేజ్‌లను జనరేట్ చేయవచ్చు.

‘ఇమాజిన్ మీ’ ఫీచర్‌ని వాట్సప్, ఫేస్‌బుక్ మెసెంజర్, ఇన్‌స్టాగ్రామ్ చాట్‌విండోస్‌లో ఉపయోగించవచ్చు.

అక్యురేట్, కస్టమైజ్డ్ ఫోటోగ్రాఫ్స్ కోసం ‘ఇమాజిన్ మీ’ యూజర్‌లకు సంబంధించి ఫ్రంట్, లెఫ్ట్, రైట్ ఫేస్‌ల సెల్ఫీలను అడుగుతుంది.

‘ఇమాజిన్ మీ యాజ్ ఏ నైంటీస్ గ్యాంగ్‌స్టర్’ ‘ఇమాజిన్ మీ యాజ్ ఏ కౌబాయ్’లాంటి ప్రాంప్ట్స్‌ను యూజర్‌లు ఇవ్వవచ్చు.

ప్రాంప్ట్ సెట్టింగ్స్‌తో అదనపు మార్పులు కూడా చేయవచ్చు.

ఉదా: ఇమాజిన్ మీ యాజ్ ఏ కౌబాయ్, బట్ ఆన్ ది మూన్, వీయరింగ్ ఫ్యూచరిస్టిక్ క్లాత్స్

ఇమాజిన్ యాజ్ ఏ నైంటీస్ గ్యాంగ్‌స్టర్ సిప్పింగ్ కాఫీ ఎట్ యాన్ ఇండియన్ బీచ్

తమ ఏఐ–జనరేటెడ్ ఇమేజ్‌లు సంతృప్తికరంగా లేకపోతే ఎడిట్, రీజెనరేట్, రిమూవ్ ఇమేజెస్‌లాంటి ఆప్షన్‌లను యూజర్‌లు ఉపయోగించుకోవచ్చు.

బిట్‌చాట్... నెట్ అవసరం లేదు!



ట్విట్టర్ కో–ఫౌండర్ జాక్ డోర్సె ‘బిట్‌చాట్’ అనే కొత్త మెసేజింగ్ యాప్‌ను లాంచ్ చేశాడు. వాట్సాప్, టెలిగ్రామ్ లాగా దీనికి ఇంటర్‌నెట్ కనెక్టివిటీ అవసరం లేదు. మెసేజ్‌ను రిసీవ్ చేసుకోవడానికి, సెండ్ చేయడానికి బ్లూటూత్‌ను ఉపయోగిస్తుంది బిట్‌చాట్. ప్రస్తుతం ఇది యాపిల్ యూజర్‌లకు అందుబాటులో ఉంది. ఈ యాప్ ప్రస్తుతం పరిశీలన దశలో ఉన్నట్లు చెబుతున్నాడు డోర్సె. క్రౌడెడ్ ఏరియాలలో, ఇంటర్‌నెట్ యాక్సెస్‌ను బ్లాక్ చేసిన చోట బిట్‌చాట్ బాగా ఉపయోగపడుతుంది.

గో డౌన్ ఏ ట్రీట్

ఫుడ్, డ్రింక్‌కు సంబంధించి ‘చాలా బాగుంది’ అనుకునే సమయంలో వాడే మాట....గో డౌన్ ఏ ట్రీట్. ఒక పని బాగా జరిగింది, సక్సెస్ అయింది అని చెప్పే సందర్భంలో కూడా ఈ ఇడియమ్ వాడుతారు.

ఉదా: ది న్యూ రెస్టారెంట్స్ ఫుడ్ ఈజ్ రియల్లీ పాపులర్, ఇట్ సీమ్స్ టు బీ గోయింగ్ డౌన్ ఏ ట్రీట్ విత్ ది లోకల్స్.

నో ది రోప్స్

ఒక పని ఎలా చేయాలి అనే విషయం తెలిసి ఉండడానికి సంబంధించి వాడే మాట...నో ది రోప్స్.

ఉదా: వీ నీడ్ సమ్‌వన్ టు టీచ్ ది న్యూ స్టాఫ్. సమ్‌వన్ హూ నోస్ ది రోప్స్ అండ్ గుడ్ ఎట్ ఎక్స్‌ప్లేనింగ్ థింగ్స్



● అవును... ఇది నిజమే!

మీసాల స్ట్రైక్



● ధరల పెరుగుదలను నిరసిస్తూ చేసే స్ట్రైక్‌ల గురించి మనకు తెలుసు. మీరెప్పుడైనా ‘మీసాల స్ట్రైక్’ గురించి విన్నారా?! హోటల్లో పనిచేసే ఫ్రెంచ్ వెయిటర్‌లు 1907లో మీసాలు పెంచుకునే హక్కు కోసం స్ట్రైక్ చేశారు. గృహసేవకులు, హోటల్లో పనిచేసే వెయిటర్‌లకు ఆరోజుల్లో మీసాలు పెంచుకునే అవకాశం ఉండేది కాదు. మీసాలు క్లాస్, స్టేచర్‌లకు సింబల్‌గా పరిగణించేవారు. గృహసేవకులు, వెయిటర్‌లను దిగువస్థాయి వ్యక్తులుగా పరిగణించడం వల్ల వారికి మీసాలు పెంచుకునే అవకాశం ఉండేది కాదు.



● రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికా సైన్యంలో ‘ఘోస్ట్ ఆర్మీ’ పేరుతో ఒక దళం పనిచేసేది. ఇందులో కళాకారులు, క్రియేటివ్‌గా ఆలోచించే వాళ్లు, ఇంజనీర్‌లు ఉండేవారు. యుద్ధ వ్యూహాలు రచించడం. రకరకాల పనుల ద్వారా శత్రువులను బురిడీ కొట్టించడం వీరి పని. 26 సంవత్సరాల గిల్బర్ట్ సెల్జర్ ‘ఘోస్ట్ ఆర్మీ’కి నాయకుడు.



● ట్రెపెనేషన్ లేదా ట్రెపానింగ్ అనేది పురాతన కాలానికి సంబంధించిన సర్జికల్ ప్రక్రియ. పుర్రెలపై రంధ్రాలు చేసే ప్రక్రియ ఇది. వివిధ కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ట్రెపెనేషన్‌ను అనుసరించేవారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

సాక్షి సినిమా

రజనీకాంత్‌గారిని విలన్‌గా చూపించాలనుకున్నా!

– దర్శకుడు లోకేశ్ కనగరాజ్



● లోకేశ్ కనగరాజ్, రజనీకాంత్

రజనీకాంత్‌ను ఓ పవర్‌ఫుల్ విలన్‌గా చూపించే ప్రయత్నం మిస్ అయ్యిందని అంటున్నారు తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘కూలీ’. నాగార్జున, శ్రుతీహాసన్, ఉపేంద్ర, సత్యరాజ్, సౌబిన్ షాహిర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ‘కూలీ’ సినిమా ప్రయాణం గురించి లోకేశ్ కనగరాజ్ కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ‘‘కూలీ’ సినిమా కంటే ముందు రజనీకాంత్‌గారికి ఓ పెద్ద కథ చెప్పాలనుకున్నాను. అందులో రజనీకాంత్‌గారిది విలన్ పాత్ర. మిగతా లీడ్ రోల్స్ హీరో పాత్రల మాదిరిగా ఉంటాయి. అయితే ఈ సినిమా నేను చేయడానికి రెండు సంవత్సరాల సమయం పడుతుంది. రజనీకాంత్‌గారు ఇప్పుడు వరుసగా సినిమాలు చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో నా సినిమా కోసం ఆయన రెండు సంవత్సరాల కాలాన్ని వృథా చేయడం నాకు ఇష్టం లేదు. అదే సమయంలో నాకు కొన్ని వ్యక్తిగత సమస్యలు ఉన్నాయి. దీంతో ఆ సినిమాను వద్దనుకుని, ‘కూలీ’ సినిమా కథ చెప్పగా, రజనీకాంత్ గారు ఓకే చేశారు. అలా ఆయనతో ‘కూలీ’ సినిమా చేయడం జరిగింది. అయితే నా ‘ఎల్‌సీయూ’ (లోకేశ్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్)లో ‘కూలీ’ భాగం కాదు. అలాగే ‘కూలీ’ సినిమాలో ఓ మంచి ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంది. ఈ సినిమా ఆడియన్స్‌ను అలరిస్తుంది’’ అని లోకేశ్ కనగరాజ్ చెప్పుకొచ్చారు. ఇక ‘కూలీ’ సినిమా తర్వాత లోకేశ్ డైరెక్షన్‌లో ‘ఖైదీ 2’ సినిమా సెట్స్‌పైకి వెళ్తుంది. ఆ తర్వాత ఆమిర్ ఖాన్‌తో ఓ సూపర్ హీరో మూవీ చేస్తారు లోకేశ్. ఇంకా కమల్‌హాసన్‌తో ‘విక్రమ్ 2’, సూర్యతో ‘రోలెక్స్’ వంటి సినిమాలు లైనప్‌లో ఉన్నట్లుగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు లోకేశ్.

గ్యాంగ్‌స్టర్స్ భూతాలైతే..!



● జెనీలియా

నటి జెనీలియాను పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లనున్నారట రామ్‌గోపాల్ వర్మ. ‘సత్య (1988), కౌన్ (1999), శూల్’ (1999) చిత్రాల తర్వాత బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్‌పాయ్, దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ కాంబినేషన్‌లో రూపొందనున్న చిత్రం ‘పోలీస్ స్టేషన్ మే భూత్’. ఈ సినిమాలోని ఓ లీడ్ రోల్ కోసం జెనీలియాను సంప్రదించగా, ఆమె ఓకే చెప్పారని బాలీవుడ్ సమాచారం. ఈ హారర్ కామెడీ సినిమా చిత్రీకరణ ఈ వారంలోనే హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన సెట్ వర్క్ జరుగుతోందట. ఇక ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమాను ప్రకటించారు రామ్‌గోపాల్ వర్మ. ఓ పోలీస్ స్టేషన్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో కొంతమంది గ్యాంగ్‌స్టర్స్ చనిపోతారు. ఆ చనిపోయిన గ్యాంగ్‌స్టర్స్ భూతాలుగా మారడంతో ఈ పోలీస్ స్టేషన్ ఓ హాంటెడ్ స్టేషన్‌గా మారిపోతుంది. భూతాలైన గ్యాంగ్‌స్టర్స్ పోలీసులను ఎలా ఇబ్బంది పెడతారు? ఈ సమస్య నుంచి పోలీసులు ఎలా తప్పించుకోగలిగారు? అన్నదే ‘పోలీస్ స్టేషన్ మే భూత్’ సినిమా కథ అని సమాచారం.

ఆటా పాటా



● జాన్వీ కపూర్

పెద్దితో కలిసి ఆటాపాటాతో బిజీ కానున్నారట జాన్వీ కపూర్. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రూపొందుతున్న మల్టీ స్పోర్ట్స్ పీరియాడికల్ అండ్ రూరల్ డ్రామా ‘పెద్ది’. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ లాంగ్ షెడ్యూల్‌లో కొంత టాకీ పార్ట్, ఓ సాంగ్, యాక్షన్ సీక్వెన్స్‌లను షూట్ చేయడానికి ప్లాన్ చేశారు బుచ్చిబాబు. కాగా ఈ వారంలో ‘పెద్ది’ సినిమా చిత్రీకరణలో జాన్వీ కపూర్ పాల్గొంటారని తెలిసింది. రామ్‌చరణ్ – జాన్వీలపై ఓ పాటతో పాటు, లవ్ ట్రాక్, కీలక టాకీ పార్ట్ తీయనున్నారట. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా 2026 మార్చి 27న విడుదల కానుంది. శివ రాజ్‌కుమార్, దివ్యేందు, జగపతిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: ఏఆర్ రెహమాన్.

అది అమానవీయ చర్య

మహారాష్ట్రలోని ఓ హాస్పిటల్‌లో రిసెప్షనిస్ట్‌పై గోకుల్ ఝా అనే వ్యక్తి చేసిన అమానుష దాడికి చెందిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వ్యక్తిపై పలువురు నెటిజన్లు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ విషయంపై జాన్వీ కపూర్ ఘాటుగా స్పందించారు. ‘‘ఇది చాలా అమానవీయమైన చర్య. అలాంటి వ్యక్తి జైలుకు వెళ్లాల్సిందే. ఆ ఘటనను ఖండించి, అతడిని శిక్షించకపోతే అది మనకే సిగ్గుచేటు’’ అని ఇన్‌స్టాలో షేర్ చేశారు జాన్వీ. ఇక గోకుల్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు తెలిపిన సంగతి తెలిసిందే.

అబ్బాస్ రీ ఎంట్రీ



‘ప్రేమదేశం’ (1996) ఫేమ్ అబ్బాస్ గుర్తుండే ఉంటారు. 1990–2015 మధ్య కాలంలో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి పేరు సంపాదించుకున్న అబ్బాస్ వెండితెరపై కనిపించి దాదాపు పదేళ్లయింది. 2015లో వచ్చిన ‘పచ్చ కాలం’ అనే మలయాళ సినిమా తర్వాత అబ్బాస్ మరో సినిమాలో నటించలేదు. కాగా అబ్బాస్ మళ్లీ కెమెరా ముందుకు వచ్చారు. నటుడు–సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా తమిళంలో ఓ సినిమా రానుంది. నూతన దర్శకుడు మరియరాజా ఇళంచెళియన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అబ్బాస్ ఓ లీడ్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. శ్రీ గౌరి ప్రియ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తుండగా, జయవర్ధనన్ నిర్మిస్తున్నారు. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో పదేళ్ల తర్వాత అబ్బాస్ యాక్టర్‌గా రీ ఎంట్రీ ఇస్తున్నారు. అలాగే 2014లో వచ్చిన ‘అలా జరిగింది ఒక రోజు’ సినిమా తర్వాత అబ్బాస్ మరో తెలుగు సినిమా చేయని సంగతి తెలిసిందే.

ఆజ్ కీ రాత్ రీమిక్స్‌లో..?




● కృతీ సనన్

షారుక్ ఖాన్‌తో ‘డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్ (2006), డాన్ 2: ది కింగ్ ఈజ్ బ్యాక్’ సినిమాలను తెరకెక్కించి, హిట్స్ అందుకున్నారు దర్శకుడు ఫర్హాన్ అక్తర్. తాజాగా ఫర్హాన్ డైరెక్షన్‌లోనే ‘డాన్ 3’ రానుంది. అయితే ‘డాన్ 3’ చిత్రంలో షారుక్ ఖాన్ హీరోగా చేయడం లేదు. రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించనున్నారు. హీరోయిన్‌గా కియారా అద్వానీని ప్రకటించారు. కానీ ఈ సినిమా ఇంకా సెట్స్‌పైకి రాలేదు. కాగా ఇటీవల ఓ పాపకు జన్మనిచ్చారు కియారా. దీంతో కియారా సెట్స్‌కు రావడం కుదరదని, ఆమె ప్లేస్‌లో మేకర్స్ కృతీ సనన్‌ను హీరోయిన్‌గా తీసుకున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. ఓ దశలో ‘డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్ (2006), డాన్ 2: ది కింగ్ ఈజ్ బ్యాక్’ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన ప్రియాంకా చోప్రా ‘డాన్ 3’లోనూ నటిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. కాగా ప్రస్తుతం ‘ధురంధర్’ సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు రణ్‌వీర్ సింగ్. డిసెంబరు 5న ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. దీంతో ముందుగా ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేయాలనుకుంటున్నారు రణ్‌వీర్. ఆ విధంగా ‘డాన్ 3’ చిత్రీకరణ వాయిదా పడింది. జనవరిలో షూటింగ్ ఆరంభించాలనుకుంటున్నారు మేకర్స్. ఎలాగూ ‘డాన్ 3’ సినిమా స్టార్ట్ కావడానికి ఇంకా సమయం ఉంది కాబట్టి, ముందుగా ప్రకటించినట్లుగానే హీరోయిన్‌గా కియారా అద్వానీనే నటింపజేయాలనుకుంటున్నారట. ఇక ‘డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్’ (2006) సినిమాలో ‘ఆజ్ కీ రాత్’ పాట ఉన్న విషయం తెలిసిందే. ఈ పాపులర్ సాంగ్‌ను ‘డాన్ 3’లో రీమిక్స్ చేసి, ఈ స్పెషల్ సాంగ్‌లో కృతీ సనన్‌తో డ్యాన్స్ చేయిస్తే బాగుంటుందని, ఈ సాంగ్‌లో ప్రియాంకా చోప్రా గెస్ట్‌గా కనిపిస్తే బాగుంటుందని ఫర్హాన్ భావిస్తున్నారట. ఆ దిశగా కృతీతో చర్చలు జరుపుతోందట ‘డాన్ 3’ టీమ్. మరి... ‘ఆజ్ కీ రాత్’ సాంగ్‌లో రణ్‌వీర్‌తో కలిసి కృతీ సనన్ స్టెప్పులేస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ‘డాన్, డాన్ 2’ చిత్రాలకు సంగీతం అందించిన శంకర్–ఇషాన్–లాయ్ త్రయమే ‘డాన్ 3’కీ సంగీతం అందించనున్నారు.

ఓటీటీ | ఇది చూడొచ్చు

పోలీసు వ్యథే ఈ కథ

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం ‘రోంత్’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ప్రతి క్షణం మన క్షేమం కోరుతూ అనుక్షణం మన కోసం శ్రమిస్తున్న పోలీస్ వ్యవస్థ పై సమాజానికి మిశ్రమ అభిప్రాయం ఉందన్న విషయం మనకు తెలిసిందే. అయితే పోలీసులు కూడా మనలాంటి మనుషులు, వాళ్ళకి మనలానే భావావేశాలతో పాటు కష్టాలు నష్టాలు ఉంటాయన్న ఇతివృత్తంతో వచ్చిన థ్రిల్లర్ సినిమానే ‘రోంత్’. నిజానికి ఈ సినిమా చూశాక ప్రస్తుత సమాజంలో పోలీసుకి ఉన్న ఇమేజ్ మారిపోతుందేమో. అంతలా ఏముందో ఈ సినిమాలో ఓసారి చూద్దాం. ఈ సినిమా మొత్తం దాదాపు రెండు పాత్రలపైనే సాగుతుంది. వాళ్లలో ఒకరు సబ్ ఇన్‌స్పెక్టర్ యోహనన్ అయితే మరొకరు పోలీస్ డ్రైవరు దీనానాథ్. కథ ప్రకారం వీళ్లిద్దరూ వారి స్టేషన్ పరిధిలో నైట్ రౌండ్స్‌లో పెట్రోలింగ్ చేస్తుంటారు. దాదాపు సినిమా మొత్తం పెట్రోలింగ్ జరుగుతూనే ఉంటుంది. ఈ పెట్రోలింగ్‌లో వాళ్ళు ఎదుర్కొనే సంఘటనలే కథను నడిపిస్తుంటాయి. యోహనన్ మంచి అనుభవం గల నిఖార్సయిన పోలీసు. దీనానాథ్ కొత్తగా పోలీసు ఉద్యోగంలో చేరిన డ్రైవరు. ఇద్దరికిద్దరూ మంచి మనస్తత్వం కలిగినవారు. కానీ కథ చివర్లో మాత్రం దీనానాథ్ ఆత్మహత్య చేసుకుంటాడు. యోహనన్ అరెస్ట్ అవుతాడు. అలా ఎందుకు జరిగిందో మాత్రం సినిమాలోనే చూడాలి. హాట్ స్టార్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ మలయాళ సినిమా తెలుగు డబ్బింగ్ వెర్షన్‌లో కూడా లభ్యమవుతోంది.

మంచి గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో ఓ పోలీసు డ్యూటీని వెండితెరపై సజీవంగా తీసుకొచ్చిన దర్శకులు షాహి కబీర్‌కు హ్యాట్సాఫ్. ఒక్క థ్రిల్లర్ జోనర్ ఇష్టపడేవాళ్ళే కాదు సినిమాని... అంతకన్నా పోలీసులను అభిమానించేవాళ్ళు... అలాగే ముఖ్యంగా పోలీసులను ద్వేషించేవాళ్లు తప్పక చూడాల్సిన సినిమా. పోలీసులను అభిమానించేవాళ్ళు ఈ సినిమా చూసిన తరువాత మరింత అభిమానం పెంచుకుంటారు. ఇక పోలీసులను ద్వేషించేవాళ్లు సినిమా చూసిన తరువాత అభిమానిస్తారు. వర్త్‌ఫుల్ వాచ్.

– హరికృష్ణ ఇంటూరు

సాక్షి బిజినెస్
శుక్రవారం
25-7-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
542	158
82,184	25,062

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	21,090	△	70
డోజోన్స్	44,808	▽	203
ఎఫ్‌టీఎస్ఈ 100	9,140	△	79
డాక్స్	24,320	△	79
షాంఘై	3,606	△	23
నికాయ్	41,826	△	655

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.90	86.92
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.90	118.82
€	యూరో	ఎస్‌బీఐ	100.40	103.14
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.14	59.92
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.06	58.29
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.37	69.02
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.17	23.65
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.63	23.88
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.20	13.02

మళ్లీ ఐపీవో హవా..!

రేసులో ఎన్ఎస్‌డీఎల్, ఆదిత్య ఇన్ఫోటెక్, శ్రీ లోటస్ డెవలపర్స్ ● మొత్తం రూ.6,200 కోట్ల సమీకరణ

ఓవైపు సెకండరీ మార్కెట్లు కన్సాలిడేషన్ బాటలో సాగుతున్నప్పటికీ మరోపక్క ప్రైమరీ మార్కెట్లు సందడి చేస్తున్నాయి. వెరసి ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య ఐపీవోల ద్వారా అన్‌లిస్టెడ్ కంపెనీలు రూ. 45,350 కోట్లు సమీకరించాయి. ఇది 45 శాతం వృద్ధికాగా.. మరో 118 కంపెనీలు సెబీకి దరఖాస్తు చేశాయి. ఈ బాటలో వచ్చే వారం 3 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి వస్తున్నాయి. తద్వారా రూ. 6,200 కోట్లు సమీకరించనున్నాయి. వివరాలు చూద్దాం..



రూ. 4,000 కోట్ల ఎన్ఎస్‌డీఎల్ ఐపీవో 30న



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్(ఎన్ఎస్‌డీఎల్) పబ్లిక్ ఇష్యూ ఈ నెల 30న ప్రారంభంకానుంది. ఆగస్ట్ 1న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 4,000 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ధరల శ్రేణి ప్రకటించవలసి ఉంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 29న షేర్లను ఆఫర్ చేయనుంది. ఇష్యూలో భాగంగా 5.01 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. వీటిని సంస్థలో ప్రధాన వాటాదారులైన స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈతోపాటు.. బ్యాంకింగ్ దిగ్గజాలు ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐడీబీఐ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూటీ(ఎస్‌యూయూటీఐ) విక్రయానికి ఉంచనున్నాయి. వెరసి ఐపీవో నిధులు ప్రస్తుత వాటాదారుల సంస్థలకు చేరనున్నాయి. 2017లోనే ఐపీవోకు వచ్చిన సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్(సీడీఎస్ఎల్) ఇప్పటికే ఎన్ఎస్ఈలో లిస్టయిన సంగతి తెలిసిందే. దీంతో దేశీయంగా డిపాజిటరీ సర్వీసులందించే రెండో సంస్థగా ఎన్ఎస్‌డీఎల్ లిస్ట్‌కానుంది. 1996 నవంబర్‌లో డీమెటీరియలైజేషన్‌కు తెరతీయడంతో కంపెనీ డీమ్యాట్ సేవలలో భారీగా విస్తరించిన విషయం విదితమే. 2024-25లో కంపెనీ ఆదాయం 12% పైగా ఎగసి రూ. 1,535 కోట్లను తాకింది. నికర లాభం 25% జంప్‌చేసి రూ. 343 కోట్లకు చేరింది.

ఆదిత్య ఇన్ఫోటెక్ @ రూ. 640-675


29-31 మధ్య ఆఫర్



న్యూఢిల్లీ: వీడియో సెక్యూరిటీ, నిఘా (సర్వైలెన్స్) ప్రాడక్టుల కంపెనీ ఆదిత్య ఇన్ఫోటెక్ పబ్లిక్ ఇష్యూకి తాజాగా రూ. 640-675 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 29న ప్రారంభమై 31న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 800 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 1,300 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 375 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. 2024 మార్చికల్లా రూ. 405 కోట్ల రుణం ఉంది. సీపీ ప్లస్ బ్రాండ్ సేవల కంపెనీ ఎంటర్‌ప్రైజ్, కన్జూమర్ విభాగాలలో అడ్వాన్స్‌డ్ వీడియో సెక్యూరిటీ, సర్వైలెన్స్ ప్రాడక్టులు, టెక్నాలజీస్‌ను ఆఫర్ చేస్తోంది.

శ్రీ లోటస్ @ రూ. 140-150

ఈ నెల 30-ఆగస్ట్1 మధ్య ఇష్యూ



పలువురు బాలీవుడ్ తారలు ఇన్వెస్ట్ చేసిన రియల్టీ రంగ కంపెనీ శ్రీ లోటస్ డెవలపర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 140-150 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 30న ప్రారంభమై ఆగస్ట్ 1న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 792 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థలు.. రిచ్‌ఫీల్ రియల్టీ, ధ్యాన్ ప్రాజెక్ట్స్, త్రిక్షా రియల్టీ సంస్థలలో పెట్టుబడుల కోసం వినియోగించనుంది. దీనిలో భాగంగా అమల్ఫీ, ద ఆర్కేడియన్, వరుణ్ ప్రాజెక్టుల అభివృద్ధి, నిర్మాణానికి వెచ్చించనుంది. వీటితోపాటు సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం కొంత మేర నిధులను కేటాయించనుంది. డిసెంబర్‌లో బాలీవుడ్ తారలు అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్ కుటుంబ ట్రస్ట్, హృతిక్ రోషన్, టైగర్ జాకీ ష్రాఫ్, ఏక్తా కపూర్ తదితరులతోపాటు.. సుప్రసిద్ధ ఇన్వెస్టర్ ఆశిష్ కచోలియా కంపెనీలో ఇన్వెస్ట్ చేశారు. శ్రీ లోటస్ ప్రధానంగా మహారాష్ట్రలోని ముంబైలో గృహ, వాణిజ్య ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. గతేడాది(2024-25) ఆదాయం 19 శాతం ఎగసి రూ. 550 కోట్లకు చేరింది. నికర లాభం 90 శాతం జంప్‌చేసి రూ. 228 కోట్లను తాకింది.

ఐఆర్‌డీఏఐ కొత్త చైర్మన్ అజయ్ సేత్



న్యూఢిల్లీ: బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) కొత్త చైర్మన్‌గా కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అజయ్ సేత్‌ను ప్రభుత్వం నియమించింది. మూడేళ్ల కాలానికి లేదా 65 ఏళ్లు వచ్చేంత వరకు లేదా తదుపరి ఆదేశాలు వెలువడేంత వరకు సేత్‌ను ఈ పదవిలో నియమించేందుకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. అజయ్ సేత్ 1987 బ్యాచ్ కర్ణాటక కేడర్ ఐఏఎస్ అధికారి. నాలుగేళ్ల పాటు కేంద్ర ఆర్థిక శాఖలో ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా సేవలు అందించిన అనంతరం ఈ ఏడాది జూన్‌లో పదవీ విరమణ చేశారు. దేవాశిష్ పాండా పదవీకాలం ఈ ఏడాది మార్చితో ముగియగా, అప్పటి నుంచి ఐఆర్‌డీఏఐ చైర్మన్ పదవి ఖాళీగా ఉంది.

హెచ్‌పీసీఎల్‌తో ర్యాపిడో జట్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రైడ్ షేరింగ్ ప్లాట్‌ఫాం ర్యాపిడో తాజాగా ప్రభుత్వ రంగ చమురు, గ్యాస్ మార్కెటింగ్ సంస్థ హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్‌తో (హెచ్‌పీసీఎల్) వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. దీనితో హైదరాబాద్‌లో తమకున్న సుమారు 3.8 లక్షల మంది బైక్ ట్యాక్సీ, క్యాబ్ కెప్టెన్లకు ప్రయోజనం చేకూరుతుందని కంపెనీ తెలిపింది. ఈ ఒప్పందం ప్రకారం ర్యాపిడో కెప్టెన్లకు హైదరాబాద్‌లోని 300 పైచిలుకు హెచ్‌పీసీఎల్ ఔట్‌లెట్స్‌లో ఇంధనంపై 1.25 శాతం డిస్కౌంటు లభిస్తుంది. అలాగే ఎంపిక చేసిన 10 లొకేషన్లలో హెచ్‌పీ లూబ్రికెంట్.. హెచ్‌పీ వాహన్ కిట్‌పై 50 శాతం డిస్కౌంటు లభిస్తుందని ర్యాపిడో తెలిపింది. ముందుగా హైదరాబాద్‌తో ప్రారంభించి దేశవ్యాప్తంగా 11 నగరాలకు దీన్ని విస్తరించనున్నట్లు వివరించింది.

కెనరా బ్యాంక్ లాభం జూమ్

క్యూ1లో రూ. 4,752 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో స్టాండెలోన్ నికర లాభం 22 శాతం జంప్‌చేసి రూ. 4,752 కోట్లను తాకింది. మొండి రుణాలు తగ్గడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 3,905 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 34,020 కోట్ల నుంచి రూ. 38,063 కోట్లకు బలపడింది. అయితే నికర వడ్డీ ఆదాయం స్వల్పంగా 2 శాతం క్షీణించి రూ. 9,009 కోట్లకు పరిమితమైంది. నికర వడ్డీ మార్జిన్లు 2.55 శాతం నుంచి 2.9 శాతానికి మెరుగుపడినట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో కె.సత్యనారాయణ రాజు తెలియజేశారు. అనుమతుల ఆధారంగా అసెట్ మేనేజ్‌మెంట్ జేవీ కెనరా రొబెకో ఏఎంసీ లిస్టింగ్‌ను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ బాటలో జీవిత బీమా జేవీ కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్‌ను సైతం లిస్ట్ చేయనున్నట్లు వెల్లడించారు. కాగా.. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.14 శాతం నుంచి 2.69 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.24 శాతం నుంచి 0.63 శాతానికి భారీగా దిగివచ్చాయి.

ఫలితాల నేపథ్యంలో కెనరా బ్యాంక్ షేరు 5.3 శాతం జంప్‌చేసి రూ. 114 వద్ద ముగిసింది.

సైయెంట్ లాభం రూ. 154 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటెలిజెంట్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్ సంస్థ సైయెంట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 154 కోట్ల లాభం ప్రకటించింది. క్రితం క్యూ1లో ఇది రూ. 144 కోట్లు. అటు ఆదాయం రూ. 1,697 కోట్ల నుంచి రూ. రూ. 1,781 కోట్లకు చేరింది. సమీక్షాకాలంలో వివిధ విభాగాలవ్యాప్తంగా కొత్తగా 14 క్లయింట్లు జతయినట్లు సంస్థ తెలిపింది. అలాగే, త్రైమాసికాలవారీగా పోలిస్తే ప్రస్తుత క్లయింట్ల నుంచి వ్యాపారం మరింతగా పెరిగినట్లు పేర్కొంది. అసోసియేట్ రిస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్స్ స్కీమ్ 2020 కింద సిబ్బందికి 71,500 స్టాక్ ఆప్షన్లను కేటాయించినట్లు సంస్థ తెలిపింది. క్యూ1లో వివిధ సెగ్మెంట్లవ్యాప్తంగా అంచనాలకు అనుగుణమైన పనితీరును సాధించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ కృష్ణ బోదనపు తెలిపారు. ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన కమ్యూనికేషన్స్ సేవల సంస్థ నుంచి 20 మిలియన్ డాలర్ల డీల్ దక్కించుకున్నామని వివరించారు. సెమీకండక్టర్స్ విభాగం భవిష్యత్తులో గ్రూప్ వృద్ధి చోదకంగా మారగలదని భావిస్తున్నట్లు చెప్పారు.

సైయెంట్ షేరు సుమారు మూడు శాతం క్షీణించి రూ. 1,242 వద్ద క్లోజయ్యింది.

బ్లూచిప్ షేర్లలో అమ్మకాలు

సెన్సెక్స్ నష్టం 542 పాయింట్లు ● 25,100 దిగువకు నిఫ్టీ



ముంబై: అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాలతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణతో గురువారం దేశీయ స్టాక్ సూచీలు అరశాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ 542 పాయింట్లు క్షీణించి 82,184 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 158 పాయింట్లు కోల్పోయి 25,062 వద్ద నిలిచింది. అమెరికాతో ఆగస్టు 1న భారత్ కుదుర్చుకోవాలనుకుంటున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ముఖ్యంగా తొలి త్రైమాసిక ఫలితాలు మెప్పించకపోవడంతో ఐటీ, ఫైనాన్స్, ఎఫ్ఎంసీజీ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్ 679 పాయింట్లు క్షీణించి 82,047 వద్ద, నిఫ్టీ 208 పాయింట్లు కోల్పోయి 25,018 వద్ద కనిష్టాన్ని తాకాయి.

- క్యూ1 ఫలితాల ప్రకటన తర్వాత ఇన్ఫోసిస్ షేరులో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. బీఎస్ఈలో 1.3% నష్టపోయి రూ.1,554 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 2% పతనమై రూ. 1,548 వద్ద కనిష్టాన్ని తాకింది. మార్కెట్ విలువ రూ.8,661 కోట్లు దిగజారి రూ.6.45 లక్షల కోట్లకు దిగివచ్చింది.
- రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ షేర్లు 5% క్షీణించి లోయర్ సర్క్యూట్ తాకాయి. యస్ బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాల్లో రూ.3 వేల కోట్లను దారి మళ్లించిన మనీలాండరింగ్ కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఈడీ అనిల్ అంబానీకి చెందిన 35 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది.
- భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడంతో దేశీయ టెక్స్‌టైల్స్, లెదర్, ఫార్మా, ఆటో రంగాల షేర్లకు డిమాండ్ నెలకొంది. లెదర్ రంగానికి చెందిన ఏకేవ ఇండియా 5%, మీర్జా ఇంటర్నేషనల్ 2%, జెనిత్ ఎక్స్‌పోర్ట్స్ 1%, సూపర్ హౌస్ అరశాతం లాభపడ్డాయి. టెక్స్‌టైల్స్ రంగ పెర్ల్ గ్లోబల్ ఇండస్ట్రీస్ 4%, వెల్‌స్పన్ లివింగ్ 2.5%, వర్ధమాన్ టెక్స్‌టైల్స్ 2% పెరిగాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
బ్లూ-గ్రే కాలర్ ఉద్యోగాల్లో మహిళలకు మరింత వాటా | విమాన ప్రయాణికులు 3 శాతం అప్..

సాక్షి స్పోర్ట్స్

డబ్ల్యూడబ్ల్యూఈ దిగ్గజ రెజ్లర్ హుల్క్ హోగన్ మృతి



ఫ్లోరిడా: అమెరికాకు చెందిన ప్రముఖ ప్రొఫెషనల్ రెజ్లర్ హుల్క్ హోగన్ గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. 'రెజ్లర్ మానియా'గా మొదలైన ఈ ఆటలోకి 1985లో తొలిసారిగా బరిలోకి దిగిన హుల్క్ స్టార్ రెజ్లర్‌గా ఎదిగాడు. ఆరుసార్లు చాంపియన్‌షిప్‌లు సాధించాడు. గురువారం 71 ఏళ్ల హోగన్‌కు గుండెపోటు రావడంతో హాస్పిటల్‌కు తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందాడని ఫ్లోరిడా పోలీసులు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. రెజ్లర్ మానియా తర్వాత్తర్వాత 1990వ దశకంలో వరల్డ్ రెజ్లింగ్ ఫెడరేషన్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్)గా తదనంతరం వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ (డబ్ల్యూడబ్ల్యూఈ)గా మారి విశేషాదరణ చూరగొంది. ఈ పోటీలను భారత ప్రేక్షకులు సైతం ఆదరించారు. టీవీల్లో ప్రసారమయ్యే రెజ్లింగ్ పోటీలకు ముఖ్యంగా పిల్లలు బ్రహ్మరథం పట్టేవారు.

ఇంగ్లండ్ దూకుడు

- ప్రస్తుతం తొలి ఇన్నింగ్స్‌లో 225/2
- డకెట్, క్రాలీ ధనాధన్ ఇన్నింగ్స్
- భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358 ఆలౌట్
- రాణించిన పంత్, శార్దుల్
- 5 వికెట్లు తీసిన స్టోక్స్


డకెట్, క్రాలీ

మాంచెస్టర్: నాలుగో టెస్టులో ఇంగ్లండ్ మళ్లీ 'బజ్ బాల్' ఆటకు దిగినట్లుంది. ఓపెనర్లు జాక్ క్రాలీ, బెన్ డకెట్‌లిద్దరూ వన్డేను తలపించే బ్యాటింగ్ దూకుడు కనిపించడంతో ఒక్క సెషన్‌లోనే 148 పరుగులు చేసింది. అంతకుముందు భారత ఇన్నింగ్స్‌ను గాయపడిన రిషభ్ పంత్ బ్యాటింగ్‌కు దిగి ఆదుకున్నాడు. టెస్టులో పోరాడేందుకు తనవంతు పరుగులు జతచేసే నిశ్చయించాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 114.1 ఓవర్లలో 358 పరుగుల వద్ద ఆలౌటైంది. రిషభ్ పంత్ (75 బంతుల్లో 54; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), శార్దుల్ ఠాకూర్ (88 బంతుల్లో 41; 5 ఫోర్లు) రాణించారు. లోయర్ ఆర్డర్‌పై ప్రతాపం చూపిన బెన్ స్టోక్స్ 5 వికెట్లు పడగొట్టగా, ఆర్చర్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం ఆట ప్రారంభించిన ఇంగ్లండ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 46 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (113 బంతుల్లో 84; 13 ఫోర్లు, 1 సిక్స్), బెన్ డకెట్ (100 బంతుల్లో 94; 13 ఫోర్లు) అదరగొట్టారు. పోప్ (20 బ్యాటింగ్; 3 ఫోర్లు), రూట్ (11 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. జడేజా, అన్షుల్ కంబోజ్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంగ్లండ్ ఇంకా 133 పరుగులు వెనుకబడి ఉంది.

తడబడిన మిడిలార్డర్

రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 264/4తో గురువారం ఆట ప్రారంభించిన భారత్ ఆదిలోనే కీలకమైన వికెట్‌ను కోల్పోయింది. క్రితం రోజు స్కోరుకు కేవలం ఒక పరుగే జతచేసిన జడేజా (20; 3 ఫోర్లు)ను ఆర్చర్ బోల్తా కొట్టించాడు. ఈ దశలో శార్దుల్‌కు వాషింగ్టన్ సుందర్ జతయ్యాడు. ఇద్దరు అడపాదడపా బౌండరీలు కొడుతూ జట్టు స్కోరును 300 దాటించారు. ఈ సెషన్ ముగిసే దశలో ఉండగా క్రీజులో పాతుకుపోయిన శార్దుల్‌ను స్టోక్స్ అవుట్ చేసి భారత్‌ను కష్టాల్లోకి నెట్టాడు. తొలిరోజు రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగిన రిషభ్ పంత్ క్రీజులోకి వచ్చాడు. ఈ దశలో 321/6 స్కోరు వద్ద వర్షం కాసేపు ఆటంకపరిచింది. అక్కడితోనే తొలి సెషన్ ముగిసింది. రెండో సెషన్‌లో పంత్, సుందర్ ఇన్నింగ్స్‌ను గాడినపెట్టే ప్రయత్నం చేశారు. కానీ ఈ జోడీ బలపడుతుండగానే స్టోక్స్ మళ్లీ గట్టిదెబ్బే కొట్టాడు. నాలుగు బంతుల వ్యవధిలో సుందర్ (90 బంతుల్లో 27; 2 ఫోర్లు), అన్షుల్ కంబోజ్ (0)లను అవుట్ చేశాడు. ఆర్చర్ బౌలింగ్‌లో 6 కొట్టిన పంత్... స్టోక్స్ వేసిన మరుసటి ఓవర్లో బౌండరీతో 69 బంతుల్లో అర్ధసెంచరీని పూర్తిచేసుకున్నాడు. తర్వాత కాసేపటికే ఆర్చర్... పంత్‌తో పాటు బుమ్రా (4) వికెట్ పడగొట్టడంతో భారత్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బ్రూక్ (బి) డాసన్ 58; రాహుల్ (సి) క్రాలీ (బి) వోక్స్ 46; సుదర్శన్ (సి) కార్స్ (బి) స్టోక్స్ 61; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) స్టోక్స్ 12; పంత్ (బి) ఆర్చర్ 54; జడేజా (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 20; శార్దుల్ (సి) డకెట్ (బి) స్టోక్స్ 41; సుందర్ (సి) వోక్స్ (బి) స్టోక్స్ 27; అన్షుల్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 0; బుమ్రా (సి) స్మిత్ (బి) ఆర్చర్ 4; సిరాజ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 30; **మొత్తం (114.1 ఓవర్లలో ఆలౌట్) 358. వికెట్ల పతనం:** 1-94, 2-120, 3-140, 4-235, 5-266, 6-314, 7-337, 8-337, 9-349, 10-358. **బౌలింగ్:** వోక్స్ 23-5-66-1, ఆర్చర్ 26.1-3-73-3, కార్స్ 21-1-71-0, స్టోక్స్ 24-3-72-5, డాసన్ 15-1-45-1, జో రూట్ 5-0-19-0.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (సి) రాహుల్ (బి) జడేజా 84; డకెట్ (సి) సబ్-జురేల్ (బి) అన్షుల్ 94, ఒలీ పోప్ (బ్యాటింగ్) 20; రూట్ (బ్యాటింగ్) 11; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (46 ఓవర్లలో 2 వికెట్లకు) 225. వికెట్ల పతనం:** 1-166, 2-197. **బౌలింగ్:** బుమ్రా 13-4-37-0, అన్షుల్ కంబోజ్ 10-1-48-1, సిరాజ్ 10-0-58-0, శార్దుల్ 5-0-35-0, జడేజా 8-0-37-1.



ఫ్రాక్చరైనా... ప్యాడ్లు కట్టుకొని...

తొలి రోజే రిషభ్ పంత్ గాయపడటంతో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. వోక్స్ సంధించిన బంతి పంత్ కుడికాలి బొటనవేలికి బలంగా తగలడంతో అతను విలవిలలాడుతూ రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. తదనంతరం స్కానింగ్‌లో బొటనవేలికి ఫ్రాక్చర్ అయినట్లు తేలడంతో ఇక ఆడే పరిస్థితి లేనట్లేనని భావించారంతా! కానీ 2022, డిసెంబర్లో పెను ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన పంత్ నడవలేని స్థితి నుంచి... పట్టుదలతో నడవడమే కాదు ఏకంగా పిచ్‌పై చకచకా పరుగులు తీస్తున్న ఈ పోరాటయోధుడు రెండో రోజు బ్యాటింగ్‌కు దిగి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. గాయాన్ని పంటిబిగువన భరించి అసౌకర్యంగా నడుకుకుంటూ వచ్చిన రిషభ్ పంత్ క్రీజ్‌లో మొండిగా పోరాడి అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. దెబ్బ తగలగానే అడుగుతీసి అడుగు వేయడంలో ఇబ్బంది పడిన పంత్ రెండో రోజు ఆటలో ఇంగ్లండ్ బౌలర్లకు ఎదురీది అర్ధసెంచరీ సాధించడం విశేషం. ఈ స్పెషలిస్ట్ బ్యాటర్ ఆడటం వల్లే భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 350 పైచిలుకు స్కోరు చేయగలిగింది. లేదంటే భారత్ పరిస్థితి భిన్నంగా ఉండేది. మొత్తమ్మీద అతని పోరాటం దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లేను గుర్తుకుతెచ్చింది. 2002లో కరీబియన్ పర్యటనకు వెళ్లిన భారత జట్టులో అప్పటి బౌలింగ్ దళానికి తురుపుముక్కలాంటి కుంబ్లే తలకు గాయమైంది. అయినాసరే తలకు బ్యాండేజ్ కట్టుకొని వచ్చి మరీ 14 ఓవర్లు వేసిన కుంబ్లే... వెస్టిండీస్ బ్యాటింగ్ దిగ్గజం బ్రియాన్ లారాను అవుట్ చేశాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఫైనల్లో కోనేరు హంపి

భారత్ ఖాతాలో మహిళల వరల్డ్ కప్ టైటిల్

తుది పోరులో దివ్య దేశ్‌ముఖ్‌తో హంపి 'ఢీ'



2 ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ పోరుకు చేరడం హంపికిది రెండోసారి. 2011లో మ్యాచ్ ఫార్మాట్‌లో నిర్వహించిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో హంపి ఫైనల్ చేరి చైనా గ్రాండ్‌మాస్టర్ హు ఇఫాన్ చేతిలో ఓడిపోయింది.

బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ నాకౌట్ చెస్ టోర్నమెంట్ టైటిల్ తొలిసారి భారత్ ఖాతాలో చేరడం ఖరారైంది. బుధవారం భారత్‌కు చెందిన ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ ఫైనల్‌కు చేరగా... గురువారం దివ్య సరసన భారత దిగ్గజం కోనేరు హంపి కూడా చేరింది. చైనా గ్రాండ్ మాస్టర్ లె టింగ్జితో జరిగిన రెండో సెమీఫైనల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హంపి టైబ్రేక్‌లో 4-2 పాయింట్లతో... ఓవరాల్‌గా 5-3 పాయింట్లతో విజయాన్ని అందుకొని ఫైనల్‌కు చేరింది. ఈ గెలుపుతో హంపి వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి కూడా అర్హత సాధించింది. బుధవారం నిర్ణీత రెండు క్లాసికల్ గేమ్‌ల తర్వాత హంపి, లె టింగ్జి 1-1తో సమంగా ఉన్నారు. దాంతో విజేతను తేల్చేందుకు గురువారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. ముందుగా ర్యాపిడ్ ఫార్మాట్‌లో రెండు గేమ్‌లు జరిగాయి. అయితే ఈ రెండూ 'డ్రా'గా ముగిశాయి. దాంతో ఇద్దరూ 2-2తో సమంగా నిలిచారు. అనంతరం ర్యాపిడ్ ఫార్మాట్ లోనే మరో రెండు గేమ్‌లు నిర్వహించారు. తొలి గేమ్‌లో లె టింగ్జి 65 ఎత్తుల్లో నెగ్గగా... రెండో గేమ్‌లో హంపి 39 ఎత్తుల్లో గెలిచింది. దాంతో స్కోరు 3-3తో సమమైంది. ఈసారి వీరిద్దరి మధ్య బ్లిట్జ్ ఫార్మాట్‌లో రెండు గేమ్‌లు నిర్వహించారు. ఈ రెండు గేముల్లోనూ హంపి నెగ్గి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. తొలి గేమ్‌లో హంపి 70 ఎత్తుల్లో, రెండో గేమ్‌లో 33 ఎత్తుల్లో గెలుపొందింది. హంపి, దివ్య మధ్య ఈనెల 26, 27వ తేదీల్లో ఫైనల్ జరుగుతుంది. రెండు గేమ్‌లలో ఫలితం తేలకపోతే 28న టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు.

వచ్చే ఏడాదీ ఇంగ్లండ్‌కు టీమిండియా

5 టి20లు, 3 వన్డేలు ఆడనున్న భారత్

మాంచెస్టర్: ప్రస్తుతం భారత క్రికెట్ జట్టు ఇంగ్లండ్‌లో బిజీ షెడ్యూల్‌లో నిమగ్నమైంది. ఐదు టెస్టుల పూర్తిస్థాయి ద్వైపాక్షిక సిరీస్‌లో పాల్గొంటోంది. అయితే వచ్చే ఏడాది కూడా టీమిండియా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. పరిమిత ఓవర్ల ద్వైపాక్షిక సిరీస్‌లను ఆడుతుంది. గురువారం ఈ మేరకు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) వెల్లడించింది. వచ్చే ఏడాది ఐదు టి20లతో పాటు మూడు వన్డేల సిరీస్‌లో భారత్ పాల్గొంటుంది. ఈసీబీ షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. మొదట జూలై 1న దర్హమ్‌లో జరిగే తొలి టి20తో పొట్టి సిరీస్ మొదలవుతుంది. రెండో మ్యాచ్ 4న మాంచెస్టర్‌లో, మూడో మ్యాచ్ 7న నాటింగ్‌హామ్‌లో, నాలుగో పోరు 9న బ్రిస్టల్‌లో, ఆఖరి పోరు 11న సౌతాంప్టన్‌లో జరుగనుంది. తర్వాత జూలై 14న బర్మింగ్‌హామ్, 16న కార్డిఫ్, 19న లార్డ్స్‌లలో మూడు వన్డేలు జరుగుతాయి. భారతే కాదు న్యూజిలాండ్, పాకిస్తాన్‌లతో జరిగే ద్వైపాక్షిక సిరీస్‌లతో ఇంగ్లండ్ 2026 సీజన్ ఆసాంతం బిజీ బిజీగా గడపనుంది. ఈ ఏడాది ఇంగ్లండ్‌లో టి20, వన్డే సిరీస్‌లను నెగ్గిన భారత మహిళల జట్టు కూడా అక్కడికి వెళ్లనుంది. మూడు టి20లు, ఏకైక టెస్టు మ్యాచ్ ఆడనుంది. మే 28, 30, జూన్ 2 తేదీల్లో చెమ్స్‌ఫోర్డ్, బ్రిస్టల్, టాంటన్ వేదికల్లో పొట్టి మ్యాచ్‌లు ఆడుతుంది. జూలై 10 నుంచి లార్డ్స్‌లో ఏకైక టెస్టు ఆడుతుంది.

కీబోర్డు, మౌస్, టచ్ స్క్రీన్, వాయిస్ కమాండ్ల వంటివి లేకుండా కంప్యూటర్‌తో పనిచేయించడాన్ని ఊహించగలమా?

స్మార్ట్ రిస్ట్ బ్యాండ్‌తో.. దాన్ని సుసాధ్యం చేయనుంది మార్క్ జుకర్‌బర్గ్‌కు చెందిన మెటా సంస్థ.

కేవలం మన చేతివేళ్ల కదలికలతో, వాటి సంజ్ఞలతో కంప్యూటర్లు, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ (ఏఆర్)తో పనిచేసే వస్తువులను ఇకమీదట నియంత్రించవచ్చు!

టెక్నాలజీ వాడకంలో ఇదో గొప్ప మలుపు కానుంది. ముఖ్యంగా దివ్యాంగులకు ఇది వరం. మాట (వాయిస్) లేదా సాధారణ ఇన్‌పుట్ పద్ధతులు పనిచేయని సందర్భాల్లో ఇది ఉపయోగకరంగా ఉంటుంది.



కీబోర్డు, మౌస్ లేకుండానే.. కంప్యూటర్ పనిచేస్తుంది!

భవిష్యత్తులో మన చేతివేళ్ల కదలికలతోనే కంప్యూటర్‌కు అన్నీ చెప్పేయొచ్చు, వాటిని నియంత్రించవచ్చు. ముఖ్యంగా రహస్యమైన విషయాలను ఎవ్వరికీ తెలియకుండా నిర్భయంగా కంప్యూటర్లో కంపోజ్ చేయొచ్చు.. సెర్చ్ చేయొచ్చు.. ఒకటేమిటి.. మనకు నచ్చినవన్నీ చేయొచ్చు. మెటా సంస్థ తయారుచేస్తున్న స్మార్ట్ రిస్ట్ బ్యాండ్‌తో ఇవన్నీ సాధ్యం కానున్నాయి. టెక్నాలజీ వినియోగంలో ఇదో విప్లవాత్మక మార్పుగా చెబుతున్నారు టెక్ నిపుణులు. ఇప్పటికే వాయిస్ కమాండ్స్‌తో పనిచేసే స్మార్ట్ కళ్లజోళ్లను మెటా రూపొందించింది.

మెటా రియాలిటీ ల్యాబ్స్‌లో..: ఈ సాంకేతికతకు సంబంధించిన పురోగతిని ఇటీవల ప్రముఖ జర్నల్ 'నేచర్‌'లో మెటా ప్రచురించింది. మెటాకు చెందిన వ్యాపార, పరిశోధనా విభాగం 'రియాలిటీ ల్యాబ్స్'లో ఈ పరిశోధనలు నిర్వహించారు. సుమారు 300 మంది వివిధ రకాల పనులు చేస్తుంటే.. వారి కండరాల నుంచి వచ్చే విద్యుత్ సంకేతాలను పసిగట్టేందుకు మెషీన్ లెర్నింగ్ మాడ్యూళ్లకు శిక్షణ ఇచ్చారు. ఆ మోడళ్లు వారి కండరాల సందేశాలను విజయవంతంగా గ్రహించి, వారి కదలికలకు అనుగుణంగా పనిచేశాయి. ఈ రిస్ట్ బ్యాండ్‌ని మెటా ఆగ్‌మెంటెడ్ రియాలిటీ కళ్లద్దాలు 'ఓరియన్'తోనూ పరీక్షించారు.

ఎలా పనిచేస్తుంది?..: మన మెదడు.. నరాల ద్వారా కండరాలకు విద్యుత్ సంకేతాలు పంపుతుంది. వీటిని ఎలక్ట్రోమయోగ్రాఫిక్ (ఈఎమ్‌జీ) సంకేతాలు అంటారు. మన మణికట్టు దగ్గర ఉండే కండరాల నుంచి వచ్చే విద్యుత్ సంకేతాల ఆధారంగా పనిచేసే రిస్ట్ బ్యాండ్‌ని మెటా కంపెనీ తయారుచేసింది. దీని సాయంతో కంప్యూటర్లు, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ (ఏఆర్)తో పనిచేసే వస్తువులను నియంత్రించవచ్చు. ఇకమీదట కీబోర్డులు, మౌస్‌లు లేదా స్క్రీన్‌ను టచ్ చేయడం వంటివేవీ అవసరం ఉండదు. కంప్యూటర్లతో పనిచేయించడం మరింత సులభతరం, సరళతరం కానుంది. మన జేబుల్లో చేయి పెట్టి వేళ్లు కదిలించినప్పుడు కూడా ఇది పనిచేయడం విశేషం.

ఏమిటీ సాంకేతికత?

సాధారణంగా ఎలక్ట్రోమయోగ్రాఫిక్ (ఈఎమ్‌జీ) సంకేతాలు శరీరం లోపలి నుంచి వస్తాయి. వాటిని గ్రహించి బయట నుంచి పనిచేస్తుంది కాబట్టి దీన్ని 'ఉపరితల ఈఎమ్‌జీ (ఎస్ఈఎమ్‌జీ) సాంకేతికతగా పిలుస్తున్నారు. ఇది చాలా తేలికైన రిస్ట్ బ్యాండ్. మనం చేతిని కదిలినప్పుడు కండరాల నుంచి వచ్చే అతి సూక్ష్మ లేదా స్వల్ప స్థాయి విద్యుత్ సంకేతాలను కూడా గ్రహించి పనిచేయడం దీని ప్రత్యేకత. పెద్దపెద్ద పరికరాలు, యంత్రాల అవసరం లేకుండానే ఇది పనిచేస్తుంది. కెమెరాలు, కొన్ని రకాల సెన్సర్లతో పనిచేసే వ్యవస్థలు మన సంజ్ఞలను గుర్తించి పనిచేస్తాయి. కానీ, మన కదలికలు స్పష్టంగా లేకపోతే ఇవి పనిచేయవు. కానీ, మన మెదడు – కంప్యూటర్ లేదా న్యూరో మోటార్ ఇంటర్‌ఫేస్‌లు.. అంటే మన శరీరం నుంచి వచ్చే విద్యుత్ సంకేతాలతో పనిచేసే వాటితో ఈ సమస్య ఉండదని ఈ అధ్యయన కర్తలు చెబుతున్నారు.

'స్మార్ట్ బ్రేస్‌లెట్' రూపొందించిన 'మెటా'

చేతివేళ్ల కదలికలతోనే పనిచేసే సాంకేతికత

కంప్యూటర్ వాడకం ఇక మరింత సులభం



దీంతో ఏమేం చేయొచ్చు?

ఒక టేబుల్ లేదా మన తొడ లేదా డెస్క్ లాంటి దానిపై మనం రాసిన దాన్ని కూడా ఈ రిస్ట్ బ్యాండ్ గుర్తించి, మనం ఏం రాశామో కంప్యూటర్ స్క్రీన్ మీద చూపిస్తుంది.

మెసేజ్‌లు టైప్ చేయొచ్చు	మెనూలు నియంత్రించవచ్చు	చేతుల కదలికల ద్వారా డిజిటల్ కంటెంట్‌ను మనకు నచ్చినట్టు యాక్సెస్ చేయవచ్చు

ఎవరికి ఉపయోగం?

దివ్యాంగులకు..

శరీరంలోకి ప్రత్యేకమైన ఇంప్లాంట్లు లేదా సంక్లిష్టమైన పరికరాలు జొప్పించాల్సిన అవసరం లేకుండానే.. వివిధ శారీరక సామర్థ్యాలు ఉన్న వ్యక్తులకు..	సాధారణ ఇన్‌పుట్ పరికరాలను ఉపయోగించడంలో ఇబ్బంది పడుతున్నవారికి ..	బహిరంగంగా లేదా ప్రైవేటుగా మాట్లాడలేని సందర్భాల్లో ఏదైనా విషయాన్ని రహస్యంగా అవతలివారికి చేరవేయాల్సి వచ్చినప్పుడు..

మరిన్ని ఆవిష్కరణల కోసం..

ప్రస్తుతానికి ఈ సాంకేతికత పూర్తిగా అభివృద్ధి కాలేదు. మన శరీరం నుంచి వచ్చే సంకేతాలను గుర్తించే పరికరాలను భవిష్యత్తులో అందరికీ అందుబాటులోకి తీసుకురావడం తమ లక్ష్యమని మెటా చెబుతోంది. ఈ సాంకేతికతకు సంబంధించిన డేటా, సాఫ్ట్‌వేర్ మోడళ్లు, డిజైన్ మార్గదర్శకాలను పరిశోధకులతో పంచుకునేందుకు మెటా ముందుకు వచ్చింది. తద్వారా.. కండరాల నుంచి వచ్చే విద్యుత్ సంకేతాల ఆధారంగా పనిచేసే మరిన్ని సాంకేతికతల ఆవిష్కరణలకు ఇది తోడ్పాటు అందించనుంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

క్లుప్తంగా...

సిగాచిపై సీఎస్ కమిటీ నివేదిక!

సాక్షి, హైదరాబాద్: పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని సిగాచి పరిశ్రమలో గత నెలలో జరిగిన భారీ పేలుడు ఘటనపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. పరిశ్రమల్లో అగ్నిమాపక పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. సిగాచి పరిశ్రమలో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదని కమిటీ అభిప్రాయపడినట్లు విశ్వసనీయ సమాచారం. పరిశ్రమల్లో తనిఖీల నిర్వహణ సక్రమంగా జరగాల్సిన అవసరం ఉందని పేర్కొంది. సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటనలో 44 మంది కార్మికులు మరణించగా మరో ఆరుగురు గల్లంతైన విషయం తెలిసిందే. ఈ కమిటీలో కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ మెంబర్ కన్వీనర్‌గా, డిజాస్టర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి తదితరులు సభ్యులుగా ఉన్నారు.

నేటి నుంచి రెండో విడత ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం నుంచి మొదలవుతుంది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనని విద్యార్థులు ఇదే రోజు నుంచి నమోదు చేసుకోవచ్చు. ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 26న చేపడతారు. 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వొచ్చు. ఈ నెల 30న సీట్ల కేటాయింపు ఉంటుంది. తొలి విడతలో 83054 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 77561 సీట్లు కేటాయించారు. ఇందులో 59980 మంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. తొలి విడతలో మిగిలిపోయిన సీట్లు, సీటు వచ్చినా రిపోర్ట్ చేయని కారణంగా మిగిలిపోయినవి మొత్తం 23074 సీట్లు కేటాయించాల్సి ఉంది. రెండో విడత కౌన్సెలింగ్‌లో ఈ సీట్ల భర్తీ చేపడతారు.

నేటినుంచి దోస్త్ ప్రత్యేక రౌండ్

- స్థానికేతరులకు కూడా స్పాట్ ప్రవేశాలు
- ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) ప్రత్యేక రౌండ్ కౌన్సెలింగ్ ప్రక్రియను శుక్రవారం నుంచి మొదలు పెడతారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలోని దోస్త్ కమిటీ గురువారం సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ రూ.400 రుసుముతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 25 నుంచి 31 వరకూ వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు అవకాశం ఇచ్చారు. ఈ నెల 31న ధ్రువపత్రాల పరిశీలన చేపడతారు. వచ్చే నెల 3వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. వచ్చే నెల 6వ తేదీలోగా సీట్లు వచ్చిన విద్యార్థులు రిపోర్టింగ్ చేయాలి. ఇంకా సీట్లు మిగిలిపోతే వచ్చే నెల 11, 12 తేదీల్లో కాలేజీల్లో స్పాట్ ప్రవేశాలను నిర్వహిస్తారు. స్పాట్‌లో సీటు పొందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు పొందే అర్హత ఉండదు. స్పాట్ ప్రవేశాల్లో నాన్ లోకల్ విద్యార్థులు కూడా సీట్లు పొందే అవకాశం కల్పించారు. ఈసారి కౌన్సెలింగ్‌లో ఎర్త్ యూనివర్సిటీ కోర్సులను కూడా అందుబాటులోకి తెచ్చారు.


ట్రాన్స్‌జెండర్ల సంరక్షణకు ఎంవోయూ

సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌జెండర్ల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రైడ్ ప్లేస్ సెల్ సేవలను బలోపేతం చేసేందుకు తెలంగాణ పోలీసు మహిళా భద్రతా విభాగం బెంగళూరుకు చెందిన ఎన్జీవో యుగాంతర్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం జరిగిన కార్యక్రమంలో మహిళా భద్రత విభాగం అడిషనల్ డీజీ చారుసిన్హా, డీఐజీ రెమా రాజేశ్వరితోపాటు యుగాంతర్ ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ భాగస్వామ్యం ఎల్‌జీబీటీయూ1ఏ వ్యక్తులకు చట్టపరమైన సహాయం, మానసిక ఆరోగ్య మద్దతు, పోలీసు సిబ్బందికి శిక్షణ నిర్వహించనుంది.

పాడైన కాలేయానికి పునరుజ్జీవం..

▶ మొదటి పేజీ తరువాయి

బాగుచేయడం ఎలా అన్న దానిపై తులసీ థెరప్యూటిక్స్ ఏళ్లుగా పరిశోధనలు చేస్తోంది. ఇందులోభాగంగా కంపెనీ శాస్త్రవేత్తలు 'తులసీ-28ఎక్స్' అనే ఒక మందును తయారు చేశారు. ఇందులో బొడ్డుతాడు జిగురులో ఉండే మూలకణాలతో తయారైంది. దీన్ని మెసెన్కైమల్ స్టెమ్‌సెల్స్ అంటారు. వీటికి బొడ్డు తాడులోనే లభించే ఎక్సోసోమ్‌లు (శరీర కణాల మధ్య మెసెంజర్‌లాంటివి) కూడా చేర్చి ప్రయోగాలు చేపట్టారు. అమెరికాలోని ఇండియానా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ చలసాని నాగ, చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్ డాక్టర్ అజయ్ దుసేజాల పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రయోగం విజయం సాధించింది. తులసీ-28ఎక్స్ అందుకున్న జంతు కాలేయాలన్నీ మళ్లీ పెరగడం మొదలైంది. ఏ ఒక్క జంతువూ మరణించలేదు. ఇదే సమయంలో తులసీ-28ఎక్స్ అందుకోని జంతువుల కాలేయాల్లో 14 శాతం పెరుగుదల కనిపించిందని, 43 శాతం జంతువులు మరణించాయని తులసీ థెరప్యూటిక్స్ వ్యవస్థాపకులు, సీఈవో డాక్టర్ అట్లూరి సాయిరామ్ తెలిపారు. భారతీయ బయోటెక్ రంగంలో ఇదో మైలు రాయి లాంటిదని వ్యాఖ్యానించారు. జంతు కాలేయాల్లో ప్రీక్లినికల్ ట్రయల్స్ విజయవంతమైన నేపథ్యంలో మానవ ప్రయోగాలు సవాలుగా ఉన్నాయన్నారు. ఈ పరిశోధన కాలేయ సంబంధిత వ్యాధుల చికిత్సలో కొత్త అవకాశాలను కల్పిస్తోందని చెప్పారు. పరిశోధన వివరాలు జర్నల్ ఆఫ్ రీజనరేటివ్ మెడిసిన్‌లో ప్రచురణకు అర్హత సాధించడం విశేషం.



25 లక్షల మందికి పరీక్షలు

దేశంలో ఏటా లక్షల మంది కాలేయ వ్యాధుల బారిన పడుతున్నారు. కాలేయంలో కొవ్వు పేరుకుపోతే వచ్చే వ్యాధి ఫ్యాటీ లివర్. ఈ సంస్థ దేశంలో 25 లక్షల మందికి పరీక్షలు జరపగా 65 శాతం మందికి వ్యాధి ఉన్నట్టు తేలింది. వీరిలో 85 శాతం మంది మంది మద్యపానానికి బానిసలైన వారు. అలాగే, దేశంలో ప్రతి 8 మందిలో ఒకరు ఊబకాయంతో ఉన్నారు. ఊబకాయులు నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్, నాన్ ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్ వ్యాధుల బారిన పడేందుకు అవకాశాలు ఎక్కువ. ఐటీ రంగంలో పనిచేస్తున్న వారిలో అత్యధికులు కాలేయ వ్యాధుల బారిన పడుతున్నట్లు తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. 2022లో జీర్ణకోశ వ్యాధులతో మరణించిన వారిలో 75 శాతం మందికి కాలేయ సమస్యలున్నాయి. మహిళల విషయానికి వస్తే ఈ సంఖ్య 57.5 శాతం మాత్రమే.

కాలేయ సమస్యలు పెరిగేందుకు కారణాలివీ..

జీవనశైలి మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం, వేళాపాళా లేని ఆహారం, పోషకాల లేమి, మద్యం, ప్రాసెస్డ్ ఫుడ్స్ వినియోగం పెరగడం. డెస్క్ ముందు కూర్చుని చేసే ఉద్యోగాలు పెరిగిపోవడం, వ్యాయామం వంటివి పెద్దగా చేయకపోవడం. మధుమేహం, ఊబకాయం.

'నిమ్స్'తో కలిసి మానవ ప్రయోగాలు

మూలకణాలకు ఎక్సోసోమ్‌లను జోడించి కాలేయ వ్యాధికి ఉపయోగించింది తులసీ థెరప్యూటిక్స్ సంస్థ ఒక్కటే. మాకు తెలిసినంత వరకూ ప్రపంచంలో ఇలాంటి ప్రయోగం చేసిన బయోటెక్ కంపెనీ ఇంకోటి లేదు. 'నిమ్స్' సాయంతో తులసీ-28ఎక్స్‌తో మానవ ప్రయోగాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం కాలేయం బాగా పాడైతే మార్చడం మినహా మరో మార్గం లేదు. తులసీ-28ఎక్స్ ప్రయోగాలు విజయవంతమైతే ఈ సమస్య రాదు. – డాక్టర్ బొంతల రవి, తులసీ థెరప్యూటిక్స్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్

బడి సంచి భారం తగ్గించాల్సిందే..

- జిల్లా అంతటా 'గంగాధర మోడల్' అమలు
- కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆదేశాలు


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పాఠశాల విద్యార్థులకు భారంగా పరిణమించిన స్కూల్ బ్యాగ్‌ల బరువును తగ్గించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లోగా జిల్లావ్యాప్తంగా గంగాధర మండలం ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విధానాన్ని వర్తింపజేయాలని సూచించారు. 'బడి సంచి భారం కాదిక్కడ' శీర్షికన ఈ నెల 23న 'సాక్షి' ప్రధాన సంచికలో ప్రచురితమైన ప్రత్యేక కథనంపై కలెక్టర్ స్పందించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన విద్యాశాఖ సమీక్షలో ఆమె సాక్షి కథనాన్ని ప్రస్తావించారు. ఈ మేరకు గంగాధర మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్‌రావును అభినందించారు. విద్యార్థుల స్కూల్ బ్యాగ్ బరువు తగ్గించేందుకు గంగాధర మండలంలోని 40 పాఠశాలల్లో త్రాసును ఏర్పాటు చేశారు. విద్యాశాఖ నిర్దేశించిన ప్రకారం విద్యార్థి బ్యాగ్ బరువుండేలా తూచి.. అదనపు పుస్తకాలుంటే తొలగిస్తున్నారు. దీనిపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో.. జిల్లావ్యాప్తంగా ఇదే విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి నిర్ణయించారు.

గిరిజన వర్సిటీ ప్రవేశాలకు దరఖాస్తులు

ములుగు రూరల్: ములుగు జిల్లా జాకారం పరిధిలోని సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీలో బీఏ (ఆనర్స్) ఇంగ్లిష్, బీఏ (ఆనర్స్) ఎకనామిక్స్‌లో 2025-26 విద్యాసంవత్సరానికి ప్రవేశాల నోటిఫికేషన్‌ను యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వైఎల్ శ్రీనివాస్ గురువారం విడుదల చేశారు. ప్రవేశాలకు సీయూఈటీ ప్రవేశ పరీక్ష రాసిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువుందని తెలిపారు. ఆగస్టు 4న మెరిట్ లిస్టు, 6న తుది జాబితాను విడుదల చేస్తామన్నారు.

'3 ట్రిలియన్ల' సంకల్పంలో భాగస్వాములు కండి

ఇన్వెస్టోపియా గ్లోబల్ పెట్టుబడుల సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో యూఏఈ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు 'ఇన్వెస్టోపియా గ్లోబల్'ను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ 'భౌగోళికంగా చిన్నదైనా, ఆశయాలు, ఆచరణలో మాత్రం తెలంగాణ ఉన్నతంగా ఆలోచిస్తుంది. తక్కువ వ్యవధిలోనే వేగంగా అభివృద్ధి సాధించి దేశంలోని ఇతర రాష్ట్రాలకు అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలిచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో తెలంగాణ కొత్తగా రూ.3.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ నుంచి యూఏఈకి ఎగుమతుల్లో 2.5 రెట్లు వృద్ధి సాధించాం. ఎగుమతుల్లో ఫార్మా, ఏరోస్పేస్, డిజిటల్ సేవలు, ఫుడ్ ప్రాసెసింగ్ కీలకపాత్ర పోషించాయి. ఇప్పటికే యూఏఈకి చెందిన లులు గ్రూప్, డీపీ వరల్డ్, నాఫ్కో వంటి కంపెనీలు రాష్ట్రానికి పెట్టుబడులతో వచ్చాయి'అని మంత్రి వెల్లడించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని యూఏఈ పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించారు. సదస్సు ప్రారంభ కార్యక్రమంలో యూఏఈ ఆర్థిక, పర్యాటకశాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తాక్ అల్ మర్రి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సంజయ్‌కుమార్, టీజీఐఐసీ ఎండీ కె.శశాంక, అండర్ సెక్రటరీ ఆఫ్ ది యూఏఈ మినిస్ట్రీ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ మహ్మద్ అల్హావీ, యూఏఐ ఇంటర్నేషనల్ ఇన్వెస్టర్స్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ వాలిద్ హారేబ్ అల్ ఫలాహి, ఇన్వెస్టోపియా సీఈవో డా.జీన్ ఫారెస్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబుతో పారిశ్రామికవేత్తలు

స్థానికతపై నేడు సమావేశం

- ఎంబీబీఎస్ ప్రవేశాలపై చర్చించనున్న మంత్రి దామోదర రాజనర్సింహ
- సుప్రీం సూచనకు అనుగుణంగా మార్పులకు వర్సిటీ సిద్ధం
- కౌన్సెలింగ్, ధ్రువీకరణ పత్రాల పరిశీలన గడువు 30 వరకు పెంపు



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని సుప్రీం కోర్టు సూచించిన నేపథ్యంలో..ఎంబీబీఎస్ ప్రవేశాల్లో స్థానికత అంశంపై శుక్రవా రం హైదరాబాద్‌లో వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఇతర ఉన్నతాధికారులతో యూనివర్సిటీ అధికారులు సమావేశం కానున్నారు. ఎంబీబీఎస్‌లో ప్రవేశాలకు ముందు వరుసగా నాలుగేళ్లు (9వ తరగతి నుంచి ఇంటర్ వరకు) రాష్ట్రంలో చదివితేనే స్థానికులుగా పరిగణిస్తామని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం కౌన్సెలింగ్ నోటిఫికేషన్లలో స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అయితే బుధవారం సుప్రీంకోర్టు.. ఎంబీబీఎస్ ప్రవేశాలకు గత సంవత్సరం తరహాలోనే తహసీల్దార్ ఇచ్చే నివాస ధ్రువపత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించడంతో అందుకు అనుగుణంగా మార్పులకు వర్సిటీ సిద్ధమైంది. కౌన్సెలింగ్‌కు సంబంధించి గతంలో విధించిన గడువు శుక్రవారం ముగుస్తుండగా.. విద్యార్థులు స్థానికతకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు శుక్రవారం లోగానే అందజేయాల్సి ఉంటుంది. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కౌన్సెలింగ్, ధ్రువీకరణ పత్రాల పరిశీలన గడువును ఈ నెల 30వ తేదీ వరకు పెంచాలని నిర్ణయించినట్లు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

సమస్యకు 5న తెర పడేనా?

వర్సిటీ విధించిన నిబంధనతో ఇంటర్‌లో మంచి విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన తెలంగాణ వాసులు 'నాన్ లోకల్'సమస్యను ఎదుర్కొంటుండగా, 9వ తరగతి నుంచి తెలంగాణలోని ఏదైనా సీబీఎస్ఈ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివిన ఇతర రాష్ట్రాల విద్యార్థులకు 'లోకల్'గా అవకాశం లభిస్తోంది. దీనిపై తెలంగాణకు చెందిన వారు హైకోర్టును, సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో గత సంవత్సరం ప్రవేశాల సందర్భంగా తహసీల్దార్ ఇచ్చే 'స్థానికత'ధ్రువపత్రాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. కానీ మళ్లీ ఈసారి కూడా అదే 9 నుంచి ఇంటర్ వరకు నిబంధనను కాళోజీ యూనివర్సిటీ పెట్టడంతో విద్యార్థులు మరోసారి కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. దీంతో ఆగస్టు 5న ఈ అంశంపై క్లారిటీతో రావాలని సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సమస్యకు తెరపడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెపుతున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ఎన్ఐఆర్‌డీకి ఇదేం బడ్జెట్?

కేటాయింపులపై పార్లమెంటరీ ప్యానెల్ ఆందోళన | నిధులు చాలా తక్కువగా ఉన్నాయి..ఇది పథకాల అమలుపై ప్రభావం చూపుతుంది

సాక్షి, హైదరాబాద్: స్వతంత్ర ప్రతిపత్తిగల ఓ ప్రతిష్టాత్మక సంస్థకు బడ్జెట్ కేటాయింపుల తగ్గింపుతో జాతీయస్థాయిలో దాని ప్రాధాన్యం కోల్పోయే ప్రమాదం ఏర్పడిందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సంస్థకు మంజూరైన పోస్టులు 640 ఉంటే...ఈ ఏడాది మార్చి12 నాటికి 221 మంది ఉద్యోగులే ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్-ఎన్ఐఆర్‌డీ-పీఆర్ (గతంలో ఎన్ఐఆర్‌డీ)కు బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం పట్ల గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ పార్లమెంటరీ స్థాయీ సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. తాజాగా లోక్‌సభ, రాజ్యసభలకు సమర్పించిన నివేదికలో ఎన్ఐఆర్‌డీ-పీఆర్ సంస్థను నీరుగార్చేలా చేస్తున్న ప్రయత్నాలను ఈ పార్లమెంటరీ ప్యానెల్ ఎండగట్టింది. ఈ సంస్థకు సంబంధించిన అనేక ముఖ్యమైన ప్రశ్నలను సంధించింది.

గ్రామీణాభివృద్ధి పథకాలపైనా ప్రభావం...

బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పొందుపరిచిన డిమాండ్ల కంటే ఈ సంస్థకు కేటాయించిన నిధులు చాలా తక్కువగా ఉండటం వల్ల జాతీయస్థాయిలో గ్రామీణాభివృద్ధి పథకాలు సరైన పద్ధతుల్లో అమలు కావడంపై ప్రభావం చూపే అవకాశాలున్నట్టుగా పేర్కొంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఈ సంస్థను 'డీలింక్'చేయాలనే (పాలనాపరంగా అయినా) ఎలాంటి ప్రయత్నమైనా కూడా దీని లక్ష్యాలు, జాతీయ ప్రాధామ్యాలకు చేటు చేస్తుందని హెచ్చరించింది. గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో ఇది ఉండటం వల్లేనే.. దాదాపు 70 ఏళ్లుగా ప్రపంచస్థాయిలో గుర్తింపుతోపాటు, అత్యున్నత నైపుణ్యాలున్న అధ్యాపకులు, శిక్షకులు, విస్తృతమైన మౌలిక సదుపాయాలతోపాటు విస్తృతస్థాయిలో చేరుకునేందుకు వీలు ఏర్పడిందని ఈ నివేదిక వెల్లడించింది. కేవలం 'మినిమం గవర్నమెంట్ అండ్ మాగ్జిమమ్ గవర్నెన్స్'అనే లక్ష్యసాధన కోసం ఈ సంస్థలో గ్రామీణాభివృద్ధి జోక్యం, ప్రమేయం తగ్గించే ప్రయత్నంతోపాటు బడ్జెట్ కేటాయింపుల తగ్గింపు సరికాదని స్థాయీ సంఘం స్పష్టం చేసింది. ప్రభుత్వపరంగా అందే నిధుల తగ్గుదలతో ఆర్థికంగా ఒడిదొడుకులు ఎదురై గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పథకాలు, కార్యక్రమాలకు ఈ సంస్థ కీలక సహాయ, సహకారాలు దూరమయ్యే అవకాశముందని పేర్కొంది. ఎన్ఐఆర్‌డీ-పీఆర్‌కు దూరం పాటించాలనే యోచన కంటే కూడా మరింత లోతైన వ్యూహాత్మక భాగస్వామ్యం కోసం గ్రామీణాభివృద్ధిశాఖ చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇందుకోసం వ్యవస్థీకృత సంస్కరణలు, నిర్ణయాధికారాల వికేంద్రీకరణ, తగిన బడ్జెట్-గ్రాంట్ ఇన్ ఎయిడ్, మరింతగా స్వయం ప్రతిపత్తి కల్పన ద్వారా ప్రస్తుత గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోనే ఈ సంస్థ విస్తరించే అవకాశం ఉంటుందని తెలిపింది.



ఎగ్జిక్యూటివ్ కమిటీ తీరుపై మండిపాటు

పార్లమెంట్ స్థాయీ సంఘం తన నివేదికలో భాగంగా.. ఈ సంస్థ ప్రస్తుత ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ వ్యవహారశైలిని సైతం తీవ్రస్థాయిలో తప్పుబట్టింది. ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసినవారి సమస్యలు, వారి జీతాలు, పింఛన్లు సైతం సకాలంలో చెల్లించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ వెంటనే ఓ కమిటీని ఏర్పాటు చేసి ఈ సంస్థ పరిపాలన, నిర్వహణకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించాలని సూచించింది. సంస్థ సుస్థిరతను కాపాడేందుకు వెనువెంటనే ప్రస్తుత పరిపాలనా విభాగం తీరును సమీక్షించి, ప్రత్యామ్నాయాలు ఆలోచించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. అప్పటివరకు ప్రభుత్వం ఇస్తున్న గ్రాంట్‌లను కొనసాగించాలని కోరింది. ఎన్ఐఆర్‌డీ-పీఆర్ పరిపాలన, నిర్వహణకు సంబంధించిన పర్యవేక్షణకు గ్రామీణాభివృద్ధిశాఖ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తే మంచిదని అభిప్రాయపడింది.

ఇదీ సంస్థ నేపథ్యం...

- 1958లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌గా ముస్సోరీలో ఏర్పాటు
- 1965లో హైదరాబాద్‌కు తరలింపు
- 1977లో జాతీయ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ (ఎన్ఐఆర్‌డీ)గా పేరు మార్పు
- 2013 డిసెంబర్ 4న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్‌గా మరోసారి పేరు మార్పు
- రాజేంద్రనగర్‌లో దీని క్యాంపస్ 174.21 ఎకరాల్లో విస్తరించి ఉంది
- ఈ సంస్థకు ఢిల్లీ, గువాహతి, వైశాలిలో సెంటర్లు ఉన్నాయి

ప్రత్యేక గుర్తింపు ఎందుకు ?

- కేంద్ర పంచాయతీరాజ్, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖకు ఈ సంస్థ 'థింక్ ట్యాంక్'గా పనిచేస్తుంది
- పీఆర్, ఆర్‌డీ ఇంకా అనుబంధ రంగాలకు ఇదొక జ్ఞానకేంద్రంగా ఉపయోగపడుతుంది.
- కేంద్ర ప్రభుత్వ పథకాల రూపకల్పనలో సహాయ,సహకారాలు అందిస్తుంది.
- ఈ సంస్థ శిక్షణ, పరిశోధనా కార్యకలాపాల ద్వారా జాతీయస్థాయి కార్యక్రమాలు/పథకాల అభివృద్ధి, అమలు విషయంలో తోడ్పాటు అందిస్తున్నది.

సూత్రధారులు, పాత్రధారులను వదిలే ప్రసక్తే లేదు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం, ఫోన్‌ట్యాపింగ్‌లపై విచారణ జరుగుతోందని, ఇందులో సూత్రధారులు, పాత్రధారులను వదిలే ప్రసక్తే లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ తీరు దొంగే దొంగ అన్నట్టు ఉందన్నారు. పదేళ్లపాటు ఫోన్ ట్యాపింగ్ చేసి.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆడిపోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన ఖర్మ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేసే బీఆర్ఎస్ పార్టీకి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదురుదెబ్బ తప్పదని హెచ్చరించారు.

26న బీఆర్ఎస్ విద్యార్థి విభాగ రాష్ట్ర సదస్సు

తెలంగాణ ప్రయోజనాలు కాపాడేలా కార్యాచరణ: బాల్క సుమన్



మాట్లాడుతున్న బాల్క సుమన్. చిత్రంలో భగత్, గెల్లు శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో జాతీయ పార్టీలకు ఊడిగం చేస్తూ తన గురువు చంద్రబాబుకు తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నాడని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, నోముల భగత్‌తో కలిసి గురువారం తెలంగాణభవన్‌లో సుమన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పడావు పెట్టి గోదావరి నదీ జలాలను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించేందుకు జరుగుతున్న కుట్రలను విద్యార్థులకు వివరిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా ఈ నెల 26న నాచారంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగ రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఉదయం జరిగే సదస్సుకు మాజీమంత్రి హరీశ్‌రావు, మధ్యాహ్నం మొదలయ్యే సెషన్‌కు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే జి.జగదీశ్ రెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో పార్టీ విద్యార్థి విభాగం నాయకులు చిరుమళ్ల రాకేశ్‌కుమార్, ఆంజనేయగౌడ్, ధర్మేంద్రరెడ్డి, తుంగబాలు, కడారి స్వామి యాదవ్, కృష్ణ, యాకూబ్‌రెడ్డి పాల్గొన్నారు.

సైనిక పాఠశాలల ఏర్పాటుకు వినతి

రక్షణ శాఖ సహాయ మంత్రిని కలిసిన రాష్ట్ర బీజేపీ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కనీసం మూడు సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీలు కేంద్ర రక్షణ శాఖ మంత్రిని కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీ రఘునందన్ రావు నేతృత్వంలో.. తెలంగాణ బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడం నగేశ్, బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులు కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ యువత భవిష్యత్తు, దేశ రక్షణ రంగంలో సేవ చేయడానికి.. వారికి అవసరమైన అనుభవం, విద్యా విలువలు, నైపుణ్యాలు పెంపొందించేందుకు సైనిక పాఠశాలలు ఎంతగానో దోహదపడతాయని రఘునందన్ రావు పేర్కొన్నారు.



తెలంగాణలో చేపట్టిన కుల గణన సర్వేపై గురువారం ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయంలో ప్రభుత్వం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న దీపాదాస్ మున్షీ, భట్టి విక్రమార్క, మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్, పొన్నం ప్రభాకర్ తదితరులు



గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మామునూరు ఎయిర్‌పోర్టుకు ప్రభుత్వం సహకరించడంలేదు

బీజేపీ నేత సీతారామ్ నాయక్



సాక్షి, న్యూఢిల్లీ: వరంగల్ జిల్లా మామునూరులో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సహకరించడంలేదని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తనకు చెప్పారని బీజేపీ నేత, మాజీ ఎంపీ గుగులోత్ సీతారామ్ నాయక్ తెలిపారు. బుధవారం కేంద్రమంత్రిని పార్లమెంటులోని ఆయన కార్యాలయంలో కలిసిన సందర్భంగా ఈ విషయాన్ని చెప్పారని గురువారం సీతారామ్ నాయక్ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులకు వెల్లడించారు. మామునూరు ఎయిర్‌పోర్టు కోసం ఇప్పటికే రూ.10 వేల కోట్లు కేటాయించామని, డీపీఆర్ కూడా సిద్ధంగా ఉందని, మరో 200 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తే తక్షణమే పనులు ప్రారంభిస్తామని కూడా కేంద్రమంత్రి తెలిపారన్నారు. అలాగే ఆదిలాబాద్, కొత్తగూడెం విమానాశ్రయాల ఏర్పాటుపైనా రామ్మోహన్‌నాయుడుతో చర్చించానన్నారు. కాగా రాష్ట్ర మంత్రి వర్గంలో బీసీలకు న్యాయం చేసిన తర్వాతే.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై మాట్లాడాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు.

పార్లమెంట్‌లో తెలంగాణం

భారత పౌరసత్వానికి 'గుడ్ బై'

- ఆరేళ్లలో పౌరసత్వం త్యజించిన 10.40 లక్షల మంది భారతీయులు
- రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ ప్రశ్నకు సమాధానం ఇచ్చిన కేంద్ర విదేశాంగ శాఖ



సాక్షి, న్యూఢిల్లీ: 2019 నుంచి భారత పౌరసత్వం త్యజిస్తున్న వారి సంఖ్య పెరుగుతోందని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ గురువారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్‌సింగ్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఈ ఆరు సంవత్సరాల్లో మొత్తం 10,40,860 మంది భారతీయులు విదేశీ పౌరసత్వం కోసం భారత పౌరసత్వాన్ని త్యజించారు. 2019లో 1,44,017 మంది, 2020లో 85,256 మంది, 2021లో 1,63,370 మంది, 2022లో అత్యధికంగా 2,25,620 మంది, 2023లో 2,16,219 మంది, 2024లో 2,06,378 మంది భారతీయులు పౌరసత్వాన్ని వదులుకున్నారు. అయితే పౌరసత్వం త్యజిస్తున్న భారతీయుల నుంచి వచ్చిన అభ్యర్థనలపై ప్రత్యేక తనిఖీలు లేదా సర్వేలు నిర్వహిస్తున్నామన్న కేంద్రం... ఆ వివరాలను మాత్రం వెల్లడించలేదు. దానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. పౌరసత్వం త్యజించే భారతీయులు ప్రధానంగా విదేశాల్లో స్థిరపడేందుకు లేదా డ్యూయల్ సిటిజన్‌షిప్ ఉన్న దేశాల్లో మరిన్ని అవకాశాల కోసం ఇలా చేస్తున్నారు.

భారతమాల-2 కింద ఒక్క ప్రాజెక్ట్ కూడా మంజూరు కాలేదు: కేంద్రం



తెలంగాణతో పాటు దక్షిణ భారత రాష్ట్రాల్లో భారతమాల పథకం ఫేజ్-2 కింద ఇప్పటి వరకు ఒక్క రహదారి ప్రాజెక్ట్ కూడా మంజూరు కాలేదని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీ స్పష్టం చేశారు. భారతమాల రెండో దశను ప్రభుత్వం ఇంకా అధికారికంగా ప్రారంభించలేదని, అందుకే ఈ పథకం కింద ఎలాంటి ప్రాజెక్టులూ ఆమోదం పొందలేదన్నారు. గురువారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. హైదరాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్-బెంగళూరు మధ్య రహదారి మరమ్మతులు, విస్తరణల కోసం ప్రాజెక్ట్ నివేదికలు (డీపీఆర్‌లు) సిద్ధం చేస్తున్నామని తెలిపారు. డీపీఆర్‌ల ఆధారంగా నిధుల వినియోగం, ప్రాజెక్టు అమలుపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇవన్నీ పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ సమన్వయంతో ఉంటాయని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఈ ప్రాజెక్టుల వల్ల కలిగే ప్రయోజనాల వివరాలు తుది డీపీఆర్‌లో వెల్లడిస్తామని గడ్కరీ పేర్కొన్నారు. అయితే ఇవి పూర్తయితే రవాణా సామర్థ్యం పెరగడంతోపాటు వస్తు, ప్రయాణికుల ట్రాన్స్‌పోర్ట్‌లో వేగం పెరగడం, ప్రాంతీయ అభివృద్ధికి వేగం చేకూరే అవకాశముందని గడ్కరీ అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో పెట్రోల్‌కు 19.09% ఎథనాల్ మిశ్రమం

లోక్‌సభలో బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నకు కేంద్రం సమాధానం



ఎథనాల్ మిశ్రమంపై దేశవ్యాప్తంగా చర్చ ఊపందుకున్న నేపథ్యంలో తెలంగాణలో పెట్రోల్‌కు 19.09 శాతం ఎథనాల్ మిశ్రమం చేశామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఏడాది జూన్ 30 నాటికి ఈ మిశ్రమ స్థాయి నమోదైందని... దేశవ్యాప్తంగా సగటు మిశ్రమం 18.93 శాతం కాగా, జూన్ నెలలో మాత్రం అత్యధికంగా 19.92 శాతం నమోదైనట్టు కేంద్ర పెట్రోలియం సహాయమంత్రి సురేష్ గోపీ గురువారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. రాష్ట్రాల వారీగా లక్ష్యాలు నిర్దేశించకపోయినా, ప్రస్తుతానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణ రాష్ట్రాలు మంచి ప్రగతిని సాధించాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 19 శాతం, తమిళనాడులో 19.11 శాతం, కర్ణాటకలో 19.13 శాతం ఎథనాల్ మిశ్రమం నమోదైంది. కాగా భారతదేశంలోని అన్ని ఎథనాల్ డిస్టిల్లరీలకు గ్రౌండ్‌వాటర్ వినియోగంపై నిషేధం అమలులో ఉందని కేంద్రమంత్రి సురేష్ గోపి తెలిపారు. తెలంగాణలో ఏర్పాటయ్యే యూనిట్లు కూడా నీటి వినియోగ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాల్సిందే అని స్పష్టం చేశారు.

సహకార సమాఖ్య పరిధిలోకి బర్రెలు, ఆవులు

- రైతు కమిషన్‌కు పీసీసీ నేతల వినతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య పరిధిలోకి బర్రెలు, ఆవులను చేర్చాలని పీసీసీ నేతలు చరణ్ కౌశిక్ యాదవ్, లోకేశ్ యాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భవానీ రెడ్డి, భూమి సునీల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉమ్మడి 9 జిల్లాలకే పరిమితమైన సమాఖ్యలను.. విభజన అనంతరం ఏర్పాటైన 33 కొత్త జిల్లాలకు వర్తింపజేయాలని కోరారు. ఈ సమాఖ్యకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో చైర్మన్లను నియమించేలా చట్టాన్ని సవరించాలని కోరారు. నాబార్డు ద్వారా రుణాలు మరింత మెరుగుపడేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. దీనిద్వారా కురుమ, యాదవ సామాజిక వర్గాలకు మెరుగైన ఉపాధి, రాజకీయ అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలోనే కమిషన్ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, రాష్ట్రంలో గొర్రెలు, మేకలు, బర్రెలు, ఆవుల పెంపునకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

బీసీలకు ఎవరేం చేశారో చర్చకు సిద్ధం

- బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతులకు ఏ పార్టీ ఏం చేసిందనే అంశంపై బహిరంగ చర్చకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు సవాల్ చేశారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే బీసీ నాయకుడికి ముఖ్యమంత్రి పదవిని అప్పగించాలని కోరారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో సగం మంది బీసీలున్నా.. రేవంత్ రెడ్డి కేబినెట్‌లో ఆ మేరకు ప్రాతినిధ్యం కల్పించారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం కల్పించిన నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. ఉమ్మడి ఏపీలో అర్ధ శతాబ్దం పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఒక్కసారైనా బీసీ వర్గాల వారిని ఎందుకు సీఎం చేయలేదని నిలదీశారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ ఈరోజు బీసీల గురించి మొసలికన్నీరు కారుస్తోందని హరీశ్ ఎద్దేవా చేశారు.

ఉప రాష్ట్రపతిగా బీసీ: జాజుల వినతి



సాక్షి, హైదరాబాద్: భారత ఉప రాష్ట్రపతిగా బీసీ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆయన లేఖ రాశారు. భారత రాష్ట్రపతిగా తొలిసారి ఆదివాసీ మహిళకు అవకాశం కల్పించినట్లు.. బీసీ సామాజిక వర్గానికి చెందిన బండారు దత్తాత్రేయ లేదా తమిళసైను ఉప రాష్ట్రపతిగా నియమించాలని కోరారు.

26న తెలంగాణ జాగృతి 'లీడర్' శిక్షణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈనెల 26న 'లీడర్'రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక ఉపన్యాసంతో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. రాష్ట్రంలోని యువత, మహిళలు, బహుజనులను రాజకీయాల్లో ప్రోత్సహించేందుకు తెలంగాణ జాగృతి.. 'లీడర్'రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జూలై 26న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో రెండు సెషన్స్‌లో శిక్షణ తరగతులు ఉంటాయని వెల్లడించారు. ఈ సందర్భంగా పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ప్రజాప్రతినిధుల విధులు, బాధ్యతలు, రాజ్యాంగం, ప్రజాసేవలో నాయకుల పాత్ర తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు.



గురువారం తన పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేక్ కట్ చేస్తున్న కేటీఆర్. చిత్రంలో మల్లారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు



తల్లిదండ్రులు కేసీఆర్, శోభ ఆశీర్వాదం తీసుకున్న కేటీఆర్. చిత్రంలో కేటీఆర్ భార్య శైలిమ, కుమారుడు హిమాన్షు



వన్యప్రాణులకు ప్రత్యేక సంరక్షణ చర్యలు

- బెబ్బులుల సంరక్షణ కోసం 58 రక్షిత ప్రాంతాలు
- సింహాల అవసరాలకు కారిడార్ అభివృద్ధి
- వన్యప్రాణుల బారినపడి మరణించిన వారికి రూ.10లక్షల నష్టపరిహారం
- కేంద్ర అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ వెల్లడి




సాక్షి, న్యూఢిల్లీ: గతంతో పోలిస్తే దేశంలో ప్రస్తుతం పులులు, సింహాలు, ఏనుగుల సంఖ్య పెరుగుతున్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో 3,682 పులులు, 891 సింహాలు, 30,711 ఏనుగులు ఉన్నట్లు రాజ్యసభలో కేంద్ర అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడించారు. వీటి సంరక్షణకు కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జాతీయ పులుల సంరక్షణ సంస్థ రాష్ట్రాలతో కలిసి నాలుగేళ్లకోసారి అఖిల భారత పులుల అంచనా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీని ఆధారంగా..

2018లో 2,967 పులుల జనాభా ఉండగా,
2022లో 3,682కు పెరిగిందన్నారు.

గుజరాత్ రాష్ట్రం నిర్వహించిన 16వ సింహాల సంఖ్య అంచనా ప్రకారం
2020లో 674 సింహాలు ఉన్నట్లు అంచనా వేయగా..
2025లో 891 సింహాలు ఉన్నట్లు గుర్తించారని పేర్కొన్నారు.

ఇక ఏనుగుల సంఖ్య అంచనా
2017లో పూర్తి అయినట్లు చెప్పారు.
2017లో ఏనుగులు 29,964 ఉన్నట్లు తెలిపారు.

పులుల సంరక్షణకు 58 నిల్వల ఏర్పాటు..



వన్యప్రాణులను, వాటి ఆవాసాలను సంరక్షించేందుకు 1972 వన్యప్రాణుల(రక్షణ) చట్టంలోని నిబంధనల ప్రకారం దేశవ్యాప్తంగా వన్యప్రాణుల ఆవాసాలను కవర్ చేసే ఉద్యానవనాలు, అభయారణ్యాల వంటి రక్షిత ప్రాంతాల నెట్‌వర్క్ సృష్టించినట్లు కీర్తివర్ధన్ చెప్పారు. దేశంలో దాదాపు 2.5శాతం భౌగోళిక ప్రాంతంలో పులులు నివాసం ఉంటున్నట్లు కేంద్ర సహాయ మంత్రి వెల్లడించారు. వీటి సంరక్షణ కోసం 58 పులుల నిల్వలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక సింహాల విషయంలో గుజరాత్‌లోని బర్దాలో రెండవ నివాసాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆసియా సింహాల ఆవాస అవసరాలను తీర్చేందుకు గుజరాత్ రాష్ట్రంలో ఆవాస మెరుగుదల పనులు, కారిడార్ అభివృద్ధి, రక్షిత ప్రాంతాల వెలుపల గడ్డి భూముల మెరుగుదల పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏనుగుల సంరక్షణ కోసం 14 ఏనుగుల శ్రేణి రాష్ట్రాలలో 33 ఏనుగుల నిల్వలు స్థాపించినట్లు వివరించారు. వన్యప్రాణుల దాడుల్లో గాయపడిన, మరణించిన బాధితులకు 'వన్యప్రాణుల ఆవాసాల అభివృద్ధి', 'ప్రాజెక్ట్ టైగర్ అండ్ ఎలిఫెంట్' కింద నష్టపరిహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. శాశ్వత వైకల్యం లేదా మరణించిన వారికి రూ.10లక్షల నష్టపరిహారాన్ని 24గంటల్లో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



టైగర్ కన్జర్వేషన్ ప్రోగ్రామ్ ప్రారంభమైన రోజుల్లో పులుల సంఖ్యను అంచనా వేసేందుకు ఉపయోగించిన పద్ధతులు అశాస్త్రీయమైనవిగా తేలాయి. ఒక పులిని పలుమార్లు లెక్కించడం వల్ల పులుల సంఖ్యలో తప్పులు వచ్చాయి. ఆ తర్వాత పులుల పాదముద్రల ఆధారంగా లెక్కించేవారు. వాటితోనూ పులుల సంఖ్యను కచ్చితంగా అంచనా వేయడం సాధ్యం కాదని అధికారులు గ్రహించారు. అనంతరం పులులను లెక్కించే అత్యాధునిక పద్ధతి 'కెమెరా ట్రాప్' అందుబాటులోకి వచ్చింది. పులుల సంచారం ఉన్న ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిలో రికార్డు అయిన పులుల ఫొటోల ఆధారంగా వాటి సంఖ్యను లెక్కిస్తున్నారు. ఆ ఫొటోల్లో కనిపిస్తున్న పులుల చర్మంపై ఉన్న చారలను గుర్తించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నారు. మనిషి వేలిముద్రల లాగే పులి చర్మంపై ఉండే చారలు కూడా వేర్వేరుగా ఉంటాయి. ఏ రెండు పులులకు ఒకే విధంగా చారలు ఉండవు. ఇది ఒక పులిని రెండోసారి లెక్కించకుండా ఉపయోగపడుతుంది. ఈ అత్యాధునిక 'కెమెరా ట్రాప్' ద్వారా పులులను లెక్కిస్తున్నారు.

క్లుప్తంగా...

కింగ్‌డమ్ సినిమా టికెట్ల ధర పెంపు

సాక్షి, అమరావతి: విజయ్ దేవరకొండ నటించిన కింగ్‌డమ్ సినిమా టికెట్ల రేట్ల పెంపునకు ప్రభుత్వం అనుమతిచ్చింది. సినిమా విడుదల అయిన తరువాత తొలి పది రోజుల పాటు మల్టీప్లెక్స్ థియేటర్లలో టికెట్‌పై రూ.75, సింగిల్ స్క్రీన్ థియేటర్లో టికెట్‌పై రూ.50 పెంచుకునేందుకు అంగీకరించింది. ఈ మేరకు హోమ్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

కొత్తగా 1.09 లక్షల మంది వితంతువులకు పింఛన్లు

రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందించే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సరళీకృతం చేసిందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం తెలిపారు. పింఛన్ తీసుకుంటున్న భర్త చనిపోతే వెంటనే భార్యకు ఆ పింఛన్‌ను వీలైనంత త్వరగా ఇచ్చే విధానాన్ని అమల్లోకి తెచ్చామని చెప్పారు. గతేడాది నవంబర్ 1 నుంచి పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన పెన్షన్‌దారుల భార్యలకు (స్పౌజ్ కేటగిరి కింద), అర్హులైన వారికి కలిపి మొత్తం 1,09,155 మందికి కొత్తగా పెన్షన్ మంజూరు చేసినట్లు చెప్పారు. వీరికి ఆగస్ట్ 1న రూ.4 వేల చొప్పున పింఛను పంపిణీ చేయనున్నామని, ఇందుకోసం ప్రతినెల రూ.43.66 కోట్లు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించనుందని తెలిపారు.

ఎస్ఐఆర్‌కు 2014 ఓటర్ లిస్టును ప్రామాణికంగా తీసుకోండి

టీడీపీ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితా విషయంలో ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్ఐఆర్)కు 2002 నుంచి కాకుండా 2014 ఎన్నికల ఓటర్ లిస్టును ప్రామాణికంగా తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరినట్లు టీడీపీ తెలిపింది. గురువారం సచివాలయంలో జరిగిన సమావేశంలో తమ పార్టీ నాయకులు పాల్గొన్నట్లు పేర్కొంది. 2002ను ఎస్ఐఆర్‌కు పరిగణనలోకి తీసుకుంటే ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ వలస వెళ్లిన ఏపీ ప్రజలు తిరిగి ఓటు హక్కు పొందడానికి ఇబ్బంది పడతారని వివరించినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా విషయంలో బిహార్‌లో అమలు చేస్తున్న ఎస్ఐఆర్‌ను రాష్ట్రానికి చెందిన పలు రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని పేర్కొంది.

బీసీ హాస్టళ్లలో క్రీడలకు ప్రోత్సాహం

రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత

సాక్షి, అమరావతి: బీసీ హాస్టళ్ల విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రణాళికలు రూపొందించామని, హాస్టళ్లలో క్రీడా వసతులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం మంత్రిని శాప్ చైర్మన్ రవినాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీ హాస్టళ్లలో క్రీడా వసతుల ఏర్పాటుపై చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో ఇప్పటికే స్పోర్ట్స్ కిట్లు విరివిగా అందజేస్తూ మండల, జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పర్యాటకానికి పురస్కారం

సాక్షి, అమరావతి: ఏపీ పర్యాటక రంగానికి ప్రతిష్టాత్మక ఎమర్జింగ్ కోస్టల్ అండ్ హెరిటేజ్ అవార్డు లభించినట్లు ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ ఇంటర్నేషనల్ టూరిజం కాంక్లేవ్ అండ్ ట్రావెల్ అవార్డ్ ఈ పురస్కారాన్ని ప్రకటించినట్లు వివరించారు. జూలై 26న న్యూఢిల్లీలో అవార్డు అందించనున్నట్లు ఐసీఎం గ్రూప్ ఎండీ, చైర్మన్ అజయ్‌గుప్తా, ఐటీసీటీఏ జ్యూరీ సభ్యులు తెలిపారన్నారు.

ఛాయ తగ్గని దేశవాళీ

పసుపు సాగులో స్థానిక రకానికి ప్రాధాన్యం

పసుపు సాగులో ఏజెన్సీ వాతావరణానికి అనువైన ఆధునిక వంగడాలు అందుబాటులో ఉన్నప్పటికీ గిరి రైతులు దేశవాళీ రకం వైపే మొగ్గు చూపుతున్నారు. అధిక దిగుబడినిచ్చే రోమా రకాన్ని శాస్త్రవేత్తలు పరిచయం చేసినా ఆసక్తి చూపడం లేదు. మెట్ట, పోడు భూముల్లో దేశవాళీ రకం సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

- ఆధునిక వంగడాలపై కానరాని ఆసక్తి
- ఏటా పంట దిగుబడిలో కొంతమేర విత్తనానికి కేటాయింపు
- సొంతంగా సమకూర్చుకుంటున్న గిరి రైతులు
- అప్రమత్తంగా లేకుంటే తెగుళ్లతో నష్టమంటున్న శాస్త్రవేత్తలు


పసుపు సాగు


తాటాకు తెగులు సోకిన పసుపు పైరు

చింతపల్లి: అల్లూరి జిల్లా ఏజెన్సీలో గిరి రైతులకు ప్రధాన ఆదాయ వనరుల్లో కాఫీ మాదిరిగానే పసుపు సాగు కీలకం. ఏటా సాగు చేస్తున్న పంటలో కొంతమేర పసుపు దుంపను భద్రపరిచి విత్తనంగా వినియోగించడం ఆనవాయితీగా వస్తోంది. దీనివల్ల విత్తన ఖర్చు తగ్గుతోందని గిరి రైతులు చెబుతున్నారు.

- పాడేరు డివిజన్ పరిధిలో సుమారు 24 వేల హెక్టార్లలో పసుపు పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు పైరుకు అనుకూలంగా ఉన్నప్పటికీ తెగుళ్ల సోకే అవకాశం కూడా లేకపోలేదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో సాగు చేపట్టారు. పైరు ఎదుగదల బాగానే ఉంది. అయితే ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి.
- దేశవాళీ రకాలను కూడా ఏడాది పంటగా సాగు చేయడం వల్ల మంచి దిగుబడులు ఆదాయం పొందవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అలాకాకుండా రెండేళ్ల పంటగా సాగు చేయడం వల్ల రెండో ఏడాది గణనీయంగా దిగుబడులు తగ్గిపోతున్నాయి.



పెరుగుతున్న తేమశాతంతో నష్టం

వర్షాలు కురుస్తున్నందున గాలిలో తేమశాతం ఎక్కువగా ఉంటోంది. ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆకుమచ్చ, తాటాకు తెగులు సోకే ప్రమాదం ఉందని ఉద్యానవన శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సకాలంలో నివారణ చర్యలు చేపట్టకుంటే దిగుబడి నష్టపోయే పరిస్థితులు ఉంటాయని వారు హెచ్చరిస్తున్నారు.

'రోమా' అనుకూలమైనా..

ఏజెన్సీలో పసుపు సాగుకు 'రోమా' రకం అత్యంత అనుకూలమని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆదివాసీలు దేశవాళీ రకం పసుపును రెండేళ్ల పంటగా సాగుచేస్తున్నారు. అయితే రోమా రకం పసుపు కేవలం పది నెలల్లో ఎకరానికి దేశవాళీ రకం కన్నా ఎక్కువ దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ రకం పసుపులో కుర్కుమిన్ అధికంగా ఉన్నందున అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని గతంలో రైతులకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఎస్టీ ఉప ప్రణాళిక నిధులతో 250 మంది రైతులకు 20 కిలోల చొప్పున పంపిణీ చేశారు. రైతు స్థాయిలో విత్తనం ఉత్పత్తి చేసుకునేలా సహకారం అందించినా ఆశించిన ఫలితాలు రాలేదు. దేశవాళీ రకం కన్నా ఈ రకం పైరులో 25 నుంచి 35 శాతం దిగుబడి ఎక్కువగా ఉంటున్నా ఈ రకం సాగుపై ఆసక్తి కనబరచడం లేదు.

మచ్చ తెగుళ్ల లక్షణాలివీ..

- మొక్కల ఆకులపై చిన్న చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడి అవి క్రమేపీ గోధుమ రంగులోకి మారి ఎండిపోతాయి. ఈ తెగులు కింద ఆకుల నుంచి పైకి వ్యాప్తి చెందుతుంది. దీనికి ఆకుమచ్చ తెగులుగా గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. నవంబర్- డిసెంబర్ నెలలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీని విషయంలో రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి.
- ఆకులపై అండాకారంలో పెద్ద మచ్చలు కనిపిస్తే తాటాకు మచ్చ తెగులుగా గుర్తించాలి. ఇవి ముదురు గోధుమ వర్ణంలో ఉంటాయి. ఆకు కాడపై మచ్చలు ఏర్పడటంతో ఆకు కిందకు వాలిపోతుంది. ఈదురు గాలులతో కూడిన వర్షాలు, గాలిలో తక్కువ తేమ, ఉష్ణోగ్రతలు ఈ తెగులు వ్యాప్తికి దోహదపడతాయి. సెప్టెంబర్ నుంచి ఈ తెగులు ప్రభావం పైరుపై కనిపిస్తుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

అప్రమత్తత అవసరం



దేశవాళీ రకం పసుపు పైరుపై మచ్చలు కనిపించిన వెంటనే రైతులు అప్రమత్తం కావాలి. ప్రారంభంలోనే సస్యరక్షణ చేపడితే వ్యాప్తిని వెంటనే నివారించవచ్చు. ఒక శాతం బోర్డో మిశ్రమం/ ఒక లీటరు నీటికి ఒక మిల్లీలీటర్ ప్రోపికొనజోల్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్‌కు 0.5 ఎంఎల్ సబ్బునీరు కలిపి 15 రోజుల వ్యవధిలో సెప్టెంబరు నుంచి 3 నుంచి 4 సార్లు పిచికారి చేయాలి. పైరు విత్తుకునే సమయంలో జాగ్రత్తలు పాటించడం వల్ల కూడా నివారించవచ్చు. ఆరోగ్యకరమైన విత్తనాన్ని ఎంచుకుని విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్లను నివారించవచ్చు.

– శెట్టి బిందు, ప్రధాన శాస్త్రవేత్త, ఉద్యానవన పరిశోధన స్థానం, చింతపల్లి

సైబర్ నేరాలపై 17.82 లక్షల ఫిర్యాదులు

- రూ.5,489 కోట్లు ఫ్రీజ్
- సైబర్ నేరాల కట్టడికి ఐ4సీ, సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్‌లు
- 9.42 లక్షల సిమ్ కార్డులు బ్లాక్
- లోక్‌సభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణకు కేంద్రం కృషి చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్పారు. నేరాల నియంత్రణతో పాటు.. ప్రజలకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేరాల నియంత్రణ, పరిష్కారానికి కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో 'ఇండియన్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్'(ఐ4సీ)ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాల్లో కొట్టేసిన డబ్బును ఫ్రీజ్ చేసేందుకు ఐ4సీ కింద ×సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం (సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్)ను 2021లో ప్రారంభించినట్లు చెప్పారు. లోక్‌సభలో పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు బండి సంజయ్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఇప్పటి వరకు 17.82 లక్షల ఫిర్యాదులు ఐ4సీకి అందగా.. వీటిలో రూ.5,489 కోట్లు నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లకుండా ఫ్రీజ్ చేసినట్లు వివరించారు. ఈ ఫిర్యాదుల నిమిత్తం 1930 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ అందుబాటులో ఉందన్నారు. నేరగాళ్లు సైబర్ నేరాల కోసం వినియోగిస్తున్న 9.42 లక్షల సిమ్ కార్డులు, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు దేశంలో నార్కో కో–ఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. ఈ కో–ఆర్డినేషన్ సెంటర్‌లో కేంద్ర అధికారులతో పాటు, రాష్ట్ర, జిల్లా పరిధిలోని అధికారులు సైతం ఉన్నట్లు తెలిపారు.

సైబర్ మోసాలపై సదస్సులు

ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

సాక్షి, అమరావతి: సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలను రక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ చెప్పారు. గురువారం విజయవాడలోని టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. నేరగాళ్లు ఏవిధంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారనే విషయాలతోపాటు మోసపోయిన అనంతరం ఎలా ఫిర్యాదు చేయాలి అనే విషయాలపై అవగాహన సదస్సుల్లో తెలియజేస్తామన్నారు. సైబర్ సెక్యూరిటీ రంగంపై ఆసక్తి ఉన్న గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన విద్యార్థులు, ఐటీ నిపుణులకు శిక్షణ కోసం రాష్ట్రస్థాయి సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ నిర్వహించామని చెప్పారు. ఎంపికైన వారికి 6 నెలలపాటు సైబర్ సెక్యూరిటీలో శిక్షణ ఇచ్చామన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సినీ ప్రముఖులతో వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయిస్తున్నామని మోహనకృష్ణ తెలిపారు. ఏపీటీఎస్ సైబర్ సెక్యూరిటీ ఆడిట్ సేవలను ప్రభుత్వ సెక్టార్‌లోనే కాకుండా ప్రైవేట్ సెక్టార్‌లోకి కూడా విస్తరించాలని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తద్వారా ఏపీకి సైబర్ సెక్యూరిటీ ఆడిటింగ్ మీద వచ్చే ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. ఏపీని సెక్యూర్డ్ డిజిటల్ ఫ్యూచర్‌గా నిర్మించేందుకు యువతను నడిపించే లక్ష్యంగా ఏపీటీఎస్ పనిచేస్తోందన్నారు.

పామాయిల్ మిషన్ కోసం రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నూనె గింజల సాగు, ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్‌సీడ్స్‌ను సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా సీఎస్ విజయానంద్, మెంబర్ సెక్రటరీగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావుతో పాటు పలు శాఖలకు చెందిన 10 మంది అధికారులు సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు సభ్యులుగా ఆయిల్ సీడ్, ఎఫ్‌పీవో, కో ఆపరేటివ్స్, సంబంధిత పరిశ్రమల వర్గాల నుంచి పలువురిని నియమించారు. ఆయిల్ పామ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 25 మండలాలను నోటిఫై చేశారు.

'సీబీజీ' ప్లాంట్ల నిర్మాణం వేగవంతం చేయాలి

రిలయన్స్ ప్రతినిధులతో మంత్రి గొట్టిపాటి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 'రిలయన్స్' ఏర్పాటు చేస్తున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆ సంస్థ ప్రతినిధులను కోరారు. రిలయన్స్ గ్రీన్ ఎనర్జీలో భాగంగా సీబీజీ ప్లాంట్ల నిర్మాణాలు, ప్రాజెక్టులకు స్థలాల కేటాయింపు తదితర అంశాలపై గురువారం సచివాలయంలో రిలయన్స్ సంస్థ ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి ప్రకాశం జిల్లాను ఇంటిగ్రేటెడ్ సీబీజీ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. సీబీజీ ప్లాంట్లతో రైతులకు మెరుగైన కౌలు, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రకాశం జిల్లాలోని వాయుమడుగు, పీసీపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ప్లాంట్లను 26 మార్చి 2026 నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను మంత్రి ఆదేశించారు. శ్రీ సత్యసాయి, నంద్యాల, అనంతపురం జిల్లాల్లోనూ సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ ట్రాన్స్ కో జేఎండీ కీర్తి చేకూరి, నెడ్ క్యాప్ ఎండీ ఎం.కమలాకర్ బాబు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి మీ శాఖ నిధులు ఇవ్వండి

గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖ మంత్రులకు శాప్ చైర్మన్ వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖ నిధులను వినియోగించాలని శాప్ చైర్మన్ రావినాయుడు ఆయా శాఖల మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం సచివాలయంలో మంత్రులను కలిశారు. గిరిజన ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధి, క్రీడా సదుపాయాల కల్పన, ట్రైబల్ స్పోర్ట్స్ స్కూల్, ట్రైబల్ స్పోర్ట్స్ హాస్టల్ ఏర్పాటుకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిధులను సమకూర్చాలని ఆ శాఖ మంత్రి సంధ్యారాణిని కోరారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో ఎస్సీ కాంపోండ్ కింద సబ్ ప్లాన్ నిధులను వినియోగించి క్రీడామైదానాల అభివృద్ధి, కేవీకేల ఏర్పాటుకు సహకరించాలని సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి విజ్ఞప్తి చేశారు. ఏపీలో పారా స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (నేషనల్ డిజైబిలిటీ స్పోర్ట్స్ సెంటర్) ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఇక బీసీ సంక్షేమ శాఖ ద్వారా రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో క్రమంగా క్రీడలను ప్రోత్సహించాలని బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎస్.సవితను కోరారు.

ప్రభుత్వ పుస్తక ప్రెస్‌లో పదోన్నతులకు కమిటీ

సాక్షి, అమరావతి : ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ప్రింటింగ్ ప్రెస్‌లో మొదటి, రెండో స్థాయి గెజిటెడ్ పోస్టుల పదోన్నతుల కోసం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ)ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులిచ్చారు. 2025–2026, 2026–2027 సంవత్సరాల ప్యానెల్ కోసం ఈ కమిటీని నియమిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాల డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా, పరీక్షల విభాగం డైరెక్టర్, అదనపు కార్యదర్శి సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఉపాధ్యాయులను పాఠాలు చెప్పనీయండి: ఎస్టీయూ

సాక్షి, అమరావతి: ఈ విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేస్తామన్న అధికారులు, బోధన తప్ప అన్ని పనులు చేయిస్తున్నారని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి మండిపడ్డారు. ఉపాధ్యాయులకు స్వేచ్ఛ లేకుండా ప్రభుత్వం పనుల సంకెళ్లు విధిస్తోందని ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు రికార్డులు, రిపోర్టుల పని తొలగిస్తే స్వేచ్ఛగా బోధిస్తారని, కానీ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి టీచర్ల సేవలు ఆన్‌లైన్‌కే పరిమితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గూగుల్ ఫారాలు నింపడం, యోగాంధ్ర కార్యక్రమ ఫొటోలు అప్‌లోడ్ చేయడం, కార్యక్రమ నివేదిక సమర్పించడం, మెగా పీటీఎం పేరుతో కమిటీలు వేయడం, విద్యార్థులకు అందించే కిట్లను తల్లిదండ్రులతో బయోమెట్రిక్ ద్వారా, చరవాణికి వచ్చే ఓటీపీల ద్వారా ధ్రువీకరణ చేయడం తదితర పనులతో ఉపాధ్యాయులకు మానసిక ప్రశాంతత లేకుండా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయ సంఘాలతో, విద్యావేత్తలతో చర్చించి బోధనేతర కార్యక్రమాల భారం తగ్గించి ఉపాధ్యాయులను స్వేచ్ఛగా పాఠాలు బోధించనీయాలని, లేకపోతే ఉద్యమాలకు సిద్ధమవుతామని తేల్చి చెప్పారు.

'పీఎస్ హెచ్‌ఎంలకు జాబ్ చార్ట్ ప్రకటించండి'

రాష్ట్రంలో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ స్కూళ్లలో నియమితులైన హెచ్‌ఎంలకు జాబ్ చార్ట్ ప్రకటించాలని పీఎస్ హెఎంల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. పీఎస్ హెచ్‌ఎంల సమస్యల పరిష్కారం కోసం ఏపీపీఎస్ హెచ్‌ఎం ఫోరంను ఏర్పాటు చేసి, కమిటీని నియమించినట్టు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా సీవీ ప్రసాద్ (కడప జిల్లా), ప్రధాన కార్యదర్శిగా వీరవల్లి వెంకటేశ్వర రావు (పశ్చిమగోదావరి), అసోసియేట్ అధ్యక్షులుగా బి.సూర్యనారాయణ (సత్యసాయి), టి.భాస్కర్‌రెడ్డి (అన్నమయ్య), ధర్నాశి చిరంజీవి(ప్రకాశం), జి.వెంకటరమణయ్య (తిరుపతి), లోయ రమేష్ కుమార్ (కృష్ణా), బి.బాబురెడ్డి (చిత్తూరు)ను ప్రకటించారు. వీరితోపాటు అన్ని జిల్లాల నుంచి ఉపాధ్యక్షులు, అదనపు కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ప్రకటించారు.


● రవితేజ
● ప్రభాస్


● షారుక్ ఖాన్


● అడివి శేష్


● కార్తీ

గాయం

● అయినా తగ్గేదే లే...

వెండితెరపై హీరోలు కావొచ్చు లేదా హీరోయిన్లు కావొచ్చు... విలన్లను, రౌడీ మూకలను రఫ్ఫాడిస్తుంటే ప్రేక్షకులకు ఆ కిక్కే వేరు. కొన్ని సన్నివేశాల కోసం ఎత్తైన ప్రదేశాల నుంచి దూకడం, వాహనాలపై నుంచి జంప్ చేయడంతో పాటు పలు రిస్కీ సన్నివేశాలకు సై అంటుంటారు కథానాయకులు. అయితే పోరాట సన్నివేశాల్లో కొందరు డూప్స్‌ని వాడుతుంటారు. మరికొందరైతే రియాలిటీ కోసం డూప్‌లను కాదని స్వయంగా వారే యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంటుంటారు. అయితే ఆ పోరాట సన్నివేశాల చిత్రీకరణ అన్నది ఆషామాషీ కాదు... ఎలాంటి గాయాల బారిన పడకుండా ఫైట్ సీన్స్ పూర్తి చేయడం అనేది నటీనటులతో పాటు స్టంట్‌మేన్, ఫైటర్స్‌తో పాటు ఇతర సాంకేతిక నిపుణులందరికీ ఓ సవాల్ లాంటిదే. షూటింగ్ సమయంలో నటీనటులకు గాయాలు సాధారణమే అయినప్పటికీ, కొన్నిసార్లు అవి తీవ్రంగా కూడా ఉంటాయి. ఈ కారణంగా వైద్యుల సూచనల మేరకు కొన్ని నెలల పాటు షూటింగ్‌లకు దూరంగా ఉండాల్సి వస్తుంది యాక్టర్స్‌కి. చిన్న బ్రేక్ తర్వాత 'అయినా తగ్గేదే లే' అంటూ... మళ్లీ లొకేషన్‌లో ఫైట్స్‌లో విజృంభిస్తుంటారు. ఇక ఈ మధ్య కాలంలో ఇలాంటి గాయాల బారిన పడిన నటీనటుల గురించి ఓ లుక్కేద్దాం.

కాలికి గాయం

హీరో ప్రభాస్ వరుస పాన్ ఇండియా సినిమాలతో దూసుకెళుతున్నారు. ఆయన చేతిలో ప్రస్తుతం 'ది రాజా సాబ్', 'ఫౌజీ' (ప్రచారంలో ఉన్న టైటిల్), 'స్పిరిట్' వంటి చిత్రాలున్నాయి. 'సీతారామం' మూవీ ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఫౌజీ'. ఈ సినిమాలో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వీ ఇస్మాయిల్ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్‌లో ప్రభాస్ కాలికి గాయం అయినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. 1945 నాటి బ్రిటిష్ పాలన నేపథ్యంలో సాగే ఈ చిత్రకథలో ప్రభాస్ బ్రిటిష్ ఆర్మీ సైనికుడిగా కనిపించనున్నారట. దేశభక్తి, త్యాగం ఇతివృత్తాలుగా భారతదేశ స్వాతంత్ర్య పోరాటం నేపథ్యంలో ఈ స్క్రిప్ట్‌ని తీర్చిదిద్దారట హను. మిలటరీ ఆఫీసర్ రోల్ కావడంతో ఇందులో యాక్షన్ సీక్వెన్స్ ఎక్కువగా ఉన్నాయట. అందులో భాగంగానే డూప్ లేకుండా పోరాట సన్నివేశాలు తెరకెక్కిస్తున్న సమయంలో గత డిసెంబరులో ప్రభాస్ కాలికి గాయమైనట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఆయన ఇటలీకి వెళ్లి అక్కడే వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహా మేరకు అక్కడే విశ్రాంతి తీసుకుని, ఇండియా తిరిగొచ్చారని టాక్. ఈ చిత్రంలో ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్నారనే వార్తలు వచ్చాయి. ఇదిలా ఉంటే... ప్రభాస్ నటిస్తోన్న 'ది రాజా సాబ్' డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది.

నో డూప్...

బాలీవుడ్ స్టార్ హీరోల్లో ఒకరైన షారుక్ ఖాన్ నటిస్తున్న తాజా చిత్రం 'కింగ్'. ఈ సినిమాకి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. 'పఠాన్' (2023) వంటి భారీ హిట్ తర్వాత షారుక్, సిద్ధార్థ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా 'కింగ్'. ఈ మూవీలో దీపికా పదుకోన్, రాణీ ముఖర్జీ, అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్‌లతో పాటు షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సిద్ధార్థ్ ఆనంద్, మమతా ఆనంద్, షారుక్ ఖాన్, గౌరీ ఖాన్ నిర్మిస్తున్నారు. 'కింగ్' సినిమా కోసం ముంబైలోని గోల్డెన్ టొబాకో స్టూడియోలో వేసిన అతి పెద్ద సెట్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. అందులో భాగంగా ఓ యాక్షన్ సీన్‌లో షారుక్ ఖాన్ గాయపడ్డారని సమాచారం. రియాలిటీ కోసం ఆ సన్నివేశంలో డూప్ లేకుండా పాల్గొన్నారట షారుఖ్. ఆ సమయంలోనే గాయపడ్డారనే వార్తలు బాలీవుడ్‌లో హల్‌చల్ చేశాయి. అంతే కాదు... కండరాల నొప్పికి సంబంధించిన అత్యవసర వైద్యం కోసం ఆయన అమెరికా వెళ్లారనే వార్తలు కూడా ఆన్‌లైన్ వేదికగా చక్కర్లు కొట్టాయి. అయితే షారుక్ ఖాన్‌కి గాయాలయ్యాయనే విషయంపై ఇటు ఆయన టీమ్ నుంచి కానీ, అటు 'కింగ్' చిత్రయూనిట్ నుంచి కానీ ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇక 'పఠాన్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత షారుక్, సిద్ధార్థ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'కింగ్'పై ఇండస్ట్రీ వర్గాల్లో భారీ అంచనాలు, ప్రేక్షకుల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది.

కుడిచేతికి గాయం


చేతినిండా వరుస సినిమాలతో దూసుకెళుతుంటారు హీరో రవితేజ. ఆయన నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. 'ధమాకా' వంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత రవితేజ–శ్రీలీల 'మాస్ జాతర'లో రెండోసారి జోడీగా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో కీలకమైన ఓ యాక్షన్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా గత ఏడాది ఆగస్టులో రవితేజ కుడి చేతికి గాయమైంది. అయితే తన గాయం కారణంగా షూటింగ్‌కి బ్రేక్ పడకూడదని చిత్రీకరణలో పాల్గొన్నారట రవితేజ. కానీ, నొప్పి తీవ్రం కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఆస్పత్రికి వెళ్లారాయన. చిన్నపాటి శస్త్ర చికిత్స చేసిన వైద్యులు ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. ఈ గాయం నుంచి కోలుకున్నాక ఆయన తిరిగి షూటింగ్‌లో పాల్గొన్నారు. 'మాస్ జాతర'ని మే 9న విడుదల చేయనున్నట్లు యూనిట్ తొలుత ప్రకటించింది. అయితే వాయిదా వేసి ఆగస్టు 27న రిలీజ్ చేయనున్నట్లు కొత్త తేదీని ప్రకటించారు మేకర్స్.

వారం విశ్రాంతి

వైవిధ్యమైన పాత్రలు, చిత్రాలతో తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు హీరో కార్తీ. 'ఆవారా, యుగానికి ఒక్కడు, ఊపిరి, ఖైదీ, సర్దార్' వంటి చిత్రాలతో తెలుగులోనూ అభిమానుల్ని సంపాదించుకున్నారాయన. 'సర్దార్ 2' చిత్రం షూటింగ్‌లో ఆయన ఓ ఫైట్ సీన్ చిత్రీకరణలో గాయపడ్డారు. హీరో కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో రూపొందిన 'సర్దార్' చిత్రం 2022లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీకి సీక్వెల్‌గా వీరి కాంబినేషన్‌లోనే 'సర్దార్ 2' తెరకెక్కుతోంది. ఈ మూవీలో మాళవికా మోహనన్, ఆషికా రంగనాథ్, రజీషా విజయన్ హీరోయిన్లుగా, ఎస్‌జే సూర్య విలన్‌గా నటిస్తున్నారు. ఎస్. లక్ష్మణ్ కుమార్, ఇషాన్ సక్సేనా నిర్మాతలు. మైసూరులో 'సర్దార్ 2' షూటింగ్‌లో భాగంగా ఈ ఏడాది మార్చిలో కీలకమైన ఓ యాక్షన్ సీన్ తీస్తుండగా కార్తీ కాలికి గాయమైంది. దీంతో ఆయన్ని సమీపంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా... పెద్ద ప్రమాదం ఏమీ లేదని.. జస్ట్ వారంపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో ఆ మూవీ షూటింగ్ ఆపేసి చెన్నై వెళ్లిపోయారు కార్తీ. విశ్రాంతి తర్వాత 'సర్దార్ 2' షూటింగ్ పూర్తి చేశారు.

మెడకు గాయం...

'మర్డర్, ఆషిక్ బనాయా ఆప్నే, మర్డర్ 2' వంటి చిత్రాలతో తెలుగులోనూ తనకంటూ యూత్‌లో మంచి ఫాలోయింగ్‌ని సొంతం చేసుకున్నారు బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ. హిందీలో వరుస సినిమాలు చేసిన ఆయన పవన్‌కల్యాణ్ హీరోగా సుజీత్ దర్శకత్వం వహిస్తున్న 'ఓజీ' చిత్రం ద్వారా తెలుగుకి పరిచయమవుతున్నారు. ఈ సినిమాలో ఆయన విలన్ పాత్ర చేస్తున్నారు. మరోవైపు అడివి శేష్ హీరోగా తెరకెక్కుతోన్న 'జీ2' (గూఢచారి 2') చిత్రంలోనూ ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కోసం గత ఏడాది అక్టోబరులో హైదరాబాద్ వచ్చారు ఇమ్రాన్. ఓ యాక్షన్ సీన్‌లో భాగంగా పై నుంచి దూకుతున్న క్రమంలో ఆయన మెడకు గాయమైంది. అయితే షూటింగ్ ఆగకూడదని ప్రథమ చికిత్స అనంతరం చిత్రీకరణలో పాల్గొన్నారు ఇమ్రాన్.


● ఇమ్రాన్ హష్మీ

ముఖానికి గాయాలు

బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రియాంకా చోప్రా. 2018లో అమెరికన్ సింగర్ నిక్ జోనాస్‌ను పెళ్లి చేసుకొని తన మకాంను హాలీవుడ్‌కి మార్చేశారామె. హాలీవుడ్‌లో సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటిస్తూ బిజీగా ఉన్నారు. కాగా 'ది బ్లఫ్' అనే హాలీవుడ్ చిత్రం షూటింగ్‌లో ఆమె గాయపడ్డారు. ఫ్రాంక్ ఇ. ఫ్లవర్స్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ సినిమాలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా కోసం గత ఏడాది జూన్‌లో ఆస్ట్రేలియాలో ప్రియాంకా చోప్రాపై ఓ యాక్షన్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా ప్రమాదం జరిగింది. ముఖ్యంగా ముఖంపై గాయాలు అయ్యాయి. ఆమె పెదవి, ముక్కు, మెడకు దెబ్బలు తగిలాయి. ఆ ఫొటోలను ఆమె స్వయంగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి, 'ప్రొఫెషనల్ లైఫ్‌లో జరిగే ప్రమాదాలు' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఇక ప్రియాంక గాయపడటంతో వెంటనే చిత్రయూనిట్ షూటింగ్ ఆపేసి.. ఆమెను సిడ్నీలోని ఆస్పత్రికి తీసుకెళ్లింది. ఆ తర్వాత కొద్ది రోజులు విశ్రాంతి తీసుకుని తిరిగి 'ది బ్లఫ్' షూటింగ్‌లో పాల్గొన్నారు ప్రియాంక. ఇదిలా ఉంటే.. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ 29' సినిమాలో ప్రియాంక ఓ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే.

చేతులకు, కాళ్లకు గాయాలు...

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో ఈ సినిమా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియన్ థ్రిల్లర్ మూవీగా రూపొందుతోన్న 'డెకాయిట్' చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా చిత్రీకరణలో భాగంగా ఒక యాక్షన్ సీక్వెన్స్ తీస్తున్న సమయంలో చిన్న ప్రమాదం చోటు చేసుకుందట. ఈ ఘటనలో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రమాదవశాత్తు కింద పడటంతో చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయట. అయితే చిత్రీకరణకు ఇబ్బందులు రాకూడదనే ఆలోచనతో సెట్స్‌లోనే ప్రథమ చికిత్స అనంతరం వారిద్దరూ షూటింగ్‌ను కొనసాగించి తమ సన్నివేశాలను పూర్తి చేశారని టాక్. అయితే ఈ ప్రమాదంపై చిత్ర యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇదిలా ఉంటే... ఈ సినిమా కోసం మదనపల్లె యాసలో డైలాగులు చెబుతున్నారు అడివి శేష్. 'డెకాయిట్' క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న విడుదల కానుంది.

గాయాలను లెక్క చేయకూడదు


'ఊహలు గుసగుసలాడే, బెంగాల్ టైగర్, సుప్రీమ్, ప్రతి రోజూ పండగే, తొలి ప్రేమ' వంటి పలు హిట్ చిత్రాలతో ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు రాశీ ఖన్నా. ఆమె నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'ఫర్జీ 2'. విజయ్ సేతుపతి, షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలు చేస్తున్నారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహిస్తున్నారు. 'ఫర్జీ 2' షూటింగ్‌లో భాగంగా ఈ ఏడాది మేలో రాశీ ఖన్నా గాయపడ్డారు. కథ డిమాండ్ మేరకు రిస్కీ యాక్షన్ సీన్స్‌లో ఆమె పాల్గొనగా ప్రమాదవశాత్తు స్వల్పంగా గాయపడ్డారు. అందుకు సంబంధించిన ఫొటోలను ఆమె తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. "కథ డిమాండ్ చేస్తే గాయాలను కూడా లెక్క చేయకూడదు. మన గాయాలు కూడా ఒక్కోసారి మన శరీరం, శ్వాస మీద ప్రభావం చూపవచ్చు. మనమే ఒక తుపాను అయినప్పుడు మనల్ని ఏ పిడుగు ఆపలేదు" అంటూ పోస్ట్ చేశారు రాశీ ఖన్నా. 'ఫర్జీ' తొలి సిరీస్‌కి మంచి స్పందన రావడంతో 'ఫర్జీ 2' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రాశీ ఖన్నా ప్రస్తుతం తెలుగులో పవన్ కల్యాణ్‌తో 'ఉస్తాద్ భగత్‌సింగ్', సిద్ధు జొన్నలగడ్డతో 'తెలుసు కదా' వంటి సినిమాల్లో నటిస్తున్నారు.

– దేరంగుల జగన్ మోహన్


● మృణాల్ ఠాకూర్
● ప్రియాంకా చోప్రా
● రాశీ ఖన్నా

బయాన్‌కి అరుదైన అవకాశం

హ్యూమా ఖురేషీ లీడ్ రోల్‌లో నటించిన 'బయాన్' చిత్రం 'టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025'కు ఎంపికైంది. వికాస్ రంజన్ మిశ్రా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో చంద్రచూర్ సింగ్, సచిన్ ఖేడ్కర్, స్వాతి దాస్, అదితి కాంచన్ సింగ్ వంటివారు నటించారు. ఈ సినిమా ఈ ఏడాది సెప్టెంబరులో విడుదలకు సిద్ధం అవుతోంది. కాగా డిస్కవరీ విభాగంలో 'టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025' ప్రదర్శనకు 'బయాన్' ఎంపిక కావడం విశేషం. "ఒక మహిళ చేసే పోరాటం నేపథ్యంలో సాగే చిత్రం 'బయాన్'. నాకు నచ్చిన పాత్రని పోషించే అవకాశాన్ని ఈ సినిమా ఇచ్చింది. ఈ చిత్రయూనిట్‌తో పని చేయడం చాలా సంతోషంగా ఉంది" అని హ్యూమా ఖురేషీ తెలిపారు. "మా సినిమాని 'టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్'లో ప్రదర్శించనుండటం గర్వంగా ఉంది" అని బికాస్ రంజన్ మిశ్రా సంతోషం వ్యక్తం చేశారు.


● హ్యూమా ఖురేషీ

చాన్స్ ఇస్తే మాకేంటి? అనేవారు!

"చిత్ర పరిశ్రమలో చాలామందిలా నేను కూడా క్యాస్టింగ్ కౌచ్ ఎదుర్కొన్నాను. ఈ కారణంగా చాలా అవకాశాలు కూడా కోల్పోయాను. అయినప్పటికీ ధైర్యంగా నిలబడి ముందుకు సాగుతున్నాను" అని నటి సుర్వీన్ చావ్లా అన్నారు. 'పరమేశ పన్వాలా' (2008) అనే కన్నడ చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యారామె. అదే విధంగా 'రాజు మహారాజు' (2009) సినిమా ద్వారా తెలుగులో ఎంట్రీ ఇచ్చారు సుర్వీన్ చావ్లా. ఆ తర్వాత పంజాబీ, హిందీ, తమిళ చిత్రాల్లో నటించి తనకంటూ గుర్తింపు సొంతం చేసుకున్నారామె. అలాగే పలు టీవీ షోస్ ద్వారా బుల్లితెర ప్రేక్షకులనూ అలరించిన ఆమె తాజాగా క్యాస్టింగ్ కౌచ్‌పై మాట్లాడారు. "ఇండస్ట్రీలో ఒక దశలో క్యాస్టింగ్ కౌచ్ పీక్స్‌లో ఉండేది. అవకాశం కోసం ఆఫీస్‌కు వెళ్తే అసభ్యకరంగా మాట్లాడేవారు. 'చాన్స్ ఇస్తాం.. మరి మాకేంటి?', 'నీ వల్ల మాకు లబ్ది ఏంటి?' అంటూ ముఖం పైనే అడిగేవారు. అలాంటి మాటలు చాలా సినిమా ఆఫీసుల్లో విని విసిగిపోయాను. ఇన్ని రకాల ఇబ్బందులు పడుతూ సినిమాలు చేయాలా? అని ఎన్నోసార్లు బాధపడ్డాను. వాళ్ల కోరికలకు అంగీకరించకపోవడం వల్ల ఎన్నో అవకాశాలు కోల్పోయాను. కెరీర్ ఆరంభం రోజులు మాత్రం చాలా కఠినంగా అనిపించేవి. నటిగా మనకంటూ ఓ గుర్తింపు వచ్చిందంటే ఇలాంటి సమస్యల నుంచి బయట పడొచ్చనుకునేదాన్ని. 'మీటూ' ఉద్యమంలో భాగంగా అంత మంది మీడియా ముందుకొచ్చారంటే? వాళ్లందరూ ఎంత బాధపడి ఉంటారు. మనసు చంపుకుని ఎవరూ అలాంటి పనులు చేయలేరు" అని సుర్వీన్ చావ్లా తెలిపారు. ఆమె మాటలు వైరల్‌గా మారాయి.


● సుర్వీన్ చావ్లా

బిజినెస్ రీల్

విమాన ప్రయాణికులు 3 శాతం అప్..

జూన్‌లో 1.36 కోట్ల ప్యాసింజర్లు



న్యూఢిల్లీ: దేశీయంగా విమానయాన సంస్థలు ఈ ఏడాది జూన్‌లో 1.36 కోట్ల మందిని గమ్యస్థానాలకు చేర్చాయి. మే నెలలో నమోదైన 1.32 కోట్ల మందితో పోలిస్తే ఇది 3 శాతం అధికం. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విడుదల చేసిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం, ఈ ఏడాది జనవరి–జూన్ మధ్య కాలంలో దేశీ ఎయిర్‌లైన్స్‌లో 8.51 కోట్ల మంది ప్రయాణించారు. గతేడాది ఇదే వ్యవధిలో నమోదైన 7.93 కోట్ల మంది ప్యాసింజర్లతో పోలిస్తే ఇది 7.34 శాతం అధికం. ఫ్లయిట్ల జాప్యాల వల్ల 1,20,023 మంది ప్రయాణికులపై ప్రభావం పడింది. ఫ్లయిట్ల రద్దు వల్ల 33,333 ప్రయాణికులపై ప్రభావం పడగా, పరిహారం, ఇతరత్రా సదుపాయాల కల్పన కింద విమానయాన సంస్థలు రూ. 72.40 లక్షలు వెచ్చించాయి. ఇక, మే నెలలో 64.6 శాతంగా ఉన్న విమానయాన సంస్థ ఇండిగో మార్కెట్ వాటా జూన్‌లో 64.5 శాతానికి పరిమితమైంది. ఎయిరిండియా గ్రూప్ వాటా 26.5 శాతం నుంచి 27.1 శాతానికి చేరింది. ఆకాశ ఎయిర్ వాటా పెద్దగా మార్పు లేకుండా 5.3 శాతం స్థాయిలోనే ఉంది. స్పైస్‌జెట్ వాటా మాత్రం 2.4 శాతం నుంచి 1.9 శాతానికి తగ్గింది.

అపోలో హాస్పిటల్స్, సీమెన్స్ భాగస్వామ్యం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కాలేయ వ్యాధుల చికిత్సకు సంబంధించి కొత్త ఆవిష్కరణలు చేసే దిశగా అపోలో హాస్పిటల్స్, సీమెన్స్ హెల్తినీర్స్ చేతులు కలిపాయి. ఈ ఒప్పందంలో భాగంగా వ్యాధులను ముందుగా గుర్తించడం, పర్యవేక్షణ, చికిత్స మొదలైన వాటికి కృత్రిమ మేధ (ఏఐ), అల్ట్రాసౌండ్ ఇమేజింగ్‌లాంటి సాంకేతికతలను ఉపయోగిస్తాయి. తద్వారా మరింత మెరుగైన ఫలితాలను సాధించడంపై దృష్టి పెడతాయి. ఏఐని ఉపయోగించి, గాటు పెట్టకుండా కాలేయ వ్యాధికి చికిత్సను అందించే దిశగా సీమెన్స్ హెల్తినీర్స్‌తో భాగస్వామ్యం కీలక ముందడుగు కాగలదని అపోలో హాస్పిటల్స్ జాయింట్ ఎండీ సంగీత రెడ్డి తెలిపారు. వ్యాధులను సకాలంలో కచ్చితంగా గుర్తించేందుకు, మెరుగైన చికిత్సను అందించేందుకు, పేషంట్లకు మెరుగైన జీవితాన్ని అందించేందుకు అధునాతన టెక్నాలజీలు తోడ్పడతాయని సీమెన్స్ హెల్త్‌కేర్ ఎండీ హరిహరన్ సుబ్రమణియన్ చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-7-2025

విశాఖ	465–00
చిత్తూరు	503–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	425–00
వరంగల్	427–00
రిటైల్ ధర	4.85

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	312.45	3.44
DRREDDY	1,268.90	1.72
TATAMOTORS	701.3	1.62
TATACONSUM	1,073.00	0.98
CIPLA	1,486.30	0.87

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NESTLEIND	2,316.00	-5.57
TRENT	5,148.00	-3.94
TECHM	1,496.20	-3.26
SHRIRAMFIN	633.3	-3.17
RELIANCE	1,402.80	-1.53

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,097
ఎన్ఎస్ఈ	1,00,060
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,77,761
ఎఫ్ఐఐ	- 2,134
డీఐఐ	+ 2,617

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.48 (రాత్రి 11.30కు)	$	65.25 (క్రితం ముగింపు)
బ్రెంట్	69.21 (రాత్రి 11.30కు)	$	68.51 (క్రితం ముగింపు)

బ్లూ-గ్రే కాలర్ ఉద్యోగాల్లో

మహిళలకు మరింత వాటా

- ఆందోళన కలిగిస్తున్న వలసలు
- అనుకూల వాతావరణం లేకపోవడం వల్లే
- ఉదైతి ఫౌండేషన్, క్వెస్‌కార్ప్ నివేదిక



ముంబై: కార్మిక, నైపుణ్య ఉద్యోగాల్లో (బ్లూ-గ్రే కాలర్ ఉద్యోగాలు) మహిళల భాగస్వామ్యం క్రమంగా పెరుగుతున్నప్పటికీ.. అదే సమయంలో చెప్పుకోతగ్గ సంఖ్యలో ఉద్యోగం వీడుతుండడం (వలసల రేటు/అట్రిషన్) ఆందోళన కలిగిస్తోంది. 2023–24లో బ్లూ-గ్రే కాలర్ ఉద్యోగాల్లో మహిళల భాగస్వామ్యం 19 శాతానికి పెరిగింది. 2020–21 నాటికి వీరి భాగస్వామ్యం 16 శాతంగా ఉండడం గమనార్హం. కానీ, వలసలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. ముఖ్యంగా ఏడాది లోపు అనుభవం ఉన్న మహిళల ఎక్కువగా ఉద్యోగం మానేస్తున్నారు. ఈ వివరాలను ఉదైతి ఫౌండేషన్, క్వెస్‌కార్ప్ నివేదిక వెల్లడించింది. రిటైల్, తయారీ, బీఎఫ్ఎస్ఐ, సేవల రంగాల్లో ఉద్యోగం చేస్తున్న 10,000 మంది మహిళలతోపాటు, ఉద్యోగం మానేసిన 1,500 మందిని సర్వే చేసి ఈ వివరాలు విడుదల చేసింది. వలసలు ఎక్కువగా ఉండడం ఉత్పాదకతకు, 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ స్వప్న సాకారానికి విఘాతం కలిగిస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

మహిళల అభిప్రాయాలు..

వచ్చే 12 నెలల్లో ఉద్యోగం వీడనున్నట్టు ఏడాది లోపు అనుభవం ఉన్న 52 శాతం మహిళా ఉద్యోగులు సర్వేలో తెలిపారు. అదే రెండేళ్లకు పైగా అనుభవం ఉన్న వారిలో ఇలా చెప్పిన వారు 3 శాతంగానే ఉండడం గమనార్హం. వలసల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఇది సూచిస్తోంది. ప్రస్తుతం పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల్లోనూ 54 శాతం తమ వేతనం విషయమై సంతృప్తిగా లేరు. 80 శాతం మంది నెలకి రూ. 2,000 కన్నా తక్కువే పొదుపు చేస్తున్నారు. మంచి వేతనం ఇస్తే ఉద్యోగాల్లో తిరిగి చేరతామని 42 శాతం మంది చెప్పారు. 57 శాతం మంది రవాణా పరమైన సవాళ్లను ఎదుర్కొంటుంటే, 11 శాతం మంది రాత్రి షిఫ్టుల్లో పని ప్రదేశానికి వెళ్లి రావడాన్ని భద్రంగా భావించడం లేదు. రూ.20వేల కంటే అధిక వేతనం పొందుతున్న వారు సమీప కాలంలో ఉద్యోగం విడిచి పెట్టిపోవడం 21 శాతం తక్కువగా ఉండొచ్చన్నది ఈ నివేదిక సారాంశం.

వ్యవస్థలోనే లోపం..



''భారత్ ఆర్థిక సామర్థ్యాల విస్తరణకు అద్భుతమైన అవకాశాలున్నాయి. పని ప్రదేశాల్లో మహిళలకు ద్వారాలు తెరిచాం. కానీ, వారికి అనుకూలమైన వ్యవస్థల ఏర్పాటుతోనే వృద్ధి చెందగలరు. సామర్థ్యాలు లేకపోవడం వల్ల మహిళల ఉద్యోగాలు వీడడం లేదు. మహిళలు పనిచేసేందుకు, విజయాలు సాధించేందుకు అనుకూలమైన వసతులను మనం కల్పించలేకపోతున్నాం''అని ఉదైతి ఫౌండేషన్ సీఈవో పూజ గోయల్ వివరించారు.

ఒక్క రోజులోనే పతనమైన బంగారం, వెండి

- వెండి కిలోకి రూ.3,000 నష్టం
- రూ.1,400 తగ్గిన పసిడి ధర
- వాణిజ్య ఒప్పందాలపై ఆశావాదం



న్యూఢిల్లీ: వరుస ర్యాలీ అనంతరం బంగారం, వెండి ధరలు గురువారం వెనకడుగు వేశాయి. స్టాకిస్టులు అమ్మకాలకు (లాభాల స్వీకరణ) దిగడంతో వెండి కిలోకి రూ.3,000 నష్టపోగా, పసిడి రూ.1,400 తగ్గింది. బుధవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములు ధర రూ.1,01,020 వద్ద ముగిసింది. దీంతో పోల్చితే గురువారం రూ.1,400 నష్టపోయి రూ.99,620 స్థాయికి దిగొచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం రూ.1,200 నష్టపోయి రూ.99,250కి చేరుకుంది. బుధవారం వెండి కిలోకి రూ.4,000 ఎగిసి రూ.1,18,000 చేరుకోవడం తెలిసిందే. కానీ, గురువారం రూ.3,000 నష్టపోయి రూ.1,15,000 స్థాయికి పరిమితమైంది. ''లాభాల స్వీకరణతో బంగారం ధరలు తగ్గాయి. జపాన్, ఫిలిప్పీన్స్‌తో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్టు యూఎస్ ప్రకటించడంతో రిస్క్ ధోరణి తగ్గింది. ఇదే మాదిరి మరిన్ని ఒప్పందాలకు, ముఖ్యంగా చైనా, యూరప్‌తోనూ డీల్స్ కుదురుతాయన్న అంచనాలు బలపడ్డాయి. అదే సమయంలో ప్రధాన కరెన్సీలతో డాలర్ కొంత బలహీనపడడం ధరలకు కొంత వరకు మద్దతునిచ్చింది''అని జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ మీర్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్ ధర 31 డాలర్ల నష్టంతో 3,365 స్థాయిలో ట్రేడయ్యింది. అమెరికా, దాని ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు కుదురుతాయన్న ఆశావాదం పెరగడంతో సురక్షిత సాధనమైన బంగారం ధర ఐదు వారాల గరిష్ట స్థాయి నుంచి పతనమైనట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

బాలాజీ ఫౌండేషన్ దాతృత్వం



హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాలాజీ ఫౌండేషన్ మరోసారి దాతృత్వాన్ని చాటుకుంది. నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండులో ప్రయాణికుల సౌకర్యార్థం రూ.10 లక్షలు వెచ్చించి మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ మాట్లాడుతూ... నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే బస్టాండులో తాగు నీటి సదుపాయం కల్పించడం అభినందనీయమన్నారు. బాలాజీ ఫౌండేషన్ వ్యాపారంతో పాటు సేవారంగంలోనూ మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. తన తండ్రి బాలాజీ చౌదరి నెల్లూరు నుంచే తన వ్యాపార ప్రస్థానాన్ని ప్రారంభించారని, అలాంటి ప్రాంతంలో బాలాజీ ఫౌండేషన్ సేవలు అందించడం ఎంతో సంతోషంగా ఉందని బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్', బాలాజీ సంస్థ సీవోఈ సాయి నిఖిలేష్ తెలిపారు.

ప్రాట్ అండ్ విట్నీతో గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ ఒప్పందం



ముంబై: ఏరోస్పేస్ విడిభాగాల తయారీకి సంబంధించి ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ల తయారీ సంస్థ ప్రాట్ అండ్ విట్నీతో గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్‌లో (జీఈజీ) భాగమైన ఏరోస్పేస్ విభాగం ఒప్పందం కుదుర్చుకుంది. సాంకేతికత, ఉత్పత్తిని మరింతగా మెరుగుపర్చుకునేందుకు ఈ కాంట్రాక్ట్ ఉపయోగపడుతుందని జీఈజీ తెలిపింది. ప్రెసిషన్ ఏరోస్పేస్ తయారీ విభాగంలో కార్యకలాపాలను గణనీయంగా విస్తరించనున్నట్లు వివరించింది. జీఈజీకి దేశీయంగా 35,000 చ.మీ. ఏరోస్పేస్ విడిభాగాల తయారీ ప్లాంటు ఉంది. మరో 48,500 చ.మీ. మేర ప్లాంటును అభివృద్ధి చేస్తోంది. విమానాల ఇంజిన్లు, అనుబంధ పవర్ యూనిట్లు మొదలైన వాటి డిజైనింగ్, తయారీ, సర్వీసింగ్‌లో ప్రాట్ అండ్ విట్నీ అగ్రగామిగా ఉంది.

స్మార్ట్ డోర్‌లాక్ ఆవిష్కరణ

మరోవైపు, జీఈజీలో భాగమైన లాక్స్ అండ్ ఆర్కిటెక్చరల్ సొల్యూషన్స్ అధునాతనమైన అడ్వాంటిస్ జీఎస్ఎల్ డీ1 స్మార్ట్ డోర్ లాక్‌ను ప్రవేశపెట్టింది. మొబైల్ బ్లూటూత్, ఎన్ఎఫ్‌సీ, బయోమెట్రిక్ సెక్యూరిటీ తదితర ఫీచర్లతో గృహాలకు మరింత పటిష్టమైన భద్రతను అందించేలా దీన్ని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. దీని ధర రూ. 18,499 నుంచి ప్రారంభమవుతుందని బిజినెస్ హెడ్ శ్యామ్ మోత్వాని తెలిపారు.

మార్కెట్లోకి 'లాటీ' పెపెరో బిస్కెట్స్

రూ. 2 వేల కోట్ల ఆదాయ లక్ష్యం



చెన్నై: దక్షిణ కొరియన్ దిగ్గజం లాటీ గ్రూప్‌లో భాగమైన లాటీ ఇండియా కొత్తగా పెపెరో బిస్కెట్లను దేశీ మార్కెట్లో ప్రవేశపెట్టింది. కొరియాలో ఇది నంబర్ 1 బిస్కెట్ బ్రాండ్ అని, 56 పైగా దేశాలకు ఎగుమతి అవుతోందని లాటీ ఇండియా ఎండీ మిలాన్ వాహీ తెలిపారు. హావ్‌మోర్ ఐస్‌క్రీమ్ విలీనంతో గతేడాది రూ. 1,750 కోట్ల ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది రూ. 2,000 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని ఆయన పేర్కొన్నారు. కొరియాకు వెలుపల తొలిసారిగా హర్యానాలో ఏర్పాటు చేసిన ప్లాంటుకు రూ. 475 కోట్ల పెట్టుబడులు కేటాయించినట్లు వాహీ చెప్పారు. 2027 నాటికి రూ. 3,000 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, కన్ఫెక్షనరీ వ్యాపారం వాటా రూ. 1,250 కోట్లు, హ్యావ్‌మోర్ వాటా రూ. 1,750 కోట్లుగా ఉందన్నారు. పెపెరో ప్యాక్ ధర శ్రేణి రూ. 20 నుంచి రూ. 70గా ఉంటుంది.

ప్రమాణాలను పెంచండి, విశ్వాసాన్ని గెలవండి

ఐటీ అధికారులకు మంత్రి సీతారామన్ సూచన



న్యూఢిల్లీ: విధానాలను సకాలంలో అమలు చేయడం ద్వారా కొత్త ప్రమాణాలను సృష్టించాలని.. పన్ను చెల్లింపుదారుల విశ్వాసాన్ని చూరగొనాలని ఆదాయపన్ను శాఖ అధికారులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఆరు నెలల్లోనే కొత్త ఆదాయపన్ను చట్టం ముసాయిదాను రూపొందించడం పట్ల అధికారులను అభినందించారు. ''మంచి విధానాలు ఉండడంతోనే సరిపోదు. సకాలంలో వాటిని అమలు చేయడమే కీలకం. ఇటీవలి కాలంలో మీరు ఎంతో గొప్పగా పనిచేశారు. ఈ ప్రమాణాలను మరింత పెంచాల్సిన సమయం వచ్చింది''అని 166వ ఆదాయ పన్ను శాఖ దినోత్సవం సందర్భంగా పేర్కొన్నారు.

వాణిజ్య యుద్ధాలు తాత్కాలికమే!

- త్వరలోనే అనిశ్చితులు సమసిపోతాయ్
- దశాబ్దం పాటు భారత్‌లో 7–8 శాతం వృద్ధి
- డెలాయిట్ దక్షిణాసియా సీఈవో శెట్టి



న్యూఢిల్లీ: వాణిజ్య యుద్ధాలు ఎక్కువ కాలం పాటు కొనసాగబోవని డెలాయిట్ దక్షిణాసియా సీఈవో రోమల్ శెట్టి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతమున్న అనిశ్చితులు వచ్చే కొన్ని నెలల్లో సమసిపోతాయని అంచనా వేశారు. గతం కంటే ఇప్పుడు భారత్–అమెరికా మరింత సన్నిహితంగా మారినట్టు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ద్వైపాక్షిక బంధం బలపడినట్టు తెలిపారు. దీనికితోడు భౌగోళికంగా వ్యూహాత్మకమైన స్థితిలో ఉండడంతో ఇతర దేశాలకు లేని అనుకూలతలు భారత్‌కు ఉన్నట్టు చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం విషయమై భారత్–అమెరికా మధ్య విస్తృత సంప్రదింపులు నడుస్తున్న తరుణంలో డెలాయిట్ సీఈవో వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. 50–60 శాతం టారిఫ్‌లు కొనసాగడం అసాధ్యమని, అవి దిగొస్తాయని శెట్టి పేర్కొన్నారు. భారత్–అమెరికా తమ సొంత ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నాయని.. కనుక ఇవి మధ్యేమార్గానికి రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. భారత్‌లో కొన్ని అట్టడుగు వర్గాలు, ఇతర విభాగాలున్న నేపథ్యంలో స్వేచ్ఛా వాణిజ్యం కుదుర్చుకోవడం సవాలుగానే అభివర్ణించారు. సంక్లిష్టమైన అంశాల పరిష్కారం అంత సులభం కాదంటూ.. ఎన్నో దశల చర్చల తర్వాతే ఏకాభిప్రాయం సాధ్యపడుతుందన్నారు. అంతిమంగా కుదిరే ఒప్పందం ఇరు దేశాలకూ ప్రయోజనం కలిగిస్తుందని.. రెండు దేశాల మార్కెట్ వాటా పెరుగుతుందన్నారు.

జీడీపీ వృద్ధి 6.7 శాతం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ జీడీపీ 6.7 శాతం వృద్ధిని నమోదు చేయొచ్చని రోమల్ శెట్టి అంచనా వేశారు. వచ్చే దశాబ్దంన్నర (15 ఏళ్లు) పాటు ఏటా 7–8 శాతం వృద్ధి రేటు సాధ్యమేనన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో అంతర్జాతీయ సంక్షోభాలను (కరోనా, భౌగోళిక ఉద్రిక్తతలు) విజయవంతంగా అధిగమించడమే కాకుండా బలమైన వృద్ధిని నమోదు చేయడాన్ని గుర్తు చేశారు. ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అయిన భారత్.. ఈ ఏడాది జపాన్‌ను అధిగమించి 4.2 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఐఎంఎఫ్ అంచనా వేయయం ఈ సందర్భంగా గమనార్హం. భారత ఆర్థిక వ్యవస్థ మెరుగైన పనితీరు వెనుక సేవల రంగం పాత్రను రోమల్‌శెట్టి ప్రస్తావించారు. భారత ఆర్థిక వ్యవస్థకు సేవలే బలమంటూ.. అంతర్జాతీయ వాణిజ్య సవాళ్ల ప్రభావం ఏమంత ఉండబోదన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో వ్యవసాయ రంగం పనితీరు మెరుగుపడినట్టు చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్య పరంగా కొంత ప్రభావం ఉన్నా కానీ, అది తాత్కాలికమేనన్నారు. తలసరి ఆదాయం 2,800 డాలర్ల నుంచి 4,000 డాలర్లకు చేరుకుందంటూ, ఇదే కాలంలో వాస్తవ వినియోగం రెట్టింపైనట్టు చెప్పారు. తయారీ, సెమీకండక్టర్లు క్రమంగా పట్టు సాధిస్తునట్టు తెలిపారు. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం స్థాయిలోనే ఉండొచ్చన్నారు. 2029–30 నాటికి మంచి స్థితికి చేరుకోవచ్చని అంచనా వేశారు.

క్యూ1 ఫలితాలు

కోరమాండల్ ఇంటర్నేషనల్ లాభం అప్

క్యూ1లో 54 శాతం జూమ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అగ్రి ఉత్పత్తుల సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ రూ. 508 కోట్ల నికర లాభం (స్టాండెలోన్) ప్రకటించింది. క్రితం క్యూ1లో నమోదైన రూ. 331 కోట్లతో పోలిస్తే ఇది 54 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ. 4,768 కోట్ల నుంచి రూ. 7,083 కోట్లకు చేరింది. వివిధ విభాగాలవ్యాప్తంగా పటిష్టమైన పనితీరు కనపర్చినట్లు కంపెనీ ఎండీ ఎస్. శంకరసుబ్రమణియన్ తెలిపారు. రుతుపవనాలు ముందుగా రావడంతో పంటలు వేయడం పెరిగిందని, దానికి తగ్గట్లు తమ ఉత్పత్తుల వినియోగం కూడా పెరిగిందని పేర్కొన్నారు. ఎరువులు, పంట సంరక్షణ రసాయనాలు మొదలైన ఉత్పత్తులను కంపెనీ తయారు చేస్తోంది. సెనెగల్‌లోని బావోబాబ్ మైనింగ్ అండ్ కెమికల్స్ కార్పొరేషన్‌లో (బీఎంసీసీ) 7.7 మిలియన్ డాలర్లకు మరో 17.69 శాతం వాటా కొనుగోలు చేసే ప్రతిపాదనకు కంపెనీ బోర్డు ఆమోదముద్ర వేసింది. దీనితో బీఎంసీసీలో కంపెనీ వాటా 71.51 శాతానికి చేరుతుంది.

గురువారం కోరమాండల్ ఇంటర్నేషనల్ షేరు సుమారు 5% పెరిగి రూ. 2,439 వద్ద ముగిసింది.

ఎస్‌బీఐ లైఫ్ పటిష్ట పనితీరు

లాభం 14 శాతం అధికం



న్యూఢిల్లీ: ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో అంతమైన మొదటి త్రైమాసికంలో (క్యూ1) మెరుగైన పనితీరు చూపించింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 14 శాతం వృద్ధి చెంది రూ.590 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.520 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం ఇదే కాలంలో రూ.34,392 కోట్ల నుంచి రూ.38,696 కోట్లకు పెరిగింది. న్యూ బిజినెస్ ప్రీమియం (కొత్త పాలసీల ద్వారా) ఆదాయం రూ.7,270 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది రూ.7,033 కోట్లుగా ఉంది. ఇక రెన్యువల్ ప్రీమియం (గతంలో తీసుకున్న పాలసీల పునరుద్ధరణ) ఆదాయం 24 శాతం పెరిగి రూ.10,550 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది రూ.8,540 కోట్లుగా ఉంది. నిర్వహణలోని ఆస్తుల విలువ 15 శాతం పెరిగి రూ.4,14,770 కోట్లకు చేరుకుంది. జూన్ చివరికి డెట్–ఈక్విటీ ఆస్తుల నిష్పత్తి 60:40గా ఉంది. కంపెనీ నికర విలువ 15 శాతం పెరిగి రూ.15,570 కోట్లకు చేరుకుంది. అమిత్ జింగ్రన్‌ను ఎండీ, సీఈవోగా అక్టోబర్ 1 నుంచి 2027 జనవరి 31 వరకు తిరిగి నియమించేందుకు కంపెనీ బోర్డు నిర్ణయించింది.

బీఎస్ఈలో ఎస్‌బీఐ లైఫ్ షేరు ధర అర శాతం నష్టంతో రూ.1,798 వద్ద స్థిరపడింది.

ఇండియన్ బ్యాంక్ లాభం 24 % అప్

క్యూ1లో రూ. 2,973 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ రూ. 2,973 కోట్ల నికర లాభం ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ1లో నమోదైన రూ. 2,403 కోట్లతో పోలిస్తే 24 శాతం పెరిగింది. మొత్తం ఆదాయం రూ. 16,945 కోట్ల నుంచి రూ. 18,721 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ. 15,039 కోట్ల నుంచి రూ. 16,283 కోట్లకు పెరిగింది. సమీక్షాకాలంలో మొండిబాకీల పరిస్థితి మెరుగుపడింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 3.77 శాతం నుంచి 3.01 శాతానికి దిగి వచ్చాయి. అలాగే నికర ఎన్‌పీఏలు 0.39 శాతం నుంచి 0.18 శాతానికి తగ్గాయి. దీంతో మొండిబాకీలకు ప్రొవిజనింగ్ గణనీయంగా రూ. 1,258 కోట్ల నుంచి రూ. 691 కోట్లకు తగ్గింది.

గురువారం ఇండియన్ బ్యాంక్ షేరు సుమారు 4% పెరిగి రూ. 652.30 వద్ద ముగిసింది.

నెస్లే ఇండియా నేలచూపు

క్యూ1 లాభం రూ. 647 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 13 శాతం క్షీణించి రూ. 647 కోట్లకు పరిమితమైంది. ప్రధానంగా కమోడిటీల ధరలు పెరగడం ప్రభావం చూపింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 747 కోట్లు ఆర్జించింది. మ్యాగీ, నెస్కఫే, కిట్‌కాట్ బ్రాండ్ల దిగ్గజం మొత్తం ఆదాయం మాత్రం 6 శాతం బలపడి రూ. 5,074 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 4,793 కోట్ల అమ్మకాలు సాధించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 9 శాతం పెరిగి రూ. 4,860 కోట్లను తాకాయి. దేశీ అమ్మకాలు 5 శాతంపైగా ఎగసి రూ. 4,860 కోట్లను దాటాయి. వీటిలో ఈకామర్స్ వాటా 12.5 శాతంగా నమోదైంది. ఎగుమతులు 16 శాతం పుంజుకుని రూ. 214 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో నెస్లే ఇండియా షేరు బీఎస్ఈలో 5.4 శాతం పతనమై రూ. 2,320 వద్ద ముగిసింది.

ఐఈఎక్స్ లాభం జూమ్

క్యూ1లో రూ.121 కోట్లు



న్యూఢిల్లీ: విద్యుత్, గ్యాస్ ట్రేడింగ్ తదితర సేవలు అందించే 'ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్' జూన్ త్రైమాసికంలో రాణించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే 25 శాతం జంప్ చేసి రూ.121 కోట్లకు చేరుకుంది. ఆదాయం సైతం 19 శాతం వృద్ధితో రూ.184 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.96 కోట్లుగా ఉంటే, ఆదాయం రూ.154 కోట్లుగా ఉండడం గమనార్హం. 32.4 బిలియన్ యూనిట్ల (బీయూ) విద్యుత్ ట్రేడయ్యింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 15 శాతం పెరిగింది. 52.7 లక్షల పునరుత్పాదక ఇంధన సర్టిఫికెట్లు (ఆర్ఈసీలు) ట్రేడయ్యాయి. 149 శాతం వృద్ధి నమోదైంది. డే అహెడ్ మార్కెట్ (డీఏఎం) విభాగంలో యూనిట్ విద్యుత్ సగటున రూ.4.41గా ట్రేడయ్యింది. రియల్‌టైమ్ మార్కెట్ సగటు ధర యూనిట్‌కు రూ.3.91గా ఉంది. ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజ్‌లో (ఐజీఎక్స్) 24.6 మిలియన్ ఎంఎంబీటీయూ గ్యాస్ ట్రేడయ్యింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 109 శాతం పెరిగింది. ఐజీఎక్స్‌కు రూ.14.1 కోట్ల లాభం సమకూరింది.

షేరు క్రాష్...: ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఐఈఎక్స్ సేరు ఏకంగా 30% వరకు పతనమైంది. రూ.132 వద్ద ముగిసింది. 2026 జనవరి నుంచి మార్కెట్ కప్లింగ్ (అన్ని ఎక్స్ఛేంజీల్లో ఒకే ధర) అమలు చేయనున్నట్టు సీఈఆర్‌సీ ప్రకటించడం పతనానికి దారితీసింది.

ఏసీసీ లాభం ప్లస్

క్యూ1లో రూ. 375 కోట్లు



న్యూఢిల్లీ: సిమెంట్ రంగ దిగ్గజం ఏసీసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 375 కోట్లను అధిగమించింది. అమ్మకాలు పుంజుకోవడం, నిర్వహణ సామర్థ్యం ఇందుకు సహకరించాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 360 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 18 శాతం ఎగసి రూ. 6,035 కోట్లను తాకింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 17% పెరిగి రూ. 5,594 కోట్లను దాటాయి. ఈ కాలంలో 12% వృద్ధితో 11.5 మిలియన్ టన్నుల అమ్మకాల పరిమాణాన్ని సాధించింది. ఇది క్యూ1కు కంపెనీ చరిత్రలోనే అత్యధికంకాగా.. సిమెంట్ బిజినెస్ ఆదాయం 17 శాతం ఎగసి రూ. 5,715 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో ఏసీసీ షేరు బీఎస్ఈలో 3.1 శాతం నష్టంతో రూ. 1,891 వద్ద ముగిసింది.

ఆర్ఈసీ లాభం దూకుడు

క్యూ1లో రూ. 4,466 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం ఆర్ఈసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 29 శాతం జంప్‌చేసి రూ. 4,466 కోట్లను తాకింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 3,460 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 13,092 కోట్ల నుంచి రూ. 14,824 కోట్లకు ఎగసింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 4.6 చొప్పున తొలి మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఆగస్ట్ 1 రికార్డ్ డేట్‌కాగా.. నికర వడ్డీ ఆదాయం రూ. 4,474 కోట్ల నుంచి రూ. 5,247 కోట్లకు బలపడింది. కాగా.. స్టాండెలోన్ నికర లాభం సైతం రూ. 3,442 కోట్ల నుంచి రూ. 4,451 కోట్లకు పుంజుకుంది. నికర వడ్డీ మార్జిన్లు 3.74 శాతంగా నమోదయ్యాయి. 2025 జూన్30కల్లా లోన్‌బుక్ 5.3 లక్షల కోట్ల నుంచి రూ. 5.85 లక్షల కోట్లకు మెరుగుపడింది.

ఫలితాల నేపథ్యంలో ఆర్ఈసీ షేరు బీఎస్ఈలో 1% లాభపడి రూ. 405 వద్ద ముగిసింది.

సింధుకు షాక్

ఉన్నతి చేతిలో అనూహ్య ఓటమి

ముగిసిన ప్రణయ్ పోరాటం • క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ





చాంగ్జౌ: ఈ ఏడాది మరో టోర్నమెంట్‌లో భారత స్టార్, ప్రపంచ మాజీ చాంపియన్ పీవీ సింధు నిరాశ పరిచింది. చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో సింధు కథ ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. అనూహ్యంగా ఈసారి భారత రైజింగ్ స్టార్, హరియాణాకు చెందిన ఉన్నతి హుడా చేతిలో సింధు ఓడిపోవడం గమనార్హం. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు 16-21, 21-19, 13-21తో ప్రపంచ 35వ ర్యాంకర్, 17 ఏళ్ల ఉన్నతి హుడా చేతిలో ఓటమి పాలైంది. 73 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధుకు ఆద్యంతం గట్టిపోటీ ఎదురైంది. తొలి గేమ్‌లో పలుమార్లు ఇద్దరి స్కోర్లు సమమయ్యాయి. స్కోరు 13-13 వద్ద వరుసగా మూడు పాయింట్లు నెగ్గిన ఉన్నతి 16-13తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఉన్నతి ఒక పాయింట్ కోల్పోయి, వెంటనే వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి 20-14తో ముందంజ వేసింది. సింధు రెండు పాయింట్లు నెగ్గిన తర్వాత మరో పాయింట్ చేజార్చుకొని తొలి గేమ్‌ను కోల్పోయింది. రెండో గేమ్‌లోనూ ఇద్దరూ ప్రతి పాయింట్‌కూ నువ్వా నేనా అన్నట్లు పోరాడారు. గత ఏడాది సయ్యద్ మోదీ ఓపెన్ టోర్నీలో సింధు చేతిలో వరుస గేముల్లో ఓడిన ఉన్నతి ఈసారి మాత్రం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. స్కోరు 19-19 వద్ద సింధు రెండు పాయింట్లు నెగ్గి గేమ్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో ఆరంభంలోనే ఉన్నతి 9-5తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని 15-9కు పెంచుకుంది. స్కోరు 16-13 వద్ద ఉన్నతి ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఐదు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అకానె యామగుచి (జపాన్)తో ఉన్నతి ఆడుతుంది. అంతర్జాతీయ టోర్నీల్లో భారత క్రీడాకారిణి చేతిలో సింధు ఓడిపోవడం 2018 తర్వాత ఇదే తొలిసారి. 2018 కామన్వెల్త్ గేమ్స్ ఫైనల్లో సైనా చేతిలో సింధు ఓటమి పాలైంది. 2019 జాతీయ చాంపియన్‌షిప్ ఫైనల్లోనూ సైనా చేతిలోనే సింధు పరాజయం పాలైంది. ఈ ఏడాది సింధు ఇండియా ఓపెన్, ఇండోనేసియా మాస్టర్స్, ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్, స్విస్ ఓపెన్, ఆసియా చాంపియన్‌షిప్, మలేసియా మాస్టర్స్, సింగపూర్ ఓపెన్, ఇండోనేసియా ఓపెన్, జపాన్ ఓపెన్ టోర్నీలలో ఆడింది. జనవరిలో స్వదేశంలో జరిగిన ఇండియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరడమే ఈ ఏడాది సింధు అత్యుత్తమ ప్రదర్శన కావడం గమనార్హం.

పురుషుల సింగిల్స్‌లో భారత పోరాటం ముగిసింది. భారత మూడో ర్యాంకర్ హెచ్ఎస్ ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. ఆరో సీడ్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో జరిగిన మ్యాచ్‌లో ప్రణయ్ 21-18, 15-21, 8-21తో ఓడిపోయాడు. తొలి గేమ్‌ను నెగ్గిన ప్రణయ్ అదే జోరును కొనసాగించలేకపోయాడు. వరుసగా రెండు గేమ్‌లను కోల్పోయి ఓటమి పాలయ్యాడు. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-19, 21-19తో ఎనిమిదో సీడ్ లియో రాలీ కర్నాండో-బగాస్ మౌలానా (ఇండోనేసియా) జోడీపై విజయం సాధించింది.


చిరాగ్ శెట్టి, సాత్విక్ సాయిరాజ్

> సింధుపై గెలుస్తానని అస్సలు ఊహించలేదు. తుది ఫలితం గురించి ఆలోచించకుండా నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతో బరిలోకి దిగాను. మొత్తానికి సింధుపై నెగ్గడం నాకే ఆశ్చర్యమనిపిస్తోంది. మ్యాచ్‌లో నేను రెండుసార్లు హాక్ ఐ చాలెంజ్‌లను వృథా చేసుకున్నాను. చివరకు నా వద్ద అప్పీల్ చేసుకునేందుకు మరో అవకాశం లేకపోవడంతో కాస్త అసహనం కలిగింది. అయితే నిర్ణాయక మూడో గేమ్‌లో సంయమనం కోల్పోకుండా ఆడి విజయం అందుకున్నాను.
>
> - ఉన్నతి హుడా




రన్నరప్ పంకజ్
విజేత రిలే పావెల్

మనామా (బహ్రెయిన్): వరల్డ్ 6-రెడ్స్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత దిగ్గజం పంకజ్ అద్వానీ రన్నరప్‌గా నిలిచాడు. గురువారం జరిగిన ఫైనల్లో పంకజ్ 4-5 ఫ్రేమ్‌ల (6-41, 38-10, 73-0, 42-35, 15-38, 1-39, 0-42, 44-0, 9-38) తేడాతో వేల్స్‌కు చెందిన రిలే పావెల్ చేతిలో ఓడిపోయాడు. ఒకదశలో 3-1తో ఆధిక్యంలో ఉన్న పంకజ్ ఆ తర్వాత వరుసగా మూడు ఫ్రేమ్‌లు చేజార్చుకొని 3-4తో వెనుకబడ్డాడు. ఎనిమిదో ఫ్రేమ్‌ను అలవోకగా నెగ్గిన పంకజ్ స్కోరును 4-4తో సమం చేశాడు. అయితే నిర్ణాయక తొమ్మిదో ఫ్రేమ్‌లో రిలే పావెల్ ఏకాగ్రతతో గురి తప్పకుండా బాల్స్‌ను లక్ష్యానికి చేర్చి విజేతగా అవతరించాడు.

అనిరుధ్ ద్వయం అవుట్

బ్లూమ్‌ఫీల్డ్ హిల్స్ (అమెరికా): క్రాన్‌బ్రూక్ క్లాసిక్ ఏటీపీ-100 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్-రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) ద్వయం 6-4, 4-6, 7-10తో 'సూపర్ టైబ్రేక్'లో స్టెఫాన్ డొస్టానిక్-బెంజమిన్ కిట్టే (అమెరికా) జోడీ చేతిలో ఓడిపోయింది. 1 గంట 43 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్-రామ్‌కుమార్ మూడు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు.



క్వార్టర్ ఫైనల్లో యూకీ జోడీ

వాషింగ్టన్: ముబాదాలా సిటీ డీసీ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)-మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో నాలుగో సీడ్ యూకీ-వీనస్ ద్వయం 6-7 (1/7), 7-6 (7/3), 10-6తో 'సూపర్ టైబ్రేక్'లో ఆంద్రీ గొరాన్సన్ (స్వీడన్)-సెమ్ వెర్‌బీక్ (నెదర్లాండ్స్) జంటపై గెలుపొందింది. రెండు గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో-కివీస్ జోడీ నాలుగు ఏస్‌లు సంధించి, తొమ్మిది డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. 86 సర్వీస్ పాయింట్లలో యూకీ-వీనస్ 58 పాయింట్లు సాధించారు. క్వార్టర్ ఫైనల్లో నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్)-జాన్ ప్యాట్రిక్ స్మిత్ (ఆస్ట్రేలియా)లతో యూకీ-వీనస్ తలపడతారు.



రిత్విక్ జంట ఓటమి

కిట్జ్‌బుహెల్ (ఆస్ట్రియా): జెనరాలీ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీకి నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన రిత్విక్ చౌదరీ-శ్రీరామ్ బాలాజీ (భారత్) జంట పరాజయం చవిచూసింది. నీల్ ఒబెర్లెట్నర్-జోయల్ ష్వార్జ్‌లర్ (ఆస్ట్రియా) ద్వయంతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో రిత్విక్-బాలాజీ జోడీ 4-6, 2-6తో ఓడిపోయింది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బాలాజీ నాలుగు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసే అవకాశాన్ని వదులుకున్న రిత్విక్-బాలాజీ తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయారు. వాస్తవానికి తొలి రౌండ్‌లో టాప్ సీడ్ కెవిన్ క్రావిట్జ్-టిమ్ పుట్జ్ (జర్మనీ) జోడీతో రిత్విక్-బాలాజీ ఆడాల్సింది. అయితే 'డ్రా' తీశాక క్రావిట్జ్-పుట్జ్ ద్వయం టోర్నీ నుంచి వైదొలగడంతో మరో ప్రత్యామ్నాయ జంట లభించలేదు. దాంతో రిత్విక్-బాలాజీలకు తొలి రౌండ్‌లో 'బై' ఇచ్చారు. క్వార్టర్ ఫైనల్లో ఓడిన రిత్విక్-బాలాజీలకు 5,500 యూరోల (రూ. 5 లక్షల 59 వేలు) ప్రైజ్‌మనీతో పాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

యూఏఈలో ఆసియా కప్!

- బీసీసీఐ ఆధ్వర్యంలోనే నిర్వహణ
- త్వరలోనే అధికారిక ప్రకటన



న్యూఢిల్లీ/ఢాకా: భారత్‌లో జరగాల్సిన ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌ను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సిద్ధమైంది. ఢాకాలో జరిగిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సమావేశంలో బీసీసీఐ ఈ మేరకు చర్చించినట్లు తెలిసింది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే ఏసీసీ వెల్లడించనుంది. ఏసీసీలోని మొత్తం 25 సభ్య దేశాలు ఈ మీటింగ్‌లో పాల్గొన్నాయి. మొదట్లో ఈ సమావేశానికి బీసీసీఐ గైర్హాజరైనట్లు మీడియాలో వార్తలొచ్చాయి. కానీ భారత బోర్డు నుంచి సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వర్చువల్‌గా (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా) పాల్గొన్నట్లు బీసీసీఐ వర్గాలు ధ్రువీకరించాయి. 'ఆసియా కప్‌ను యూఏఈలో నిర్వహించనున్నాం. టీమిండియా మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లోనే ఆడనుంది. షెడ్యూల్‌పై చర్చలు ఇంకా జరుగుతున్నాయి' అని ఏసీసీ వర్గాలు వెల్లడించాయి. ఏసీసీ చైర్మన్ మోసిన్ నఖ్వీ మాట్లాడుతూ 25 సభ్య దేశాలన్నీ పాల్గొన్నాయని, బీసీసీఐతో సంప్రదింపులు పూర్తయిన వెంటనే తుది షెడ్యూలును త్వరలో ఖరారు చేస్తామని చెప్పారు. పూర్తిగా క్రికెట్ క్రీడ, అనుబంధ, సభ్యదేశాల్లో ఆట గురించే తప్ప ఇతరత్రా రాజకీయ అంశాలేవీ చర్చించలేదని ఆయన చెప్పారు. బీసీసీఐ భౌతికంగా పాల్గొనకపోవడంపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ... 'అది అసలు సమస్యే కాదు. ఎందుకంటే నేను కూడా సింగపూర్‌లో జరిగిన ఐసీసీ వార్షిక సమావేశంలో భౌతికంగా పాల్గొనలేదు' అని అన్నారు. సెప్టెంబర్‌లో రెండు వారాల్లోనే ఈ టి20 టోర్నీని ముగించే ప్రణాళికల్లో బీసీసీఐ ఉంది. ఎందుకంటే ఆ నెలాఖరి వారంలో భారత్, వెస్టిండీస్‌ల మధ్య ద్వైపాక్షిక టెస్టు సిరీస్ మొదలు కానుంది.

భారత్‌లో ఎందుకు జరగడం లేదు?

భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా వచ్చే ఏడాది టి20 ప్రపంచకప్‌కు ఆతిథ్యమివ్వనున్నాయి. ఫిబ్రవరిలో జరిగే ఈ మెగా ఈవెంట్ కోసం భారత్‌లో ఈ సారి ఆసియా కప్‌ను టి20 ఫార్మాట్‌లో నిర్వహించాలనుకున్నారు. అయితే పాక్‌లో జరిగిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భారత్ మ్యాచ్‌ల్ని దుబాయ్‌లో ఆడింది. ఆ సందర్భంలోనే ఇకపై పాక్ కూడా తమ మ్యాచ్‌ల్ని తటస్థ వేదికైన శ్రీలంక, లేదంటే యూఏఈలో ఆడుతుందని ఈ మేరకు ఒప్పందం కూడా జరిగింది. అయితే ఇటీవలే పాక్ వైఖరిలో మార్పు వచ్చింది. భారత్‌లో ఆడేందుకు సై అంటూ సంకేతాలిచ్చింది. సాక్షాత్తూ పాకిస్తాన్ క్రీడాశాఖ మంత్రే ఈ విషయాన్ని వెల్లడించారు. కానీ భారత్‌లో పహల్గామ్‌లో ఉగ్రమూకల ఊచకోత అనంతరం భద్రతా దళాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో యుద్ధవాతావరణ పరిస్థితులు తలెత్తాయి. చివరకు కాల్పుల విరమణతో ఉద్రిక్తతలకు తెరపడింది. అయితే ఇలాంటి క్లిష్టమైన పరిస్థితులు ఎదురై నెలలు గడవకముందే పాక్ ఆటగాళ్లను భారత్‌లోకి అనుమతిస్తే వచ్చే సమస్యలు, విమర్శలను ముందే గుర్తించిన బీసీసీఐ తమ ఆతిథ్యాన్ని యూఏఈలో ఇచ్చేందుకు సిద్ధపడింది.

అనాహత్‌కు పతకం ఖాయం



కైరో (ఈజిప్ట్): ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్ సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో అనాహత్ 11-6, 13-11, 11-5తో మలికా ఎల్కారస్కీ (ఈజిప్ట్)పై విజయం సాధించింది. అంతకుముందు తొలి రౌండ్‌లో 'బై' పొందిన అనాహత్... రెండో రౌండ్‌లో 11-4, 11-4, 11-2తో జోలి కిమ్ (కెనడా)పై, మూడో రౌండ్‌లో 11-1, 11-6, 11-1తో ఇనెస్ గుయోట్ (ఫ్రాన్స్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 11-5, 11-2, 11-6తో లౌరా సుజా (బ్రెజిల్)పై గెలుపొందింది. సెమీఫైనల్లో ఈజిప్ట్‌కు చెందిన నాదిన్ ఎల్‌హామితో అనాహత్ తలపడుతుంది.

ఎదురులేని న్యూజిలాండ్


సీఫెర్ట్



ఇష్ సోధి


రచిన్

- ముక్కోణపు టి20 టోర్నీలో వరుసగా నాలుగో విజయం
- జింబాబ్వేపై 60 పరుగులతో నెగ్గిన సాంట్నర్ బృందం
- మెరిసిన సీఫెర్ట్, రచిన్, ఇష్ సోధి

హరారే: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన న్యూజిలాండ్ జట్టు ముక్కోణపు టి20 క్రికెట్ టోర్నీలో వరుసగా నాలుగో విజయం నమోదు చేసింది. ఇప్పటికే ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్న మిచెల్ సాంట్నర్ బృందం... గురువారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య జింబాబ్వే జట్టుపై 60 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 190 పరుగులు స్కోరు చేసింది. ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ (45 బంతుల్లో 75; 9 ఫోర్లు, 1 సిక్స్), వన్‌డౌన్‌లో వచ్చిన రచిన్ రవీంద్ర (39 బంతుల్లో 63; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ ఆటతీరుతో అర్ధ సెంచరీలు చేశారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 108 పరుగులు జోడించారు. చివర్లో మైకేల్ బ్రేస్‌వెల్ (16 బంతుల్లో 26 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా బ్యాట్‌ను ఝళిపించాడు. జింబాబ్వే బౌలర్లలో రిచర్డ్ ఎన్‌గరావా 34 పరుగులిచ్చి 4 వికెట్లు, మపోసా 33 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు. 191 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 18.5 ఓవర్లలో 130 పరుగులకే ఆలౌటై ఓటమి పాలైంది. టోనో మున్‌యోంగ్యా (30 బంతుల్లో 40; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్ లెగ్ స్పిన్నర్ ఇష్ సోధి 12 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి టి20ల్లో తన కెరీర్ బెస్ట్ ప్రదర్శన నమోదు చేశాడు. అంతేకాకుండా టిమ్ సౌతీ (న్యూజిలాండ్; 164 వికెట్లు), రషీద్ ఖాన్ (అఫ్గానిస్తాన్; 161 వికెట్లు) తర్వాత టి20ల్లో 150 వికెట్ల మైలురాయిని అందుకున్న మూడో బౌలర్‌గా ఇష్ సోధి గుర్తింపు పొందాడు. శనివారం జరిగే ఫైనల్లో దక్షిణాఫ్రికాతో న్యూజిలాండ్ తలపడుతుంది.




ఫర్హాన్

పాకిస్తాన్‌కు ఊరట విజయం

చివరి టి20లో బంగ్లాదేశ్ పరాజయం

మిర్పూర్: వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి సిరీస్‌ను సొంతం చేసుకున్న బంగ్లాదేశ్‌కు చివరిదైన మూడో మ్యాచ్‌లో మాత్రం పరాజయం ఎదురైంది. పాకిస్తాన్‌తో గురువారం జరిగిన ఆఖరి టి20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 74 పరుగుల తేడాతో ఓడిపోయింది. బంగ్లాదేశ్ కెప్టెన్ లిటన్ దాస్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 178 పరుగులు సాధించింది. ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ (41 బంతుల్లో 63; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) బంగ్లాదేశ్ బౌలర్ల భరతం పట్టి అర్ధ సెంచరీ నమోదు చేశాడు. సయీమ్ అయూబ్ (15 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), హసన్ నవాజ్ (17 బంతుల్లో 33; 1 ఫోర్, 3 సిక్స్‌లు), మొహమ్మద్ నవాజ్ (16 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా మెరిపించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో టస్కిన్ అహ్మద్ 3 వికెట్లు, నసుమ్ అహ్మద్ 2 వికెట్లు తీశారు. షోరిఫుల్ ఇస్లాం, సైఫుద్దీన్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. 179 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 16.4 ఓవర్లలో 104 పరుగులకే ఆలౌటై ఓటమి పాలైంది. ఒకదశలో 41 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన బంగ్లాదేశ్ సైఫుద్దీన్ (34 బంతుల్లో 35 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఇన్నింగ్స్‌తో 100 పరుగులను దాటింది. పాకిస్తాన్ బౌలర్లలో సల్మాన్ మీర్జా 3 వికెట్లు పడగొట్టగా... ఫహీమ్ అష్రఫ్, మొహమ్మద్ నవాజ్ 2 వికెట్ల చొప్పున తీశారు. ఫర్హాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు... జాకీర్ అలీకి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' పురస్కారం లభించాయి.



ఐస్‌ల్యాండ్‌లోని రెక్‌జాన్స్ ద్వీపకల్పంలోని గ్రిండావిక్‌లోని అగ్ని పర్వతం మళ్లీ బద్దలైంది. ఉప్పొంగుతున్న ఎర్రటి లావా దిగువకు ప్రవహిస్తున్న దృశ్యమిది.



ఫిలిప్పీన్స్‌ను వరదలు భయపెడుతున్నాయి. రిజాల్ ప్రావిన్స్‌లోని కైంటాలో ఓ వ్యక్తి వరదలో పాత ఫ్రిజ్‌ను ఇలా బోటుగా మార్చుకున్నాడు..



గురువారం తుర్కియే వాయవ్యాన ఉన్న కరాబుక్ ప్రాంతంలో కవుస్లార్ గ్రామ సమీపంలో కమ్ముకొస్తున్న కార్చిచ్చు

వనాలకు ఆకాశ శరాలు

చెట్లను నిట్టనిలువుగా తగలబెడుతున్న పిడుగులు

- కోట్ల సంఖ్యలో వృక్షాలను కోల్పోతున్న పుడమి
- హరితవనాలకు ప్రాణసంకటంగా మారిన పిడుగులు
- ఏటా 35,00,00,000 చెట్లు మెరుపులు, పిడుగులకు ఆహుతి

వాషింగ్టన్: వెచ్చని సూర్యకిరణాలు పుడమి తల్లిని ముద్దాడకుండా అడ్డుకుంటూ దట్టంగా, ఏపుగా పెరిగిన వృక్షాలను చూసి వరుణ దేవునికి ఆగ్రహం కట్టలు తెంచుకుంటుదో లేదో తెలీదుగానీ వర్షం వంటి సందర్భాల్లో భూమిపైకి దూసుకొచ్చే మెరుపులు, పిడుగుల కారణంగా కోట్లాది వృక్షాలను కాలిబూడిద అవుతున్నాయి. పిడుగులు పడడంతో ఉద్భవించే అతి ఉష్ణానికి ప్రతి ఏటా అక్షరాలా 35 కోట్ల చెట్లు నిట్టనిలువునా కాలిపోతున్నాయని తాజా అధ్యయనంలో తేలింది. పుడమిపై పచ్చదనం క్షీణించడానికి పిడుగులు కూడా ప్రబల హేతువుగా మారాయన్న కొత్త విషయాన్ని అధ్యయనకారులు వెల్లడించారు. మ్యూనిచ్ టెక్నికల్ యూనివర్సిటీ పరిశోధకులు ఈ మేరకు విస్తృతస్థాయిలో పరిశోధన చేశారు. పిడుగులు పడటంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది చెట్లు కాలిపోతున్నాయని, దీంతో పచ్చదనం తగ్గిపోతోందని అధ్యయనంలో స్పష్టమైంది. ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన అడవుల్లో వృక్షాల క్షీణతకు సంబంధించిన సమాచారాన్ని ఆధునిక గణన పద్ధతులతో విశ్లేషించి ఈ విషయాన్ని ధృవీకరించుకున్నారు. అయితే వాస్తవంగా చూస్తే ఏటా ఇంతకంటే ఎక్కువ సంఖ్యలోనే వృక్షాలు పిడుగులకు బలికావొచ్చని అధ్యయనకారులు అంచనావేశారు. ''ప్రతి సంవత్సరం పడుతున్న పిడుగుల కారణంగా ఎన్ని చెట్లు కాలిపోతున్నాయి అనేది అంశంతోపాటే ఏఏ దేశాల్లో పిడుగుల ఘటనలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి? వాటి కారణంగా తగ్గిన పచ్చదనంతో అక్కడ మారిన వాతావరణ పరిస్థితుల వివరాలనూ సేకరిస్తున్నాం'' అని అధ్యయనంలో ముఖ్య రచయిత ఆండ్రీస్ క్రాస్ చెప్పారు.

భారీ స్థాయిలో నష్టం

32 కోట్ల చెట్లు అంటే చిన్న విషయం కాదు. ఏకంగా ప్రపంచ వృక్ష సంపదలో 2.1 శాతం నుంచి 2.9 శాతానికి సరిపడా వృక్షాలు అంతరించిపోతున్నట్లే లెక్క. ఈ లెక్కన పుడమిపై పచ్చదనం గాఢత సైతం తగ్గుతోంది. ఇంతటి భారీ సంఖ్యలో చెట్లు లేకపోవడం కారణంగా ఈ చెట్లుఉంటే పీల్చుకునే కార్బన్‌డయాక్సైడ్ అలాగే వాతావరణంలోనే పోగుబడుతోంది. ఇలా ఏటా ఏకంగా 77 కోట్ల నుంచి 109 కోట్ల టన్నుల కార్బన్‌డయాక్సైడ్ వాతావరణంలోనే ఉండిపోతోంది. ఇది భూతాపోన్నతికి ప్రత్యక్షంగా కారణమవుతోందని అధ్యయనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. పిడుగులు పరోక్షంగా 109 కోట్ల టన్నుల సీఓ2 వాతావరణంలో పేరుకుపోవడానికి కారణమైతే.. కార్చిచ్చు, అడవి దగ్ధం వంటి ఘటనల కారణంగా వృక్షసంపద కాలిపోయి తద్వారా దాదాపు అదే స్థాయిలో 126 కోట్ల టన్నుల కార్బన్‌డయాక్సైడ్ వాతావరణంలోకి విడుదల అవుతోంది.

మరింతగా పిడుగుల వర్షం!

రాబోయే రోజుల్లో పిడుగులు పడే దృగ్విషయాలు మరింతగా సర్వసాధారణం కానున్నాయని అధ్యయనంలో తేలింది. ప్రస్తుతం ఉష్ణమండల అరణ్యాల్లో పిడుగులు ఎక్కువగా పడుతున్నాయి. దీంతో భారీసంఖ్యలో చెట్లు నాశనమవుతున్నాయి. రాబోయే రోజుల్లో సముద్రమట్టంతో పోలిస్తే మధ్యస్థాయి, కాస్తంత ఎక్కువ ఎత్తులో ఉండే దేశాల్లోనూ పిడుగుల బెడద ఎక్కువ కానుందని అధ్యయనకారులు చెప్పారు. సమశీతోష్ణ మండలాలు, యూరప్ దేశాల్లో పిడుగులు ఎక్కువగా పడే అవకాశముంది. దీంతో అటవీ ఆవరణ వ్యవస్థ, అక్కడి కార్బన్‌డయాక్సైడ్ స్థాయిలపై దుష్ప్రభావం పెరగనుంది. ఈ నేపథ్యంలో ఆయా దేశాలు తమ పరిధిలోని అడవుల సంరక్షణపై మరింతగా దృష్టిసారించాలని అధ్యయనకారులు సూచించారు.

3,682 పులులు..891 సింహాలు..!

దేశంలోని అభయారణ్యాల్లో ఉన్నట్లు కేంద్రం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని అభయారణ్యాల్లో 3,682 పులులు, 891 సింహాలు, 30,711 ఏనుగులు ఉన్నట్లు రాజ్యసభలో కేంద్ర అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు.నాలుగేళ్లకోసారి పులుల గణనను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీని ఆధారంగా 2018లో 2,967 పులుల జనాభా ఉండగా, 2022లో 3,682కు పెరిగాయన్నారు. అదేవిధంగా, 2020లో 674 సింహాలుండగా, 2025లో ఇవి 891కి పెరగాయన్నారు. 2017లో ఏనుగులు 29,964 ఉండగా, 2012లో 29,391 ఏనుగులు ఉన్నట్లు చెప్పారు. దేశంలోని దాదాపు 2.5 శాతం భూభాగంలో పులుల కోసం 58 అభయారణ్యాలున్నాయని మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ చెప్పారు. సింహాల కోసం గుజరాత్‌లోని బర్దాలో రెండో అభయారణ్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఏనుగుల సంరక్షణ కోసం 14 రాష్ట్రాలలో 33 సంరక్షణ కేంద్రాలున్నాయన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్

న్యూఢిల్లీ: ఢిల్లీ–ముంబై ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం టేకాఫ్ సమయంలో సాంకేతిక లోపం తలెత్తడంతో నిలిచిపోయింది. మొత్తం 160 మందితో ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బుధవారం సాయంత్రం బయలుదేరిన విమానం స్పీడ్ పారామీటర్లు సరిగ్గా కనిపించడం లేదని పైలట్ గుర్తించారు. దీంతో, టేకాఫ్ చేయడానికి ఆయన నిరాకరించారు. ప్రయాణికులందరినీ దించేసి మరో విమానంలో వారిని గమ్యస్థానాలకు చేర్చినట్లు ఎయిరిండియా ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమని పేర్కొంది.

ధన్‌ఖడ్‌కు వీడ్కోలు పలకరా?

కేంద్రం తీరు పట్ల జైరామ్ రమేశ్ ఆగ్రహం

న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి పదవికి హఠాత్తుగా రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ గౌరవార్థం ప్రభుత్వం తరఫున అధికారికంగా వీడ్కోలు పలకకపోవడం పట్ల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం సాయంత్రం బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశంలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తినట్లు తెలిసింది. ధన్‌ఖడ్‌కు అధికారికంగా వీడ్కోలు పలకాలని డిమాండ్ చేయగా, అక్కడే ఉన్న కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిరణ్ రిజిజు మౌనంగా ఉండిపోయినట్లు సమాచారం. అలాగే జైరామ్ రమేశ్ డిమాండ్‌కు ఇతర విపక్ష నేతలు కూడా మద్దతు ఇవ్వలేదని తెలిసింది. ధన్‌ఖడ్‌తో బలవంతంగా రాజీనామా చేయించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఆయనకు కనీసం గౌరవప్రదమైన వీడ్కోలు అయినా పలకాలని కోరుతోంది.

ఆస్ట్రేలియాలో హిందూ ఆలయంపై విద్వేష రాతలు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగిపోతుండటమే ఆయా వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా ఓ హిందూ ఆలయం, రెండు రెస్టారెంట్లపై మత విద్వేష రాతలు ప్రత్యక్షమయ్యాయి. మెల్‌బోర్న్ శివారు బొరొనియాలోని స్వామి నారాయణ్ ఆలయం గోడలపై ఎర్ర రంగుతో రాసిన విద్వేష నినాదాలు కనిపించాయి. అదే రోజు బొరొనియా రోడ్డులో ఉన్న రెండు రెస్టారెంట్ల గోడలపైనా ఇలాంటి రాతలే ప్రత్యక్షమయ్యాయి. ఈ ఘటనలను విక్టోరియా పోలీసు విభాగం ఖండించింది. ఆస్ట్రేలియా హిందూ కౌన్సిల్ విక్టోరియా చాప్టర్ ప్రెసిడెంట్ మకరంద్ భాగవత్ ఖండించారు. మత స్వేచ్ఛ, ప్రార్థనాస్వేచ్ఛలతోపాటు మా గుర్తింపుపై దాడి జరిగినట్లే భావిస్తున్నామన్నారు.

అహ్మదాబాద్ ఘటన అనంతరం.. అమాంతం పెరిగిన ఎయిరిండియా పైలట్ల సిక్ లీవులు

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం ఘోర ప్రమాదానికి గురైన తర్వాత ఆ సంస్థలో అనారోగ్య కారణాలతో సెలవులు పెట్టే పైలట్ల సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది. ఈ విషయాన్ని పౌరవిమానయాన శాఖ మంత్రి మురళీధర్ మహోల్ గురువారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా బదులిచ్చారు. జూన్ 16వ తేదీ ఒక్క రోజే ఏకంగా 51 మంది ఎయిరిండియా పైలట్లు, మరో 61 మంది అసిస్టెంట్ పైలట్లు మొత్తం 112 మంది సిక్ లీవుపై వెళ్లారన్నారు. అనారోగ్య కారణాలతో మూకుమ్మడిగా మాత్రం వెళ్లలేదని వివరించారు. జూన్ 12న జరిగిన దుర్ఘటనలో మొత్తం 260 మంది చనిపోవడం తెల్సిందే.

ఎయిరిండియాకు డీజీసీఏ 4 షోకాజ్ నోటీసులు

ముంబై: వివిధ నియమ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఎయిరిండియాకు నాలుగు షోకాజ్ నోటీసులు పంపినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) గురువారం తెలిపింది. ఎయిరిండియా జూన్ 20, 21వ తేదీల్లో స్వయంగా అందజేసిన సమాచారాన్ని అనుసరించి జూలై 23న ఈ నోటీసులు అందజేశామని వివరించింది. విమాన సిబ్బంది విశ్రాంతి, విధులు, శిక్షణకు సంబంధించిన పలు ఉల్లంఘనలున్నాయని తెలిపింది.

'సోషలిజం, సెక్యులరిజం' తొలగించం: కేంద్రం

న్యూఢిల్లీ: రాజ్యాంగ పీఠికలో ఉన్న సోషలిజం, సెక్యులరిజం అనే మాటలను తొలగించే యోచనేదీ ప్రస్తుతానికి లేదని కేంద్రం తెలిపింది. ఈ రెండు మాటలను తొలగించే రాజ్యాంగ సవరణకు సంబంధించి చట్టపరమైన రాజ్యాంగపరమైన ప్రక్రియను అధికారికంగా ప్రారంభించలేదని కూడా వెల్లడించింది. న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మెఘ్వాల్ గురువారం రాజ్యసభలో ఈ విషయం లిఖిత పూర్వకంగా తెలిపారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన సమయంలో రాజ్యాంగ పీఠికలో చేర్చిన సోషలిజం, సెక్యులరిజం మాటలను తొలగిస్తారంటూ వస్తున్న వార్తలు ప్రజల్లో అయోమయానికి కారణమవుతున్నాయన్నారు. ఈ వార్తలతో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని కూడా ఆయన పేర్కొన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 రోజుల సెలవులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు వృద్ధులైన తమ తల్లిదండ్రుల సంరక్షణ కోసం 30 రోజులపాటు సెలవులు తీసుకోవచ్చని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభలో వెల్లడించారు. తల్లిదండ్రుల సంరక్షణతోపాటు ఇతర వ్యక్తిగత కారణాల రీత్యా ఈ సెలవులు పొందడానికి సెంట్రల్ సివిల్ సర్వీసెస్(లీవ్స్) రూల్స్–1972 అనుమతిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతిఏటా 30 రోజులు ఆర్జిత సెలవులు, 20 రోజులు సగం వేతనంతో కూడిన సెలవులు, 8 రోజులు సాధారణ సెలవులతోపాటు ఇతర సెలవులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

కర్ణాటక హైకోర్టుది విచక్షణారాహిత్యం

రేణుక స్వామి హత్య కేసులో దర్శన్‌కు బెయిల్ ఇవ్వడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: రేణుకస్వామి హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్, ఇతర నిందితులకు కర్ణాటక హైకోర్టు బెయిల్ ఇవ్వడంపై సుప్రీంకోర్టు ఆగ్రహంవ్యక్తం చేసింది. విచక్షణారహిత చర్యగా అభివర్ణించింది. హత్య కేసులో తన తీర్పును గురువారం రిజర్వ్ చేసింది. చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టుపై తీవ్రంగా మండిపడింది. ఈ కేసులో హైకోర్టు న్యాయమూర్తులు విచక్షణను వర్తింపజేశారా? అన్ని బెయిల్ దరఖాస్తుల్లో ఒకే రకమైన ఆదేశాలను నిర్దేశించడమేంటని హైకోర్టును ప్రశ్నించింది. 'హైకోర్టు వైఖరి మమ్మల్ని ఇబ్బంది పెడుతోంది. హైకోర్టు న్యాయమూర్తి అర్థం చేసుకున్న తీరు అదేనా? సెషన్స్ జడ్జి అయితే మనం అర్థం చేసుకోగలం. కానీ హైకోర్టు న్యాయమూర్తి కూడా అలాంటి తప్పు ఎలా చేశారు?'అని విస్తుపోయింది. ఈ తీర్పు విచక్షణారాహిత్యమని అభివర్ణించిన సుప్రీంకోర్టు.. హైకోర్టు చేసిన అదే తప్పును తాము చేయబోమని చెప్పింది. ఇది హత్య, కుట్ర కేసు తీవ్రంగా ఉంటామని స్పష్టం చేసింది.

33 ఏళ్ల రేణుకస్వామి హత్య కేసులో నటుడు దర్శన్, ఇతరులకు బెయిల్ మంజూరు చేస్తూ డిసెంబర్ 13, 2024న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ కర్ణాటక ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. సహ నిందితురాలు పవిత్ర గౌడ తరఫు న్యాయవాదిని ఉద్దేశించి ధర్మాసనం మాట్లాడుతూ.. 'ఇదంతా మీ వల్లే జరిగింది. మీరు అక్కడ లేకుంటే, దర్శన్ ఆసక్తి చూపేవారు కాదు. ఆయన ఆసక్తి చూపకపోతే, ఇతరులు ఆసక్తి చూపేవారు కాదు. కాబట్టి, సమస్యకు మీరే మూల కారణం'అని పేర్కొంది. అయితే.. ఆమెకు అభ్యంతరకరమైన సందేశాలు వచ్చాయని, కిడ్నాప్ లేదా హత్యలో పాల్గొన్న నిందితులతో ఆమెకు ప్రత్యక్ష కాల్ రికార్డ్ సంబంధాలు లేవని పవిత్ర గౌడ తరఫు న్యాయవాది వాదించారు. ప్రత్యక్ష సాక్షులైన గార్డులుగా పనిచేస్తున్న కిరణ్, పునీత్‌ల కథనాలను హైకోర్టు ఎలా తోసిపుచ్చిందని కూడా సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తాము హైకోర్టు ప్రవర్తనను పరిశీలించి ఉత్తర్వులు వెలువరిస్తామని స్పష్టం చేసింది.

కొత్త పార్టీ పెడతా.. ఎన్నికల్లో అభ్యర్థులను బరిలోకి దించుతా

అధిష్టానానికి టీఎంసీ ఎమ్మెల్యే హుమాయూన్ వార్నింగ్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) మైనారిటీ ఓటు బ్యాంకును దెబ్బతీసే పరిణామమిది. పార్టీకి చెందిన ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్ అసమ్మతి గళాన్ని గట్టిగా వినిపించారు. ఆగస్టు 15వ తేదీలోగా ముర్షిదాబాద్ జిల్లా నాయకత్వాన్ని ప్రక్షాళన చేయకుంటే కొత్తగా పార్టీని పెట్టి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 50కిపైగా స్థానాల్లో అభ్యర్థులను నిలబెడతానని గురువారం ప్రకటించారు. ముస్లిం ప్రాతినిధ్యం కలిగి ఉండే తన పార్టీ ముర్షిదాబాద్‌తోపాటు మల్దా, నార్త్ దినాజ్‌పూర్, నిడియా, సౌత్ దినాజ్‌పూర్‌లో రాజకీయ సమీకరణాలను తలకిందులు చేస్తుందంటూ చెప్పుకొచ్చారు. తనమాదిరిగా టీఎంసీని వీడాలని సిద్ధంగా ఉన్నవారే చాలా మందే ఉన్నారన్నారు. తనను పట్టించుకోకుంటే 2026 జనవరి ఒకటో తేదీన పార్టీని ప్రకటిస్తానన్నారు. ఈ వార్నింగ్‌ను టీఎంసీ అధిష్టానం ఏమాత్రం పట్టించుకోలేదు. ఇదో పెద్ద స్టంట్ అంటూ కొట్టిపారేసింది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినందుకు పలుమార్లు షోకాజ్ నోటీసులు అందుకున్న హుమాయూన్ కావాలనుకుంటే పార్టీని వీడి వెళ్లవచ్చని టీఎంసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోయ్‌ప్రకాశ్ మజుందార్ తెలిపారు. 'పార్టీలో ఉండాలనుకుంటే క్రమశిక్షణతో మెలగాలి. అలా కాదంటే ఇప్పుడే వెళ్లిపోవచ్చు. పార్టీ పెట్టుకున్నా మాకు అభ్యంతరం లేదు'అని మజుందార్ పేర్కొన్నారు. దీనిపై హుమాయూన్ సైతం వెనక్కి తగ్గలేదు. 'వచ్చే ఎన్నికల్లో నేనే కాదు, మా పార్టీలోకి వచ్చే వారినీ గెలిపించుకుని మమతా బెనర్జీతో చర్చలు జరిపే స్థాయికి ఎదుగుతా'అంటూ సవాల్ విసిరారు. తనకు మమతా బెనర్జీపై వ్యక్తిగతంగా ఎటువంటి ద్వేషం లేదన్నారు. హుమాయూన్ కబీర్ వ్యాఖ్యలపై సీపీఎం నేత సుజన్ చక్రవర్తి స్పందిస్తూ..ఆయనో అవకాశవాది అంటూ విమర్శించారు. 'హుమాయూన్ మొదట్లో కాంగ్రెస్‌లో ఉన్నారు. అక్కడి నుంచి బీజేపీకి ఆపైన టీఎంసీకి వెళ్లారు. మళ్లీ కాంగ్రెస్‌కు వచ్చి తిరిగి టీఎంసీలో చేరారు. ఇప్పుడేమో కొత్తగా పార్టీ పెడతానంటున్నారు. ఆయన పక్కా అవకాశవాది'అంటూ మండిపడ్డారు.

మిమ్మల్ని వదిలేది లేదు

- ఈసీకి రాహుల్ గాంధీ హెచ్చరిక
- కర్నాటకలో మోసం జరిగిందని ఆరోపణ

న్యూఢిల్లీ: గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటకలోని ఓ నియోజకవర్గంలో మోసం జరిగిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. ఈ విషయాన్ని ఇంతటితో వదిలేస్తామనుకోవద్దు..మేం మిమ్మల్ని వదిలిపెట్టం అంటూ ఆయన చేసిన హెచ్చరికలపై ఎన్నికల కమిషన్(ఈసీ) తీవ్రంగా స్పందించింది. రాహుల్ గురువారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన..'భారత ఎన్నికల సంఘం తన విధులను సక్రమంగా నిర్వహించడం లేదు. గతేడాది కర్నాటకలో లోక్‌సభ ఎన్నికలు జరిగిన ఒక్కో నియోజకవర్గాన్ని పరిశీలిస్తూ వస్తున్నాం. ఒక నియోజకవర్గంలో తప్పు జరిగినట్లు మా దగ్గర ఆధారాలున్నాయి. 90 శాతం కాదు..100శాతం మోసం జరిగినట్లు రుజువులున్నాయి. అక్కడంతా డ్రామా నడిచింది. దీనిపై ఈసీకి మెసేజీ పంపుతా. ఈ విషయం ఇంతటితో ముగిసిందని ఈసీ, అధికారులు అనుకోవద్దు. మీరు తప్పు చేశారు. ఎక్కడికీ వెళ్లలేరు. మిమ్మల్ని వెంటాడుతాం'అని ఆయన హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలపై ఈసీ స్పందించింది. ఎన్నికలైన ఏడాది తర్వాత రాజ్యాంగ సంస్థపై నిరాధార బెదిరింపు ఆరోపణలు చేయడం తగదని పేర్కొంది. ప్రజాప్రాతినిధ్యచట్టంలోని సెక్షన్ 80 ప్రకారం హైకోర్టులో పిటిషన్ వేయకుండా ఇటువంటి విమర్శలు చేయడం దురదృష్టకరమంది. 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు ఒక్క ఫిర్యాదు కూడా నమోదవలేదని ఈసీ తెలిపింది.

మృతులు, వలసదారులకు జాబితాలో చోటుండదు: ఈసీ

న్యూఢిల్లీ: బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా రివిజన్‌లో ఎట్టిపరిస్థితుల్లోనూ చనిపోయినవారి పేర్లకు, శాశ్వతంగా వలస వెళ్లిన వారికి, పలుప్రాంతాల్లో ఓటరు జాబితాల్లో నమోదైన వారికి స్థానం కల్పించబోమని చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గేది లేదన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారంటూ వస్తున్న ఆరోపణలపై ఈమేరకు ఆయన స్పందించారు.

అవసరమైతే ఎన్నికల్ని బహిష్కరిస్తాం: తేజస్వీ

పట్నా: బిహార్‌లో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా ప్రత్యేక రివిజన్ వివాదాస్పదం అయిన నేపథ్యంలో ప్రతిపక్ష ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే ఎన్నికల్ని బహిష్కరిస్తామన్నారు. గురువారం ఆయన అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల్ని బహిష్కరించే ఆప్షన్ కూడా మాకుంది. సమయమొచ్చినప్పుడు మా భాగస్వామ్య పార్టీలతో చర్చించి దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటాం. ఇప్పుడు రివిజన్ పేరుతో జరిగేదంతా మోసం'అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న బూత్ లెవెల్ అధికార్లు(బీఎల్‌వోలు) ఎన్యుమరేషన్ ఫాంలపై ఓటర్లకు బదులుగా సంతకాలు చేస్తూ, వేలిముద్రలు వేస్తున్నారు. మీడియా ఇదేమని అడిగితే పోలీసులు కేసులు పెడుతున్నారు. ఇదంతా ప్రభుత్వం అండతోనే జరుగుతోంది. ఈసీ అధికార పార్టీకి వత్తాసు పలుకుతోంది'అని తీవ్రంగా విమర్శించారు.



బ్రిటన్ కింగ్ ఛార్లెస్‌ను కలిసిన మోదీ

లండన్: బ్రిటన్‌లో పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అక్కడ బ్రిటన్ రాజు ఛార్లెస్‌ను కలిశారు. గురువారం రాజు అధికారిక నివాసాల్లో ఒకటైన నోర్ఫోక్ ప్రాంతంలోని సాండ్రింగ్‌హామ్ హౌస్‌కు విచ్చేసిన మోదీని ఛార్లెస్ సాదరంగా ఆహ్వానించారు. ఇద్దరూ కొద్దిసేపు పలు అంశాలపై మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా ఛార్లెస్‌కు మోదీ తెల్లని పూరెమ్మలు ఉండే సోనోమా డేవిడియా ఇన్వాలుక్రాటా అనే వింతైన మొక్కను బహూకరించారు. ఈ చెట్టుకు పూసే పూలను దూరం నుంచి చూస్తే గాల్లో ఎగిరే తెల్లపావురాల్లా కనిపిస్తాయి. శ్వేతవర్ణ పూరెమ్మలు ఉండటంతో దీనిని హ్యాండ్‌కర్ఛీఫ్ చెట్టు అని కూడా అంటారు. అమ్మ పేరిట ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా ఛార్లెస్‌కు మోదీ ఈ మొక్కను బహుమతిగా అందించారు. తల్లిని గుర్తుచేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం తెల్సిందే. సాధారణంగా డేవిడియా మొక్క నాటిన 20 ఏళ్ల తర్వాతే పూలు పూస్తుంది. కానీ సోనోమా రకం సంకరజాతి మొక్క కేవలం రెండు, మూడేళ్లలోనే విరగబూస్తుంది.

జస్టిస్ యశ్వంత్ వర్మపై విచారణ కమిటీ

ప్రకటించనున్న స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణల పట్ల విచారణకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఒక కమిటీని ఏర్పాటు చేయబోతున్నారని అధికార వర్గాలు గురువారం తెలిపాయి. దీనిపై త్వరలో ప్రకటన చేసే అవకాశాలున్నాయని వెల్లడించాయి. జస్టిస్ వర్మను అభిశంసించాలని కోరుతూ 152 మంది ఎంపీలు సంతకాలు చేసిన నోటీసు ఈ నెల 21వ తేదీన స్పీకర్‌కు అందింది. దీంతో జస్టిస్ వర్మ వ్యవహారం ఇప్పుడు పార్లమెంట్ పరిధిలోకి వచ్చింది. ఆయనపై విచారణకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయ నిపుణుడు సభ్యులుగా ఉంటారు. జస్టిస్ శర్మ అభిశంసనను కోరుతూ 63 మంది విపక్ష ఎంపీల సంతకం చేసిన నోటీసు ఈ నెల 21న అప్పటి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు అందింది. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయయూర్తిగా పని చేస్తున్న సమయంలో ఆయన నివాసంలో భారీగా నోట్ల కట్టలు దొరికిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు నియమించిన అంతర్గత విచారణ కమిటీ ఆయనను దోషిగా తేల్చింది. అవినీతికి పాల్పడి నోట్లకట్టలు పోగేసినట్లు తేల్చింది. అంతర్గత విచారణ కమిటీ నివేదికను సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఛత్తీస్‌గఢ్‌లో 66మంది నక్సల్స్ లొంగుబాటు

49 మందిపై మొత్తం 2.27 కోట్ల రివార్డు

బస్తర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ ప్రాంత పరిధిలోని ఐదు జిల్లాలకు చెందిన 66 మంది మావోయిస్టులు గురువారం పోలీసు అధికారుల ఎదుట లొంగిపోయారు. వీరిలో 49 మంది తలలపై ప్రభుత్వం ప్రకటించిన మొత్తం రివార్డు రూ.2.27 కోట్లు ఉందని అధికారులు గురువారం వెల్లడించారు. వీరిలో బిజాపూర్ జిల్లాలో 25 మంది, దంతెవాడలో 15 మంది, కాంకేర్‌లో 13, నారాయణపూర్‌లో 8, సుక్మా జిల్లాకు చెందిన ఐదుగురు ఉన్నారు. ఇందులో మహిళా సభ్యులు 27 మంది అని వివరించారు.మావోయిస్టు సిద్ధాంతాలపై విముఖత, ప్రభుత్వం, పోలీసులు ప్రకటించిన సానుకూల పథకాలే వీరిని జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చాయన్నారు. లొంగిపోయిన ఒడిశా రాష్ట్ర మావోయిస్టు పార్టీ కమిటీ సభ్యుడు, స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు అయిన రమణప్ప ఇర్పా తలపై రూ.25 లక్షలు, అతడి భార్య ప్లటూన్ కమిటీ సభ్యురాలు రమే కల్ముపై రూ.8 లక్షల రివార్డు ఉందని బిజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. అదేవిధంగా, దంతెవాడలో లొంగిపోయిన డివిజన్ కమిటీ సభ్యుడు బుధ్రాం అలియాస్ లాఉ కుహ్రాం, ఆయన భార్య కమ్లి అలియాస్ మోతి పొటావిపై వరుసగా రూ.8 లక్షలు, రూ.5 లక్షల రివార్డుందని అదనపు ఎస్పీ ఉదిత్ పుష్కర్ చెప్పారు. కాంకేర్‌లో లొంగిపోయిన వట్టి గంగా అలియాస్ ముఖేశ్ తలపై రూ. 8 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ రాబిన్సన్ తెలిపారు.

సిక్కు సామ్రాజ్య నిర్మాత రంజిత్ సింగ్

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ప్రాంతీయ రాజ్యాలు

సిక్కులు

గురునానక్ (1469-1539)

సిక్కు మతస్థాపకుడు గురునానక్. ఇతడు 1469లో పంజాబ్‌లోని తల్వండి అనే గ్రామంలో జన్మించాడు. మొదటి సిక్కు గురువైన గురునానక్ సర్వమత సమానత్వాన్ని, సహన భావాన్ని బోధించాడు. ఇతడి శిష్యులను 'నానక్ పంతి' అంటారు. కొంత కాలం తర్వాత వీరినే సిక్కులుగా పిలిచారు. దేవుడు ఒక్కడేనని, కర్మ సిద్ధాంతాన్ని నమ్మాలని నానక్ బోధించాడు.

గురు అంగద్ (1539-1552)

గురు అంగద్ 1539లో నానక్ వారసుడిగా గురువయ్యాడు. ఇతడు మొగల్ చక్రవర్తి హుమాయూన్‌కు సమకాలీకుడు. అంగద్ 'గురుముఖి' లిపిని కనిపెట్టాడు. భాయిబాల సహాయంతో నానక్ జీవిత చరిత్రను రచించాడు.

గురు అమర్‌దాస్ (1552-1574)

ఇతడు 78 ఏళ్ల వయస్సులో సిక్కు గురువు అయ్యాడు. సతీ సహగమనాన్ని నిరసించాడు.

గురు రామ్‌దాస్ (1574-81)

ఇతడు గురు అమర్‌దాస్ అల్లుడు. గురు రామ్‌దాస్ మొగల్ చక్రవర్తి అక్బర్‌కు సమకాలీకుడు. అక్బర్ పంజాబ్‌లోని అమృత్‌సర్ ప్రాంతాన్ని ఇతడికి బహూకరించగా అక్కడే 1577లో స్వర్ణ దేవాలయ నిర్మాణానికి పునాది వేశాడు. ఒక సరస్సును తవ్వించాడు. ఇతడి కాలం నుంచే గురువు కావడం వారసత్వ హక్కుగా మారింది.

గురు అర్జున్ దేవ్ (1581-1606)

ఇతడు సిక్కుల అయిదో గురువు. ప్రాచీన హిందూ, ముస్లింల రచనల్లోని ముఖ్య సిద్ధాంతాలు సేకరించి 'ఆదిగ్రంథ్'ను సంకలనం చేశాడు. ఇది సిక్కుల పవిత్ర గ్రంథం. స్వర్ణ దేవాలయ నిర్మాణాన్ని పూర్తి చేశాడు. 'వైశాఖి' అనే పండుగను ప్రవేశపెట్టి ప్రజల సంపాదనలో పదో వంతు వసూలు చేసేవాడు. జహంగీర్ కుమారుడైన ఖుస్రూ తండ్రికి ఎదురు తిరిగాడు. అర్జున్ దేవ్ ఖుస్రూకు ఆశ్రయం కల్పించాడు. ఫలితంగా జహంగీర్ చక్రవర్తి అర్జున్ దేవ్‌పై దేశద్రోహ నేరం మోపి అతణ్ని ఉరితీయించాడు. ఈ ఘటనతో అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న సిక్కులు సైనికులుగా మారారు.

గురు హర గోవింద్ (1606-44)

ఇతడు గురు అర్జున్ దేవ్ వారసుడు. రక్షక దళాన్ని చిన్న సైన్యంగా మార్చాడు. సైనిక శిక్షణ ఇప్పించాడు. 'అఖల్ తక్త్'ను స్థాపించాడు. 'లోహఘర్' (అమృత్‌సర్) కోటను నిర్మించాడు. ఇతడికి 'సచ్చాబాద్షా' అనే బిరుదు ఉంది. హర గోవింద్ సింగ్ 'సంగ్రామ్' యుద్ధంలో షాజహాన్ సైన్యాన్ని ఓడించాడు. ఇతడి తర్వాత గురువైన గురు హర రాయ్ (1644-61) శాంత స్వభావుడు. హర రాయ్ తర్వాత గురు హర కృష్ణ (1661-64) గురువయ్యాడు.

గురు తేజ్ బహద్దూర్ (1664-1675)

తేజ్ బహదూర్ కశ్మీర్‌లోని ఆనందపూర్‌లో స్థిరపడ్డాడు. ఇతడు ఔరంగజేబ్ అసహన మత విధానాన్ని వ్యతిరేకించాడు. దీంతో ఔరంగజేబ్ తేజ్ బహద్దూర్‌ను చిత్రవధ చేసి చంపించాడు.

గురు గోవింద్ సింగ్ (1675-1708)

ఇతడు పదో గురువు, చివరి వాడు. ఇతడు సిక్కులను రాజకీయ, సైనిక సమాజంగా రూపొందించాడు. దీన్నే ఖల్సా సమాజం అంటారు. సిక్కులు ఖడ్గంతో చిలికిన నీటిని తాగి 'సింగులు' (సింహాలు)గా బిరుదు వహించారు. ఖల్సా ప్రకారం సిక్కులు కేశ (పొడవు వెంట్రుకలు), కంఘ్రూ (దువ్వెన), కృపాణ్ (ఖడ్గం), కచ్చా (పొట్టి లాగు), కర్ద (చిన్న చాకు)ను ధరించేవారు. ఇతడి కుమారులందరూ ఆనందపూర్ యుద్ధంలో మరణించారు. గోవింద్ సింగ్‌ను నాందేడ్‌లో ఒక అఫ్గాన్ సైనికుడు కత్తితో పొడిచి చంపాడు. అయిదుగురు సిక్కులు ఎక్కడ కూడితే అక్కడే నేనుంటాను అని గురు గోవింద్ సింగ్ తన శిష్యులకు చివరి సందేశం ఇచ్చాడు.

1708 తర్వాత సిక్కుల చరిత్ర

బందా బహదూర్ (1708-16)

ఇతడు సిక్కుల నాయకుడయ్యాడు. సిక్కుల స్వాతంత్ర్యం కోసం మొగలులతో పోరాటం చేశాడు. సయ్యద్ సోదరులు బందా బహదూర్‌ను బంధించి హత్య చేశారు. సిక్కులు స్థాపించిన రాజ్యాలను ఖల్సా రాజ్యాలంటారు. 1773 నాటికి 12 ఖల్సా రాజ్యాలుండేవి. సుకేర్ చకియా వీటిలో ఒక రాజ్యం. చరత్ సింగ్ దీని స్థాపకుడు. అతని కుమారుడు రంజిత్ సింగ్. ఈయన 1780 నాటికి సుకేర్ చకియా పాలకుడయ్యాడు.

రంజిత్ సింగ్ (1792-1839)

ఇతడికి పంజాబ్ సింహం అనే బిరుదు ఉంది. 1799లో లాహోర్‌ను ఆక్రమించి సట్లేజ్ నదికి పశ్చిమంగా ఉన్న ఖల్సా రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాడు. 1801లో మహారాజా అనే బిరుదు ధరించాడు. ఇతడు సిక్కు సామ్రాజ్య నిర్మాత. బ్రిటిష్ వారితో సఖ్యతతో మెలిగాడు. 1809లో గవర్నర్ జనరల్ మింటోతో సంధి చేసుకున్నాడు. రైతుల నుంచి 40 శాతం శిస్తు వసూలు చేసేవాడు. రంజిత్ సింగ్ వారసులు అసమర్థులైనందువల్ల మొదటి ఆంగ్లో సిక్కు యుద్ధం (1845-46), రెండో ఆంగ్లో సిక్కు యుద్ధం (1848-49)లో బ్రిటిషర్లు సిక్కులను జయించారు. దీంతో పంజాబ్ బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనమైంది.

మరాఠాలు

శివాజీ

శివాజీ 1627లో జన్మించాడు. ఇతడి తల్లి జిజియా బాయి. శివాజీ దాదాజీ కొండదేవ్ సంరక్షణలో పెరిగాడు. ఇతడి గురువు రామదాస్. రాయ్‌గఢ్ వద్ద దుర్గాన్ని నిర్మించి తన కార్యకలాపాలకు కేంద్రం చేసుకున్నాడు. శివాజీని చంపి లేదా బంధించి తీసుకురమ్మని 1659లో బీజాపూర్ సుల్తాన్ తన సేనాని అఫ్జల్ ఖాన్‌ను ఆదేశించాడు. శివాజీ భాఘనఖ్ (పులిగోళ్లు) ఉపయోగించి అఫ్జల్‌ఖాన్‌ను హతమార్చాడు. 1665లో ఔరంగజేబ్ మీర్జా జయసింగ్‌ను శివాజీపై యుద్ధానికి పంపాడు. జయసింగ్ పురంధర్‌ను ముట్టడించాడు. శివాజీ 23 దుర్గాలను మొగలులకు ఇచ్చి 12 దుర్గాలను తన వద్ద ఉంచుకునేలా సంధి చేసుకున్నాడు. 1666లో శివాజీ తన కుమారుడైన శంభాజీతో కలిసి ఆగ్రాలో ఔరంగజేబ్‌ను సందర్శించాడు. కానీ ఔరంగజేబ్ శివాజీతో అమర్యాదగా ప్రవర్తించి అతణ్ని గృహ నిర్బంధం చేశాడు. శివాజీ మిఠాయిల గంపలో దాక్కొని తప్పించుకున్నాడు. తర్వాత దక్కన్ చేరి మొగలులకు ఇచ్చిన కోటలన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకున్నాడు.

రాయ్‌గఢ్‌ను రాజధానిగా చేసుకున్న శివాజీ 1674లో పట్టాభిషిక్తుడయ్యాడు. శివాజీ 'ఛత్రపతి' బిరుదు వహించాడు. ఇతడి రాజ్యానికి స్వరాజ్యమని పేరు. శివాజీ రాజ్యాన్ని రెండు భాగాలుగా విభజించాడు. అతడి ప్రత్యక్ష పాలనలో ఉన్న ప్రాంతానికి స్వరాజ్యమని, దాని చుట్టూ ఉన్న ప్రాంతానికి మొగలాయ్ అని పేరు. ఈ ప్రాంతాల నుంచి చౌత్, సర్దేశ్‌ముఖి అనే పన్నులు వసూలు చేశాడు. కేంద్ర ప్రభుత్వంలో అష్టప్రధాన్ అనే మంత్రి పరిషత్ ఉండేది. రాజు వారికి నేరుగా జీతాలను చెల్లించేవాడు. పంటలో నాలుగో వంతు భూమి శిస్తుగా వసూలు చేసేవారు. సైన్యాన్ని వ్యవస్థీకరించారు. పది మంది ఉన్న దళానికి అధిపతి 'నాయక' నుంచి వేయి మంది ఉన్న దళానికి అధిపతి 'హజరీ' వరకు అనేక భాగాలుగా సైన్యాన్ని విభజించారు. శివాజీ, అతడి వారసులు గెరిల్లా యుద్ధంలో ప్రావీణ్యం పొందారు.



పీష్వాలు

బాలాజీ విశ్వనాథ్ (1713-20)

సాహు కాలంలో బాలాజీ విశ్వనాథ్ ప్రధాన మంత్రి లేదా పీష్వా. సాహుకు వారసులు లేకపోవడం వల్ల అతడి మరణానంతరం మరాఠా సామ్రాజ్యం పీష్వాల పరమైంది. పీష్వా వంశ స్థాపకుడు బాలాజీ విశ్వనాథ్. ఇతణ్ని మహారాష్ట్ర జాతీయ స్థాపకుడిగా అభివర్ణిస్తారు. బాలాజీ విశ్వనాథ్ పీష్వా పదవిని వంశ పారంపర్యం చేశాడు. పుణేను రాజధానిగా చేసుకున్నాడు.

మొదటి బాజీరావు (1720-1740)

ఇతడు పీష్వాలందరిలోకెల్లా సమర్థుడు. హిందూ పద్ పద్ షాహి లేదా అఖిల భారత సామ్రాజ్యం నిర్మించాలనేది ఇతడి ఆశయం. లక్ష్య సాధనలో కొంత మేర సఫలీకృతుడయ్యాడని చెప్పవచ్చు. ఇతడి కాలంలో పన్నులు వసూలు చేసే సర్దార్లు బలవంతులై స్వతంత్రం ప్రకటించుకున్నారు. నాగ్‌పూర్‌లో రఘూజీ భోంస్లే, బరోడాలో పిల్లాజీ గైక్వాడ్, ఇండోర్‌లో మల్హర్‌రావ్ హోల్కార్, గ్వాలియర్‌లో రోటోజీ సింధియా స్వతంత్ర రాజ్యాలు స్థాపించారు. వీరందర్నీ మహారాష్ట్ర కూటమిగా చేర్చిన ఘనత మొదటి బాజీరావుదే.

బాలాజీ బాజీరావు (1740-1761)

ఇతడు మొదటి బాజీరావు కుమారుడు. బాలాజీ బాజీరావు కాలంలో మరాఠాల అధికారం, వైభవం ఉచ్ఛ స్థితికి చేరింది. 1757లో మరాఠాలు అహ్మద్ షా అబ్దాలీ ప్రతినిధి నుంచి ఢిల్లీని స్వాధీనం చేసుకున్నారు. రఘొబా పీష్వా తమ్ముడు పంజాబ్‌ను జయించి అటక్ కోటపై మరాఠా జెండా ఎగురవేశాడు. ఇదే సమయంలో అఫ్గానిస్తాన్ రాజైన అహమ్మద్ షా అబ్దాలీ 1761లో పానిపట్ వద్ద మరాఠాలను ఓడించాడు. దీన్నే 'మూడో పానిపట్' యుద్ధం అంటారు. ఈ యుద్ధంలో అబ్దాలీకి రెండో షా ఆలం, ఔద్ నవాబు సహకరించారు. గెరిల్లా పోరాటం చేయకపోవడం వల్లే మరాఠాలు ఈ యుద్ధంలో ఓడారు.

హైదరాబాద్ రాజ్యం

నిజాం-ఉల్-ముల్క్ అసఫ్‌జా 1724లో హైదరాబాద్ రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు 1722-24 మధ్య మొగల్ సామ్రాజ్యానికి వజీర్‌గా పనిచేశాడు. హిందువుల పట్ల సహన భావం ప్రదర్శించాడు. పూరన్ చంద్ అనే హిందువు ఆయన వద్ద దివాన్‌గా పనిచేయడమే దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. నిజాం-ఉల్-ముల్క్ 1748లో మరణించాడు. తర్వాత వరుసగా.. అతడి రెండో కుమారుడైన నాజర్ జంగ్, నిజాం మనవడైన ముజఫర్ జంగ్, నిజాం మూడో కుమారుడైన సలాబత్ జంగ్ అధికారంలోకి వచ్చారు. వీరి తర్వాత రెండో నిజాంగా లేదా రెండో అసఫ్‌జాగా నిజాం అలీ రాజ్యపాలన చేపట్టాడు. ఇతడు 1763లో ఉత్తర సర్కార్ జిల్లాలను, 1788లో గుంటూరును, 1802లో దత్త జిల్లాలను బ్రిటీషర్లకు ఇచ్చేశాడు. నిజాం అలీ తర్వాత సికిందర్ ఝా మూడో నిజాంగా రాజ్యానికొచ్చాడు. ఇతడు లష్కర్ (సికింద్రాబాద్)ను నిర్మించాడు. నసీరుద్దీన్ నాలుగో నిజాం, అఫ్జల్ ఉద్దౌలా అయిదో నిజాం. ఇతడి కాలంలో హైదరాబాద్ రాజ్యంలో సిపాయిల తిరుగుబాటు జరిగింది. ఇతడి ప్రధాని సాలార్‌జంగ్-1 గొప్పవాడు. సాలార్‌జంగ్ అసలు పేరు తురాబ్ అలీఖాన్. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ అఫ్జల్‌గంజ్‌లో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, కాచిగూడలో రైల్వేస్టేషన్, నిజాం కళాశాల (1887), మహబూబ్ ఆలియా కళాశాలను నిర్మించాడు. చివరి నిజాంగా మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911లో పాలనా పగ్గాలు చేపట్టాడు.

బెంగాల్

ముర్షిద్ కులీఖాన్ 1700 నుంచి బెంగాల్ దివాన్‌గా పనిచేసి స్వతంత్రంగా వ్యవహరించాడు. ఇతడు 1717లో మరణించాడు. అలీ వర్దీఖాన్ 1741లో స్వతంత్రం ప్రకటించుకున్నాడు. ఇతడి రాజధాని ముర్షిదాబాద్. 1756లో సిరాజ్ ఉద్దౌలా సింహాసనాన్ని అధిష్ఠించాడు. 1757లో ఆంగ్లేయులు రాబర్ట్ క్లైవ్ నేతృత్వంలో బెంగాల్ నవాబైన సిరాజ్ ఉద్దౌలాను ప్లాసీ యుద్ధంలో ఓడించారు. ఆంగ్లేయులు జయించిన మొదటి రాష్ట్రం బెంగాల్.


ఔద్

సాదత్ ఖాన్ 1724లో ఔద్‌ను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించాడు. 1764లో ఔద్ నవాబైన షుజాద్దౌలా మొగల్ చక్రవర్తి రెండో షా ఆలం, బెంగాల్ నవాబ్ మీర్ ఖాసీంతో ఒక కూటమిని ఏర్పాటు చేశాడు. వీరు ఆంగ్లేయుల నుంచి బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. 1764లో జరిగిన ఈ యుద్ధానికి బక్సార్ యుద్ధమని పేరు. కూటమిపై విజయం సాధించిన ఆంగ్లేయులు, బెంగాల్, బిహార్, ఒరిస్సాలపై దివానీ హక్కు పొందారు. ఈ యుద్ధం వల్ల ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో స్వతంత్ర రాజకీయాధికారం పొందింది. షుజాద్దౌలా తర్వాత అసఫ్ ఉద్దౌలా ఔద్ రాజ్యానికి నవాబు అయ్యాడు.

మైసూర్

1766లో మైసూర్ రాజు మరణించగానే హైదరాలీ సింహాసనం ఆక్రమించి సుల్తాన్ అయ్యాడు. 1776లో మొదటి ఆంగ్లేయ-మహారాష్ట్ర యుద్ధంలో హైదరాలీ, నిజాం నవాబు కలిసి ఆంగ్లేయులపై పోరాడారు. ఈ యుద్ధంలో ఏ పక్షానికి విజయం లభించలేదు. 20 ఏళ్ల పాటు శాంతి వర్ధిల్లింది. వారన్ హేస్టింగ్స్ నిజాం నవాబుకు గుంటూరు జిల్లాను లంచంగా ఇచ్చి అతణ్ని బ్రిటిష్ వ్యతిరేక కూటమి నుంచి వేరు చేశాడు. 1781-82లో జరిగిన రెండో మైసూర్ యుద్ధంలో ఐర్ కూట్ నాయకత్వంలోని బ్రిటిష్ సేనలు పోర్టోనొవో వద్ద హైదరాలీని ఓడించాయి. 1782లో హైదరాలీ మరణించాడు. అతడి కుమారుడైన టిప్పు సుల్తాన్ అధికారాన్ని చేపట్టాక 1784లో శాంతి ఒప్పందం జరిగింది. గవర్నర్ జనరల్ లార్డ్ కారన్ వాలిస్ మహారాష్ట్రులు, నిజాం నవాబు, తిరువాన్కూరు, కూర్గు రాజులను తన వైపు తిప్పుకొని కూటమిని ఏర్పాటు చేశాడు. యుద్ధంలో టిప్పు సుల్తాన్‌ను ఓడించి అతడి రాజ్యంలోని సగ భాగాన్ని స్వదేశీ రాజులకు ఇచ్చేశాడు. దీన్నే మూడో ఆంగ్లో-మైసూర్ యుద్ధం (1790-92) అంటారు. 1799లో జరిగిన నాలుగో ఆంగ్లో-మైసూర్ యుద్ధంలో బ్రిటిష్ సైన్యం టిప్పును ఓడించింది. శ్రీరంగ పట్నాన్ని రక్షించుకునే ప్రయత్నంలో టిప్పు సుల్తాన్ 1799 మే 4న వీర మరణం పొందాడు.

'రాజనీతి శాస్త్ర పితామహుడు' అని ఎవరిని పేర్కొంటారు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సోషల్ స్టడీస్

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పంచశీల సూత్రం కానిది?
   1) రాజ్యాల సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని పరస్పరం గౌరవించడం
   2) రాజ్యాల పరస్పర దురాక్రమణకు పాల్పడకుండా ఉండటం
   3) ఇతర రాజ్యాల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం
   4) ఇతర రాజ్యాల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా ఉండటం
2. అలీనోద్యమ మొదటి శిఖరాగ్ర సమావేశం 1961లో యుగోస్లేవియాలోని బెల్‌గ్రేడ్‌లో జరిగితే, 2015లో 17వ శిఖరాగ్ర సమావేశాన్ని ఎక్కడ నిర్వహించారు?
   1) కౌలాలంపూర్ (మలేషియా)
   2) హవానా (క్యూబా) 3) టెహ్రాన్ (ఇరాన్)
   4) కారకాస్ (వెనిజులా)
3. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శుల్లో రెండు పర్యాయాలు పనిచేసిన వారెవరు?
   1) ట్రిగ్వేలీ (నార్వే)
   2) యుథాంట్ (బర్మా)
   3) డాగ్‌హామర్ జోల్డ్ (స్వీడన్)
   4) బుట్రోస్ బుట్రాస్ ఘలీ (ఈజిప్ట్)
4. కింది వాటిలో యూఎన్‌వో ప్రత్యేక ఏజెన్సీల్లో జెనీవాలో ప్రధాన కార్యాలయం లేని సంస్థ ఏది?
   1) అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్)
   2) అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో)
   3) ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)
   4) ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంవో)
5. కింది వాటిలో బ్రిక్స్‌లో సభ్యత్వం లేని దేశం ఏది?
   1) దక్షిణాఫ్రికా 2) బ్రెజిల్
   3) భారత్ 4) భూటాన్
6. CTBTను విస్తరించండి?
   1) Common Treatment for Bad Terrorists
   2) Comprehensive Nuclear Test Ban Treaty
   3) Conclusive Test Ban Treaty
   4) Community Test Base Treatment
7. వివిధ సమావేశాలకు అధ్యక్షత వహించే వారికి సంబంధించి కింది వాటిని జతపరచండి.
   జాబితా -I
   i) ఉపరాష్ట్రపతి
   ii) ప్రధానమంత్రి
   iii) స్పీకర్
   iv) శాసన మండలి చైర్మన్
   జాబితా -II
   a) కేబినెట్ సమావేశం
   b) పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశం
   c) రాజ్యసభ సమావేశం
   d) విధాన పరిషత్ సమావేశం
   1) i-c, ii-a, iii-b, iv-d
   2) i-c, ii-a, iii-d, iv-b
   3) i-b, ii-a, iii-c, iv-d
   4) i-a, ii-c, iii-b, iv-d
8. 'మున్సిపల్ వ్యవస్థకు కళ్లు, చెవులు, చేతులు' అని వేటిని పేర్కొంటారు?
   1) మున్సిపల్ కమిషనర్లు
   2) ఆర్థిక వనరులు
   3) పన్నులు, ప్రణాళికలు
   4) స్థాయి సంఘాలు
9. కలకత్తా, మద్రాస్, బొంబాయి హైకోర్టులను ఏ చట్టం ద్వారా ఏర్పాటు చేశారు?
   1) రెగ్యులేటింగ్ చట్టం -1773
   2) చార్టర్ చట్టం - 1833
   3) కౌన్సిల్ చట్టం - 1861
   4) భారత ప్రభుత్వ చట్టం - 1858
10. కింది వారిలో ముసాయిదా కమిటీలో సభ్యుడు కాని వారెవరు?
    1) టి. కృష్ణమాచారి 2) ఎన్. మాధవరావు
    3) కె.ఎం. మున్షీ 4) రాజేంద్రప్రసాద్
11. 'రాజనీతి శాస్త్ర పితామహుడి'గా ఎవరిని పేర్కొంటారు?
    1) సోక్రటీస్ 2) అరిస్టాటిల్
    3) ప్లేటో 4) మాకియవెల్లి
12. భారత రాజ్యాంగ రూపకల్పనకు పట్టిన కాలం?
    1) 36 నెలల 18 రోజులు
    2) 34 నెలల 18 రోజులు
    3) 35 నెలల 18 రోజులు
    4) 37 నెలల 18 రోజులు
13. రాజ్యాంగ పరిషత్ చిహ్నం?
    1) సింహం 2) ఐరావతం
    3) మేషం 4) వరాహం
14. భారత రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు, అందులో ఎన్ని ఆర్టికల్స్, షెడ్యూళ్లు, భాగాలు ఉన్నాయి?
    1) 395 ఆర్టికల్స్, 6 షెడ్యూళ్లు, 12 భాగాలు
    2) 395 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్లు, 21 భాగాలు
    3) 395 ఆర్టికల్స్, 12 షెడ్యూళ్లు, 8 భాగాలు
    4) 395 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్లు, 22 భాగాలు
15. జతపరచండి.
    కేసులు
    i) బెరుబారి ii) కేశవానంద భారతి
    iii) గోలక్ నాథ్ iv) మినర్వా మిల్స్
    సంవత్సరాలు
    a) 1967 b) 1980
    c) 1960 d) 1973
    1) i-c, ii-a, iii-b, iv-d
    2) i-b, ii-c, iii-a, iv-d
    3) i-b, ii-a, iii-c, iv-d
    4) i-c, ii-d, iii-a, iv-b
16. కింది వారిలో రాజ్యాంగ పరిషత్ సలహాదారుడిగా ఎవరు వ్యవహరించారు?
    1) బెనగల్ రామారావు
    2) బెనగల్ నర్సింగ రావు
    3) బెనగల్ నరేంద్ర 4) ఎవరూ కాదు
17. జతపరచండి.
    వ్యక్తులు
    i) గ్రాన్‌విల్లె ఆస్టిన్ ii) హెచ్.వి. కామత్
    iii) ఎం.వి. పైలీ iv) కె.సి. వేర్
    భారత రాజ్యాంగంపై వ్యాఖ్యానం
    a) న్యాయవాదుల స్వర్గం
    b) అందమైన అతుకుల బొంత
    c) ఐరావతం d) అర్ధ సమాఖ్య
    1) i-c, ii-a, iii-b, iv-d
    2) i-b, ii-c, iii-a, iv-d
    3) i-b, ii-a, iii-c, iv-d
    4) i-a, ii-c, iii-b, iv-d
18. లోక్‌సభ స్పీకర్‌కు సంబంధించి కింది వాటిలో సరైన అంశం ఏది?
    ఎ) రాజ్యాంగ నిర్మాతలు స్పీకర్ పదవిని బ్రిటిష్ రాజ్యాంగం నుంచి స్వీకరించారు
    బి) స్పీకర్‌గా ఎన్నికైన వ్యక్తికి లోక్‌సభలో సభ్యత్వం ఉండాలి
    సి) లోక్‌సభ రద్దు అయినప్పటికీ స్పీకర్ పదవి రద్దుకాదు
    డి) స్పీకర్ పదవి గురించి 90-99 అధికరణల్లో పేర్కొన్నారు
    1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, సి 4) బి, సి, డి
19. కింది వ్యాఖ్యల్లో సరైనవి ఏవి?
    ఎ) పార్లమెంటరీ ప్రభుత్వాన్ని 'బాధ్యతాయుత ప్రభుత్వం' అని కూడా పిలుస్తారు
    బి) అధ్యక్షతరహా ప్రభుత్వానికి మరోపేరు 'ఏక సభ్య కార్య నిర్వాహక ప్రభుత్వం'
    సి) పునరాయనం అనేది పరోక్ష ప్రజాస్వామ్య సాధనం
    డి) రాజ్యాంగం అంటే ప్రభుత్వ రూపం - స్టీఫెన్ లీకాక్
    1) బి, సి 2) ఎ, సి
    3) బి, డి 4) ఎ, బి, డి
20. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) రాజ్యసభ సభ్యత్వంతో ప్రధాని పదవి చేపట్టిన నాలుగో వ్యక్తి
    2) ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేసి ప్రధాని అయిన రెండో వ్యక్తి
    3) గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు
    4) పంజాబ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు
21. కింది వాటిని జతపరచండి.
    జాబితా -I
    i) మొరార్జీ దేశాయ్
    ii) పీవీ నరసింహారావు
    iii) దేవెగౌడ iv) లాల్ బహదూర్ శాస్త్రి
    జాబితా -II
    a) రాజ్యసభ సభ్యత్వంతో ప్రధాని పదవి చేపట్టిన వారు
    b) మొదటి కాంగ్రెసేతర ప్రధాని
    c) తాష్కెంట్ ఒప్పందంపై సంతకం చేసిన ప్రధాని
    d) తొలి తెలుగు ప్రధాని
    1) i-b, ii-d, iii-a, iv-c
    2) i-a, ii-b, iii-c, iv-d
    3) i-c, ii-a, iii-d, iv-b
    4) i-c, ii-d, iii-b, iv-a
22. కింది వారిలో అలీన విధాన (నామ్) రూపకల్పనలో ప్రమేయం లేని వారెవరు?
    1) మార్షల్ టిటో (యుగోస్లేవియా)
    2) సుకర్నో (ఇండోనేషియా)
    3) సిరిమావో బండారు నాయకే (శ్రీలంక)
    4) జవహర్ లాల్ నెహ్రూ (భారత్)
23. భారత రాష్ట్రపతులు - వారి ప్రత్యేకతలను జతపరచండి.
    జాబితా -I
    i) హిదయతుల్లా ii) వి.వి. గిరి
    iii) జాకీర్ హుస్సేన్
    iv) నీలం సంజీవరెడ్డి
    జాబితా -II
    a) భారత ప్రధాన న్యాయమూర్తిగా పని చేసి రాష్ట్రపతి పదవి చేపట్టిన వారు
    b) తాత్కాలిక రాష్ట్రపతిగా పనిచేసిన తొలి వ్యక్తి
    c) తొలి ముస్లిం రాష్ట్రపతి
    d) ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రపతి
    1) i-b, ii-d, iii-a, iv-c
    2) i-a, ii-b, iii-c, iv-d
    3) i-c, ii-a, iii-d, iv-b
    4) i-a, ii-b, iii-c, iv-d
24. ఏ సభలోని సభాపతి ఆ సభలో సభ్యుడిగా ఉండరు?
    1) విధానసభ 2) రాజ్యసభ
    3) లోక్‌సభ 4) పైవేవీకాదు
25. ఉపరాష్ట్రపతిని తొలగించే అధికారం ఎవరికి ఉంది?
    1) పార్లమెంట్ 2) రాష్ట్రపతి
    3) ప్రధానమంత్రి 4) సుప్రీంకోర్టు
26. భారత ఉపరాష్ట్రపతులకు సంబంధించి కింది వాటిలో సరైంది?
    ఎ) ఉపరాష్ట్రపతిని పదవి నుంచి తొలగించే తీర్మానాన్ని మొదట రాజ్యసభలో మాత్రమే ప్రవేశపెట్టాలి
    బి) ఉపరాష్ట్రపతి పదవిని అమెరికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు
    సి) సర్వేపల్లి రాధాకృష్ణన్, మహమ్మద్ హమీద్ అన్సారీ రెండు పర్యాయలు ఉపరాష్ట్రపతులుగా విధులు నిర్వర్తించారు
    డి) ఉపరాష్ట్రపతి తన రాజీనామాను రాష్ట్రపతికి సమర్పిస్తారు
    1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
27. రాజ్యసభ అధ్యక్షుడికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) ఓటు వేసే హక్కు ఉండదు
    2) ఇతర సభ్యుల మాదిరిగా ఒక ఓటు ఉంటుంది
    3) సమానంగా ఓట్లు వచ్చిన సందర్భంలో మాత్రమే ఓటు ఉంటుంది
    4) సవరణ బిల్లుల విషయంలో మాత్రమే ఓటు ఉంటుంది
28. భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది?
    ఎ) ఉత్తర్‌ప్రదేశ్ నుంచి రాష్ట్రపతి అయిన తొలి వ్యక్తి
    బి) భారతీయ జనతా పార్టీ నుంచి రాష్ట్రపతి అయిన తొలి వ్యక్తి
    సి) దేశంలో రెండో దళిత రాష్ట్రపతి
    డి) వ్యక్తుల పరంగా 14, ఎన్నికల పరంగా 15వ రాష్ట్రపతి
    1) బి మాత్రమే 2) సి మాత్రమే
    3) ఎ, సి 4) ఎ, బి, సి, డి
29. కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) రాష్ట్రపతి తన రాజీనామాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సమర్పిస్తారు
    బి) రాష్ట్రపతి తన రాజీనామాను ఉపరాష్ట్రపతికి సమర్పిస్తారు
    సి) రాష్ట్రపతిని పార్లమెంట్ మహాభియోగ తీర్మానం ద్వారా తొలగిస్తుంది
    డి) ప్రధానమంత్రిని రాష్ట్రపతి తొలగిస్తారు
    1) బి, సి 2) ఎ, సి
    3) బి, డి 4) బి, సి, డి
30. అలీన దేశాల ఏడో శిఖరాగ్ర సమావేశం 1983లో భారత్‌లోని ఏ నగరంలో నిర్వహించారు?
    1) బెంగళూరు 2) ఢిల్లీ
    3) హైదరాబాద్ 4) ముంబై
31. రాజ్యం అనే పదం కింది వాటిలో ఏ భాష పదంతో సంబంధం కలిగి ఉంది?
    1) లాటిన్ 2) గ్రీక్
    3) ట్యూటానిక్ 4) జర్మన్
32. అవినీతి నిరోధక చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?
    1) 1985 2) 1988
    3) 1990 4) 1919
33. సమష్టి కుటుంబాల నిర్వహణ బాధ్యతలను ఎవరు చేపడతారు?
    1) పెద్ద కుమారుడు
    2) పెద్ద కుమార్తె
    3) తల్లి 4) కుటుంబ పెద్ద
34. 'నాగరికతకు ఊయల లాంటిది' అని దేన్ని పేర్కొంటారు?
    1) ప్రభుత్వం 2) సమాజం
    3) కుటుంబం 4) సంస్కృతి
35. పబ్లిక్ ఆస్తికి ఉదాహరణ?
    1) విద్యుచ్ఛక్తి 2) సముద్ర నీరు
    3) వార్తా పత్రిక 4) జనరేటర్
36. 'మానవుడికి సుఖప్రదమైన, గౌరవప్రదమైన జీవనాన్ని ప్రసాదించడమే లక్ష్యంగా కలిగిన కుటుంబాలు, గ్రామాల సముదాయమే రాజ్యం' అని రాజ్యాన్ని నిర్వచించినవారు?
    1) బ్లంట్ షీ 2) గార్నర్
    3) బీన్ బోడిన్ 4) అరిస్టాటిల్
37. సైమన్ కమిషన్ ముఖ్య ఉద్దేశం?
    ఎ) 1919 చట్టం ద్వారా ప్రవేశపెట్టిన సంస్కరణలను సమీక్షించడం
    బి) డొమినియన్ ప్రతిపత్తిని సమీక్షించడం
    1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
    3) ఎ, బి 4) ఏదీకాదు
38. బి.ఆర్. అంబేద్కర్ ముసాయిదా రాజ్యాంగంలో ఎన్ని ఆర్టికల్స్ ఉన్నాయి?
    1) 314 2) 315
    3) 316 4) 317

సమాధానాలు

1) 3	2) 4	3) 2	4) 1	5) 4
6) 2	7) 1	8) 4	9) 3	10) 4
11) 2	12) 3	13) 2	14) 4	15) 4
16) 2	17) 2	18) 3	19) 4	20) 4
21) 1	22) 3	23) 4	24) 2	25) 1
26) 4	27) 3	28) 4	29) 1	30) 2
31) 3	32) 2	33) 4	34) 3	35) 2
36) 4	37) 3	38) 2		

కేశనాళికీయత అనువర్తనం కానిది

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం

ద్రవ పదార్థాలు

పీడనం (PRESSURE)

ప్రమాణ వైశాల్యంపై ప్రయోగించే బలాన్ని పీడనం అంటారు.

పీడనం $P = \frac{F}{A}$

ప్రమాణాలు:

1. డైన్ / సెం.మీ.^{2}
2. న్యూటన్ / మీ^{2}
3. 1 పాస్కల్
4. BAR
5. TORR

- ఒక ప్రవాహిని వల్ల (ద్రవాలు, వాయువులు) కలిగే పీడనం P = hdg
  - h → ప్రవాహి ఎత్తు
  - d → ప్రవాహి సాంద్రత
  - g → భూమి గురుత్వ త్వరణం
- ఒక వస్తువుతో కలిగించే పీడనం, దాని వైశాల్యాని(అడ్డుకోత వైశాల్యం)కి విలోమానుపాతంలో ఉంటుంది.

$$P \propto \frac{1}{A}$$

కాబట్టి వస్తువుల అడ్డుకోత వైశాల్యం తగ్గితే వాటి వల్ల కలిగే పీడనం పెరుగుతుంది.

ఉదాహరణ:

- కత్తి, కత్తెరల అంచులను నునుపుగా తయారు చేయడం వల్ల వాటి వల్ల కలిగే పీడనం పెరుగుతుంది.
- సూది, దబ్బనం, గడ్డపార, మేకు, మొదలైన వాటి అడ్డుకోత వైశాల్యాలను తగ్గించడం వల్ల వీటి వలన కలిగే పీడనం ఎక్కువగా ఉంటుంది.
- మానవుడు నేల మీద నిలుచున్నప్పుడు అధిక పీడనాన్ని కలుగజేస్తాడు.
- వెడల్పైన పాత్రలో ఉండే ద్రవాన్ని పొడవైన, తక్కువ వ్యాసం ఉన్న పాత్రలో పోసినప్పుడు ద్రవస్తంభ పొడవు పెరగడంతో ఆ ద్రవం వల్ల కలిగే పీడనం కూడా పెరుగుతుంది.
- సమాన ఘనపరిమాణం ఉన్న మూడు భిన్న పాత్రల్లో వరసగా పాదరసం (Hg), నీరు (H_2O), ఆల్కహాల్ నింపారు. వీటిలో పాదరస సాంద్రత, నీటిసాంద్రత కంటే ఎక్కువగా ఉంటుంది. ఈ రెండింటి సాంద్రతలు ఆల్కహాల్ సాంద్రత కంటే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి పాదరసం వల్ల కలిగే పీడనం ఎక్కువగా, నీటి పీడనం తక్కువగా, ఆల్కహాల్ పీడనం కనిష్ఠంగా ఉంటాయి.

భారమితి

ఒక ప్రదేశంలో ఉండే వాతావరణ పీడనాన్ని



కొలవడానికి భారమితిని ఉపయోగిస్తారు. దీన్ని టారిసెల్లీ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

పనిచేసే విధానం:

భారమితి ఎత్తు 100 సెం.మీ., వ్యాసం 1 సెం.మీ. దీనిలో పాదరసాన్ని ఉపయోగిస్తారు.

- సాధారణ వాతావరణ పీడనం పాదరస మట్టం 76 సెం.మీ. లేదా 760 మి.మీ.

ఫలితాలు:

- ఒక ప్రదేశంలో భారమితిలోని పాదరస స్తంభం పొడవు అకస్మాత్తుగా తగ్గితే రాబోయే తుపాన్‌ను, క్రమక్రమంగా తగ్గితే రాబోయే వర్షాన్ని సూచిస్తుంది.
- భారమితిలో తగ్గిన పాదరస మట్టం క్రమక్రమంగా పెరిగితే అక్కడ మారిన వాతావరణ పరిస్థితులు తిరిగి సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయని అర్థం.
- భారమితి ఎత్తు, దానిలో ఉపయోగించే ద్రవ సాంద్రతకు విలోమానుపాతంలో ఉంటుంది.

P = hdg

$$\frac{P}{d} = hg \therefore h \propto \frac{1}{d}$$

- ద్రవ సాంద్రత తగ్గితే భారమితిలోని ద్రవ మట్టం పెరుగుతుంది.

నోట్: ఇంక్ ఫిల్లర్స్, గాలిపంపులు, స్ట్రాలు వాతావరణ పీడనాన్ని అనుసరించి పనిచేస్తాయి.

1. పర్వతాలు ఎక్కినప్పుడు ముక్కు నుంచి రక్తం కారడం, వాంతులు కావడానికి ప్రధాన కారణం.. వాతావరణ పీడనం కంటే రక్తపీడనం ఎక్కువగా ఉండటం.
2. విమానాల్లో ప్రయాణించేటప్పుడు బాల్‌పెన్‌లోని ఇంక్ బయటకి రావడానికి కారణం- వాతావరణ పీడనం కంటే పెన్నులోని పీడనం ఎక్కువగా ఉండటం.

నోట్:

1. పాదరసం సాంద్రత ఎక్కువగా ఉండటం వల్ల దానితో పనిచేసే భారమితి ఎత్తు 1 మీ. ఉంటుంది.
2. నీటితో పనిచేసే భారమితి ఎత్తు నీటి సాంద్రతను బట్టి 10 మీ. నుంచి 11 మీ. ఉంటుంది. ఆల్కహాల్‌తో పనిచేసే భారమితి ఎత్తు 13.6 మీటర్లు.
3. ప్రయోగశాలలో ఉపయోగించే ఫోర్టిన్ (FORTINE) భారమితి ఎత్తు 80 సెం.మీ., దీనిలో పాదరసం వాడతారు.
4. అనార్ద్ర భారమితిలో ఉండే వివిధ పరికరాలన్నీ ఘన స్థితిలో మాత్రమే ఉంటాయి.

స్నిగ్ధత వివరణ

- సమాన ద్రవ్యరాశులు ఉన్న పక్షి ఈక, ఒక రాయిని ఒకే ఎత్తు నుంచి జారవిడిచినప్పుడు, ఆ రాయి వాతావరణంలోని స్నిగ్ధతా బలాలను తొందరగా అధిగమించడం వల్ల ఈక కంటే ముందుగా భూమిని చేరుతుంది.

ఒకవేళ ఈ రెండు వస్తువులను ఒకే ఎత్తునుంచి ఒకేసారి శూన్యంలో జారవిడిచినప్పుడు అవి రెండూ ఒకేసారి భూమిని చేరుతాయి. కారణం.. శూన్యంలో ఎలాంటి స్నిగ్ధతా బలాలు ఉండవు.

- అన్ని ద్రవ పదార్థాల కంటే గ్రీజు స్నిగ్ధత స్థానం ఎక్కువగా ఉంటుంది. తేనె స్నిగ్ధత కూడా ఎక్కువగా ఉంటుంది.

నోట్ :

1. స్నిగ్ధత.. పీడనంపై ఆధారపడుతుంది.
2. ఉష్ణోగ్రత పెరిగితే వాయువుల స్నిగ్ధత పెరుగుతుంది.
3. ఉష్ణోగ్రత పెరిగితే ద్రవాల స్నిగ్ధత తగ్గుతుంది.
4. గాలిలో ఉన్న స్నిగ్ధతా బలాల కంటే నీటిలోని స్నిగ్ధతా బలాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఒక వస్తువు భారం గాలిలో కంటే నీటిలో తక్కువగా ఉంటుంది.

స్నిగ్ధత మారడానికి కారణాలు

- ద్రవ పదార్థాలను వేడి చేసినప్పుడు ద్రవాణువుల మధ్య ఉండే సంసంజన బలాలు బలహీనపడి స్నిగ్ధత తగ్గిపోతుంది.
- వాయువులను వేడిచేసినప్పుడు వాటి అనుచలనం పెరిగి అవి పరస్పరం ఒకదానికి మరొకటి దగ్గరగా రావడంతో స్నిగ్ధత బలంపెరుగుతుంది.

బాయిల్ నియమం

స్థిరమైన ఉష్ణోగ్రత వద్ద నియమిత ద్రవ్యరాశిని ఉన్న వాయువు ఘనపరిమాణం, దానిపై ప్రయోగించిన పీడనానికి విలోమానుపాతంలో ఉంటుంది.

$$V \propto \frac{1}{P}$$

ఉదాహరణ:

1. నీటి అడుగు భాగంలో ఉండే గాలి బుడగ ఉపరితలం పైకి చేరినప్పుడు గాలిపై నీటి వల్ల కలిగే పీడనం ఉండదు. కాబట్టి గాలి బుడగపై పనిచేస్తున్న పీడనం తగ్గడం వల్ల దాని ఘనపరిమాణం పెరుగుతుంది.
2. భూమి ఉపరితలం నుంచి పైకి వెళ్లే బెలూన్‌పై ఉండే వాతావరణ పీడనం తగ్గడం వల్ల ఆ బెలూన్ పరిమాణం పెరుగుతుంది.
3. చంద్రుడిపై ఎలాంటి వాతావరణం లేదు. కాబట్టి అక్కడ బెలూన్ పైకి ఎగరదు.

పాస్కల్ నియమం

ఒక ప్రవాహినిపై కలిగించే పీడనం అన్ని వైపులా సమానంగా విభజితమవుతుంది.

అనువర్తనాలు:

1. బట్టలు, కాగితాలను అదిమి పట్టడానికి ఉపయోగించే 'బ్రామాప్రెస్' సాధనం పాస్కల్ నియమం ఆధారంగా పనిచేస్తుంది.
2. వ్యవసాయ రంగంలో ఉపయోగించే స్ప్రేయర్ ఈ నియమం ఆధారంగా పనిచేస్తుంది. ఈ సాధనాన్ని ఉపయోగించి క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తారు.
3. హైడ్రాలిక్ బ్రేకులు, హైడ్రాలిక్ పంపులు, హైడ్రాలిక్ క్రేన్లు, టిప్పర్లు, సాధనాలు, ఎయిర్ బ్రేక్‌లు పాస్కల్ నియమం ఆధారంగానే పనిచేస్తాయి..

గతంలో అడిగిన ప్రశ్నలు

1. జతపరచండి.

i. బలం	1. పాయిజ్
ii. ప్రచోదనం	2. పాస్కల్
iii. స్నిగ్ధత	3. న్యూటన్
iv. పీడనం	4. న్యూటన్ - సెకన్

i ii iii iv
ఎ) 1 2 3 4 బి) 3 4 1 2
సి) 2 1 4 3 డి) 4 3 2 1

2. తలతన్యత అనువర్తనం.
1. వేడి ఆహారం చల్లని ఆహారం కంటే రుచిగా ఉండడం
2. వర్షం చినుకులు, సబ్బు బుడగ, పాదరస బిందువులు గోళాకారంలో ఉండడం
3. రంగులు, ల్యూబ్రికెంట్ సులభంగా విస్తరించడానికి అవసరం
4. నిలకడగా ఉన్న నీటిపై దోమలు స్వేచ్ఛగా చలించడం

ఎ) 2, 4 బి) 2 మాత్రమే
సి) 2, 3, 4 డి) అన్నీ

3. సమాన ద్రవ్యరాశి ఉన్న ఒక ఆస్ట్రిచ్ పక్షి ఈక, 100 గ్రాముల రాయిని భూమికి 200 మీటర్ల ఎత్తు నుంచి ఒకేసారి జారవిడిచినప్పుడు వాతావరణ పొరలోని స్నిగ్ధతా బలాల వల్ల అవి....

ఎ) రెండూ ఒకేసారి భూమిని చేరుతాయి
బి) రాయి ముందుగా భూమి చేరుతుంది
సి) పక్షి ఈక ముందుగా చేరుతుంది
డి) రెండూ స్నిగ్ధతా బలాల వల్ల భూమిని చేరవు

4. సమాన ద్రవ్యరాశి ఉన్న ఒక ఆస్ట్రిచ్ పక్షి ఈకను 100 గ్రా. రాయిని 200 మీ. ఎత్తునుంచి ఒకేసారి శూన్యంలో జారవిడిచినప్పుడు...

ఎ) రెండూ ఒకేసారి భూమిని చేరుతాయి
బి) రాయి ముందుగా చేరుతుంది
సి) పక్షి ఈక ముందుగా చేరుతుంది
డి) రెండూ స్నిగ్ధతా బలాల వల్ల భూమిని చేరవు

5. కింది వాటిలో సరైనది.
1. ద్రవాల తలతన్యత ఉష్ణోగ్రతకు విలోమానుపాతంలో ఉంటుంది.
2. సందిగ్ధ ఉష్ణోగ్రత వద్ద ప్రతి ద్రవం తలతలన్యత శూన్యం.

ఎ) 1 సరైనది, 2 తప్పు బి) 1 తప్పు, 2 సరైనది
సి) రెండూ సరికావు డి) రెండూ సరైనవే

6. నిలకడగా ఉన్న నీటిపై కిరోసిన్‌ను వెదజల్లినప్పుడు దేనిలో మార్పు జరిగి దోమల గుడ్లు, లార్వాలు మునుగుతాయి.

ఎ) నీటి తలతన్యత తగ్గడం
బి) నీటి తలతన్యత పెరగడం
సి) నీటి స్నిగ్ధత పెరగడం
డి) నీటి స్నిగ్ధత తగ్గడం

7. కేశనాళికీయత అనువర్తనం కానిది

ఎ) కిరోసిన్ స్టవ్, దీపం, మైనం క్యాండిల్ పనిచేయడం
బి) ఇసుక నేలలు తేమగా ఉండడం
సి) ఎడారుల్లో ఒయాసిస్‌లు ఏర్పడటం
డి) మొక్కలు దారువు ద్వారా పీల్చుకున్న నీరు పైకి ఎగబాకడం

8. జతపరచండి. (పదార్థాలు- స్పర్శకోణం)

i. పాదరసం	1. 0°
ii. స్వచ్ఛమైన నీరు	2. 8° - 9°
iii. వెండితో నీరు	3. 90°
iv. సాధారణ నీరు	4. 135° - 140°

i ii iii iv
ఎ) 2 3 4 1 బి) 4 1 3 2
సి) 1 4 2 3 డి) 3 2 1 4

9. 1. ఒక ప్రదేశంలో భారమితిలోని పాదరస స్తంభం పొడవు అకస్మాత్తుగా తగ్గితే అది తుపాను రాకను సూచిస్తుంది.
2. పాదరస మట్టం క్రమంగా తగ్గితే రాబోయే వర్షసూచనను తెలుపుతుంది.

ఎ) 1, 2 సరైనవి బి) రెండూ తప్పు
సి) 1 సరైనది, 2 తప్పు డి) 1తప్పు, 2 సరైనది

10. జలాంతర్గామి పనిచేయడంలో ఉపయోగించే సూత్రం?

ఎ) బాయిల్ నియమం బి) పాస్కల్ నియమం
సి) బెర్నౌలీ నియమం
డి) ఆర్కిమిడిస్ ప్లవన సూత్రం

11. నదిలో ప్రయాణిస్తున్న ఓడ సముద్రజలాల్లోకి ప్రవేశించినప్పుడు ఓడ మట్టం పెరుగుతుంది. కారణం?

ఎ) సముద్ర నీటి సాంద్రత ఎక్కువగా ఉండటం
బి) నది నీటి సాంద్రత ఎక్కువగా ఉండటం
సి) నది నీటి సాంద్రత తక్కువగా ఉండటం
డి) సముద్ర నీటి సాంద్రత తక్కువగా ఉండటం

12. టారిసెల్లీ కనుగొన్న భారమితి దేన్ని కొలుస్తుంది?

ఎ) సాంద్రత బి) వాతావరణ పీడనం
సి) స్నిగ్ధత డి) నీటి అసంగత వ్యాకోచం

13. నీటిలో తేలే మంచు కరిగితే, నీటిమట్టం?

ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
సి) పెరిగి తగ్గుతుంది డి) మారదు

14. ప్రెషర్ కుక్కర్‌లో పదార్థాలు త్వరగా ఉడుకుతాయి. ఎందుకు?

ఎ) ఉష్ణం తగ్గడం వల్ల
బి) ఉష్ణోగ్రత పెరగడం వల్ల
సి) నీటి బాష్పీభవన స్థానం పెరగడం వల్ల
డి) నీటి బాష్పీభవన స్థానం తగ్గడం వల్ల

సమాధానాలు

1) బి 2) డి 3) బి 4) ఎ 5) డి
6) ఎ 7) బి 8) బి 9) ఎ 10) డి
11) డి 12) బి 13) డి 14) సి

What is the FIRST sentence after rearrangement?



MODEL QUESTIONS

Directions (Q.No.1-05): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Entrepreneurs, who have dealt with multiple government agencies, (1)/ also felt that there are too many government bodies that play an active role in the journey of a company and, (2)/ more often than not, it only complicates the operations of the company (3)/ while increasing the compliance costs manifold. (4)/ No error (5)
2. The Comptroller and Auditor General (CAG), in its first ever audit of the Goods and Services Tax, (1)/ has said the government had failed (2)/ to trying out the system before its rollout, (3)/ leading to inadequate compliance mechanisms, and lower tax revenues. (4)/ No error (5)
3. The accumulated toxins in our body (1)/ did not just affect our physical being (2)/ but also have adverse effect (3)/ on our mental faculties. (4)/ No error (5)
4. One needs to acquire many talent (1)/ and master plenty of disciplines (2)/ to make a profitable (3)/ and reputed business. (4)/ No error (5)
5. Hundreds of doctors and medicos staged dharnas (1)/ and taking out rallies in Andhra Pradesh (2)/ to register their protest (3)/ against the National Medical Council Bill. (4)/ No error (5)

Directions: (Q.No. 06- 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. The appropriate atmospheric conditions made it feasible for the astronomers to see the stars and they could even distinguish the sizes.
1) and even distinguish the sizes
2) and they were even distinguishing the sizes
3) and he could even distinguish the size
4) and even distinguishing the sizes
5) no correction required
7. Get out of the building! It sound like the generator is going to explode.
1) It is sounding like the generator is going to explode
2) It sounds like the generator is going to explode
3) It sounds like generator exploded
4) it sounded like generator explosion
5) no correction required
8. A belief in superstitious people is that birth marks are the signs of influence on the mother before childbirth.
1) A belief in superstitious people that
2) Superstitious people beliefs are that
3) Among superstitious people the beliefs is that
4) Superstitious people believe that
5) no correction required
9. Tonight I am going to check that Ramesh will do his homework correctly.
1) Ramesh must be doing his homework correctly
2) Ramesh shall do his homework correctly
3) Ramesh does his homework correctly
4) Ramesh did his homework correct
5) no correction required
10. People working in high position in companies tend to shifting their work burden by delegating tasks to their subordinates.
1) tend for shifting their work
2) tend to shift their work
3) tend as to shifting their work
4) tended to shift his work
5) no correction required

Directions (Q. 11-15): Rearrange the following six sentences(A), (B), (C),(D),(E) and(F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) There are about four hundred old stone bridges joining the island of Venice.
B) Venice is a strange and beautiful city in the north of Italy.
C) It is not an island but a hundred and seventeen islands.
D) These small islands are near one another.
E) This is because Venice has no streets.
F) In this city there are no motor cars, no horses and no buses.

11. What is the FIRST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F
12. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F
13. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F
14. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) E
15. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) E

Directions (Q.No.16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Countries which _____ still undergoing the economic processes ____ known as developing countries.
1) were, are 2) are, were
3) are, are 4) is, are 5) are, is
17. There are many textile producing mills in the market that _____ with each _____ to gain the largest share of the market.
1) fight, person
2) compete, other
3) Compare, contestants
4) Clash, individual
5) Struggle, another
18. As per the recent ethical rules _____ down by National Institute of Health, diseases which cannot be treated _____ would qualify for treatment involving human gene manipulation.
1) Lay, dangerous
2) Produced, similar
3) Laid, alternatively
4) Identified, uncommon
5) Framed, fast
19. In the first ten years after the_____ of the UGC Act, eight institutions were granted deemed university status.
1) implication 2) enactment
3) Statement 4) Forming
5) issue
20. But each attempt ended in _____failure, just as such attempts have _____ all over the world including Britain and the US.
1) gloomy, ended
2) Spectacular, tremendous
3) Intense, intensified
4) Dismal, failed
5) Abysmal, aroused

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

The most **avid** users of social-networking websites may be exhibitionist teenagers, but when it comes to more grown-up use by business people, such sites have a surprisingly long **pedigree**. LinkedIn, an online network for professionals that signed up its ten-millionth user this week, was launched in 2003, a few months before MySpace, the biggest of the social sites. Consumer adoption of social networking has grabbed most attention since then. But interest in the business uses of the technology is rising. Many companies are attracted by the marketing opportunities offered by community sites. But the results can be painful. Pizza Hut has a profile on MySpace devoted to a pizza-delivery driver called Ted, who helpfully lets friends in on the chain's latest promotional offers ("Dude, I just heard some scoop from the Hut," ran one recent post). Wal-Mart started up and rapidly closed down a much-derided teenage site called The Hub last year. Reuters hopes to do better with its forthcoming site for those in the financial-services industry. Social networking has proved to be of greatest value to companies in recruitment. Unlike a simple jobs board, social networks enable members to pass suitable vacancies on to people they know, and to refer potential candidates back to the recruiter. So employers reach not only active jobseekers but also a much larger pool of passive candidates through referrals. LinkedIn has over 350 corporate customers which pay up to $250,000 each to advertise jobs to its expanding network. Having lots of people in a network increases its value in a "super-linear" fashion, says Reid Hoffman, LinkedIn's founder. He says corporate use of his service is now spreading beyond recruiters: hedge funds use it to identify and contact experts, for example. This technique is also gathering momentum in "knowledge management". IBM recently unveiled a social-software platform called Lotus Connections, due out in the next few weeks, that lets company employees post detailed profiles of themselves, team up on projects and share bookmarks.

21. Why does the author call "Lotus Connections" a social software platform?
1) Because it is used for knowledge management
2) It has a feature to allow employees to interact and cooperate with each other
3. Because IBM developed it
4. Because the service team can get in touch with the right engineers using it
22. What meaning of avid could you infer from the passage?
1) Dormant 2) Unprincipled
3) Unwanted 4) Enthusiastic
5) Hibernate
23. What is the most probable context in which the author is talking about Pizza Hut?
1) Social Networking did not benefit it
2) Social Networking was a big success for it
3) Social Networking created problems for it
4) any of the above
5) none of the above
24. Which of the following statement is true?
1) LinkedIn's rich pool of corporate customers scarcely add weightage to its expanding network.
2) Social networks enable members to pass suitable vacancies on to people they know, and to prefer potential candidates back to the recruiter.
3) Employers have a ready to use database of selected candidates.
4) Social networks help the recruiters in providing the information about potential candidates.
5) Interest in the business uses of the technology is alarming
25. The meaning of pedigree in this context is
1) It is a rare breed
2) It is a food used for pet animals
3) It means full of rage
4) To derive something
5) A lineage

Directions (Q.No. 26-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Although foetal sex determination and sex selection is _____ (26) offence in India, the practice is _____(27). Private clinics with ultrasound machines are doing _____ (28) business. Everywhere, people are paying to _____ (29) the sex of the unborn child, and paying more to abort the female child. The technology has reached even remote places through mobile clinics. Dr. Puneet Bedi obstetrician and specialist in foetal medicine, says these days he _____ (30) sees a family with two daughters. People are getting the sex determination even for the first child, he says.

26. 1) an 2) a 3) purely 4) truly 5) the
27. 1) vibrant 2) rampant 3) colorful 4) animated 5) alive
28. 1) brisk 2) hurry 3) slow 4) rare 5) vital
29. 1) understand 2) estimate 3) alter 4) know 5) change
30. 1) rare 2) scare 3) hard 4) hardly 5) almost

KEY

1) 2	2) 3	3) 5	4) 1	5) 2
6) 2	7) 2	8) 4	9) 5	10) 2
11) 2	12) 3	13) 3	14) 1	15) 5
16) 3	17) 2	18) 3	19) 1	20) 4
21) 2	22) 4	23) 2	24) 4	25) 5
26) 1	27) 2	28) 1	29) 4	30) 4